UNIVERSAL LIBRARY

OU_206178

UNIVERSAL LIBRARY

# ఆత్మవిజయము

లోకము లన్నియున్ గడియలోన జయించినవాఁడ వింద్రియా
నీకము జిత్తముఁ గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకర శత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁడొకఁడు నేర్పునఁ గావుము దానవేశ్వరా!

— భాగవతము.


బౌద్ధ వాఙ్మయబ్రహ్మ,

దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు.

మానవాదర్శ గ్రంథమాల. ద్వితీయ కుసుమము.

# ఆత్మవిజయము

Telugu Transilation of
By way of Blessed by
[illegible] — James Elen.

మద్దిపాటి బలరామకృష్ణయ్యగారు.

1000 ప్రతులు.

బెజవాడ:
ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
క. కోదండరామయ్యగారిచే ముద్రితము.
1929.

సర్వస్వామ్య సంకలితము] [వెల 1—0—0.

# మానవాదర్శ గ్రంథమండలి
# పోషకవర్గము.

---

## శాశ్వతోద్ధారకులు.

1 శ్రీ కొడాలి ఉమామహేశ్వరరావు చౌదరిగారు,
భూస్వాములు—జబర్లపూడి.

2 శ్రీ కొప్పర్తి సుబ్బయ్యశాస్త్రిగారు, వైసుచైర్మను
ప్రొద్దుటూరు.

3 శ్రీ మెట్టుపల్లి కొండారెడ్డిగారు, భూస్వాములు. ,,

## ప్రధానరాజపోషకులు.

1 శ్రీ చలసాని వెంకటకృష్ణయ్యగారు, భూస్వాములు,
కురుమద్దాలి.

2 శ్రీ కొమ్మారెడ్డి పట్టాభిరామయ్యగారు, భూస్వాములు,
కమ్మసంఘాధ్యక్షులు—బందరు.

3 శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారు, ఎం. ఎల్. సి.
జిల్లాబోర్డు ప్రెసిడెంటు,—గుంటూరు.

4 శ్రీ పోలా వేంకటగురవయ్యశాస్త్రిగారు, వర్తకులు,
నంద్యాల.

5 శ్రీ మొగిళ్ళ సుబ్బారెడ్డిగారు, భూస్వాములు — నంద్యాల.

6 శ్రీ కొర్రపాటి శివరామయ్య చౌదరిగారు, భూస్వాములు,
చల్లపల్లి.

## రాజపోషకులు.

1 దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు,
ఆంధ్ర, భారతి పత్రికాసంపాదకులు — మద్రాసు.

2 ముక్కుపాటి వేంకటసుబ్బారావుగారు & బ్రదర్సు.

3 అట్లూరి కాంతయ్య చౌదరిగారు — అంగలూరు.

4 సూదనగుంట అప్పారావు చౌదరిగారు, భూస్వాములు,
మునుపల్లె.

5 రాజా చినసుబ్బారాయుడు శ్రేష్ఠిగారు, వర్తకులు,
నంద్యాల.

6 ఆత్మకూరి సుబ్రహ్మణ్యం శ్రేష్ఠిగారు, వర్తకులు, నంద్యాల.

7 వంకదారి రామయ్య శ్రేష్ఠిగారు, వర్తకులు, గోపాలపురం.

## ప్రధానపోషకులు:

1 రావుసాహెబు కంఠంనేని వెంకటరంగయ్యచౌదరిగారు,
భూస్వాములు, నాగాయతిప్ప.

2 కావూరి కోదండరామయ్యచౌదరిగారు, కృష్ణాజిల్లా
ఎడ్యుకేషనల్ బోర్డు ప్రసిడెంటు, మోపిదేవి.

3 యార్లగడ్డ అనంతశ్రీధరం బహద్దరుగారు, బాదరు.

4 మలినేని రాఘవయ్య చౌదరిగారు, భూస్వాములు,
తోట్లపాలెం.

5 అత్తోట సత్యనారాయణ చౌదరిగారు, భూస్వాములు,
కోట్లపాలెం

6 దాసరి పెదబాపయ్య చౌదరిగారు " "

7 రామినేని అంకమ్మ చౌదరిగారు " "

8 దాసరి అంకమ్మ చౌదరిగారు " "

9 తుమ్మల సూర్యనారాయణ చౌదరిగారు, భూస్వాములు,
గోవాడ.

10 కంఠంనేని రాఘవయ్య చౌదరిగారు, భూస్వాములు,
పెదగాదెలవర్రు.

11 చదలవాడ నాగభూషణరావు చౌదరిగారు, భూస్వాములు
పేరుకలపూడి.

12 కుదరవల్లి సూర్యరామలక్ష్మయ్య చౌదరిగారు, భూస్వాములు
నిమ్మకూరు.

13 భట్టా జ్ఞానకోటయ్యగారు, ఛైర్మను, పెడన.

14 కరిపినేని రాజయ్య చౌదరిగారు, భూస్వాములు,
కొరిమెర్ల.

15 కిలారు గోవిందయ్య చౌదరిగారు, భూస్వాములు,
కోమటిగుంట.

16 శ్రీమతి రావులూరి తులశమ్మగారు, పసుమర్రు,
(ప్రకాశరావు చౌదరిగారి సతీమణి)

# కృతిభర్త.

విద్యాపోషకులు, జాతీయవాదులు :
చలసాని వేంకట కృష్ణయ్య చౌదరీగారు.

17 ఓరుగంటి సుబ్రహ్మణ్యం అయ్యర్ గారు, బి. ఏ. బి. ఎల్.
నంద్యాల.

18 రాజా పెదసుబ్బారాయుడు శ్రేష్ఠిగారు, వర్తకులు,
నంద్యాల.

19 కొప్పరపు రామయ్య శ్రేష్ఠిగారు, వర్తకులు, నంద్యాల.

20 పగడి వీరన్న శ్రేష్ఠిగారు, వర్తకులు, నంద్యాల.

21 శింగారెడ్డి తిమ్మారెడ్డిగారు అహింసాప్రచారకులు,
కోయిలకుంట్ల.

22 చెలసాని రామయ్యచౌదరిగారు, భూస్వాములు,
శేరీకల్వపూడి.

23 మండవ కోటయ్యచౌదరిగారు, భూస్వాములు,
శేరీకల్వపూడి.

# కృతిసమర్పణము.

సీ॥ ఏమహనీయునందు • యిద్ధసద్గుణపేటి
కవికోటి కొకమేటి • కల్పకంబు,
ఏమహాశయుఁడు ప్రజామానసికవాసి
గుణరాశి యఖిలచకోరవిధుఁడు,
ఏశాంతమూర్తి కళాశాంతవర్తి యై
యతకీర్తి ధనుఁడు బుద్ధైకసురభి,
ఏధన్యచారిత్రుఁ • డీ ధాత్రిని పవిత్ర
మిత్రాబ్జతతికెల్ల • మిత్రుఁడంచు,
తే॥ గీ॥ అట్టి చెలసానివంశ సుధాబ్ధి శీత
కరుఁడు వేంకట కృష్ణచాదరికిఁ గృతిగ
"ఆత్మవిజయ" మహాగ్రంథ • మాత్మవిజయ
ముగను నర్పింతుఁ దారార్ద్రఁగాను నహింప.

తే॥ గీ॥ మిత్రునకు బద్మములు నమో • మిత్రయనుచు
ముకుళిత కరాబ్జములఁ దోల్లి • మ్రొక్కుచేయ వి
కాస స్వాగతమిచ్చు నా • గతిమె దీని
కృతినొనంగితి వేంకటకృష్ణ గొనుము.

# విన్నపము.

"యస్యాస్తి సద్గ్రంథ విమర్శభాగ్యం,
కిం తస్య శుష్కైశ్చపలా వినోదైః."

మనుష్యలోక సంచారణమునకు జ్ఞానము ముఖ్యసాధనము. అతిక్లిష్టమగు మానవజీవితముయొక్క వివిధసమస్యలు జ్ఞానమూలముననే పరిష్కరింపఁబడుచున్నవి. జ్ఞానశూన్యమగు జీవితము మనుష్యజీవితమనఁబడనేరదు. జీవసామాన్యధర్మములగు నాహారనిద్రాభయమైథునములకంటె నాదర్శప్రాయములగుధర్మముల ననుష్ఠింపఁజేయు జ్ఞానము లోకమందలి యితరప్రాణులందుకంటె మనుష్యునియందు విశేషముగా వెలయుచున్నది. పరమపవిత్రమగు నిట్టి జ్ఞానబలముచే మనుష్యుఁడు తనజీవితమున కావశ్యకములగు సకలసద్గుణములను సముపార్జించి, తద్ద్వారమున విశ్వమునఁగలుగుచుండు విషాదభయముల నతిక్రమించి సౌఖ్యానందములఁ బడయఁగలుగుచున్నాఁడు. మానవజీవిత పరమావధియు నిశ్చలమగు నిట్టి బ్రహ్మానందమే. శోకమోహాభయాది వికారములచేఁ గూడియున్న యిహలోకము నానంద సామ్రాజ్యము గావింపఁగల దైవతేజమగు జ్ఞానమును మానవలోకమందంతట బాగుగా వ్యాపింపఁజేయుటకు సద్గ్రంథములు ఉత్తమసాధనములు. మానవునియందు విషయవాసనలను బెంచి వాని జీవితము నంధకారబంధురమొనరించునట్టి ప్రగాఢమగు నవివేకమును విధ్వంసపఱచుటకుఁ

వగునీతిని, ధర్మమును, సత్యమును, ఆత్మబలమును ప్రసాదించు నట్టి లోకోత్తరమగు జ్ఞానమును గలిగించునట్టివే సద్గ్రంథము-లిట్టిసద్గ్రంథముల మూలమున లోకమందలి స్త్రీపురుషు లెల్లరు సుజ్ఞానమును సంపాదించి నాగరికులు కాఁగలుగుచున్నారు.

నీతివిరుద్ధములును, ఆత్మవినాశ ప్రతిబంధకములును నగు గ్రంథములు క్షుద్రములు. ఇట్టి గ్రంథములఁ బఠించుటచే మానవుని చిత్తమున విషయవాసనా బీజములు పుంఖానుపుంఖములుగ నుదయించి, వాని చారిత్రమును భ్రష్టమొనరించి, తుదకు వానిజీవిత నౌకను దుఃఖవారిధిని ముంచివేయుచున్నవి. ప్రకృతి రంగమున దృగ్గోచర మగుచుండు భ్రాంతికరములగు వివిధవస్తువులనుండి మానవుని విముఖు నొనరింపఁగల సామర్థ్యము సద్గ్రంథములకే కలదు. కల్పిత కథలతోడను అశ్లీలములగు శృంగారమయ వర్ణనముల తోడను నిండియుండు గ్రంథములచే మానవజీవిత ముద్ధరింపఁ బడనేరదు.

లోకకల్యాణము నిమిత్తము పావనచరితులగు మన ప్రాచీన ఋషివరేణ్యులచే సృజింపఁబడిన ధార్మికసాహిత్యము విపుల జ్ఞానదాయక మయినది. కాలవైపరీత్యముచే నానాట నాయార్షవాఙ్మయము వినాశమొందఁగ, విషయవాసనలఁ బరమ లక్ష్యముగఁ గలిగియున్న భౌతిక సాహిత్యము నేఁడు సర్వత్ర విజృంభించినది. దీనిప్రభావముననే విలాసము నాగరి

కత్రమైనది. నాగరికతచే మానవుని తృష్ణ వృద్ధి నానినెట్టి దురంత దుఃఖమయుని గావించి వైచినది. నేటి మానవ జాతీయ దైన్యదశకు నైతిక సాహిత్య విహీనతయు నొక ముఖ్యకారణమని వచింపక తప్పదు. సువర్ణయుగమున "ధమ్మపదము" వంటి నీతిబోధకమగు సద్గ్రంథములచే నసంఖ్యాకులగు స్త్రీపురుషుల జీవితములు సంస్కరింపఁ బడినవి. కావుననే మహాత్ములు సద్గ్రంథమును కల్పవృక్షమని పొగడియున్నారు.

శ్రీ గాంధియుగము ప్రారంభమయినప్పటినుండి మానవలోకదృష్టి భౌతికజీవితమునుండి ఆధ్యాత్మిక జీవితము వైపునకు మరలినది. సమస్త మానవులిపుడిపుడే పశుబలము వ్యర్థమయినదనియు, ఆత్మబలము మహత్తర మయినదనియు, గ్రహింపుచుఁ జంచలేంద్రియముల విషయాదుల వైపునకుఁ బరుగెత్తించునట్టి నీతివిరుద్ధము లగు గ్రంథములను, నావస్తువులను నిషిద్ధములుగ భావింపఁ గడంగినారు. తత్ఫలితముగ మహాపురుషులగు పండితులును, కవులును శ్రమచే హితోపదేశముల నొసంగు సద్గ్రంథముల దేశదేశముల విరచింప మొదలిడినారు. ఏదేశములకంటెఁ గర్మభూమియగు నార్యావర్తమున నిట్టి కృషి విశేషముగ జరుగుచున్నది. భరతఖండముయొక్క ప్రతిరాష్ట్రమందు గల కవులెల్లరు నిష్కళంక చారిత్రులయి తమ మేధాశక్తిని, పాండిత్యమును, లోకానుభవమును సద్గ్రంథముల

రచించి, తమ మాతృభాషావధూటి కమూల్య భూషణములుగ నొసంగి ధన్యులు కావలసియున్నది.

పవిత్రమగు నిట్టి సంకల్పముచేఁ బ్రేరేపితులమయి యే సర్వాంగసుందరమగు నైతిక జీవితమున కావశ్యకములగు పవిత్ర గ్రంథములఁ బ్రచురించి, తన్మూలమున భాషాసేవ దేశసేవ సలుపు నిమిత్తము మేము "మానవాదర్శ గ్రంథ మండలి" ని స్థాపించియుండుట దేశీయు లెఱుంగుదురు. మా మండలికి సంపాదకులుగను, గ్రంథ రచయితలుగను నున్న బౌద్ధవాఙ్మయబ్రహ్మ, దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారి పరిచయము నాంధ్రుల కొసంగ నవసరము లేదు. బౌద్ధవాఙ్మయ బ్రహ్మగారు పిన్నవయస్కులయ్యు నాదర్శ వాఙ్మయ సేవా ధురీణులయి "బుద్ధపురాణము" వంటి మహాగ్రంథమును సకల పండిత సంస్తవపాత్రముగ విరచించి, ఆంధ్రలోకమునకు సమర్పించిరి. మామండలియొక్క యీ ప్రథమ కుసుమ ప్రాశస్త్య ప్రయోజనముల గ్రహించి విద్యాభిమానులగు నాంధ్ర మహాశయు లనేకులు మండలిని స్వయంశక్తిచే స్థాపించి, స్వతంత్రముగ నడుపుచు, వ్యయ ప్రయాసలకు లోనగుచున్న బలరామకృష్ణకవిగారికిఁ గడు యుదారబుద్ధితో సాయమొనరించి వందనీయు లయినారు.

మామండలి తరపున "శ్రీకృష్ణ వేణుగానము" అను ననుబంధ గ్రంథమొకటి వెలువడియున్నది. ప్రస్తుత గ్రంథమగు

"ఆత్మవిజయము" ద్వితీయ కుసుమము, ఇత్యాది విదేశీయ పండిత కృతము. బౌద్ధవాఙ్మయ బ్రహ్మగారు దీనికి స్వతంత్రానువాదకర్తలు. ఇందుఁ జర్చింపఁబడిన పదునాలుగు విషయములును మానవ జీవతోన్నతికిఁ దారకమంత్రము లయి రాణింపఁగలవు. ఇందలి ప్రతివాక్యమును మానవజీవిత సామాన్యములగు దోషముల విమర్శించుచు సంస్కరణము నకు దారి తీయుచున్నది. ఈ గ్రంథరాజము యొక్క నీతి మనఃశాస్త్రముల నైతికవిజ్ఞానముతో నేకీభవించి యుండుట సంతోషదాయకము. బౌద్ధవాఙ్మయబ్రహ్మగారిచే వ్రాయ బడిన "ఆదర్శ మనుష్యజీవిత"మను 2000 పుటలు గల బ్రహ్మాండమగు గ్రంథమును బ్రచురించుటలోఁ గలుగనున్న విలంబమును సహింపలేక మేమీ గ్రంథరాజమును బ్రకటింప వలసిన వారమయితిమి. ఈగ్రంథ ప్రాశస్త్యము నెఱుంగు బాధ్యత చదువరులపై నున్నది.

ఆంధ్ర మహాజనులు దాస్యగ్రస్తమును, దారిద్ర్యపిశాచపీడితమును నగు ప్రస్తుత స్థితిలో నొక గ్రంథమండలిని యథోచితముగఁ బోషించుచు, దాని బాధ్యతలనెల్ల వహించుటలో నొక వ్యక్తికిఁ గలుగు కష్టనష్టముల విచారించి శక్తివంచన లేక తోడ్పడుచు మాపవిత్రోద్యమము నుద్ధరింప బద్ధాంజలినయి వేడుచున్నాడను. ఆంధ్రులు 'మేధావంతులును, వివిధ భాషల నెఱింగినవారును, ధీరులును, మహావక్తలునునగు బౌద్ధవాఙ్మయబ్రహ్మగారిని సన్మానించినచో శీఘ్రకాలమందే

అమూల్యములగు గ్రంథరాజము లనేకములుగ నాంధ్ర భాషాయోష పాదారవిందార్చన ప్రసూనములుగ మామండలినుండి వెలువడఁగలవు.

ఇంతవఱకు బలరామకృష్ణకవిగారికి వారి సంచారములో మండలిహితము నపేక్షించి ధనసాహాయ్యము లొనరించిన దయామయు లెల్లఱకు నాకృతజ్ఞతాభివందనములు. మామండలియెడ విశేష శ్రద్ధాభక్తులఁ బ్రదర్శించిన శ్రీ కొడాలి ఉమామహేశ్వరరావు చౌదరిగారికిని, శ్రీ చెలసాని వెంకటకృష్ణయ్య చౌదరిగారికిని మేము మిక్కిలి కృతజ్ఞులము. ఈగ్రంథమును బంపినంతనే తన బాధ్యతల నన్నింటిఁ గట్టిపెట్టి శ్రమయనక సాంగోపాంగముగ జదివి, అమూల్యమగు సుపోద్ఘాతమును దయచేసిన దయార్ద్రహృదయులును, దేశభక్తులును, సుప్రసిద్ధాంధ్ర మహాకవులును నగు శ్రీ శ్రీ జనాబ్ ఉమర్ అలీషా పండితులవారికి మానమశ్శతంబులు. ఏతద్గ్రంథ లేఖన ముద్రణాది కార్యములు కేవల మొకపక్షములో ముగింపవలసి వచ్చుటచే నటనట దోషములు దొరలియుండవచ్చు. ఆదోసగులు ద్వితీయ సంస్కరణమున దూరమొనరింపఁ బడఁగలవు.

3—6—29
అంగలూరు.
యం. జి. మండలి
కార్యస్థానము.

విధేయుఁడు,
తిప్పిర్నేని లక్ష్మీనారాయణ,
వ్యవస్థాపకుఁడు.

# ఉపోద్ఘాతము.

ఆంగ్లభాషను అమెరికావాసి, 'జేమ్సు ఎలను' అను మహాకవి వ్రాసిన (Byways of Blessed) అను మహాగ్రంథమునకు 'ఆంధ్రవాఙ్మయబ్రహ్మ' బిరుదము వహించిన శ్రీయుత దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు ఆత్మవిజయమను పేర నాంధ్రభాషను చక్కని శైలిని, సొదులు మాటలు గట్టునట్లు రచియించియున్నారు. ఇందలి విషయము గొప్ప పారావార సదృశమైన నైతికజ్ఞాన సంపత్తిని ప్రబోధించునదిగా యున్నది.

వేదములు, వేదాంగములు, నానావిధపురాణములు, భారతేతిహాసాద్యనేక మహానైతిక గ్రంథములు సంస్కృతము ననే గాక, ఆంధ్రీకరణములయి కుప్పలు తిప్పలుగాఁ బడి యుండ, పాశ్చాత్యులంతకన్న నధికము నిర్వచింపగలరని యా వారి నీతియను నాతిని యర్థించి, ఆంధ్రావనిని బ్రవేశఁ బెట్టుటయని కొందఱు తెగనాడవచ్చును. కొందఱు మూసిముసినవ్వులు నవ్వుకొన వచ్చును. కొందఱు పెదవివిఱువ వచ్చును. "ఎవరేమన్న నేమి? నాకేమికొదువ" యని శ్రీనాథుఁడన్నట్లు, నైతికవిజ్ఞానసంపన్నుఁ డిట్టివి లెక్కింపఁడు. నీతి, ధర్మము, కళ, విద్య యున్నగు మహాపదార్థము లొకరి కాణాచి కానేరవు; ఒకరి సొంతమై వారితో సమసి పోవలసినవిగావు. సూర్యుని వెలుతురు, గాలియొక్క సంసర్గము, నీటియొక్క మధురసుధాసేచనము ఎల్లవారి కెట్లు సేవ్యమానములో నీతిగూడ నెల్లరిచేఁ బరిగ్రహణీయము. నీతి గోడయాఁ

దనున్నను, గోడ మృత్తిక జడపదార్థమని ఆ నీతిచదు వకుండ వదలిపెట్టఁజాలము. మనకు వస్తువుతోఁ బనిగాని ఉపాధితోఁగాదు. గులాబిపుష్పము ముళ్లలోనున్నను, ముళ్లు తొలఁగించి పుష్పమును తీసుకొనుచున్నాము. అట్లే నీతిని వచించునప్పుడు విదేశీయులని, దేశీయులని భేద మనావశ్యకము. ఇదియును నేర్చుకొనవలసిన నొక నీతియే.

శుక్రాచార్యులు రాక్షసగురువయినను తనపేర 'శుక్రనీతిసార'మని వ్రాసినప్పుడద్దానిని మనము ప్రమాణముగ గ్రహించుచున్నాము. హూణులాది విదేశీయులును అట్టి తెగకుఁ జేరినవారేయని యనవచ్చును.

“భూరుహమెల్ల వారలకుఁ బుష్పఫలంబులు నీడయుం బ్రీతీ,
కారము గోరకిచ్చుటను గాంచి బకంబది యభ్యసింపఁగా,
నేరదు పెద్దకాలమల నిల్చియు మోసముజేసి చేపలా,
హారము సేయు దుష్టమతి కబ్బునె సత్సహవాస సంపదల్.”

కావున నీతిచెప్పుట సుకరము. చేయుట దుర్ఘటము. నీతివంతులను చూచియు నీతి 'నేర్చుకోఁ' జాలనివారలఁ జూడ, ప్రపంచమెంత తీవ్రతరముగ మానవులను స్వార్థము వంకకు లాగుచున్నదో యిదమిత్థమని వచించుటకు ఎవరికిని సాధ్యము గాదు.

ఈ నైతిక విజ్ఞానసంపత్తి లోకసామాన్యమునకు నేర్పుటకే వేనవేలు గ్రంథములు వ్రాయఁబడినవి; వేనవేలు మతములు స్థాపించఁబడినవి; వేనవేలు ప్రవక్తలు, ఋషులు, అవతారులు, బోధకులు ఒకటేమిటి- అనంతకోటి మహావిశ్వ

మంతయు నీతిని బోధించుటకయి యున్నదని ప్రతిపాదించుచున్నారు.

అజగరుఁడను ఋషి సహ్యపర్వతమువద్దఁ బడియుండి యీమహానీతి నీవెచ్చట నేర్చితివని ప్రహ్లాదునిచేఁ బ్రశ్నింపఁబడినప్పు డతఁడు

"అజగరమును జుంటీఁగయు
నిజగురువులుగాఁ దలంచి నిశ్చింతుఁడనై
విజనస్థలిఁ గర్మంబుల
గజిబిజి లేకున్నవాఁడ గౌరవవృత్తిన్."

— భాగవతము.

అని తనకు నీతి పాము, తేనెటీఁగ చెప్పినవని చెప్పినాఁడు.

ఇఁక విదేశీయులు నీతిచెప్పరాదని యెవరు చెప్పసాహసించెదరు? నీతి నీతియే. అది యెక్కడున్నను 'సాది' అను పారసీకకవి చెప్పినట్లు మన జారిపోయిన ధనము యెందయిన లంభించిన నెట్లు నాదియని వాదించి పుచ్చుకొనుట కధికారముకలదో, అటులే నీతి వినిపించినపుడు అది నాదే యని గ్రహింపఁగలవారికెల్ల మానవలోక సామాన్యమైన ధర్మమైయున్నది.

ఈనీతి చెప్పినకొలఁది యిసుకపాతరవలె ననంతమై యున్నది. మఱియు నీతికి రెండు ముఖములు. ఏది నీతియని చెప్పెదురో స్థలాంతరమున నదియే అవినీతి యగుచున్నది. ఎట్లందురా— 'కల్లు' త్రాగుట దుర్నీతి. అదియే వండి బెల్లముచేసి తిన్న నీతి. స్త్రీకిఁ గాపురము చేయుట నీతి. పర

స్త్రీతోఁ గాపురము సేయుట అవినీతి. ఇట్లే లెక్కనయు
గ్రహింపనగును. దీని నెఱుంగుట కేదేని కొలబద్దగలదా
యని విచారింప మహాగాధ సవిలసనయుక్తమైన హృదయమునకే
అనూహ్యముగానున్నది. గ్రంథము శాసించు నీతులు కొన్ని
యున్నవి. మహమ్మదీయుల మతనీతిప్రకారము పినతండ్రి
కూతురును భార్యగా గ్రహింపవచ్చును. అదే నీతి భారతీయు
నకు చుక్కెదురు. మహాఘోరమైన పాపపంకిలము. ఇక
నెట్లు ఇట్టి ద్వంద్వములను సమన్వయింపవచ్చునని యోజించు
మహానుభావులైన పింగళి సూరన్న ఒక్క మంచి గ్రంథమును వ్రా
సఁగినాఁడు. దానితో నెల్లవిషయములు సమన్వయింపబడె
నవి. అది యేమందురా—"అచ్చపుబుద్ధికి లేవగమ్యముల్"
అని ఒక పెద్దసిద్ధాంతమును జెప్పిపోయినాఁడు.

మఱియు నీ "యాత్మవిజయము" గూడ నైతికగ్రంథమే.
ఇందు పెక్కు వాస్తవమానసిక నైతికపరిణామములు పెక్కు
ఉదాహరణపూర్వకముగాఁ జూపఁబడినవి. ఇవి యోజించిన
కొలఁది—ఆచరణములలో బరీక్షించినకొలఁది విశాలవిశ్వము
నఁ బ్రస్తారముచేసినకొలఁది క్రొత్తక్రొత్త రుచుల నీనుచు,
అనంతానుభవసిద్ధమైన అమృతసిద్ధికి మానవుని గొనిపోయి,
ఆత్మను పరబ్రహ్మపదార్థముగా మార్చి, విజయరథమెక్కించి
యీయబాండమాతను త్రుటిలో మెట్టవచ్చునట్లు గావించు
చున్నది. ఆహా! రత్నాలకైన వెలయున్నదిగాని నీతికి వెల
యింతయని యెవరు నిర్ణయింపఁగలరు? దీనికి భారవిలోని
పద్యముగూర్చి చెప్పుకథయే ఉదాహరణము.

ఈ "ఆత్మవిజయము" 14 నైతికవిషయములపైఁ జర్చింపఁబడినది. ఈ పదునాల్గును పదునాలుగు లోకములవలె మానవుని సంతృప్తిని గాంచుచున్నవి. కాని చదివి అర్థముచేసి కాని ఆత్మకుఁ బట్టించుకొన్నప్పుడే ఆత్మ, విజయమును బడయుచున్నది. కాని యిది యెల్లవారికి సులభసాధ్యముగాదు. ప్రతి పక్షికి మామిడిచిగుళ్ళు ఆహారము కాజాలవు.

ఈగ్రంథమును స్వతంత్రముగా భాషాంతరీకరించుటలో నా పరమమిత్రులయిన శ్రీ బలరామకృష్ణయ్యగారు గొప్ప మేధాశక్తిని, భాషాపరిశ్రమను చాల ఓరిమిని, నేర్పును, ప్రశాంతతను జూపియున్నారు. వీరి అసాధారణ ప్రజ్ఞావిశేషము లాంధ్రలోకము చిరకాలమై పరిచయము గలిగించుకొనియున్నది. సహజముగా వీరు రచించియున్న "శ్రీబుద్ధపురాణము" గొప్ప ఆదర్శప్రాయమై యెందరినో ఆకర్షించినదనుటలో నతిశయోక్తిలేదు.

వీరు "మానవాదర్శ గ్రంథమండలి" అనుపేర నొక నిలయమును స్థాపించి దానికి బుద్ధపురాణమును మొదటి కుసుమముగను, ఈ "ఆత్మవిజయము"ను రెండవ కుసుమముగను నేర్పఱచి లోకమునకుఁ బ్రసాదించియున్నారు. ఇట్టిగ్రంథముల నాంధ్రమహాజనులు చదివి తరింప బ్రార్థితులు.

ది 29-5-29, పిఠాపురము.

ఇట్లు,
ఉమర్ అలీషా.

# విషయసూచిక.


పుట.

1. ఉత్తమోద్యోగము. (ప్రథమ ప్రకరణము) 1
2. సామాన్యకార్యములు - కర్తవ్యములు (ద్వితీయప్రకరణము) 22
3. కాఠిన్యము - వ్యాకులత (తృతీయప్రకరణము) 46
4. భారము తగ్గించుకొనుటెట్లు? (చతుర్థప్రకరణము) 62
5. గుప్తాత్మసమర్పణము (పంచమప్రకరణము) 85
6. సహానుభూతి (షష్ఠమప్రకరణము) 113
7. సహనము (సప్తమప్రకరణము) 138
8. దోషములఁ జూడకుండుట (అష్టమప్రకరణము) 154
9. సాత్వికానందము (నవమప్రకరణము) 194
10. మౌనము (దశమప్రకరణము) 205
11. ఏకాంతవాసము (ఏకాదశప్రకరణము) 223
12. స్వావలంబనము (ద్వాదశప్రకరణము) 246
13 జీవిత సామాన్యనిబంధనముల గ్రహించుట (త్రయోదశప్రకరణము) 259
14. సౌఖ్యమయపర్యవసానము (చతుర్దశప్రకరణము) 282

# ఆత్మవిజయము.

## ప్రథమ ప్రకరణము.

### ఉత్తమోద్యోగము.

మనుష్యజీవిత సంగ్రామ రంగస్థలమున సదాలోచనగోచరము లగుచుండు వివిధము లగు వస్తుసంతతులును, భిన్నకార్యములును, సంతోషసంతాపములును, సుఖదుఃఖములును మానవుని జీవితాభ్యుదయ ప్రాసాదము నధిరోహింప సుదృఢములగు సోపానములు. మనుష్యుల మగు మనకు వాయుపథమున నెగసి సంచరింప విహంగములకు వలెఁ బక్షములు లేవు, కాని మనకుఁగల పాదముల మూలమున దుముకుచు, లంఘించుచు జీవిత విజ్ఞానశిఖరము నధిష్ఠింపఁ బాత్రులమయి యున్నారమనుట సత్యము. —లాంగు ఫెలో.

మానవ జీవితముయొక్క సామాన్య కార్యములను, సాధారణ నిబంధనములను, నైసర్గిక వాంఛలను మనోహరముగఁ జరిత్రించుట కంటె నాకు హృదయాహ్లాదకరమగు వృత్తి మఱొండు లేదు. —బ్రౌనింగు.

ఈశ్వరసృష్టియందలి సకలపదార్థములలో నుత్తమ స్థానము నలంకరించునది మానవజీవితము. తజ్జీవితమునఁ బ్రాముఖ్యమును వహించినది విజ్ఞానము. విజ్ఞానమున కుద్గమస్థానమాత్మ. ఇట్టి లోకపావనమగు నాత్మయొక్క గంభీర తత్త్వమును గూర్చి పర్యాలోచన మొనరింపఁ గడంగని వ్యక్తి యభ్యుదయపదవి నధిష్ఠింపఁ జాలఁడు. తనజీవితమును స్వర్గీయానందధామ మొనరించుకొన నభిలషించు ప్రతిమానవుఁడు నాత్మీయములగు భావములను గుర్తించియు, భాషణములను గూర్చియు, ప్రారంభములను గుర్తించియు, సమస్తకర్తవ్యాకర్తవ్యములను గుర్తించియు, శీఘ్రముగ వివేచించు టగత్యము. ఆత్మతత్త్వము నెఱిఁగి సాధించు వ్యక్తి విజయుఁడై సకలార్థసిద్ధిఁ సులభముగాఁ గరగత మొనరించుకొన సమర్థుఁడగుచున్నాఁడు. ఆత్మవిజయ రహస్యోద్ఘాటనమునిమిత్తమీప్రకరణమందుఁ బ్రప్రథమ ముత్తమోద్యోగంబును గూర్చి చర్చించుట సమంజసము.

మానవజీవిత ముద్యోగపరిపూర్ణము. ప్రతిదినమును, ప్రతినిమేషమును మనుష్యుఁడు స్వాభావికముగ నుద్యమింపుచునే యుండును. అతఁడేదో యొకకార్యమును ప్రారంభింపని గడియకాలమేని వానిజీవితమందు లభింపనేరదు. విశ్వమునందనేకములగు కార్యములు ప్రారంభమునందు నీచములుగను,

నల్పములుగను, గోచరించుచుండును, కాని పర్యవసానమం దాలఘుకార్యములే వాస్తవముగా మహోత్తమకార్యములుగఁ బరిణమించుచున్నవి. స్థూలప్రపంచమును విలోకింపుఁడు. ప్రతికార్యమును సాధారణోద్యోగముచేఁ బ్రారంభమగుచున్నది ప్రతిమహానదియుఁ దనజన్మస్థానమున సామాన్యకీటకములకేని దాటుటకుసాధ్యపడునంతటి సంకీర్ణముగ నుండుచున్నది. ప్రచండమగు తుపాను సృష్టియొక్క స్వల్పసంఖ్యాకములగు జలబిందువులనుండియే ప్రారంభమగుచున్నయది. అతివిశాలమును, మనోహరమును సహస్రవర్షములుండిగ భయంకర శీతాతప వాతములను సహించుచు సుస్థిరముగ భూమిపై నిలిచి గగనాంతరమునకు [illegible] నొసంగుచున్న బ్రహ్మాండమగు వటవృక్ష మొకానొకదినమున గణ్యము కాని బీజరూపమునందుండియుండెను. రేణువుకంటె సూక్ష్మమగు నగ్నిస్ఫులింగము ప్రమాదవశమున దేశస్థానఘంటమునఁ బడిన వో విశాలములగు నగరములనేని భస్మీభూత మొనరించివేయ సమర్థమగుచున్నయది.

ఇదియేచందమున సూక్ష్మప్రపంచమును వీక్షింపుఁడు, మహాత్త్వము లఘుత్వమునుండియే ప్రారంభమగుచున్నది. ఒక సాధారణమగు నాలోచనముచే నద్భుతమగు పదార్థావిష్కరణమును, సామాన్యభావచింతనముచేఁ జిరస్థాయియగు శిల్పాది

మహాకార్యమును నెఱవేరుచున్నవి. న్యూటను వినోదా సక్తిచే నాకసమున గాలిపటము నెగురవేయుచు విద్యుచ్ఛక్తి యొక్క రహస్యములను గుర్తింపనేర్చెను. ముఖోద్గతమగు నొక భావనముచేనయిన దేశచారిత్రమంతయుఁ బరివర్తనము నందఁగలుగుచున్నది. పవిత్రమగు నొక్క భావన కంఠీరాత్మ యందు స్థానము నొసంగుటచే విశ్వాభ్యుదయశక్తియొక్క పరిజ్ఞానము సహజముగా హస్తగతమగుచున్నది. భయంకరమగు నొక్క పాశవిక భావమున ఘోరమగు నత్యాచారము సంభవింపుచున్నది. ఇంతపర్యంతము నుడువఁబడిన వాక్యములచే మీ కెల్లర కిపుడు ప్రారంభముయొక్క మహత్వము గోచరించి యుండఁ గలదు. ఒకానొక కార్యముయొక్క పతనోత్థానములును, జయాపజయములును దాని ప్రారంభముపై ముఖ్యముగా నవలంబితములై యున్నవని మీకిప్పటికి స్పష్టముగా గోచరించి యుండవచ్చును. మీరనుదిన మెన్నిపర్యాయము లుచ్చరింపుచున్నదియుఁ, ఇది యుద్యమములకెట్టి మహిమకలదయి మీ రెపుడయిన గుర్తింప నరికించి యుంటిరా? యత్నించియుండనిచో సర్వాణసౌఖ్యము ననుభవింప నాత్మవిజయశాస్త్ర ధురీణులరయి నన్ననుగమింపుఁడు. మీరీ ప్రకరణమున నాచే వచింపఁబడు 'ప్రారంభము'నుగూర్చి దీర్ఘముగా విచారింప నాయత్తపడుఁడు. ఉద్యోగప్రభావము నెఱుంగు వ్యక్తి వివేకవంతుఁడయి, బ్రహ్మానందపథము నన్వేషించుటయందు విజ

యశీలుఁడు కాఁగలఁడు. అపుడు వాని సౌఖ్యము, ఆనందము, ధైర్యము, శాంతి వర్ధిల్లఁగలవు.

కార్యారంభమే యాకార్యముయొక్క కారణము. కారణమునకు వెనువెంటనే తత్తుల్యములగు పరిణామములు నియతము తటస్థింపుచుఁ గర్త కవశ్యభోక్తవ్యము లగుచున్నవి. ఒకానొక కార్యప్రారంభ మేరీతినుండునో, అది యేవిధమునఁ దత్పర్యవసాన మగు కార్యమగుచుండుట సత్యము ప్రకృతియొక్క యచంచల నియమప్రభావముచేఁ గార్యకారణముల కవినాభావ సంబంధ మేర్పడియున్నది. ఆరంభము గల స్థానముననే పరిపూర్ణత్వమును, అంతమును, పరిణామమును, ఉద్దేశ్యమును నెలయుచుండునని గ్రహించు టావశ్యకము. మనుజుఁడు గృహద్వారమునుండి బాహ్యమున కేతెంచుచున్నాఁడు. అటు లరుదెంచి మార్గము ననుసరించి నిర్దిష్టస్థానమును జేరఁగలుగుచున్నాఁడు. ఇది యేచందమున ప్రారంభముచేఁ బరిణామమును, పరిణామముచేఁ బరిపూర్ణతయు సిద్ధింపుచున్నవి. ప్రారంభము ధర్మాశ్రితమును, సత్యానురక్తమును నగుచో సత్పరిణామమును—ప్రారంభము సత్యవిరుద్ధమును, ధర్మప్రతికూలమును నగుచో దుష్ఫలితమును సిద్ధింపఁగలవు. పర్యవసానముయొక్క మేలు కీళ్లు ఉద్యోగావలంబితములు. మనుష్యులు అప్రమత్తులయి దీర్ఘదృష్టియుక్తులయి విమర్శనజ్ఞానముచేఁ దమ్ము వివిధ

కార్యములయొక్క కష్టోద్యోగములనుండి విముక్తులను గావించుకొనుచో నవశ్యము దుష్పరిణామములనుండి సంరక్షింపఁబడి, సత్పరిణామముయొక్క సత్ఫలరసము నాస్వాదింప సమర్థులగుదురు. ఈశ్వరసృష్టియందు మానవశక్తికిని, విజ్ఞానమునకును నేకవిధముగా నగమ్యములయి యొప్పు ప్రారంభములు కొన్ని కలవు. మనుష్యుఁడు వానినిగూర్చి శ్రమపడు టనుచితము. అట్టియుద్యోగములు మానవుని యంతర్బాహ్యములను, దశదిశలను వ్యాప్తములయి యున్నవి. అందు గొన్ని ప్రకృతిసిద్ధములు. మఱికొన్ని దుష్టమానవకల్పితములు. ఉదాహరణములఁ దిలకింపుడు, అతివృష్టి, అనావృష్టి కలుగుటకును, నిరోధింపఁబడుటకును మానవుఁడు హేతుభూతుఁడు కాఁజాలఁడు. కొన్ని దేశములం దగ్నిపర్వతములు బ్రద్దలయి భూకంపము నొదవించుచుండును. కొన్ని రాష్ట్రముల సముద్రము లుప్పొంగఁ దుపానువీచి మహానగరముల విధ్వంసపఱచును. మానవుని సామర్థ్యముచేఁ దొలఁగఁ దీయఁబడని యిట్టి యుద్యోగములన్నియుఁ బ్రకృతికి సంబంధించియున్నవి. కావుననే వీనిని ప్రకృతిసిద్ధములని వచించియుంటి. బుద్ధిమంతుఁ డెవఁడేని మార్గము ననుసరించిపోవుచుండ హఠాత్తుగా దస్యులు వానిని దండించుటయో, సంహరించుటయో తటస్థించుచుండుట మనము విలోకించుచునే యున్నారము. ఇట్టి దుఃఖదాయకములగు నుద్యోగములే దుష్టజన విర

చితములు. నిజోన్నతి నభిలషించు మనుష్యుఁ డిట్టి యుద్యోగములతో నెట్టినిమిత్తమును గలిగియుండరాదు. ఇవి మానవుని యెడ ప్రయోజనశూన్యము లగుచున్నవి. మనుష్య విజ్ఞానము, వీనిపై స్వాతంత్ర్యమును సంపాదించుటనుండి మానవలోకమును నిషేధించుచున్నది. సహోదరులారా! మీరు తమ శక్తిని, ధ్యానమును, మానవజీవిత మందిరనిర్మాణానుగుణ్యములగు పరికరములను సేకరించునట్టియు, సుఖాంతము లయినట్టియు, ధర్మవిరుద్ధములు కానట్టియు సదుద్యోగముల కయి విచారింపుఁడు. ఇట్టి యుద్యోగములు మానవజీవితోత్థానమున కత్యావశ్యకము లనియు, నివి మీ భావముల యొక్క ప్రతిబింబము లనియు గుర్తింపుఁడు. మీ రనుదినము చూచుచున్నట్టి వివిధకార్యముల యొక్క సంపాదనమున మీకుఁ గలుగు మనోభావము నుండియే సముద్యోగములు లభింపఁగలవు. మీదినచర్యయందున, జీవితవ్యవహారమందును, మీ యాత్మకు సంబంధించిన యంతర్గతస్థానమందు, మీరు పాలించునట్టి సమస్తోద్యోగములమీఁదఁ బూర్ణమగు లక్ష్యమును గలిగియుండు టావశ్యకము. స్వాభావికమగు జీవితానందము ననుభవించు నిమిత్తము మీరు మీదినచర్యను భావములను నెట్లు ప్రారంభింపవలయునో విచారించుట ముఖ్యము. సూర్యోదయానంతరము మనము మన దైనికకృత్యముల నేరీతిగ నారంభించుచున్నదియు బాగుగాఁ బరిశోధించుకొనవలయును. మనము ప్రాతఃకాలమునం దేసమ

యమున శాస్త్ర్యాతలమును వ్రాయుచున్నదియుఁ, దదనంతర మేవకువున స్వీయకర్తవ్యముల నారంభింపుచున్నదియుఁ బరిశీలింపఁదగును. ప్రతి నవీనదినముయొక్క పవిత్రజీవిత రంగమునం దేకీతి వర్తింపుచుండునదియు మనము మనయాంతరాత్మలఁ బ్రశ్నించుకొని సముచిత ప్రత్యుత్తరములఁ బడయవలసి యున్నది. అంతఃకరణము స్వప్నాదిఁ బృచ్ఛించుటచేఁ బ్రతిదినముయొక్క యుచితానుచితోద్యోగములమీఁద సమగ్రదినముయొక్క సుఖదుఃఖము లాధారపడి యున్నవని గ్రహింపఁ గలము. మనము ప్రతిదినమును వివేకపురస్సరాబుగ సద్యోగమునకయి వినియోగింపు చుందుమేని దివారాత్రములు విశుద్ధానందస్వరూపములుగా మనల సౌఖ్యవంతులనుగఁ జేయఁగలవు. అట్టి స్థితియందు జీవితాదర్శానందము నం దెట్టి న్యూనతయు తటస్థింపనేరదు.

ప్రాతఃకాలమున శీఘ్రముగఁ దల్పమును బాయుటే దైనికకార్యములయొక్క సముచితమును, సబలమును నగు ప్రారంభమయి యున్నది. ప్రాత స్సమయమున మన మేదేని విశేషకార్యము నాచరించుభాగ్యమును గలిగియుండకున్నను పకాలమునకు బ్రమత్తతను విసర్జించి నిద్రావిముక్తుల మగుటావశ్యకము. మేల్కొంచుటకు బిమ్మట దైనికకృత్యముల నారంభించుటయం దెట్టి యాలస్యమును, మాంద్యమును, నిరు

శ్వాసమును వహింపఁ జనదు. ప్రత్యూషముననే పర్యంకమును వీడి, తదనంతరము మనుష్యుఁడు నిర్మలత్వముతోడ దైనికవిధులను నిర్వర్తింపఁ గడంగినచో వాని శరీరబలమును, మనోబలమును వృద్ధి నొందనేరవు. ఏమానవుఁడు తన హృదయాంతరాళమునఁ జొచ్చి తన చారిత్రబలమును జీర్ణమొనరించుచున్న దోషములయెడ దయాళుఁడయి శిక్షింపక క్షమింపుచుండునో వాని జీవిత మవశ్యము దుఃఖమునకును, భయమునకును, వ్యాకులతకును బుట్టినిల్లగుటయం దాశ్చర్య మేమి గలదు? సూర్యోదయానంతరమును పర్యంకము నంటిపట్టుకొని నిద్రించుచుండు మనుష్యులు దృఢకాయులును, స్వస్థదేహులును, సౌఖ్యానంద మయులును, ప్రఫుల్ల వదనులును, తేజోమయులును గాఁజాలరు. అట్టివారు సదా వ్యాధిపీడితులయి దుర్భర దుఃఖగ్రస్తులయి దుర్బలులయి మానసికముగను, దైహికముగను నానాట క్షీణించి, సౌఖ్యానందకాంతులకు నోచక మృత్యుదేవతయొక్క వినోదసామగ్రి కావలసివచ్చుచున్నారు. దైనిక కర్తవ్యాచరణమునం దశ్రద్ధను, నిర్లక్ష్యమును, మాంద్యమును వహించుమనుష్యులు జీవితానందమను పెన్నిధినుండి వంచితులయి దుర్భరదారిద్ర్యమునకు గురియాగుచున్నారు.

మద్యపాయి అనుదినము సురాపాన మొనరించుచుఁ దన్మూలమునఁ దన దేహము వజ్రసమానమయి, నిత్యనూతన

స్వాస్థ్యమును గాంచుచున్నదని విశ్వసించుచుండును, కాని యతఁడు మద్యపానముచేఁ దనకాయ మెట్లు రోగగ్రస్తమయి జర్జరమగుచున్నదియు గ్రహింపఁజాలఁడు. కావున వాఁడను దినదినము విశేషముగ మద్యమును సేవింప నారంభించుచుండును. అతిమోహాంధముగ నలసుఁడును దన దేహమునకు విశ్రాంతి నొసఁగుటచే సంపూర్ణారోగ్యము సిద్ధింపఁగలదను నంధవిశ్వాసమునకు వశుఁడయి వ్యర్థముగా జీవితకాలమును గడపుచుండును. సోమరి తన వ్యాకులచిత్తమునకు శాంతినిగలిగించుటకును, హృదయమగు దౌర్బల్యమును దూరమొనరించుటకును చిరకాల సోమరితయే శ్రేష్ఠమై యున్నదని తనమూఢవిశ్వాసముచే సిద్ధాంతీకరించుకొనుచుండును. లోకమందలి సమస్త వ్యాధులకు సోమరితనమే మూలమను రహస్యము సోమరి కగ్రాహ్యము. వాస్తవ మాలోచింతుమేని దైహికములగు సమస్త విపత్పరంపరలను నవిరామమగు విశ్రాంతిని గైకొనుటయే యని ప్రాజ్ఞులు గ్రహింపవలసియున్నారు. ఈవిధమగు కృత్రిమారోగ్యలాలనముచే మనుష్య జీవితమునకుఁ గలుగు గణనాతీతములగు కష్టనష్టములను ప్రమత్తులు గ్రహింపఁజాలకున్నారు. ఆత్మదోషములను క్షమించుకొనుచుండుట వలననే దేహమనోబలక్షీణతయు, వైభవనష్టమును, జ్ఞానహానియు, సౌఖ్యనాశనమును సంభవించుచున్నవని గ్రహింపలేని మానవులు కేవలము నిర్భాగ్యులు.

ఉషఃకాలముననే నిద్రనుండి విడివడి దినమును సదుద్యోగమునకయి వెచ్చింపఁగఁదగుట శ్రేయస్కరము ప్రత్యూషముననే మేల్కాంచి నిర్వహింపవలసినన్ని కార్యములు లేకున్నను స్త్రీ పురుషు లెల్లరు సత్వరము నిద్రావిముక్తులగుట కడు లెస్స. ప్రతిమనుష్యుఁడును ప్రత్యూషముననే శయ్యాతలమును వీడి గృహబాహ్య సీమయందు విహరింపవలయును అతఁ డటఁ బ్రకృతియొక్క మనోహరమగు సౌందర్యమును చేతోప్రియముగఁ గాంచుచుఁ బ్రకృతిని గూర్చి గంభీరముగ నిశాంతఃకరణమునఁ దర్కవితర్కములు కావించుచుండినచో ససారమగు ప్రయోజనము కలుగఁ గలదు. ఈరీతి నాచరించుటచేఁ బ్రతిమనుష్యుఁడు శక్తిని, తేజస్సును, స్వాస్థ్యమును, హర్షమును బాగుగా ననుభవింపఁగలిగి బ్రహ్మముహూర్తమున శయ్యాతల బహిష్కరణ ప్రశ్రయమునకు యోగ్యమగు పారితోషికమును బడయుచున్నాఁడు. మనుష్యుఁ డీకతూరి సముద్యమమునకు గడంగినచో ద్వితీయ ప్రారంభమును బ్రశస్తముగనే యుండఁ గలదు. ప్రాతఃకాలమున మేల్కాంచుట కభ్యస్తుఁడయిన మానవుని స్వాంతము నిర్మలమయి వాని భావములను బ్రశాంతములుగఁ జేయఁగలదు అట్టి యప్రమత్తుఁడు క్రమముగా విచారశీలుఁడయి తన జీవితమును, జీవిత సమస్యలను, వ్యక్తియకర్తవ్యములను వినిర్మల తేజో విలసితములుగఁ జేసికొన

గలుగుచున్నాఁడు. ఈకారణమున నతఁడు నిత్యము ప్రాతః కాలముననే నిద్రనుండి మేల్కాంచి సమగ్రదినముయొక్క కర్తవ్యముల సాఫల్యమును, కాఠిన్యమును వివేకయుక్తతను, ఆత్మబలసామర్థ్యమునను దూర మొనరించి నిజ మస్తిష్కమును, స్వాంతమును వజ్ర సమానముగ నిర్మించు కొనుట కలవడుచున్నాఁడు.

ఉషఃకాలముయొక్క ప్రశాంతినిమేషమున దొక విధముగఁ దైవశక్తియుఁ, పవిత్ర మానమును, గుప్తశాంతియు, సుస్నిగ్ధ గాంభీర్యమును నెలకొని యుండు చున్నవి. ఏమానవుఁడు కార్యార్థియయి పురుష సింహమువలె దోషము లను జంతు జాలముల మట్టుపెట్టుచు విశ్రాంతిదుకూలమును దూరముగఁ బాఱవైచి, రక్తవర్ణమును వహించుచున్న ప్రాగ్దిశను బాల భానుని గాంచు నిమిత్తము మోమెత్తి చూచుచుండునో, వాఁ డవశ్యము సత్యమును, నిత్యమును నగు బ్రహ్మానందము యొక్క సమున్నతపర్వతము నధిరోహింపఁ గలుగుచున్నాఁడు. ప్రాతఃకాలముననే సకాలమునఁ గార్యారంభ మొనరించు టచే మనుష్యునకు భోజన స్వీకారమందును విశేషానందము లభింపఁ గలదు. మఱియు నతఁడు నిండు దినముయొక్క సమ స్తకర్తవ్యముల సులభముగా నిర్వహింపఁ గలిగి తనదైనిక జీవిత ధర్మభారమునుండి విమోచనము నంది ప్రశాంతస్థితిని భజించుచు సుఖింపఁ గలఁడు.

ఒక విధముగ విచారించినచోఁ బ్రతి నూతనదిన మొక నవ్య జీవితారంభము గాఁగలదు ఈ నవ్యజీవితమునందే మనుజుఁడు నవీన భావములను, గార్యములను నూతన వివేకోత్సాహములమూలమున నిర్వహింప సమర్థుఁడగు చున్నాఁడు.

ప్రతిదినము విశ్వజీవితమునం దొక నూతన ప్రారంభము.

ప్రతిదినము ప్రభాతమున విశ్వము నవీనముగ నుండు చున్నది.

భయవిషాద పాపములచే నలసిసొలసియున్న ప్రతి వ్యక్తియు స్వహితమునకును, లోకహితము నిమిత్తమును స్వీయ జీవితపరివర్తనమునకయి కోరినపుడెల్ల నవీనాశాలతను సృష్టించి పుష్పిత మొనరించుకొనవచ్చును.

మనుష్యుఁడు గతదినమునఁ దా నొనరించియుండిన పాపములను గూర్చియు, దోషములను గురించియు విశేషముగ దుఃఖించుచు నేటికర్తవ్యముల నిర్వహింపఁ జాలనట్టి దుస్థితిని తన మానసమునకుఁ గలిగింపరాదు. పాపమునకుఁ బ్రాయశ్చిత్తము పుణ్యాచరణము. నిరుత్సాహపూర్వక మగు స్వయంకృతాపరాధ చింతనముచేఁ బాపికి నిష్కృతి కలుగనేరదు. నిన్న పాప మొనరించిన వ్యక్తి నేఁడు పుణ్యమును సముపార్జింపలేడని భావింపరాదు. గతదినానుభవముచే నీదినమును బొత్తిగా నూతన

పద్ధతి ననుసరించి ప్రారంభించు టుచితము. ప్రతి మనుష్యుఁడు నిన్నటికంటె నేఁడు తనకార్యాచరణ విధానమును ప్రశస్తము గావించుకొనఁ గలిగినపుడే ధన్యుఁడు కాఁగలఁడు. మనుష్యుఁడు నిత్యము తన జీవితమున దైనందినాభివృద్ధి కలుగుచున్నదియు లేనిదియుఁ బరీక్షించుకొనుచుండు టవసరము. కార్యప్రారంభమును సంభాళించుకొనఁ జాలని వ్యక్తి కార్యము నుత్తమ రీతి సాధింప నేరఁడని పలుగ నుడువవలయునా? సమగ్రదినముయొక్క వివిధ కర్తవ్య సాఫల్యము ప్రాతఃకాలముయొక్క ప్రారంభము ననుసరించి యుండుచున్నయది. మహత్తరమును, సుదీర్ఘకాలమును నగు కార్యమును బ్రారంభించుట ద్వితీయ శ్రేణికి వర్తించు సముద్యోగము. మనుష్యుఁడు గృహమును నిర్మించునపుడు దాని నేరీతి నారంభించుచున్నాఁడు? నిర్మింపఁ బడవలసిన గృహముయొక్క చిత్రపటము తొలుత సృజింపఁ బడుచున్నది. అనంతరము పునాది వేయఁబడి దాని పైనుండి చిత్రపటానుగుణ్యముగ సమగ్రనికేతనము విరచింపఁబడుచున్నది. ప్రప్రథమము గృహముయొక్క చిత్రపటమే సిద్ధమొనరింపఁ బడక యున్నచోఁ జేసిన ప్రయాస మంతయు వ్యర్థము కావలసియే వచ్చును. ఒకవేళ విశేష శ్రమచే నేదియో యొక రీతి గృహము సాంగముగ నిర్మింపఁబడినను సుదృఢమును, ప్రశస్తమును నయి యుండఁ జాలదు. ఈ నియమమే మహత్తరములగు కార్యములనాచరించు

ఫల్లను సార్థకమగుచున్నది. ఏదేనియొక గురుతరమగు సత్కా ర్యము నాచరింపవలసి వచ్చినపుడు మనుష్యుఁడు తన్నిర్వాహణో పక్రమణమునకుఁ బూర్వము తా నాచరింపనెంచిన ఘనకా ర్యముయొక్క సూక్ష్మరూపమును, తద్విశేషములను మనో దృష్టితోఁగాంచు టావశ్యకము. ప్రతికార్యము స్థూలప్రపంచ మున ప్రకటీభూత మగుటకుఁ దొలుత సూక్ష్మప్రపంచమున మూర్తీభూతమగు టగత్యము. ప్రకృతిమహాలక్ష్మి నియమ శూన్యమును, నికృష్టమును నగు కార్యమును బ్రేమింపనొల్లదు. ప్రకృతి క్రమభంగమునకుఁ బ్రబలశత్రువు. క్రమశూన్యత కే సర్వనాశన మను మఱొందునామధేయము కలదు. మృతున కును, క్రమము నుల్లంఘించినవానికిని మధ్య భేదమేమియు లేదనియే నుడువవచ్చును. స్థిరమగుపద్ధతి, మితత్వము, నిశ్చితో ద్దేశ్యము సర్వకాల సర్వావస్థలయందు శాశ్వతములగు సంప దలు. తనకర్తవ్యముల నిర్వహించు సందర్భమునందీతత్త్వ రహస్యముల విస్మరించువ్యక్తి సత్యమునుండియు, సన్మగ్రస్థితి నుండియు, సాఫల్యమునుండియు వంచింపఁబడుచున్నాఁడు.

ఒకపద్ధతి లేకుండ జీవిత మేగడియయందు సృజింపఁ బడినదో, ఆగడియనుండియు నయ్యది వ్యర్థమే యగుచున్నది. తజ్జీవితమందు కేవల మనంతోపమే నిత్యము తాండవింపు చుండును. అయ్యది యథార్థమయినను గడవకముందే భయంకరో

పద్రవములు పొడమి చెలరేగుచుండఁగలవు. నిరంతరోపద్రవముల భయంకరాక్రమణములచే నాజీవితనౌక తలవని తలంపుగా నొక్కసారి భవసాగరమున మునింగి యథాయథలయి పోఁగలదు.

మనుష్యుఁ డేకార్యమునయిన ముందు తనమానసమున నిర్ణయించుకొనకయే యాచరింప సన్నద్ధుఁడయినచో వానిసకల ప్రయత్నములు నిష్ఫలములగును. అతని కపుడు విజయము, సిద్ధి, ప్రాప్తి, ఉపలబ్ధి యను పదములు స్వప్నగతసంపదలు కావలసివచ్చును. ప్రతికార్యసాఫల్యమునకు సుదృఢమగు నియమ మపేక్షితమయి యున్నది. ఉత్తమంబగు చిత్రపటము ననుసరించి వస్తునిర్మాణసాధన మొనరింప యత్నించు మానవుని యుద్యోగము సదా సఫలీభూతమయి వానిజీవితమును సౌభాగ్యానందమయ మొనరించి వేయఁ గలదు.

కేవలము వాణిజ్యశిల్పాది కార్యములపట్ల కాక సమస్త కార్యముల యెడ నీ నియమము చరితార్థమగుచున్నది. లేఖకుని గ్రంథరచనమునకును, చిత్రకారుని చిత్రచిత్రణమునకును, వక్తయొక్క వక్తృత్వమునకును, సంస్కర్తయొక్క సంస్కరణమునకును, శోధకుని పరిశోధనమునకును, చమూపతియొక్క సంగ్రామనిర్వహణమునకును వేయేల సృష్టియందలి సమస్త కార్యములకును మనక్షేత్రమున రచనావిధానమును దొలుత

నేర్పు ఆదిగాని యందు లగత్యము. మానసమందు నిర్మిం చుకొనఁబడిన చిత్రపటముయొక్క సమష్టిశక్తిని, దార్ఢ్యమును, సమగ్రస్థితిని యనుసరించియే కార్యములును ప్రశస్తములయి సిద్ధింపుచుండఁ గలవు.

వివిధ విధములగు కార్యాచరణపరిజ్ఞానమును సముపార్జించుటతోఁ బాటు మూఢజనులచే నల్పము లని భావింపఁబడి, విసర్జింపఁబడిన నిగూఢోద్యోగముల గుప్తమహాత్మ్యమును గుర్తించి యాచరింప నేర్చిన మనుష్యులే సకల జనవందనీయులగు కార్యకుశలురు.

సుఖమునకుఁ గాని, దుఃఖమునకుఁ గాని హేతుభూతమగుచు మానవున కగోచరముగ నుండు సర్వవ్యాపకమగు కారణముయొక్క జన్మస్థానము మానసము. మనుష్యుఁడా! నీసమగ్రజీవితము నీమానసమందు జనించు కారణరూపములగు భావములయొక్క పర్యవసానమే యని గ్రహించితివా? నీ సమగ్రచారిత్రము త్వదీయభావపరంపరలచే నిర్మితమయి యున్నది. సమస్తకార్యములు దుష్ట శిష్ట భావములయొక్క చిత్రములు. ఇవి తొలుతఁ జర్మచక్షువులకు గోచరింపనంతటి సూక్ష్మరూపమున మానసాంతరాళమున డాగియుండి పరిపక్వస్థితిఁ బ్రాపించినపిదప బహిర్గతములయి లోచనగోచరములగుచుండును. క్షేత్రమందు నాఁటఁబడిన బీజ మొకానొక

వృక్షముయొక్క ప్రారంభము. బీజ మంకురింపనది వృక్షమయి వాయుమండలము నాక్రమించుకొని సూర్యరశ్మిచే ననుదినము ప్రవర్ధమానమగుచున్నయది. ఇదియేవిధముగ మస్తిష్కమునం బుట్టుభావము మనుష్యునిచారిత్రమున కారంభమయి యున్నది. భావము తొలుతం దనమూలముల మస్తిష్కమున నెలకొనం జేయుచున్నది. అటుపిమ్మట వానిని ప్రకాశమువైపునకుం గార్యముయొక్కయు, చారిత్రముయొక్కయు రూపమునం బరిణమింపం జేయుచున్నది. తదనంతరము మానవుచారిత్రమునుండియే స్వభావము, భాగ్యము సృజింపంబడుచున్నవి.

నింద్యములును, క్రోధాన్వితములును, ఈర్ష్యాపరిపూర్ణములును, లోభయుక్తములును, స్వార్థాంధములును నగు భావముల సృజించుట యనుచితప్రారంభ మనంబడుచున్నది. ఇట్టి హేయమగు నుద్యోగముచే దుఃఖదాయకమగు పర్యవసానము లభించుచున్నది. పవిత్రములును, నమ్రములును దయార్ద్రములును, స్వార్థశూన్యములును నగు భావముల యొక్క యుత్పాదనము సదుద్యోగ మనంబడుచున్నది. ఈ సదుద్యోగముయొక్క పర్యవసాన మనంతసౌఖ్యదాయకము. ఈనియమము విశుద్ధమును, సత్యమును, నిత్యమును నయి యున్నది. ప్రపంచ మందలి విఖ్యాతము లగు సకలజ్ఞానములు, ఉపనిషద్దర్శనాది భారతీయ పవిత్ర ధర్మగ్రంథము లీ పవిత్ర

సిద్ధాంతము నైక్యకంఠముతో స్తుతించుచున్నవి. కాని మనుష్యు లీసిద్ధాంతమును మఱచి పుష్పముఁ దుచ్ఛమని నుదుత్కటతను సాహసించుచున్నారు.

తన పుష్పవాటికయం దెచ్చోట నెవ్వఁడే బీజముల నాటవలసియుండునదియు నెఱుంగు తోటమాలి యుత్తమ ఫలప్రాప్తి నందుచు వృత్తివిద్య యొక్క ప్రశస్తమగు జ్ఞానమును సముపార్జింపఁగలఁడు. ఉత్తమోద్యోగ మొనరించు మానవుని యంతరాత్మ ప్రశస్తఫలప్రాప్తిచే హర్షోత్ఫుల్లమయి నిత్యవికాసము నందుచున్నది. ప్రయోజనకరములును, పరమపూతములును, సుకృతమూలకములును నగు సద్భావములఁ దనమస్తిష్కమునందు నాటు సత్క్రియాపద్ధతి నభ్యసించు మానవుఁడు సర్వోత్తమంబగు విజయమును సంపాదించి జీవితసార్థక్యమును బడసి మహాసత్యముయొక్క నిగూఢమగు విశేషజ్ఞానమును సంచిత మొనరింప సమర్థుఁడగుచున్నాఁడు. వానికి సర్వోత్తమంబగు నానందము లభించి నిత్యము వాని మస్తిష్కమునఁ బవిత్రములును, సర్వోన్నతములును నగు భావముల నుద్భవింపఁజేయు చుండఁగలదు.

విశుద్ధభావములచేఁ బరిశుద్ధములును, సత్యములును నగు కార్యము లుదయించు చుండును. సత్యము నాశ్రయించి యుండు కార్యాచరణముచే నాదర్శప్రాయమగు విశుద్ధ

జీవితోపలబ్ధి కరగత మగుచున్నది. పవిత్రజీవితముచే ననూనమును, నక్షయమును, నపారమును నగు స్వర్గీయానందము సిద్ధింపుచున్నది.

తనభావముల నిర్మాణము నెడను, దదుద్దేశ్యము నెడను నిశ్చలమగు ధ్యానమును గలిగియుండునట్టియు, దూషితభావములఁ దనమానసక్షేత్రమునుండి నిర్మూలించివేయ నిరంతరము దత్తచిత్తుఁడయి యుండునట్టియు, సదా తనస్వాంతమును సదాశయములచేఁ బరిపూర్ణ మొనరింపఁ బ్రయత్నశీలుఁ డయియుండునట్టియు మనుష్యుఁడు తనజీవితముయొక్క వివిధకార్యముల పర్యవసానములకుఁ దన మనోద్భూతములగు భావములే ముఖ్యకారణము లని గ్రహింపఁగల సూక్ష్మజ్ఞానమును మిక్కుటముగ సంపాదింప సమర్థుఁ డగుచున్నాడు. అతఁ డిట్టి యమూల్యమగు జ్ఞానమును సముపార్జించి, తద్దివ్యదృష్టిచే సమగ్రవిశ్వముయొక్క బహిరంతరప్రకృతుల విలోకింప నేర్చి సదా సద్భావములకే తన చిత్తమునఁ దావొసంగుచుఁ జిరానంద శాంతి సౌఖ్యముల నిర్నిరోధముగ ననుభవింపఁ గలుగుచున్నాఁడు.

దూషితభావములు మానసమునం దుదయించునపుడును, వృద్ధినందునపుడును, బరిణమించునపుడును గడుంగడు క్లేశదాయకము లగుచుండును. కాని సద్విచారములు స్వాంత

మున జనించు నపుడును బ్రవర్ధమానములగునపుడును, పరిణతములగునపుడును విశేషానందసంధాయకము లయి యొప్పుచుండఁ గలవు.

బుద్ధిని, వివేకమును సంపాదింప నాకాంక్షించు మనుష్యుఁడు గణనాతీతము లగు విశుద్ధ సదుద్యోగముల నన్వేషించు టత్యంతావశ్యకము. ఆ విశుద్ధములగు సదుద్యోగములలో సర్వోత్తమములును, సర్వవ్యాపకములును నగు సౌఖ్యముల మూలములు నెలకొనియుండి మానవుని మానసికశక్తియొక్క సద్వినియోగవిధానమును, ఆత్మదమనమును, దృఢసంకల్ప బలమును, దేహారోగ్యమును, అంతర్బాహ్య శౌచమును, వినయ విధేయతలను, బుద్ధి వివేకములను వృద్ధిగావింపుచుండఁ గలవు. ఈకారణముచే మనుష్యజీవితము సమగ్రస్థితిఁ బ్రాపించుచున్నది. కారణ మేమనఁ బరిపక్వమగు బుద్ధిబలముచే భావముల సృష్టింపుచుండు మానవుఁడు సమస్తభయ విషాదముల విధ్వంస మొనర్పఁ జేయు శక్తుఁ డగుచున్నాఁడు. ఇట్టి పురుషోత్తముని జీవితకాలముయొక్క యనుక్షణమును శాంతిమయమయి భాసిల్లఁ గలదు. తన్మహనీయుని జీవితకాలము యొక్క సంవత్సరములు సౌమ్య సౌఖ్యానంద సమృద్ధము లయి వాని బ్రహ్మానంద మూర్తిని గావించివేయఁగల వనుట ధృవము.

# ద్వితీయ ప్రకరణము.

## సామాన్యకార్యములు - కర్తవ్యములు.

స్వర్గద్వారమును దెఱువఁగలట్టి కీలకమును మన కర్తవ్యములే మనకు సులభముగా బోధించుచున్నవి. త్వరపడకయు, నాలసింపకయు యథోచిత సమయమున స్వీయకర్తవ్యముల నిర్వహించు మనుష్యుఁడే బ్రహ్మానందముయొక్క స్వర్గీయదృశ్యమును విలోకింపఁ గలుగుచున్నాఁడు. ఆకాశమండలమున దూరముగ దేదీప్యమానముగ వెలుంగు నక్షత్రమువలె మనుష్యుఁడు తనదైనికకర్తవ్యముయొక్క పరిక్రియ దృఢసంకల్పముతోఁ గావింపవలసి యున్నది. —గేటే.

ఉత్తమోద్యోగములచే సౌఖ్యమును, అనుచితోద్యోగములచే దుర్భరమగు దుఃఖమును మానవునకు లభించువిధము ననే సాధారణకార్యములవలనను, కర్తవ్యములమూలమునను విషాదానందములు ప్రాప్తించుచున్నవి. స్వయముగాఁ గర్తవ్యపాలనమందే మనుష్యునకు సుఖదుఃఖము లను పారితోషికములఁ బ్రసాదించుశక్తి కలదని భావింపరాదు. సుఖదుఃఖముల మనుష్యునకుఁ గర్తవ్యపాలనమునకు ముఖ్యసాధనముగ నున్న మానసముయొక్క భావమే కలిగించుచున్నదని గ్రహింపఁదగును. మనుష్యులమగు మనలను కర్తవ్యపరాయణులు

గను, కర్మయోగులుగను జేయుచుండు భావ మను మహత్తర
శక్తిమీఁదనే విశ్వముయొక్క ప్రతికార్య మవలంబింత
మయియున్నది. అల్పములగు కార్యములను స్వార్థశూన్య
మగు బుద్ధితోడను, వివేకపూర్వకముగను సాకల్యముగను నిర్వ
హించుటచే నపారమగు సౌఖ్యము కలుగుచున్నది. ప్రశాంత
మగునట్టి సౌఖ్యము ననుభవించుచుండు మానవున కసామాన్య
మగు లోకోత్తరశక్తియు లభింపఁగలదు. కారణమేమన బిందు
పతనక్రమమున ఘటము జలపూరితమగురీతి మానవజీవిత
మును లఘుకార్యపరంపరల సమ్యగాచరణముచేఁ బూర్ణ
స్థితికిఁ బ్రాపించుచున్నది. అణువునుండియే బ్రహ్మాండము విర
చితమయిన దను దార్శనికసిద్ధాంతముచే నల్పములేనిదే యధి
కము కలుగనేరదను విజ్ఞానరహస్యము సార్థకమగుచున్నది.
జీవితముయొక్క సామాన్య దైనిక కార్యములందు సూక్ష్మ
మగు వివేక మంతర్వ్యాప్తమయి యున్నది. ఒకపదార్థము
యొక్క భిన్నభాగములు పూర్తిఁజెందినపు డావస్తువుయొక్క
సమగ్రరూప మేర్పడుటయం దాశ్చర్యము లేదు.

విశ్వమండలముయొక్క ప్రతివస్తువును సూక్ష్మములగు
పరమాణువులచే సృజింపఁబడియున్నది. సూక్ష్మపదార్థముల
యొక్క సంపూర్ణత్వముపై మహాపదార్థములయొక్క యాస్తి
క్యమును, సమగ్రస్థితియు నవలంబితములయి యున్నవి. సృష్టి

యొక్క యేదేని యొక విశేషాంగనిర్మాణమున దోషముండు దొరలినచో సకలసృష్టియందునయితము న్యూనత గోచరింపఁగలదు. ఒకవస్తువులోఁగల పరమాణువును దీసివేసినచో నావస్తువుయొక్క యా స్థైర్యమునకును, స్థిరత్వమునకును భంగము కలుగఁగలదు. ఇసుకయొక్క లఘుకణములు లేకయే వసుంధర సృజింపఁబడజాలదు. ఇసుకయొక్క చిన్ని రేణువులు సంపూర్ణముగ నున్నపుడే పృథ్వియుఁ బూర్ణాకారమును బడయఁగలుగుచున్నది. అల్పకార్యముల నాచరించుటయందు విస్మృతి యొదవినచో మహత్తరకార్యములందు ఘోరోపద్రవములు చెలరేగఁగలవు. నభోమండలముయొక్క నక్షత్ర మెంతసంపూర్ణమో హిమముయొక్క ఫేనము నయిత మంతియే సంపూర్ణమయియున్నది. తుషారకణ మెంత సుందరమును, సుఘటితమును నయియున్నదో భూగోళమునయిత మదియే రీతిగ నున్నది.

ఒక సూక్ష్మమగు క్రిమియు మనుష్యుఁ డెంతటి పరిమాణమునం దేరీతి నిర్మింపబడి యున్నాఁడో, అదియేరీతిగ సృజింపఁబడియున్నది. ఇటుకపై నిటుకనుంచుటచేతనే మహోత్తుంగమును, సుందరమును నగు ప్రాసాదము నిర్మింపఁబడుచున్నది. కావున నల్ప మల్పము కానేరదు. అల్పత్వము గురుత్వమున ననుసరించియుండు పదార్థము కాదు. అయ్యదిగురుత్వమునకు జ్ఞానమును గలిగించు స్వామిగ నున్నది.

గర్వాంధులును, ఉద్రేకపరులును నగు మూఢ మానవులు మహోన్నతస్థితిని సంపాదింపవలయు ననియెడి యుత్కటాభిలాషచే మిథ్యాప్రతిష్ఠను గలిగింపనట్టి యల్పములగు కర్తవ్యములను స్వీయ మంతవ్యములు గను, యథార్థములుగను భావింపక, వానినన్నింటి నుల్లంఘింపుచు, నీచదృష్టితో విలోకింపుచు వెఱ్ఱివెంకటాయలగు ఘనకార్యములకయి నిరంతరము వెదకులాడు చుందురు. మూర్ఖునియందు నమ్రస్వభావ ముండనేరదు. నమ్రస్వభావవిహీనుఁడు జ్ఞానదూరుఁడయి, దురహంకారముచే నుద్రిక్తుఁడయి యసంభవములగు గురుతరకార్యములఁ దృటిమాత్రకాలమున సాధించి వేయువానివలెఁ బ్రయత్నశీలుఁడయి వానివైపునకుఁ బర్వెత్తుచుండును.

మిథ్యాప్రశంసను, క్షుద్రపారితోషికములను, అలీకగౌరవములను నభిలషింపక మహాపురుషులు నిస్సందేహహృదయులయి, నిస్స్వార్థభావముతోఁ దమసామాన్య కర్తవ్యముల నిర్వర్తించుకొనుచు, గర్వాంధకారమును, లోభమును నిర్మూలించి జ్ఞానసంపన్నులయి, శక్తియుక్తులయి విశ్వభూషణు లగుచున్నారు. మహాపురుషులు మహత్వము నన్వేషింప వాంఛింపరు. సదా వారు భక్తిని, స్వార్థత్యాగమును, సత్యమును సంపాదింప నాతురపడుచుందురు. వారు లోక

వ్యవహారముయొక్క పవిత్రములగు సామాన్య కార్యములను, కర్తవ్యములను సాధింపుచు సద్గుణగణాలంకృతులయి, మహాత్మ మను పర్వతముయొక్క యుత్తుంగశిఖరమును సులభముగా నధిరోహింపుచున్నారు. మనుష్యుఁడు లోకసంస్తవము నపేక్షించి దంభమువిముక్తము మహత్తరములగు కార్యముల నాచరింపఁ బనిలేదు. అతఁడు విశ్వజీవితముయొక్క సర్వసాధారణములగు కర్తవ్యముల ననుదినము ధార్మికుఁడయి, స్వార్థత్యాగియయి, సన్మార్గము నుల్లంఘింపక నిర్వహింపుచున్నచో నకలంకమగు యశశ్చంద్రిక వానిముఖబింబము నావహించుట యం దబ్బుర మేమికలదు ?

మహాపురుషులు ప్రతిక్షణమును, ప్రతిశబ్దమును, స్వాగతమును, భోజనమును, వస్త్రమును, విశ్రాంతిని, కార్యమును, ప్రయత్నమును, వస్తువును మొదలగు సకలవిషయములను నీచదృష్టితో విలోకింపనొల్లరు. వారు సర్వమును సమ్మానదృష్టితోఁ గాంచుచు గౌరవింపుచుందురు. మహాపురుషులు ప్రతికార్యమును భగవన్నియమిత మని విశ్వసింపుచుఁ దత్కార్యమును బ్రశాంతభావముతో మానవజీవితము సౌఖ్యానందమయ మగునిమిత్తము నిర్వహించుటనే తన పవిత్రకర్తవ్యముగఁ దలపోయుచుందురు. మహాపురుషు లేవిషయమందును త్వరపడ నొల్లరు, కావున వారి జీవితములు

దోషపూరితములు కానేరవు. వారు నిరంతర మశౌచమునుండియు, మాఢ్యమునుండియు దూరముగా నుండ యత్నమొనరింపు చుందురు. తమసన్నిధానమున వెలయుచుండు సమస్తకర్తవ్యముల గురులఘు భేదమును పాటింపక యాచరింపు చుందురు. మహాపురుషుఁడు నేఁ డాచరింపఁ బడవలసిన కార్యమును రేపటికొఱకు శేషింపఁజేయ సమ్మతింపఁడు. అతఁడు విస్మృతియందును రేపుమాపులఁ గల కర్తవ్యముల బాధ్యతను సంస్మరించి ఖేదము నొందఁజాలఁడు. భూతభవిష్యద్వర్తమాన కాలత్రియ కర్తవ్యము లేవియు నా మహాపురుషుని రోమమునయినఁ జలింపఁజేయఁ జాలవు. అతఁడు సర్వకాల సర్వావస్థల యందు కర్తవ్య నిర్వాహణమునఁ త్రికరణపూర్వకముగ లీనుఁడయి యుండి బాల్యకాలోచితమగు నిష్కాపట్యమును, సరళత్వమును, నైసర్గికమగు మహాశక్తిని సంపాదించి సంపూర్ణమహత్త్వమును హస్తగత మొనరించుకొనుచున్నాఁడు. ఖేదవాదము లతని నేస్థితియందును స్పృశింపనోల్లవు.

మహాత్ముఁడగు కన్ఫ్యూసియసు "సార్వభౌముని రాజప్రాసాదమున షడ్రసోపేతాహారమును భుజింపుచున్నరీతిని నిరంతరము మనుష్యులు తమతమగృహములందు బ్రహ్మానందహృదయులయి తమకుఁ గల కలియో గంజియో త్రాగుచుండ

వలయును. నిత్యా నందమయులయి జీవించువారు ధన్యులు.”
అని యుపదేశించి యున్నాఁడు. సమస్తలోకాదర్శప్రాయ
మగు నీయుపదేశము సామాన్యవిషయములయొక్క మహా
త్త్వము నుద్ఘోషించుచున్నయది. శ్రీబుద్ధభగవానుఁడుసయి-
తము “భక్తుఁడు కాఁగోరు ప్రతిమనుష్యుఁడు సామాన్య మగు
కర్తవ్యము నయిన విలంబ మొనరింపక సంపూర్ణధ్యానము
తో, దృఢసంకల్పముతో నాక్రమించి నిర్వహించుట పరమ
ధర్మ” మని బోధించియున్నాఁడు. సామాన్యకార్యముల విస్మ
రించుటయు, వానిని సోమరితనముతో ధ్యానములేక యాచ
రించుటయు దుర్బలత్వముయొక్కయు, మాధ్యము యొక్కయు
ముఖ్యలక్షణము లయి యున్నవి.

ప్రతికార్యమును ధ్యానపూర్వకముగను, నిస్స్వార్థ
భావముతోడను నిర్వహింపఁ గడంగుటచేఁ బ్రకృతి యొక్క
నియమానుగుణ్యముగ మానవుని కర్తవ్యములు వృద్ధినందఁ
గలవు. అవుడు వాని కర్తవ్యనిర్వహణశక్తి సర్వోచ్చస్థా
నము నలంకరింపఁ గలదు; కారణమేమనఁ గర్తవ్య పాలన
ముచే బలవృద్ధియు, బుద్ధివికాసమును, సౌజన్యమును, చారిత్ర
ద్రఢిమయు, సమున్నతస్థితికిఁ బ్రాపించు చుండఁగలవు.
ప్రకృతిధర్మము ననుసరించి స్వయముగా వృక్షమునుండి ఫల
పుష్పములు జనించువడువునఁ గర్తవ్యపరాయణుం డగు

మనుష్యునియందుండి స్వాభావికముగాఁ బవిత్రమగుమహత్వ
ముదయించును. తన్మహత్వముయొక్క ప్రభావముచే మనుజుఁ
డవిరామముగా, క్రమపూర్వకముగ సకాలమున సముచిత
స్థానమం దుద్యోగించి తనచారిత్రమును, జీవితమును మనోహర
ముగఁ జేసికొనుచున్నాఁడు.

'ఇచ్ఛాశక్తి' (మనోబలము) యొక్కయు, మానసిక
ధ్యానముయొక్కయు వృద్ధినిమిత్తము నేఁడు ప్రపంచమున
వ్యవహారమునందున్న వివిధోపాయము లనుభవదృష్టితోఁ
జూడఁబడినపుడు నిరర్థకములుగనే తోఁచుచున్నవి. ప్రాణా
యామము, ఆసనములు, దృష్టిస్థిరీకరణము మొదలగు మంత్ర
తంత్రము లన్నియుఁ గృత్రిమములగు నసత్యప్రయోగములు.
జ్ఞానులు వీనినన్నింటి నున్మత్తుల భ్రాంతిమూలకములగు ప్రలాప
ములుగ భావింపఁగలరు. విద్యావంతులు సయితము సత్య
మార్గమును, దైనికకర్తవ్య పథమును నిత్య మనుసరించుటవల
ననే సమస్త విధముల మానవుని యిచ్ఛాశక్తియు, మనో
వికాసమును వృద్ధినందుననుట మఱచి కృత్రిమమార్గముల ననుస
రింపఁ గడంగుచున్నారు. దైవికశక్తిని, ఆధ్యాత్మిక ప్రభుత్వ
మును సంప్రాప్తింపఁజేసికొను నిమిత్తము మానవుఁ డస్వాభా
వికకష్ట మొనరించు పద్ధతిని సంపూర్ణముగ బహిష్కరించి
వేయవలయును. బాల్యమునుండి యౌవనమును—మాధ్య

యనుండి వివేకమును—అజ్ఞానమునుండి జ్ఞానమును—దుర్బలత్వమునుండి సబలత్వమును నెమ్మదినెమ్మదిగా మానవకోటికి లభించుచుండును. ప్రతిమనుష్యుఁడును నిత్యనూతన భావములను, నవీన ప్రయత్నములను, నగణ్యములగు కార్యములను నెడతెగకుండఁ జేయుచు దనశక్తుల వృద్ధిగావించుకొనుచుండుటావశ్యకము.

సాధువులును, యోగులును సమాధులవలనను, ఆసనముల మూలమునను దమశరీరములఁ హింసించి యొక విధమగు శక్తిని సంపాదింపఁ గలుగుచున్నారనుట సత్యము, కాని యీ యల్పమగు శక్తిని బడయుటకయి యమూల్యమగు దేహబలమెంతయో యాహుతి కావింపఁబడవలసి వచ్చుచున్నది. సమాధిచే సాధువులు విశేషమగు శరీరబలమును వెచ్చించి మానసిక బలమును సంపాదించుచున్నారు, వారి యీపద్ధతిచే నొకశక్తిక్షతియు, మఱొక్కశక్తి వృద్ధియు నొందుచున్నవి. అట్టిసాధువులాధ్యాత్మిక జ్ఞానవిశేషమును గ్రహింపఁ గలవారలయినను దమ దేహబలమును, ప్రయోజనకరమగు స్వభావమును గోల్పోవవలసినవార లగుచున్నారు. దేహబలమును, లాభదాయకమగు ప్రకృతిని బోగొట్టుకొనిన మనుష్యు లెవుడును సంపూర్ణస్థితికిఁ బ్రాపింపక సదా యపూర్ణస్థితియందే యుండుచుందురు. వ్యాకులము, తత్తరపాటు, మౌఢ్యము, వ్యభిచారము మొదలగు

భయంకరదోషములు నిరంతరము మనుష్యుని వెంటాడుచుండి అవకాశము లభించినంతనే నాని దేహగేహమునఁ జొరఁబడఁ జూచుచుండును. మనుష్యుఁడీదుష్టవికారములజయింపుచు, విశ్వముయొక్క కర్కశ భారాతపమున విహ్వలచిత్తులయి, వ్యాకులహృదయులయి ఖేదపడు దుర్బలమానవులసంఘము మధ్యవర్తింపుచు శాంతిని, ఆత్మదమనమును, ధృతిని బరిపక్వమొనరించుకొనఁ జూడవలయును. అపుడే వాఁడాత్మశక్తి సంపన్నుఁడు కాఁగలుగుచున్నాఁడు. భయంకర విషయప్రాబల్యముయొక్క మధ్యభాగమున నిగ్రహమును గలిగి వర్తించుటకే యాత్మబలమనియు, శక్తియనియుఁ బేర్లు. పవిత్రమగు స్వీయాత్మశక్తికి భిన్నమగు నేవస్తువును వాస్తవికమగు శక్తియని వచింప వలనుపడదు. నిరంతరము దైనికకార్యములను, కర్తవ్యములను, లోకోపకారములను విశేషముగాఁ బ్రాథోపాయములచే, నిస్స్వార్థభావముతో, సంపూర్ణత్వముయొక్క సిందుస్మృతితోఁ గావింపుచుండుటచే నాత్మశక్తి స్వయముగా నానాట వర్ధిల్లుచుండఁగలదు. గుప్తమును, నత్యద్భుతమును నగు నాధ్యాత్మిక జ్ఞానమును గలిగియుండియు నసావధానతచే బొమముడిపాటు, ఖేదము, మాంద్యము, ద్వేషము, కామము మొదలగు నేవిధమయిన దుర్వ్యసన మహాపిశాచముయొక్క మాయాజాలమునఁ దగుల్కొనిన వ్యక్తియు సద్గురువు కాఁజాలఁడు. తనదివ్యమగు మహత్వమును సాహసము, రోషశూన్యత,

దృఢత్వము, శాంతము, ధైర్యము, స్థైర్యము మొదలగు సాధనములచేఁ బ్రకటింపుచుండు వ్యక్తియే వాస్తవికమగు సద్గురువు. విషయాదివికారముల జయింపలేని దుర్బలుఁడు కేవలము నింద్యుఁడు. విషయలోలుఁడు మనుష్యుఁడు కానేరఁడు. ఇంద్రియనిగ్రహమును సంపాదించిన వ్యక్తియే గౌరవార్హుఁడగు నుత్తమమానవుఁడు. తనచిత్తమును శాసించుకొననేరని మానవుఁ డెంతటి దృఢకాయుఁడయినను, ధనాఢ్యుఁడయినను తుదకు సకలభూమండలము నేకచ్ఛత్రాధిపత్యముగఁ బరిపాలించు సార్వభౌముఁ డయినను జ్ఞానులదృష్టియం దుత్తమమానవుఁడు కాఁజాలఁడు. ధన ధాన్యాది వైభవములఁ గలిగి యుండక పోయినను, జర్జరపర్ణకుటీరమునే నివాసగృహముగను, కందమూలాదులే నిత్యాహారముగను గలిగియున్నను మనుష్యుఁడు విషయాదుల బహిష్కరించి తన యాత్మపై స్థిరమగు ప్రభుత్వమును సుస్థాపిత మొనరించి యున్నవాఁడగుచో నిజమగు ప్రభువుగ నిహపరముల సన్మానింపఁ బడఁగలఁడు. ఏతద్భిన్నమగు వ్యవహారమంతయు ప్రభుత్వమని నుడువఁబడ యోగ్యమయినది కాదు, కేవల మది కపటనాటక మనియు, బాహ్యవేషమనియు, మోసమనియుఁ జెప్ప బడఁగలదు.

ప్రతిమనుష్యుఁడును దన సమ్ముఖమునఁ గాననగు నట్టి స్వల్పకార్యమునయినఁ దదేకనిష్ఠతో బుద్ధిపూర్వక

ముగ ధ్యానము నొసంగి యాచరింపుచుండవలయును. మనుష్యుఁ డొక కార్యము నాచరింపు చుండు నపుడు తద్వ్యాప్యామగు నట్టిపవిత్రభావమునకును స్వీయమస్తిష్కమున స్థలము నొసంగరాదు; అతఁడు కర్తవ్యాచరణమునకు మాఱుగ నేదేని లంచమునకయి ప్రతీక్షింపఁ జనదు. కర్తవ్యమును ఫలాపేక్షలే నిర్వహింపఁబూనుటకంటె ధర్మబుద్ధితో సాధింపఁ గడంగుట శ్రేయస్కరము. నిష్కామకర్మచే మానసికశక్తి వసంతఋతువునందలి పచ్చికవలె చురచుర వృద్ధినందఁగలదు. మనశ్చాంచల్యమును బాయుటకును, ననాసక్తస్థితిని సంపాదించుటకును నిష్కామకర్మకంటెఁ బవిత్రమగు దైవికసాధనము వేఱొండు లేదు. ఫలాపేక్షాశూన్యుఁడయి కర్మభూమిని బ్రవేశించు మనుష్యుఁడు తనచిత్తముపై సంపూర్ణమగు నధికారమును నెఱపనేర్చి సులభముగా నున్నతచారిత్రుఁడయి లోకోత్తరమగు శక్తియుతుఁడు కాఁగలుగుచున్నాఁడు.

మనుష్యుఁడా! నీసమ్ముఖమున గోచరించు కార్యమును సులభముగా సిద్ధించురీతి దత్తచిత్తుఁడవయి దృఢసంకల్పముతో నాచరింపుము. ఆత్మశక్తియు, ధ్యానబలమును, పౌరుషమును వర్ధిల్లుట కిదియే సత్యమగు నుత్తమమార్గము. కర్మయోగము నభ్యసించుటకంటె జీవితము నుద్ధరించుకొనుటకుఁ దగు నుత్తమసాధన మేదియు భూమండలమునఁ గానరాదు.

కావున నీవు భ్రాంతుఁడవయినకాని, దుష్టోపదేశముచే మోసగింపఁ బడినకాని, కర్మయోగమహిమను విస్మరించి నిజాభ్యుదయమునకయి మంత్రతంత్రాది కృత్రిమోపాయముల నన్వేషింపఁ బోకుము. ఉన్నతిని సంపాదించుటకుఁ బ్రతివిధమగు నుపాయము నీతోడనే - నీహృదయమందే వెలయుచున్నది. నీ హృదయస్థమగు నుపాయమును గ్రహించుటకు నీ వేస్థితియందుంటివో దానియందే సంపూర్ణముగా నీచిత్తమును లీనమొనరించు పద్ధతి నభ్యసింపుము. అనగా నీ వేకార్యమును బ్రారంభింపు చుండుదువో, యాకార్యమునందే సంపూర్ణమగు ధ్యానమును గలిగి యుండు చుండుము. నీ ప్రకృతి వర్తింపనంతపర్యంతము నీ వెంతగాఁ గామించినను కల్యాణము కలుగ నేరదు.

ప్రతిక్షణమందును గార్యాచరణమునకు బలమును, బుద్ధిని ముఖ్యసాధనములుగ నవలంబించి జ్ఞానమును వృద్ధిగావించుకొను చుండవలయును. జ్ఞానసంపన్నుఁడు క్షణకాలమం దెన్నికర్తవ్యముల బాధ్యత నెత్తిపైఁ బడినను వ్యాకులచిత్తుఁడు గాక, వాని నన్నింటి సులభముగా నిర్వహించివేయు నంతటి సమర్థుఁడు కాఁగలఁడు. ఏవిషయము నల్పమని భావింపక సామాన్య కార్యములను మహాకార్యములవలె నాచరించు వ్యక్తియే శక్తిసంపన్నుఁడు; అతఁడే ధీమంతుఁడు. దుర్బలహృదయులగు మూఢులు సాధారణకార్యముల నసావధాన

చిత్తులయి నక్రమపద్ధతి నాచరింపుచు ఘనకార్యములకయి యాతురపడుచుందురు. వారు స్వల్పకార్యముల నసావధానచిత్తతతో ననుచితపద్ధతి నాచరించి తమ యయోగ్యతను, నపరిపక్వబుద్ధిని ప్రాజ్ఞప్రపంచమునకుఁ దెల్లమొనరించుకొని యుంటిమి గదా యని గ్రహింపలేనంతటి యజ్ఞానాంధకారమయస్థితియం దుండు చుందురు. తనపై నధికారమును నెఱపుకొనఁ జాలని మనుష్యుఁ డితరుల శాసించుటకును, మహత్తరములగు బాధ్యతల శిరమున ధరించుటకును లోభింపుచుండును. "తన కర్తవ్యమును దుచ్ఛముగ భావించి తన్నిర్వాహణమునకుఁ గడంగని వ్యక్తి ఆత్మవంచకుఁ డనఁబడుచున్నాఁడు. సామాన్య కర్తవ్యము నధమముగఁ దలపోసి దాని నాచరింపకుండుటకంటె భయంకరమగు నాత్మద్రోహము మఱొండు లేదు." అని మహాత్ము లనేకులు తమస్వానుభవసిద్ధమగు జ్ఞానముచే సిద్ధాంతీకరించి యున్నారు.

కార్యమును శక్తిమూలమున నాచరించుటచే మానవుని శక్తి విశేషముగ వర్ధిల్లువిధముననే దుర్బలత్వముచేఁ గార్యమాచరింపఁ బడినచో దౌర్బల్యమే వృద్ధి నందఁగలదు. మనుష్యుఁడు మహాకార్యముల నాచరించురీతిగనే సామాన్యకర్తవ్యములనునయితె మాచరింపుచున్నాఁడు. పాపాచరణముచే సంప్రాప్తమగు దుఃఖమే దుర్బలత్వము చేతను మనుజులకు

లభ్య మగుచున్నది. కావున దుర్బలత్వము పాపములలో నొకటిగ లెక్కింపఁబడుచున్నది. మానవునియందుఁ జారిత్ర్య బలము నెలకొనకయున్నంతపర్యంతము వాని కెట్టియానందమును గలుగనేరదు. దుర్బలమనుష్యుఁడయినను సామాన్య కార్యముల మహాకార్యము లని భావించి యాచరింపఁ గడంగినచో బలాఢ్యుఁడు కాఁగలుగుచున్నాఁడు. బలవంతుఁడగు మనుజుఁడు తన సామాన్య కర్తవ్యముల నాచరించుటయందు సావధానతను, నిర్లక్ష్యమును గలిగియున్నచో వాని సామాన్యమగు వివేకమును, బురుషకారమును నష్టమయిపోవ వాఁడును దుర్బలశక్తుఁడే యగును. ఈదిగువ నుదహరింపఁబడు శబ్దములలో వర్ణింపఁబడియున్న యున్నతియొక్క నియమము పైని ప్రసంగమును సమర్థింపుచున్నయది:— "తొలుదొలుత నుండియు బల మెవ్వానియందుండునో వానికే నిత్యము నూతనముగ బలము లభింపుచుండఁగలదు; ప్రప్రథమమునుండి బల మెవ్వానియందు లేకుండునో వానికిఁ గల స్వల్పమగు బలము నయితము ప్రకృతిచేఁ గబళించి వేయఁబడఁగలదు." మనుష్యుఁ డూహించుటను బట్టియుఁ, గర్మ నొనరించుటను బట్టియు, వచించుట ననుసరించియు వానికి లాభనష్టములు కలుగుచుండును. మానవునిచారిత్ర్య మనుక్షణము వృద్ధిక్షయములఁ బొందుచునే యుండుచున్నయది. మానవజీవితమునం దొకక్షణమునఁ గల్యాణాంశము వృద్ధియగుచుండ మఱొ

కృష్ణునియం దహితాంశము పెచ్చుపెరుగు చుండును. అనగా నేత్రణమందు మానని మనోవాక్కర్మ లేరీతిగ నుండునో, ఆవిధముగనే వానిచారిత్రమును హెచ్చుచుఁ దగ్గుచు నుండు, లాభనష్టములును నదియే చందమునఁ బ్రాప్తింపు చుండును.

లఘుత్వమును శాసింపనేర్చిన వ్యక్తి గురుత్వముపై నయితము న్యాయసంగత మగు నధికారమును నెఱపఁగలుగు చున్నాఁడు. లఘుత్వమునకు స్వయముగా వశీభూతుఁడయి, తద్దాస్యమునకుఁ గడంగుచుండు మనుష్యుఁడు విజయుఁడు కానే రఁడు. పరాభూతుఁడగు నతఁ డేస్థితియందును గురుత్వమును సమీపింపఁ జాలఁడు.

మూర్ఖుఁడు క్షుద్రదోషములును, నల్పములగు నధర్మ ములును, క్షుద్రములగు పాపములును మహాత్వమును గలిగి యుండవనియుఁ గావున నిరంతర క్షంతవ్యములనియు దూర దృష్టిలేమిచే భావింపుచుండును. వాఁడు తా నేదేని భయంకర మగు పాపమునుగాని, వ్యభిచారమునుగాని చేయనంత పర్యం తమును దాను పుణ్యాత్ముఁడనే యనియు, నల్పములగు పాప ములచేఁ జారిత్రము దూషితము కానేరదనియు భావింపుచుఁ దన్ను స్వయముగా మోసగించుకొను చున్నాఁడు. మూర్ఖుఁ డీరీతి భావించుటచేఁ దనకుఁగల సామాన్యపుణ్యమును నయి

తము నష్టమొనరించుకొని దురాత్ముఁ డగుచున్నాఁడు. అట్టి దురాత్ముఁడు తనజీవితమునం దెపుడు నాత్మపరిశోధనపాఠము నభ్యసింప నేరక స్వల్పకాలమునందే యధఃపతితుఁడు కాఁగలఁడు. అట్టి పతితుఁడగు పామరుని లోకము సన్మానింపఁజాలదు. వానినొక నిర్జీవప్రతిమగ భావించి సదా ధిక్కరింపుచుండఁగలదు. అట్టి హీనుఁడు మానవసంఘమును సంస్కరింప యత్నించినను దన సహచరులకు విషయాదిపాపములనుండి విడివడ నుద్బోధించినను వాని ప్రయత్నములును సదుపదేశములును నిష్ఫలములు కావలసివచ్చును. వాఁడు తన దోషముల క్షుద్రములని భావింపుచున్నకొలఁదియు వాని చారిత్రమును మనుష్యత్వమును హైన్యమునకు గురియగుచుండఁగలవు. వాఁ డేరీతి ననియమితమును, నిరంకుశమును నగు స్వాతంత్ర్యముచే దూషిత కార్యముల నాచరింపుచు నిజదుర్బలత్వమును బ్రకటింపుచుండునో ఆ నిరంకుశస్వాతంత్ర్యమును, నసావధానతయు మానభంగముగ రూపాంతరితములయి వానిని జేరుచుండును అట్టి మందభాగ్యునిగూర్చి విచారించువా రుండఁబోరు. కారణమేమన నింద్యచారిత్రుని లోకము ప్రేమింపఁజాలదు. వాఁడు నిత్యము దుర్బలుఁ డగుచుఁ దనకార్యముల సాధించుకొననేరక నిరుద్యోగము యొక్క దుష్టఫలితమగు ఘోరదారిద్ర్యదుఃఖమును విధిలేక యనుభవింపవలసినవాఁ డగుచుండును. కర్మయోగ సాధనబలమునుండియు, వివేకమునుండియు, లోకాను

భవమునుండియు శూన్యుఁడగునట్టివానియుపదేశము నాలించునా రీభూమండలమున నుండఁబోరు. ప్రతిధ్వనిని వెంటాడిన ఫల మేమి కలుగు?

సామాన్యమానవులు సదా యసావధానచిత్తులయి సేయునట్టి యపరాధములకయి యెట్టిదండనము ననుభవింపకుండనుండుచుండ, బుద్ధిమంతు లట్టిసామాన్యములగు దోషములయందే యంతర్వ్యాప్తమయి యుండు భయము ననుభవించుచున్నారు. వారు దోషముల పరిత్యజించుటచేతను, విశుద్ధభావముల జింతించు కారణమునను, పవిత్రకార్యముల నాచరించుటచేతను లభించు మోక్షమును నయితము వీక్షింపఁగలుగుచున్నారు. కాని యట్టి పవిత్రచారిత్రసంప్రాప్తమగు ముక్తినే సామాన్యులు తుచ్ఛముగఁ దలపోయుచుండుట శోచనీయము. బుద్ధిమంతుఁడు సామాన్యమనుష్యులు స్వప్నమందైనను జూడ నభిలషింపనట్టియు, దైనికకార్యములలో నవలంబింపఁబడుచున్నట్టియుఁ బ్రశాంతమగు నాంతరికాత్మదమనమును గుర్తింపఁ గలుగుచున్నాఁడు.

తమ సామాన్యదోషములను, సాధారణపాపములను మహాభయంకరములుగ గుర్తించి పరిత్యజింప నాయత్తపడు మనుష్యులే సాధుసత్తములగు మహాపురుషులు. వారు తమ ప్రతిభావమందును, కార్యమందును సువిశాలమగు ప్రభావ

ముదయించుచుండుటను వీక్షింపఁ గలుగుచున్నారు. వారు తమ జీవితాభ్యుదయమునకును, బతనమునకును హేతుభూతములగుచుండు సామాన్యములగు చరిత్రాంశములయొక్క న్యూనాధిక్యములను సావధానచిత్తులయి విలోకించుచున్నారు. బుద్ధిమంతులిట్టి యాత్మపరిశోధనమందును, సత్యాన్వేషణమందును జతురమతులయి యుండుటవలననే క్రమక్రమముగాఁ దమ్ము తామే యుద్ధరించుకొన సమర్థులగుచున్నారు. నిరంతరము తమచారిత్రమును, జీవితచర్యలను ధ్యానపూర్వకముగఁ బరిశీలించుకొనుచుండు వ్యక్తి పవిత్రుఁడును, భవ్యుఁడును నగుటయం దాశ్చర్యము లేదు. పరిశోధనము పాపపరిహారమునకు మూలసాధనము.

సముద్రము బిందువులచేతను, వసుంధర కణములమూలమునను, నక్షత్రములు ప్రకాశరేణువులవలనను నిర్మింపఁబడినభాతియే మానవజీవితము సామాన్యములగు భావములవలనను, గార్యములచేతను విరచితమయి యున్నది. భావములు, కార్యములు లేనిచో జీవితాస్తిక్యమే మిథ్యయగుట తటస్థించును. కావున ప్రతిమనుష్యుఁడును వానిజీవితమును వానిభిన్నములగు భావముల ననుసరించియుఁ, గార్యముల ననుసరించియు నేర్పడుచుండును. ఆ వివిధములగు భావములయొక్కయుఁ, గార్యములయొక్కయు సంఘటన (కూర్పు)మే మనుష్యుఁడు.

సంవత్సరము క్రమబద్ధములగు క్షణములయొక్క సమూహమే యయినచందమున మానవజీవితమును, దచ్చారిత్రమును క్రమబద్ధములగు భావములయొక్కయుఁ, గార్యములయొక్కయు సమ్మేళనమే యని నుడువఁ బనియుండదు. వివిధము లగు నంగప్రత్యంగముల సమ్మేళనముచే దేహముయొక్క బాహ్యాకృతి నిర్మింపఁబడుచున్న విధముగనే వివిధోపకరణములచే మానవజీవితము సిద్ధమగుచున్నది. వర్షము (సంవత్సరము) సకలఋతువులచేఁగూర్పబడినది. భూమండలము సమవిధ పదార్థములయొక్క విరాట్స్వరూపము.

సామాన్యములగు నుపకారములవలనను, నౌదార్యములకారణమునను, నాత్మసమర్పణముచేతను సహజ దయార్ద్రమునను, నుపకారపరతంత్రమును నగు సత్స్వభావము సృష్టింపఁబడుచున్నది. సాధారణములగు నాత్మోత్సర్గములు, సహనశీలతలు, ఆత్మవిజయములు మానవుల శక్తిసంపన్నులుగను, సమున్నతచారిత్రులుగను సిద్ధమొనరించుచున్నవి. జీవితముయొక్క సామాన్యవ్యవహారములందుఁ బౌరుష్యమును వహించు మానవుఁడే వజ్రసమాన కఠినచిత్తుఁడు. తన క్షుద్రములగు పనులందును, నుడుపులందును యోగ్యతను, సుబుద్ధిని వెల్లడించు మనుష్యుఁడే యోగ్యుఁడు; వందనీయుఁడగు సజ్జనుఁడు.

మనుష్యుఁడు లోకమం దనేకసందర్భముల మోసగింపఁబడుచు జీవితము క్షణికములగు భావములనుండియుఁ,

గార్యములనుండియు భిన్నముగా నున్నదని గ్రహింపఁ గలుగుచున్నాఁడు. వాఁడు సామాన్యములగు భావములును, గార్యములును జీవితముయొక్క సారభూతములగు మూలకములని గ్రహింపఁ జాలకున్నాఁడు. ఈరహస్యమును గుర్తించిన మనుష్యునకు సమస్తపదార్థములును పవిత్రితములుగ గోచరింప నారంభించును; సమస్తకార్యములు, కర్తవ్యములు ధర్మయుక్తములుగఁ దోప మొదలిడును. సామాన్యములగు వ్యవహారములందు సత్యము గర్భితమయి యున్నది. సంపూర్ణత్వమే నిష్క్రణాత్వము.

"అధికారములు, సంపాదనములు, ఉపలబ్ధులు నశింపుచున్నవి, ఆసక్తులు మార్పునొందుచున్నవి, మానసముయొక్క యుద్వేగములును బరివర్తనశీలములే, కాని కర్తవ్యము కబళింపఁబడఁజాలదు; క్షీణింప నొల్లదు; మంచి చెడ్డ ఘటనలను తుపానులచేతను విచలితము కానేరదు."

జీవితముయొక్క భాగములు క్రమముగాఁ గడచిపోవుచున్నవి. సమగ్రజీవిత మొక్కనాటిక నతిక్రమించి పోవుచున్నది. మానవుఁడా! నిద్రించుచుంటివా యేమి? అయ్యో! నీ వెంతటి మందభాగ్యుఁడవు లే!! లేమ్ము!! మేల్కొనుము! నీజీవితము ముగియుకమునుపే పవిత్రములగు కర్తవ్యములనన్నింటి నిర్వహింపుము. నీ కభిలాషయున్నచో నీ జీవితము

యొక్క ప్రతిభాగమును యోగ్యతచేఁ బరిపూర్ణము కాఁగలదు. ఇట్లాచరించుటచే సంపూర్ణజీవితమం దెచ్చోటను దృటి యుదయింపనేరదు. "రాగిడబ్బులనుగూర్చి జాగ్రత్తపడువాని వెండినాణెములు వానికవియే జాగ్రత్తపడఁగలవు" అనుసిద్ధాంతవాక్యము సార్థకమాయినది. ఈసిద్ధాంతము ప్రాపంచికవ్యవహారములందు యుక్తియుక్తమును, జీవితార్థమును నగుచుండ ముననే సుజ్ఞానజ్యోతిర్విభాసితమగు సూక్ష్మప్రపంచ . సంమును విశేషప్రయోజనదాయక మగుచున్నది. వర్తమానమం దాచరింపఁబడు ప్రతికార్యమును ధ్యానపూర్వకముగఁ బరీక్షించుచున్నచో మానవుని భావిజీవితముయొక్కయుఁ, జారిత్రముయొక్కయు సమస్తవిషయములు చక్కఁబడఁగలవు భావికాలమును దృష్టియం దిడుకొని వర్తమానమును సంస్కరించుకొన సన్నద్ధుఁడయియుండు మనుష్యుఁడే సావధానుఁడును, సప్రమత్తుఁడును, నిపుణుఁడును నగుచున్నాఁడు. ప్రతిమనుష్యుఁడు మహాత్వమును గలిగియుండునట్టియుఁ, బ్రశంసకుఁ బాత్రమగునట్టియు విషయముల నడుమ నాకాంక్షితుఁడయి యుండరాదు. వర్తమానమందుఁ దనసమ్ముఖమున సిద్ధముగా నున్న కర్తవ్యముల నుచితరీతి మనుష్యుఁడు నిర్వహించినచోఁ బ్రశంసనీయములగు విషయములు తమంతట తామే సిద్ధింపఁగలవు. మానవుఁడు తన యాధునిక కర్తవ్యపథమునఁ గల ప్రతిబంధకములను, నభ్యంతరములను విలోకించి భీతచిత్తుఁడు కారాదు. నిస్స్వార్థ

భావములతో, నిర్భయహృదయముతోఁ గర్తవ్యముల సాధింపఁగడంగుటచే విఘ్నభయబాధలన్నియు నంతర్హితములయి పోఁగలవు. అసంతోషము, సోమరితనము, గొప్పపనుల నొక్కసారిగఁ జక్కఁబెట్ట వలయునను పేరాస, సత్వర త్వాత్వ్యములు, ఇట్లాచరించుటచే మనుష్యుఁ డేమహాత్మ్యమును బడయుటకయి ఘోరమగు తప మొనరింపుచుండునో, ఆమహాత్మ్యమే తానుగా వచ్చి వానిచరణరాజీవముల మ్రోల వ్రాలఁ గలదు. తొట్రుపాటునకును, బొమముడికిని సమానమగు దుర్బలత్వము వేతొండు లేదు. ఆంతరిక ప్రతిష్ఠను, ఆధ్యాత్మిక గౌరవమును బడయ నుద్యోగ మొనరించుట మానవుని విధి. తృణాభంగురమును, నింద్యమును, దుఃఖదాయకమును నగు బాహ్యప్రశంసను బడయ యత్నింప నగత్యము లేదు. కృత్రిమమగు నీప్రశంస యాధ్యాత్మికప్రతిష్ఠయొక్క యడుగులకు మడుగులొత్తుచుండును.

కర్తవ్యముల నాచరించుటయందుఁ గలుగు కష్టనష్టములును, భయబాధలు నాకార్యమందు లేవు. అవి మానవుని మానసమునందే నెలకొని యుండుచున్నవి. మనుష్యుఁ డాకార్యమునైపునకుఁ దనమనోభావమును ద్రిప్పుచో వక్రపథము ఋజుమార్గమగును, ఆసౌఖ్య మానందముగఁ బరిణమించును.

మానవుఁడా! నీవు నీప్రతిక్షణమును బవిత్రముగను, నుపయోగకరముగను జేసికొన నుద్యమింపుము. ప్రతికార్య

ము ననురాగముతోడను, నిస్స్వార్థభావముతోడను నాచరింపుము. ప్రతిభావమును, వచనమును, గార్యమును ధర్మయుతముగను, మృదుమధురముగను జేసికొనుము. ఈరీతి నీవు నీజీవితముయొక్క క్షుద్రాతిక్షుద్రములగు విషయముల యసామాన్యమహాత్త్వమును నభ్యాసానుభవములచే గ్రహించి యపారమగు నక్షయానందము స్వేచ్ఛగ ననుభవింపుము

---

# తృతీయ ప్రకరణము.

## కాఠిన్యము - వ్యాకులత.

మనుష్యత్వమును బడయ నభిలషించు ప్రతివాఁడును స్వీయహృదయమును శాసించుపద్ధతి నభ్యసించవలయును. విషయవాసనలను నిర్మూలించి వానిస్థానమున నిగ్రహమును మహోన్నతమగు సువిశాలపీఠమును సుస్థాపిత మొనరించి దానిపై నుపవసింపఁదగును. ఆశాభయములను రాజద్రోహులఁ జీల్చి చెండాడి స్వతంత్రమగు నాత్మసామ్రాజ్యమును స్థాపించి స్వచ్ఛందపరిపాలనముచే సుస్థిర యశస్సౌఖ్యముల ననుభవించుటకదు లెస్స. —శేలీ.

మానవదేహధారీ! నీవు నీలక్ష్యమునుండి విచలితుఁడవయితివా? ఒకతూరి లక్ష్యమునుండి తప్పిపోయినంతనె భీతిచే మహానముఁదాక్రాంతుఁడవయితివేమి? భీరువువలె విగతసాహసుఁడవగుట తగునా? అల్లదిగో! నీ జీవితలక్ష్య మిప్పటికి నేరీతి దళతళలాడుచున్నదో నేత్రముల విప్పి యొకసారి విలోకింపుమా!

వీక్షించితివేని యాశాలత తిరిగి వికసింపఁగలదు. అపుడు నీవు ప్రయత్నశీలుఁడవగుదువు. సోదరుఁడా! పర్యాప్తముఁ బతితుఁడ వయితివా? అయినచో నష్టమేమి? సేదఁదీర్చుకొని తిరిగి పరుగిడుము.

—ఇలాహ్వీలరువిలకాక్సు.

'శ్రేయాంసి బహువిఘ్నాని' అను గురుజనోక్తి సామాన్యమానవుల పరిహాసమునకుఁ బాత్రముకాఁగలదు. విపత్పరంపరవలనను, దుఃఖభారమునను నపారమగు దివ్యానందము లభించుననుటలో జనసామాన్యమున కావంతయు విశ్వాసము కలుగ నేరదు. కష్టసహిష్ణుత సౌఖ్యప్రాప్తికి మూలసాధన మను విజ్ఞానసిద్ధాంతము సాధారణ మానవకోటి కసంగతముగఁ దోఁపవచ్చును. కాని యీసిద్ధాంతమందుఁ గల పరమసత్యమును ప్రాజ్ఞలోకము మహాపురుషుల పుణ్యచారిత్రములఁ బరిశీలింపుచుండుటచే సులభముగా గ్రహింపఁగలదు. సత్యమే బాహ్యమున కసత్యముగ గోచరింపుచుండవచ్చును. మూఢప్రపంచముయొక్క దృష్టికి దుఃఖములుగ నున్నవే ధీమంతుల విశాలదృష్టియందు సుఖములుగ నుండుచున్నవి. విపత్పరంపరలు తొలుత నజ్ఞానమునుండియు, దుర్బలత్వము నుండియు జనించి యనంతరము జ్ఞానమును, శక్తిని మానవునకుఁ గలిగింపుచున్నవి. సంకటము సదుపదేశదాయకము. సదుపదేశము సంస్కరణసాధనము. సంస్కరణ మాత్మవిజయమునకు మూలము. ఆత్మవిజయ మమందానందకందము.

సత్యపరతంత్రమగు జీవితముచే జ్ఞానము లభించుచున్న కొలఁదియు సంకటములు క్షీణించు చుండఁగలవు. జ్ఞానప్రాప్తిచే దుఃఖములు, విపత్తులు, చిక్కులు భానుప్రకాశమునఁ దొలఁగు తమఃపుంజములమాడ్కి క్రమముగా దూరమగుచుండఁగలవు. కాఠిన్యమును, సంకటములును కర్తవ్యమునం దుండనేరవు. అవి కార్యాచరణమునకు ముఖ్యసాధనములగు మనోభావమునుండియుఁ, బౌరుషమునుండియు నుదయమగుచుండును. బాలుని కాచరణసాధ్యముకాని కఠినకార్యమే ప్రౌఢవయస్కుని పరిపక్వమగు మస్తిష్కమునకుఁ గఠినముగ నుండజాలదు. ఇదియేచందమున జ్ఞానశూన్యునకుఁ గఠినముగఁ బ్రతీతమగు ప్రతివిషయము వివేకవంతునకు సులభముగ నుండుచున్నది.

అశిక్షితుఁడును నపరిపక్వ మస్తిష్కయుతుఁడును నగు నర్భకున కొక సరళమగు పాఠము నభ్యసించుటయందు చిక్కుటమును, దుర్దమనీయమును నగు కాఠిన్యము కలుగఁగలదు. సులభమగు నాపాఠవిషయమునఁ బారంగతుఁడగుటకా బాలకుఁడు దీర్ఘకాలపర్యంత మెంతయో వ్యాకులతను, గష్టమును ననుభవింపవలసియే యుండుచుండును. కాఠిన్యముయొక్క మహోన్నతమగు ప్రాకారము నుల్లఘించి విజయదుర్గమునఁ బ్రవేశించుటయం దాబాలుఁ డనేకపర్యాయములు విఫల

మనోరథుఁడయి నిరాశచే నశ్రుధారల ప్రవహింపఁజేయుచుండఁ గలఁడు. కాని ధ్యానపూర్వకముగఁ బరిశోధించినచో నశ్రుపాతమునకు హేతుభూతమయిన కాఠిన్యము బాలకుఁడు త్వరపడంగిన పాఠమందు లేదనియు, వాని యదూరదర్శిత్వము నందును, వివేకరాహిత్యమునందును గలదనియుఁ దెలియఁ దగును. ఆకాఠిన్యమును సౌలభ్యముగఁ బరిణత మొనరించుటకును, బాలకుని స్వాస్థ్యము, సౌఖ్యము, కల్యాణము నిమిత్తమును జ్ఞానమును వృద్ధిగావించు కొనుటత్యంతావశ్యకము.

పైనుదహరించిన బాలకుని దృష్టాంతమువలె మానవుఁడభ్యుదయమును, శ్రేయస్సును బడయునిమిత్తము జీవితసమస్యలయొక్క పరమత్వమును జయించుటయందును, విపత్పరంపరల డీకొనుటయందును బారంగతుఁడు కావలసియున్నది. అగణితములగు విఘ్నములను, గష్టములను సాహసముచే నెదుర్కొని జయించుచుండుటచే మానవుని లోకానుభవమును, జ్ఞానమును, వివేకమును బెంపొందుచుండఁగలవు. ఇట్లాచరించుటచే నవీనపాఠాభ్యాసమునను, నూతనసత్కార్యాచరణమునను సంప్రాప్తమగు దివ్యమగు సౌఖ్యము మానవునకు లభింపఁగలదు.

### సంకటముయొక్క యథార్థమగు రూప మెట్టిది?

సంపూర్ణత్వము ననుగ్రహింప సాధ్యపడనిస్థితికే సంకట మని

పేరు. కావున మానవుఁ డీవిపత్తును దూరమొనరించుకొన నధికమగు జ్ఞానమును, గంభీరమును, విశాలమును నగుబుద్ధిని సముపార్జింపఁగడంగు టెల్లరీతుల శ్రేయోదాయకము. ఈ యవసరమందు మానవుఁడు తనయనభ్యస్తమగు పురుషకారమును, నాంతరికబలమును, గుప్తశక్తిని వినియోగింపవలసియుండును. అట్టిస్థితియందు వాని కీప్సితార్థములన్నియు సులభముగ సిద్ధింపఁగలవు. కావునఁ గాఠిన్య మొక ఛద్మవేషమును ధరించియున్న స్వర్గదూత యని తెలియఁదగును. కాఠిన్యము మానవుని కాదర్శగురువు; పరమమిత్రము. కావున మేమన దానినీతిశిక్షను మానవుఁడు ప్రశాంతహృదయముతో నాలకించి, యథోచితముగ గ్రహించినచో నదియే వానికి మహోత్తరానందమును, సమున్నతజ్ఞానమును బ్రసాదింపఁగలదు.

కఠినత్వములేనిచో నేవిధమగు నభ్యున్నతియు, విసరణమును, బరివర్తనమును గలుగనేరవు. ప్రతిరోధమును, బ్రతిఘాతమును, ఆటంకములును సృజింపఁబడియుండనిచో సకల ప్రపంచము స్థాణువు వలె నొక్కస్థలమందే నిలిచిపోవుట తటస్థించును. మానవజాతి పరిశ్రాంతి, ప్రమాదములచే వ్యథఁ జెంది నష్టమయిపోవుట కలుగఁగలదు.

కర్తవ్యపథమునం దేదేనివిఘ్న మొందు తటస్థించినచో మనుష్యుఁడు హర్షోత్ఫుల్లముఖారవిందుఁడు కావలయును.

కారణమేమన విఘ్నములును, కష్టనష్టములును దటస్థించి
నపుడు మనుష్యుడు మాంద్యమునందును, దుర్బలత్వమునందును
దాసుఁడయి యున్నాఁడనియుఁ గర్తవ్యపథమందలి ప్రతిబంధ
కములఁ దొలఁగింప సముచితసాధనమును బడయునిమిత్తము
విశేషమగు పురుషకారమును, సుస్థిరమగు బుద్ధిని నుపయోగింప
వలసియుండు ననుభావమును దెల్లమొనరించు వాక్యము లతనికి
సూక్ష్మప్రపంచమునుండియు, నాత్మాంతరాళమునుండియుఁ
గర్ణగోచరము లగుచుండఁగలవు. మానవుఁడు వివేకమును,
నాభ్యంతరిక శక్తులను, నాత్మస్వాతంత్ర్యమును, సాధనబల
మును సంపాదింప బాధ్యుఁడయి యున్నాడను హెచ్చరికను
నిరంతర మొసంగుచుండున దీ పరమపవిత్రమగు 'విఘ్నమే.'

ప్రత్యేకముగాఁ గాఠిన్యమనుస్థితి వేఱొండు లేదు. మాన
వుఁడు తనయాస్తిక్యముయొక్క సమగ్రత్వమును గ్రహింప
లేకుండుటకే న్యూనతయనియుఁ, గాఠిన్యమనియు, విఘ్న
మనియుఁ, బ్రతిఘాతమనియు, సంకటమనియు వివిధములగు
నామములు కలవు. ఈకారణముననే కాఠిన్యముచే ననంఖ్యాక
ములగు ప్రయోజనములు కలుగఁగలవని నుడువవలసి వచ్చు
చున్నది.

కష్టములు, బాధలు స్వచ్ఛందముగను, హఠాత్తుగను
నుదయింపఁజాలవు. వాని యావిర్భావమునకు బహుకారణము

లుండుచుండును. మానవదేహముయొక్క యవయవములు పెంపొందుచుండిన కొలఁదియు వికాససిద్ధాంతము (law of evolution) ననుసరించి విఘ్నములు కలుగుచుండును. ఈవిఘ్నములే మానవునకు విజయమందిరము నారోహించుటకు బలవత్తరములగు సోపానములు కాఁగలవు.

మనుష్యులను విఘ్నభయబాధలకుఁ బాత్రులఁ జేయు నట్టియు, వానినుండి వారల విముక్తులఁ గావించునట్టియు భిన్నములగు మార్గముల నాచరణము కలిగియున్నది. మనుష్యుఁ డెంతగా ప్రయత్నించి చతుర్దిశలనుండి తన్ను దృఢతమములగు పాశముల బంధించుకొనియుండినను వాఁ డాచరణముచే స్వయముగా బంధనవిముక్తుఁడు కాఁగలుగుచున్నాఁడు. మానవుఁ డజ్ఞానాంధకార బంధుర మగు జీవితనిర్వాహమున కలవడి ఘోర దుఃఖములఁ జిక్కియున్నను, మార్గశూన్యమగు భయంకరారణ్య మధ్యమునఁ దగుల్కొని మార్గముగానక వ్యర్థముగా సంచరించుచున్నను స్వయంకృషిచే సత్యముయొక్క విశాలమగు మార్గము నన్వేషించి, బ్రహ్మానంద వివేకయుక్తమగు కర్తవ్య మను పరమోజ్జ్వలనగరమును జేరు నిష్కంటకమగు ఋజుమార్గము ననుగమింప సమర్థుఁడగుచున్నాఁడు. కాని కాలుపైఁ గాలు వైచుకొని కూర్చుండుటవలనను, హతాశుఁడయి రోదించుటవలనను, విచారభరమునఁ జీత్కారమున

రింపుచుండుటచేతను మానవుఁ డభ్యుదయమును బడయఁ జాలఁడు, యోగియాత్మశక్తిని సదా వశింపఁజేయుచుండునట్టి సంకోచమును, మనశ్చాంచల్యమును—నిరంతరోద్వేగమును, న్యాయసంగతముగు చింతనమును, నాత్మసంశోధనమును నిర్మూలించి వేయఁగలదు. పతితుండగు మానవుఁడు నిరంతరము తన యధమస్థితినిగూర్చి విచారించుకొనుచుఁ, దద్దుర్దశనుండి విడివడుట కాతురపడుచుఁ, దనచిత్తమునందు సంపూర్ణాధికారమును నెలకొల్పఁ బ్రయత్నించుచు, మానసోచితమగు నత్యున్నత స్థానమును జేరుట కనుగుణ్యమును, గ్రంథబద్ధమును, ధార్మికమును నగునుద్యోగ మొనరించుచుండుట శ్రేయస్కరము. ఉద్యోగశూన్యమగు పశ్చాత్తాపమును, చింతనమును మానవునికర్తవ్యముయొక్క కష్టపరిమాణమును వృద్ధిగావింపఁగలదు. పతితుఁడు స్వయంకృతాపరాధనివృత్తికొఱకు పశ్చాత్తాపముతోఁ బాటు ధీరహృదయుఁడయి కార్యసాధనమునకుఁ గడఁగుట యావశ్యము. అధమస్థితికిఁ బ్రాపించిన వ్యక్తి యొకింత తడవు ప్రశాంతహృదయుఁడయి, తా నేయే కర్మపథముల ననుసరించుటచే నిట్టి దుర్దశ కలిగినదియుఁ, దా నేయే సందర్భములందుఁ బొరఁబడినదియుఁ దనయంతరాత్మను బ్రశ్నించుకొనినచోఁ దనలోపముల నన్నింటి స్పష్టముగా గ్రహింపఁగలఁడు. సత్యముయొక్క జిజ్ఞాసతో మానవుఁడు తనపతితావస్థకు హేతువు నారయుచో రహస్యము వెల్లడి కాక మానదు. అతఁడు

నిరంతర మీరీతి విచారింపుచుండుటచేఁ దనకర్తవ్య నిర్వహణమునకే యేలోపములు వాటిల్లినదియు గ్రహింపఁగలఁడు. సామాన్యమగు నపజయమును దూరమొనరించుటకు విశేషమగు నాలోచనాశక్తియు, బుద్ధివికాసమును, మితవ్యయమును, స్వార్థశూన్యతయు నత్యావశ్యకములనియు, వీనిచేఁ గార్యముయొక్క కాఠిన్యమును, క్లేశములును దూరమయి పోఁగలవనియు, నాత్మపరిశోధనా తత్పరుఁడగు ప్రతిమనుజుఁడును గ్రహింపఁగలుగుచున్నాఁడు. ఆత్మపరిశోధకుఁడు తా నేరీతి దుర్వ్యసనములకు వశుఁడయి క్రమక్రమముగ భవభయదుఃఖతాపబంధనములఁ దగుల్కొనినదియు, జ్ఞానమువలనను, వివేకముచేతను సన్మార్గము నేరీతి ననుసరింపవలసి యుండునదియు స్పష్టముగా గ్రహింపఁగలఁడు. ఆతఁ డీరీతి వర్తించి తన భూతకాల జీవితచారిత్రముచే సువర్ణసమానమగు వివేకానుభవముయొక్క మూల్యవంతములగు కణముల నొక్కచోఁ బ్రోవుచేసినచో వాని విపత్పరంపరలయొక్క పరిమాణము చాల క్షీణించిపోఁగలదు. అనంతర మతఁడు తన యుద్వేగశూన్యమగు భావముయొక్క తీవ్రప్రకాశమును విపత్పరంపరలఁ బరీక్షించుటకును, వాని సమగ్రస్థితిని గుర్తించుటకును, వానిలోపలియొక్కయుఁ, దనయందలియుఁ గార్యబుద్ధిని గ్రహించుటకును వినియోగించివేయు నని స్పష్టపడుచున్నది. ఇట్లాచరించుటచే విపత్పరంపరలు దూరమయిపోవ ఋజుమార్గము

దృష్టిగోచరము కాఁగలదు. అపుడు మానుష్యుఁడు తన యావజ్జీవితమునకుఁ దగు ప్రయోజనకరమగు నీతిశిక్షను నేర్చుకొనఁగలుగుచున్నాఁడు. ఇంతియే కాక వాని స్వస్థితియందును విడిచిపుచ్చనొల్లని వివేకముయొక్క కొంతభాగమును, బ్రహ్మానందముయొక్క యొకింత పరిమాణమును బడయఁ గలుగుచున్నాఁడు. అజ్ఞానము, స్వార్థము, మౌఢ్యము, హ్రస్వదృష్టి మొదలగువాని మార్గములన్నియుఁ బొరపాటు, వ్యాకులతలయందు సమాప్తములగుచున్నవి, అదియే చందమున సుప్రసన్నతగను, శాంతముగను బరిణమించు జ్ఞానమునకును, ఆత్మత్యాగమునకును, వివేకమునకును కూడ మార్గములు కలవు. ఈసిద్ధాంతమును బాగుగా గ్రహింపనేర్చినవ్యక్తి భయంకర కష్టముల నెదుర్కొని, సాహసపూర్వకముగ వానినన్నింటిఁ బరాభవించి దోషములనుండి సుగుణములను, దుఃఖసముదాయములనుండి సుఖములను, నిరంతరోపద్రవములనుండి చిరశాంతిని సంపాదింప సమర్థుఁ డగుచున్నాఁడు.

మానవుఁడు తనకుఁగల మహాశక్తితోడ నెదుర్కొనినను జయింపఁబడని కార్యముయొక్క కష్టము లీ భూమండలమున లేవనియే చెప్పవచ్చును. తొందర నిష్ప్రయోజన మగుటయే కాక హానికరమును నయియున్నది. త్వరపడుట మూర్ఖునిలక్షణము. త్వరపడువాని కార్యకరణశక్తియు, వివేకమును ధరా

గతము లగును. యథోచిత మగు నుపాయాంతరములచే నేఁ
టిభయము కష్టములు నాశనముగు దూరమయిపోఁగలవు, కావున
కష్టములు కలుగ, విపత్పరంపరలును కలిగినపుడు మానవుఁడు
వ్యాకులచిత్తుఁడు కారాదు. కష్టములు కలకాల ముండనే
రవు. అవి ధైర్యస్థైర్యములచే ఝంఝామారుతముచే దూది
పింజము తెగిపోవు చందమున నదృశ్యములయి పోఁగలవు.
పారములేని కార్యములు కష్టసాధ్యములు అని భావింపరాదు.
కేవల మవి యసంభవములు. అసంభవములగు విషయముల
కయి పరితపించుట కేవల మవివేకము. అసంభవమగు విష
యములను జయింప నభిలషించు వ్యక్తి నాసియుండదగు నొప్పు
కొనుటకంటె గత్యంతరము లేదు. గృహికములును, సాంఘి
కములును, నార్థికములు నగు కష్టము లజ్ఞానము నావిర్భ
వింపుచున్నవి. వాని శమనముచే వ్యావహారిక జ్ఞానము లభిం
పుచున్నది. అది నేఁటి ధర్మవిషయికములగు కష్టములును,
తత్సంబాధమగు సందిగ్ధతయు, మానసిక వ్యాకులతయు హృద
యమునం దంధకారమును నొదవింపుచుండు వ్యామోహము
నుండి కలుగుచున్నవి. వీనిని దూర మొనరించుటచే ధార్మిక
మును, నాధ్యాత్మికమును నగు జ్ఞానప్రకాశము ద్విగుణముగఁ
బ్రసరింపఁ గలుగుచున్నది.

మానవ జీవితము యొక్క పరమాద్భుతమగు యాథా
ర్థ్యమును గ్రహింపవలయునని యెడి ప్రగాఢమగు వాంఛయు,

నాతురతయు మానవహృదయమందుఁ గలిగిన దినము వాని జీవితమందు పరమపవిత్రముగ పుణ్యావసరముగఁ బరిగణిం పఁబడఁ గలదు. ఆపర్వదినముయొక్క మహత్త్వమును మానవుఁడు తత్కాలమునను గ్రహింపఁజాలక పోయినను, తదనంతరము స్పష్టముగా గ్రహించి తన్ను ధన్యునిగ భావించుకొనఁ గడంగును. నాటినుండియే మానవుని స్థూలసౌఖ్యములయొక్కయుఁ, బాహ్యవిక్షేపప్రవృత్తి యొక్కయు, జడసామాన్యమగు నౌదాసీన్యము యొక్క మూఢజీవితము సమాప్తమయినదనియు మానవుఁడిక క్షణికములందుండక, అప్రమత్తుఁడయి, యున్నత శీలుఁడయి సత్యాన్వేషణాయి సాధకజీవనుఁడు కాఁగలఁడనియుఁ దెలియవచ్చును. నేటినుండి తాను ద్విపాదపశువుగ నుండఁజాలఁడనియు, జీవితమందలి సమస్యలన్నింటి మానసిక బలాధిక్యముచేఁ బరిష్కరింప నాతఁడు ద్యుక్తుఁడయి యున్నాఁడనియుఁ, బుద్ధిమందిర ద్వారమున నిద్రితులుగ నిలువఁబడియున్న సంకెలములఁ గను జాగరూకతతో నన్వేషించుచున్నాఁడనియు బాహ్యప్రపంచము గ్రహింపవలసి యున్నది.

"ఆపత్కాలమునఁ గర్మభూమినుండి విముఖత్వమును వహింపక, వ్యాకులత నందక సుస్థిర చిత్తుఁడయియుండు వ్యక్తియే సంస్తవపాత్రుఁడగు బుద్ధిమంతుఁడు."

జీవితతత్త్వ రహస్యమును గ్రహింప నాతురతను గలిగియుండు వ్యక్తి స్వార్థ యుక్తమగు విశ్రాంతిని, అసావధాన

పరతంత్రుఁడగు నజ్ఞానమును సంస్కరించుట కేని సమ్మతింప నొల్లఁడు. అతఁ డింద్రియములయొక్క నింద్య సౌఖ్యముల సంభోగింప నంగీకరింపఁడు. నిత్యము తనహృదయము యొక్క మంగళప్రకాశ భాసురములును, నపరిభావితములును నగు ప్రశ్నలకు సముచిత ప్రత్యుత్తరము నొసంగుట నుండి విముఖుఁడయి యుండఁజాలఁడు. అతనిహృదయాంతరాళముయొక్క స్వకీయ చేతనశక్తి మేల్కొంచినది. నిద్రించుచున్న దేవతాపురుషుఁడు నిశాకాలమందలి యసంగతస్వప్న సందర్శనముచే నిద్రావిముక్తుఁడయి నే నిఁక సత్య యొక్క పరమోజ్జ్వలమగు పవిత్రదినమును వీక్షించునంగాక నిద్రింపఁజాల నని ప్రతిజ్ఞ సేయుచున్నాఁడో యన్నరీతి నాత్మతత్త్వ పరిశీలనాయత్త చిత్తుఁడు సత్యాన్వేషణమున కయి తహతహపడుచుండఁ గలఁడు. అతఁడు తనహృదయాంతరాళము నుండి ప్రతిధ్వనించుచున్న యాత్మప్రబోధ రవము నాలించి, తదాత్మయొక్క సర్వోన్నతోద్దేశ్యములను, సముదారకార్యములను నిర్వహించుటయం దేమాత్రము కాలవిలంబ మొనరింప నొప్పఁబడఁడు. ఆలస్య మతనికి విషప్రాయముగ నుండుచుండును. కారణ మేమన వాని జాగరితములగు మానసిక శక్తులు కర్తవ్యములయొక్క కఠినబంధనములఁ ద్రెంచివేయుటకయి చీటికి మాటికిఁ బ్రేరేపించుచుండును. అతనికి సత్యమువలనను వివేకముచేతను లభించునట్టి యాత్మశాంతి పాపదోషములచే

ప్రాప్తింపఁ జాలదు. ఏనాఁడు మనుష్యుఁడు గాఢాజ్ఞానజన్యములగు దోషములను, సందేహములను, బాధనములను విచ్ఛేమొనరింప నవిరామమగు కృషి సలుపుచు, నిత్యము సందేహాంధకారమును దూరమొనరించు నట్టియు, జీవితముయొక్క మహత్తరములగు ప్రశ్నములకు యోగ్యమగు నుత్తరము నాసంగగలట్టియు దివ్యప్రకాశభాసురమగు మార్గము నన్వేషించునో, ఆదినమే యామానవుని యానందము సకలలోక వ్యాపకము కాఁగలదు.

కఠినమగు పాఠమును గంఠస్థ మొనరింపఁగలుగుటచే బాలకునిహృదయ మానందతరంగములచేఁ బొంగిపొరలఁగలదు. అదియేచందమునఁ బ్రాపంచిక సంకటములఁ దరించినపిమ్మట మానవునిహృదయము ప్రశాంతమయి సౌఖ్యానందముల ననుభవింపఁగలదు. దీర్ఘకాలమునుండి యతిగంభీరమగు తత్త్వరహస్యమును గుర్తింప నుద్యోగ మొనరింపుచున్న మానవుని సందేహాంధకారమంతయు నొక్కసారిగ దూరమగునట్లు రహస్యోద్ఘాటన సాధనమగు బ్రహ్మజ్ఞాన ముదయింపుచో వాని దీర్ఘకాలభవతాపతప్తమగు హృదయమున కెట్టి శాంతి చేకూరఁగలదో వర్ణింప శక్యముగాదు.

మానవుఁడా! నీవు దూరదృష్టిలేనివాఁడవయి నీకర్తవ్యసాధన మార్గమునఁదోఁచు విఘ్నములను, విపత్తులను, విఫా

తములను, విషాదభయములను నశుభకరములగు పిశాచము
లుగ భావింపకుము. ఇట్లు భ్రాంతిపడుటచే స[illegible]గా
సామాన్య వస్తువులగునవియే మహాభయంకర రాక్షసులుగ
నీమ్రోల నవతరించి నిన్ను సంహరించివేయఁగలవు కావున
నీవు వివేకవంతుఁడవయి వానిని శుభఫలదాయకములగు సత్ప
దార్థములుగనే భావింపుము. అట్లొనరించుటచే యథార్థముగ
నవియే దేవతాపురుషులయి నీసన్నిధిని సాక్షాత్కరించి నీయ
భీష్టములఁ బ్రసాదింపఁగలవు. కర్తవ్యపథమందలి ప్రతిబంధక
ములను, నవాంతరములను నవుల్లంఘనీయములగుటచే వాని
నుండి పరాఙ్ముఖుఁడగు మానవుఁడు ఘోరవిపద్దశకు గురికాఁ
గలఁడు. కార్యప్రతిబంధకములు ధీరునిఁ గాంచి పలాయన
మొనరించును. అవి పిరికిపందను సతతము వెంటాడుచుండును.
అతఁ డెచ్చోట కేగినను నవి వాని కెట్టెదుట వచ్చి సమున్నతభూ
ధరములవలె నిలువఁబడి లోకమువైపునకుఁ బ్రసరింపనున్న
వానిదృష్టి నడ్డగించివేయును. కావున వీరుఁడా! నీవు విఘ్నము
లకు — విపత్తులకు భీతిల్లక స్థైర్యముతోడను, ఓరిమితోడను
వాని నెదుర్కొనుము. వాని గురుత్వమును, వ్యాప్తిని సరిగాఁ
దూయుము. వానిని వేరుపఱిచి యొక్కొక్కదానినిఁ బాగు
గాఁ బరీక్షింపుము, వానియంగప్రత్యంగములఁబట్టి వానిశక్తి
యుక్తాలతను గ్రహించి తన్నిర్మూలోపాయము నార
యుము. ఈచందమున వానిరహస్యముల నన్నింటి స్పష్టము

గా గ్రహించి వాని నాక్రమించుటచే నీ వవశ్యము విజయుఁడవు కాఁగలవు. ఈచందమున సామాన్యదృష్టికిని, శక్తికిని సాధ్యపడనట్టి యాత్మవిజయమును సంపాదించి నీ వానందపదవిని బడసి ధన్యుఁడవు కాఁగలవు.

---

## చతుర్థ ప్రకరణము.

# భారము తగ్గించుకొనుటెట్లు?

మనము బరువు నెత్తుకొనుటనుగూర్చి పెద్దలవలన వినుచున్నారము; గ్రంథములందుఁ బఠించుచున్నారము, కాని భారమును తగ్గించుకొనుటనుగూర్చి విచారించుటయే మఱచి పోయితిమి. మానవుఁడా! నీవు వహించియున్న యేభారము నయిన నిజహృదయమునుండి తొలఁగించుకొని సాటిసహృద యులలో స్వతంత్రహృదయుఁడవయి, ప్రఫుల్లచిత్తుఁడవయి సంచరింప సమర్థుఁడవయి యుండియు వ్యర్థముగా నేల దుర్భ రమగు భారమును వహించి గాడుచున్నాఁడవు? ఒకవస్తువు నొకస్థానమునుండి మఱియొకస్థానమునకుఁ గొనిపోవలసివచ్చి నపుడే మనుష్యులా బరువును భుజములనిడుకొని మోయు చున్నారేగాని, యితరసమయములఁ దానిని స్పృశింపుటకేని సమ్మతింపరు. ఏదేని యొకబరువును సదా తనభుజములపై నిడు కొని సంచరించువ్యక్తి స్వధర్మానుష్ఠాననిమిత్త మాత్మసమర్పణ మొనరించినవానిగఁ బ్రాజ్ఞలోకముచే భావింపఁబడఁజాలఁడు.

"పతంగము రక్తవర్ణమును గలిగియుండు నగ్నిగోళమును గాంచి భ్రాంతిచే దానిలోఁబడి భస్మమగుచున్నది. మతిహీనులు వ్యర్థముగా లేనిపోనిపనులను గల్పించుకొని, ఆయాసపడుచుందురు. మూఢునియొక్కయుఁ, బతంగముయొక్కయు ననావశ్యకములగు నీచర్యలు భారమును హెచ్చించి జీవితనౌకను భవసాగరనిమగ్నమొనరించి వేయుచున్నవి. నౌకయందు బరువు మిక్కుటమగుచో మున్గిపోవుట సత్యము. మనుష్యజీవితమునకు నిట్టిదేయని గ్రహింపఁదగును"

మానవుఁడా, నీ వేల మూఢుఁడవయి నిరర్థకమగు భారమును మార్దవమగు మానసముపై వైచి ఆత్మశోకముయొక్కయు, నాత్మదయయొక్కయు వ్యాకులతచే నాభారమును మఱింత గురుతరము గావింపుచున్నాఁడవు? నిరుపయోగమగు నాభారమును తగ్గించుకొని, దుఃఖమును విసర్జించి ప్రముదితస్వాంతుఁడవయి నీ వేల విశ్వానందమును వృద్ధిగావింపకున్నాఁడవు? దుఃఖదాయకమగు నేదేని యొక భారమును విరామములేకుండ భుజములపై వహించి తిరుగుట కెట్టి న్యాయయుక్తమగు ప్రమాణమును, సముచితమగు కారణమును లేదు. ఒకస్థూలపదార్థము నొకస్థానమునుండి మఱొక్క స్థానమునకుఁ గొనిపోవు నిమిత్తము మోయవలసి వచ్చినప్పుడది దుఃఖదాయకముగ భావింపఁబడనేరదు. అదయేచంద

మున సూక్ష్మప్రపంచమందు సయితము భావవ్యాకులతయొక్క భారమును కేవల మేదేని శుభఫలప్రాప్తి నిమిత్తమే వహింపవలయును. మనోభీష్టము సిద్ధించినంతనే తద్భావ చింతనము యొక్క భారమును మానసముపైనుండి సంపూర్ణముగాఁ దొలఁగించివేయుట శ్రేయస్కరము. ఇవ్విధమగు భారమును వహించుచున్నను మానవుని కెట్టిఖేదము నొదవఁజాలదు. అవశ్యము హర్షమే కలుగుచుండఁగలదు.

తాపసోత్తములు సమాధితపములచేఁ దమదేహముల కొసంగుచుండు కష్టమనావశ్యకమును, వ్యర్థమును నయియున్నదని మేము వచింపుచుందుము. కాని తమమానసములకు నపారమును, ననావశ్యకమును, వ్యర్థమునునగు కష్టమును గలిగించునట్టి సహస్ర సహస్ర సంఖ్యాకులగు మనుష్యుల యవివేకమునుగూర్చి యింతవఱకు నుడువక లోకమున కెంతయు ద్రోహ మొనరించితిమి. వ్యర్థమగు శరీరకష్టముకంటె మానసిక ప్రయాసము శతగుణాధికముగ హానికరమయినది.

అసౌఖ్యమును, క్లేశమును గలిగించునట్టి భార మెయ్యది ? ఇట్టి భారము వాస్తవముగ విచారించిన దైవసృష్టియందు లేదనియే నుడువవచ్చును. నీ వేదేని యొకవాక్యమును సంభాషింపవలసి వచ్చినపుడు ప్రసన్నచిత్తుఁడయి భాషింపుము, విలపించుచు ననాథునివలె, దీనుని వగిది మాట్లాడకుము. అవ

శ్యకతను స్వీయమిత్రునిగను, నాయకునిగను భావించి సన్మానించుట బుద్ధిమంతుని లక్షణము, దానినే శత్రువుగ భావించి వక్రభ్రుకుటితోఁ దిరస్కరించి స్వాధీన మొనర్చుకొన యత్నించుట పామరలక్షణము.

మన కీ భూమండలమునందడుగడుగునకు నావశ్యకములగు కార్యము లాచరింపవలసి యుండుచున్నది. మన మవ్వాని యాస్తిక్యముచే యంగీకరింపక, వాని నాచరింపనపుడే యవి మనకు భారముగఁ దోఁచుచున్నవి. ఆవశ్యకమగు కార్యమును ఖేదభావముతో నాచరింపుచుఁ దోడ్తోడ ననావశ్యకమగు నానందోపలబ్ధికయి యన్వేషణ మొనరించు వ్యక్తి దురంత దుఃఖవారిధి నిమగ్నుఁడయి నిరంతరము వ్యాకులజీవితమును గడుపుచుండఁ గలఁడు.

ఓ యంతఃకరణమా! సత్కార్యా చరణమునకయి మే
ల్కాంచుము.

నీవు యౌన్నత్యము నధిరోహింప నీపక్షముల విప్పుము.

జీవిత గీతముల నూతన పద్ధతిలో గానమొనరింపుము.

సత్యము యొక్కయుఁ, గల్యాణము యొక్కయు రాగ
ములఁ బాడుము

అనత్య విజయగీతమును గానముసేయుము.

నీవు నీగీతమును మహత్తరమును, మృదుమధురమును గా
వించుకొనుము.

నీవు నీసందేహములను, చింతలను, దుఃఖములను బ్రహ్మా
నంద సాధనములుగ భావించుకొనుము.

నీమార్గము యొక్క కంటకములను నానందముకుటమును
రచించుకొని దానిని కీర్తించుము.

ఆచరణయోగ్యములగు పవిత్రకర్తవ్యములను సానంద హృదయముతోడను, నిస్స్వార్థబుద్ధితోడను, నఖండధ్యానపూర్వకముగను సాధించు టావశ్యకము. మనము మహత్తరమగు కర్తవ్యబాధ్యతను శిరమున వహించి వర్తింపవలసినవారల మయియున్నను దాని నొకదుఃఖదాయకమును, ఖేదోత్పాదకమును నగు భారముగ భావింపఁజనదు,

మనుష్యుఁ డొకకార్యమునుగాని, కర్తవ్యమునుగాని యాచరింపనెంచి పరిగ్రహించి, 'అబ్బా యీకార్యమెంత కఠినమయినది? భారముగలది?' యని భావించినచో నిక్కముగా నతని కాకార్యము భారముగనే గోచరింపఁగలదు. ఒక కార్యమును నిర్వహింపఁబూని దానిని సంపూర్ణముగ సాధింప సంకల్పించిన బుద్ధిమంతుఁడు తత్కార్యమును సౌఖ్యదాయకమగు వస్తువుగనే భావింపవలయునుగాని, విషాదకరమగు పదార్థముగఁ దలంపరాదు.

యథార్థమాలోచించినచో విశ్వమందలి యేకార్యమును భారదాయకము కాదనియు, మానవుని స్వార్థముచేఁ బ్రతి కార్యమందు భారమున్నట్లు కాననగుచున్న దనియు బుద్ధిమంతులు గ్రహింపఁగలరు. మానవుఁడా! నిన్నేది బంధించు సంకటమని భావించుచున్నాఁడవో, అదియే నీముక్తిమందిరము యొక్క ప్రథమద్వారమని విశ్వసింపుము. దేనిని నీవు భయంకర శాపముగ భావించుచున్నాఁడవో, తత్కార్యమే నీకువాస్తవికానందసంధాయకము కాఁగలదు. యథార్థమగు నానందము ప్రత్యేకమగు నొకదూరదేశమందు లభించునని భ్రాంతిపడవలదు. నీచేఁ గావింపఁబడిన కార్యములు విశుద్ధములగు దర్పణముల వంటివి. ఆయద్దములందు నీప్రతిబింబమే స్పష్టముగ గోచరింపుచుండఁగలదు. నీ కార్యములందుఁ గానవగు ప్రకాశమాంద్యము, న్యూనత కార్యాచరణ సందర్భమున నీయందుండియున్న మానసికస్థితియొక్క ప్రతిబింబములు. ఏవస్తువునందయిన నీవు నీ హృదయమును సత్యమును, స్వార్థశూన్యమునునగు భావముతో సంలగ్నమొనరించినచో నావస్తువు తత్క్షణము రూపాంతరమును జెంది దివ్యమగుశక్తిని, భవ్యమగు నానందమును బ్రసాదించునట్టి సాధనముగ నేర్పడఁగలదు. కుటిల భృకుటితోఁ గ్రోధాయమాన నేత్రములతో నీముఖబింబమును దర్పణమునందుఁ జూచుకొనుచో నొక భయంకరమును, నేహ్యమును నగు వికటదృశ్యము గోచరింపఁగలదు, నీ వేరీతి ముఖలావణ్య

మును తెలుచుకొంటివో, యట్టిదృశ్యమే దృష్టిపథమునఁ బడఁ గలదు. వదనమండలమును సుందరముగఁ జేసికొని దర్పణ మును వీక్షింతువేని మనోహరమగు నాకృతి దృగ్గోచరమ గును.

నీ వేదేని యొకకార్యము నాచరించుట యుచితమని యు, నావశ్యకమనియు భావింతువేని, తత్సంపాదనమున విలం బమొనరింపకుము. తత్కార్యసంపాదనమునుండి విముఖుఁడ వగుదువేని నిశ్చయముగా నాకార్యము నీకు మిక్కుటమగు భారముగఁ దోఁచఁగలదు. స్వార్థాంధమగు నభిలాష వస్తువును మానవునిదృష్టియందు నీచమొనరించుచున్నది. అనావశ్యక మును, ననుచితమును నగు కార్యము నీప్సితసౌఖ్యము నిమి త్తమును, నింద్రియభోగార్థమును నిర్వహింపఁబూనుట పరమ మూర్ఖ్యము. ఇట్టియుద్యోగముచేఁ దీరని హాని కలుగఁగలదు.

నిన్ను సత్యపథమున నడిపించు స్వర్గదూతనుండి వేరుప డుచునట్టియు, సత్కర్తవ్యమునుండి విముఖుఁ గానొనరించునట్టియు, నింద్రియసుఖములచే క్షణికాహ్లాదమును, సౌఖ్యమును గూర్చున ట్టియు, మిథ్యాప్రశంసను నీకుఁ గలిగించునట్టియు వాంఛయే నీబద్ధవైరి. నీవు సర్వదా యప్రమత్తుఁడవయియుండి నీతివిరు ద్ధములగు వాంఛలఁ దగులొక్కనక దూషితమార్గములనుండి విముఖుఁడవయి సుబుద్ధిని సంపాదించుచుండుటయందు దేమఱ యుండవలదు.

ప్రకృతియొక్క పరమదయాళుత్వముచే దానిపరిణామములన్నియు సత్యావలంబితములయి సర్వకాల సర్వావస్థలయందును సకలజీవరాసుల బుద్ధియుతకార్యాచరణము వైపునకుఁ బ్రోత్సహింపుచుండును. మౌర్ఖ్యముచేతను, స్వార్థమువలనను తీవ్రమగు క్లేశ మావిర్భవించుట సహజము, కారణ మేమనఁ గ్లేశ మౌదాసీన్యమునకు శత్రువును, సమృద్ధికి ద్వారపాలకుఁడును నయియున్నది. విపత్పరంపరలును, విషాదభయములును మిక్కుటముగా మనుష్యు నాక్రమించినపుడే యతఁ డుదాసీన భావమును బరిత్యజించి కష్టసెలనుండి విమోచనము నంద నుద్యోగింప నారంభించుచున్నాఁడు. ఇందువలననే మానవజీవితాంతరాళమున బుద్ధిసంచారము కాఁగలుగుచున్నది.

బాధయన నేమి? ఖేదమన నెట్టిది? భారమన నేమి? ఉద్వేగమే బాధ. అజ్ఞానమే దుఃఖము. స్వార్థమే భారము.

స్వార్థదేవతారాధనము మానవుని భావములును, కర్తవ్యములును సమాప్తములయిన పిమ్మట వానిని విశేషముగ దుఃఖితు నొనరించును. స్వార్థపూజ తొలుత సుఖకరముగ నున్నట్లుండినను తుదకు నరకబాధ నొసంగఁగలదు.

మానవుఁడా! ఉద్వేగమును, నజ్ఞానమును, స్వార్థమును నీచిత్తసీమనుండియు, వర్తనమునుండియు దూరమొనరించి వేయుము. అట్లొనరింతువేని నీజీవితము క్లేశములనుండి

స్వయముగ విముక్తిని బడయఁగలదు. అంతేకాక స్వార్థమును హృదయక్షేత్రమునుండి పెకలించివైచి తత్ప్రదేశమున నిష్కపటమగు విశుద్ధ విశ్వసోదరప్రేమను సుస్థాపిత మొనరించుటచే నిజీవితభారము హాయిగఁ బరిణమింపఁగలదు. హృదయమునందు నిర్మలమగు ప్రేమను గలిగియుండి కార్యము నాచరింపుచుండుటచే నది సుకరముగను, ప్రమోదకరముగను గానరాఁగలదు.

మానవ సజ్ఞానముచే తనకయి దుఃఖము నావిర్భవింపఁ జేసికొను చున్నది. మానసమే తన్నుఁ దాను దండించుకొను చున్నది. ఈసృష్టియం దెవ్వనికిని వ్యర్థముగా నెత్తిపై మిక్కుటమగు బరువు నిడికొని తిరుగుచుండవలసినదిగాఁ గరుణాసింధు వగు జగన్నియంత దండనము విధించియుండలేదు. నేఁడు మానవప్రపంచమునఁ గాననగుచున్న భారమును, తత్పరిణామమగు వ్యాకులతయుఁ గేవల మానవేచ్ఛాసంభూతములే. మస్తిష్కమునకు యథార్థమగు శాసనకర్త బుద్ధి. క్రోధోద్వేగములు బుద్ధిరాజుయొక్క సింహాసనము నాక్రమించినంతనే వాని మానసికసామ్రాజ్యమందు రాష్ట్రవిప్లవము కలుగ నారంభింపుచున్నది. ప్రాపంచికవిలాసవినోదములును, నింద్య భౌతికవాంఛలును ముందునడచుచుండ వానిపిఱుందనే భారమును, విషాదభయములును బ్రయాణము సాగింపుచున్నవి.

మానవుఁడా! నీవు కోరినదాని నిపుడు గ్రహించుము. నీవు క్రోధాది భయంకరోద్వేగములచే బంధీకృతుఁడవయియుండి నిన్ను నీ వొక నిస్సహాయునిగను, ననాథునిగను భావించుచున్నను హానిలేదు. నీ విప్పటికిని బంధవిమోచనము నందఁ యోగ్యుఁడవే. ఈ నీయనాథునిక దుర్దశ క్రమక్రమముగ సంఘటితమయి యున్నది.

నెమ్మదినెమ్మదిగా నీవు మంచిస్థితికిఁ బ్రాపింపనేర్చి బుద్ధిని సుస్థాపితమొనరించి, క్రోధమును సింహాసనమునుండి తలక్రిందుగఁ బడఁద్రోయవచ్చును భోగవిలాసముల గాఢాలింగన మొనరించుకొనుటకుఁబూర్వమే మనుష్యుఁడు కీడునుండి తప్పించుకొనఁ గలుగు చున్నాఁడు. ఒకతూరి భోగవిలాసములయం దనురక్తుఁడయి వానిదాస్యమునకుఁ గడంగినవ్యక్తి వానిదుష్పరిణామము ననుభవించి, గ్రహించినపిదపనే వానినుండి విమోచనము నందఁగలుగు చున్నాఁడు. కర్తవ్యపరాయణత్వమున కియ్యకొనక పూర్వమే కీడునుండి తప్పించుకొనవలయు నను సంకల్పము నిశ్చితమగుచున్నది. కారణమేమనఁ గర్తవ్యపరాయణతను ధరించుటతోడనే స్వార్థసంబంధములగు సమస్తభావములును, రోదనములును, వదరుబోతుతనమును హృదయమునుండి దూరమయిపోవుచున్నవి. కర్తవ్యపరాయణత్వమును, బాధ్యతను వివేకపూర్వకముగను,

విశుద్ధప్రేమపురస్సరంబుగను స్వీకరించుటచే వానిభారము బొత్తిగాఁ దగ్గిపోవుచున్నది.

మనుష్యునిభారము కుత్సితభావములవలనను, నింద్య సంకల్పములవలనను, స్వార్థపూర్ణములగు లాలసలచేతను ద్విగుణముగ గురుతరమును, నసహనీయమును నగుచున్నది. సంకటము నెదుర్కొనుటచేతనే మానవునిశక్తి వర్ధిల్లుచుండును, గావుననే స్నేహమయి యగు ప్రకృతి మానవుని యవసరములలో విపత్తు నొకదానిగా సృజించియున్నది. మానవుని యందు దుర్బలత్వము కాపురముసేయుచుండు కారణముననే వానికిఁ బ్రతికార్యమును భారమయముగను, గష్టతరముగను నున్నట్లు బోధయగుచుండును. మానవుని దైహిక మానసికదుర్బలత్వము నశింపనిదే వాని యీదుస్స్థితి దూరము కానేరదు. మానవుఁడా! కార్యములు కఠినములుగను, భారములుగను గాననగునట్టి దుస్స్థితి నీకుఁ దటస్థించినంత మాత్రమున విచారపరీతచిత్తుఁడవు కావలదు, నిరంతరము హర్షించుచునే యుండుము. అట్లుంటివేని నీకు శీఘ్రకాలమందే భారమునుండి విముక్తినందుటకును, స్వశక్తిని, స్వబుద్ధిని వికసింపఁ జేసికొనుటకును దగిన మంచితరుణము లభింపఁగలదు. బుద్ధిబలముచే సాధింపఁబడని మహాకార్య మీశ్వరసృష్టి యందు లేదు. ప్రేమతత్త్వమును బరిశ్రాంతమొనరింప సమర్థ

మఱి శక్తియు నీభూమండలమున గానరాదు. కష్టములను గూర్చి చింతించుట విడిచివేయుము. నీ సమీపమందుఁగల భద్రమానవుల జీవితములఁగూర్చి నిత్యము విచారించుచుండుము.

ఒక విశాలమగు కుటుంబముగల స్త్రీ తన 15రూప్యముల మాసికవేతనముచే మిక్కిలి కష్టముతో నా పరివారమునంతయు నెటులో పోషించుచున్నది. ఆయమ్మ తనయింటి మలిన వస్త్రముల నన్నింటి దానే స్వయముగ నుతుకుకొనుచున్నది. ఆమెయే వ్యాధిగ్రస్తులగు నిరుగుపొరుగువారి సేవాశుశ్రూషయు సలుపుచున్నది. ఇట్లుండియు నామె ఋణమను పెనుభూతమునుండియు, నిరాశ యను భయంకరపిశాచమునుండియు సురక్షితముగనే యుండుచున్నయది. ఆతల్లి సూర్యోదయమాదిగ సూర్యాస్తమయము దనుక ప్రఫుల్లచిత్తయయి తన సమస్తకార్యముల నిర్వహించుకొనుచుఁ బరులకు మొఱవెట్టుకొనుటను నీచముగఁ దలంచుచుండును. ఆమె స్వార్థశూన్యయగుటచే సదా భయవిషాదములనుండి దూరముగనే యుండుచున్నయది. నేను పరులసౌఖ్యమునకుఁ గారణభూతమయి యుంటినిగదా యని తలపోయుచు నామె నిత్యము హర్షించుచుండును. ఆమె గృహకృత్యములనుండి స్వల్పమగు నవకాశమును బడసినను నిరుద్యోగముగఁ గూర్చుండ నొల్లదు.

లోకమందలి మూఢులవలె సెలవులయందు వ్యర్థముగాఁ గాలమును గడపుటకును, నాటకములను, వినోదములను, వింతలను జూచుటకును సమ్మతించుట కామె సిద్ధపడదు. గృహకృత్యములనుండియు, వ్యవహారములనుండియు నేమాత్ర మవకాశము లభించినను జ్ఞానవతి యగు నామె విలాసవతులతో స్నేహ మొనరించుటకును, క్రొత్తక్రొత్త దుస్తులను వెలకుఁ దీసికొని సోల్లాసముగ ధరించుటకును, విద్యావివేకములులేని స్త్రీలు లోకాభిరామాయణము పేరిట నిత్యము సలుపుచుండు ప్రసంగములఁ బాల్గొనుటకును, సంగీతసభల కేగుటకును మానసమందయిన సంగీతాలాపన నొల్లదు. ఆవిదుషీమణి యిట్టి వ్యర్థవినోదములచే గృహస్థజీవితమునకు వాటిల్లు కష్టనష్టములను, గౌరవహానిని బాగుగా గుర్తించియున్నది. ఆయమ్మ నిజపరివారముయొక్క సామాన్యకార్యములనయిన నాచరింపవలసి వచ్చినపుడు మిక్కిలి శ్రద్ధను, దృఢసంకల్పమును, తదేకధ్యానమును గలిగియుండుచుండును. ఆమె నిర్లక్ష్యమును శబ్దమును గాలసర్పముకంటెఁ గడు భయంకరమయినదానిగఁ జూచుచుండును. ఇన్ని యొనరింపుచు నామె స్వప్నమందును స్వార్థమును దరిఁజేరనీయ నొల్లదు. కావుననే నిరంతరము బ్రహ్మానందమున వెలయుచుండును. ఆనందమును, స్వార్థత్యాగమును జంద్రచంద్రికలవలె నవిచ్ఛిన్న బాంధవ్యమును.

గలిగియున్నవి. సుస్నేహము ముందు మహోన్నతకర్తవ్య భారమేని తల వ్రాల్చుచుండుటయం దాశ్చర్యములేదు.

చదువరీ! భారమును గ్రహించుకొనుప్రక్రియయం దారి తేరిన విదుషీమణిచారిత్రము నాలకించితివి. తన యవసరములనన్నింటిఁ గడుపుకొనుట కావశ్యకమగు ధనముకంటె నెవు లైశ్వర్యమును గలిగియున్న మతియొక వనితాచారిత్రము నాకర్ణింపుము. ఈమె విశేషమగు సంపదను గలిగియుండియు నిరంతరము విలాసపూర్వకముగ జీవయాత్రను సాగించుచుండును, కాని సాంఘికములగు నవసరముల నిమిత్తమును, దేశహిత సంబంధములగు కర్తవ్యముల నిర్వహించుటకును, నీమెయొక్క కొంతసమయమును, ద్రవ్యమును, విలాసములును వ్యయమగు చుండును. లోకోపకార పరతంత్రములగు నిట్టి కార్యముల భక్తివిశ్వాసములతోడను, విశుద్ధ ప్రేమానురాగములతోడను నిర్వహింపవలసియుండ నీయమ్మ సదా వీనినుండి తప్పించుకొనుటకు యత్నించుచు మనోభీష్టము సిద్ధింపని హేతువుచే నిరంతరము డెందమునఁ బెద్దగఁ గుందుచుండును. ఈరీతి వ్యాకులతచే నీ స్త్రీ సదా తనసౌఖ్యానందముల నశింపఁజేసికొనుచుఁ దన జీవితమును, గర్తవ్యములను గౌనతమములుగఁ జేసికొనుచుండును. హాస్యమును, నిస్వార్థమును సమీపబాంధవ్యమును గలిగియున్నచందమున నే స్వార్థానంతోషములను బరస్పరమగు

నవినాభావసంబంధమును గలిగియున్నవి. ఆత్మస్నేహము కర్త వ్యము నానందమయముగఁ జేసివేయుచుండును. గృహిణుల నీ రెండు దృష్టాంతములను బోలునట్టి యుదాహరణము లెన్నియో జీవితకాలమందు లభింపఁగలవు.

పాఠకుఁడా! నేను నుడివియున్న స్త్రీలచారిత్రములం దెయ్యది కష్టగ్రస్తమో నుడువఁగలవా? వారి యుభయుల యొక్క స్థితియు విపద్గ్రస్తమును, దుఃఖమయమును గాదనియే నుడువవచ్చును. స్వార్థమును, ప్రేమయు వారి జీవితకర్తవ్యములఁ బ్రవేశించుటనుబట్టియే వా రానందమయులుగను, దుఃఖమయులుగను నుండుచుండిరి. వారి సుఖదుఃఖములకు మూలకారణము వారి మనోభావమే కాని వ్యవస్థ యెంతమాత్రమును గానేరదు. ఎవఁడేని యొకమనుష్యుఁడు ధర్మశాస్త్రమునుగాని, మఱియేదేని యొక తాంత్రికవిద్యనుగాని నేర్వఁ గడంగుచు, “నామీద భార్యను, కుటుంబమును బోషింపవలసిన భారమే లేకున్న నే నొక మహత్తరకార్యమును నిర్వహించియుండెడివాఁడను. నా కిపుడు కల జ్ఞానమే తొలుతయుండియున్నచో వివాహమే చేసికొనియుండువాఁడను గాను.” అని వచింపుచుండును. అట్టిమనుష్యుఁడు నేటిపర్యంతము సుబుద్ధియొక్క బహువిశాలమగు ఋజుమార్గమును జూచియే యుండలేదనియు, మహత్తరమగు కార్యము నాచరింపఁదగు

యోగ్యత వానియం దేమాత్రమును లేదనియు మనము గ్ర
హింప వలసియున్నది. ఎవఁడేని యొకమనుష్యుని హృదయ
మందు మానవజాతియెడ విశేషమగు ప్రేమ యున్నచో,
వాఁడు మానవులనిమిత్తము కల్యాణదాయకమగు నొకమహా
కార్యము నాచరింప నభిలషించినచోఁ దనస్థితి యెట్లున్నను
నిస్సందేహచిత్తుఁడయి, తత్క్షణమే తన హృదయాంతరాళమునఁ
గల యపారమగు ప్రేమను గార్యరూపమునఁ బ్రకటించియే
తీరును. ఆప్రేమభావముచే వాని వాసస్థానమంతయు నిండి
నిబిడీకృతమయి యుండఁగలదు. వానిస్వార్థశూన్య మగు
ప్రేమయొక్క పవిత్రసుస్నిగ్ధ సౌందర్యకాంతియు, మాధుర్య
మును వారెట కరిగిన నట కేగుచు నచ్చటివారి హృదయము
లకు సౌఖ్యానందములఁ బ్రసాదించుచుఁ బ్రతివస్తువును సం
స్కరింపఁగలదు. బాహ్యమునకు వెల్లడింపఁబడుచు గృహ
మందును, హృదయమందును లేనట్టి ప్రేమ కేవల మహంకార
మనఁ బడుచున్నది. కపటప్రేమనే బుద్ధిమంతులు గర్వ మను
చున్నారు. అనేకులగు మతప్రచారకుల గృహములానంద
శూన్యములయి, బాల బాలికలకు సముచిత పోషణ
సంస్కారణముల నొసఁగలేనట్టి హీనస్థితియం దుండుచున్నవి.
ఆ ధర్మోపదేశకులు పరులకు గృహముల సౌఖ్యానందమయ
ములుగ నుంచుకొను విధానమును గూర్చి యుపదేశించుచుం

దురు. కాని తమగృహముల హీనస్థితిని గుఱించి విచారింప నొల్లరు. కావున వారు ప్రపంచమును మోసగింపుచుఁ దమ కాత్మవంచకత్వమునకు సయిత మొడిగట్టుచున్నారు. వారు గృహములను విడిచి పర్యటనముసలుపు శ్రమను సహింపఁ గలిగినంత మాత్రమున ధర్మోపదేశమున కర్హత తమకుఁ గలిగినదని భావించుచున్నారు. ఆత్మద్రోహులగు నిట్టి మనుష్యులు స్వయంకృతాపరాధ కల్పితములగు కష్టములనే పవిత్రమగు ధార్మికభావముగ భావించి, ఆబరువును నెత్తిపై నిడుకొని ప్రపంచమం దంతట సంచరించుచున్నారు. మహాపురుషుఁడే మహాకార్యము నొనరింప సమర్థుఁడు. అతఁ డా కార్యము యొక్క తత్త్వమును సాంగముగ గ్రహించి, తద్రహస్యముల స్పష్టముగ వెల్లడింపఁగలిగి నపుడు తానే దేశమందున్నను, నెట్టి స్థితియందును దనసమున్నత కర్తవ్యము నవశ్యముగా సాధింపఁ గలుగుచున్నాఁడు.

మానవుఁడా! నీవు మానవజాతీయ కల్యాణార్థమును లోకోపకారము నిమిత్తమును విచారాయత్తచిత్తుఁడ వగుచుంటివేమి? తొలుత నీగృహమం దుపకారతత్త్వమును సార్థకమొనరింపుము. నీవు నీయొక్కయు, నీభార్యయొక్కయు, బాలబాలికలయొక్కయుఁ, తదితరకుటుంబ సభ్యులయొక్కయు, నిరుగు పొరుగువారియొక్కయు సాహాయ్యమొనరింపుము.

పోషింపఁబడకుము. పోషింపకుము. నీవు వాస్తవికమగు భక్తి పరిపూర్ణమగు హృదయముతో నీ సామీప్యమున నివసించువారియొక్కయు, నీకంటెఁ బిన్నలయొక్కయు మేలు గావింపనంతపర్యంతము దూరమునఁ దనివసించువారియొక్కయు, గురుజనులయొక్కయు హితమును గావింపఁ జాలవు. "Charity begins at home" దానము గృహము నుండియే ప్రారంభమగు ననియెడి యీ యాంగ్లోక్తి పై సందర్భమున సార్థకమగుచున్నది.

ఒకానొక మనుష్యుఁడు తనజీవితముయొక్క విశేషకాలమునను భోగవిలాసములందును, నింద్యమగు విషయసేవనమందును వినియోగించి యుండినచోఁ బ్రకృతిసిద్ధాంతము ననుసరించి కల్యాణమునిమిత్త మతఁడు విశేషమగుభారముచేతను, కష్టనష్టములవలనను బాధింపఁ బడవలసియుండును. కారణమేమన విషయలోలుఁడు, ఇంద్రియదాసుఁడు తా నాచరించియుండిన సమస్త దుష్కృతములయొక్క వేదనలచే వ్యథనొంది, వేసారి పాపము భయంకరదుఃఖదాయకమయినదని గ్రహించినగాని విషయవికారపరతంత్రమగు దుష్టవాతావరణమును విసర్జించి, పరిష్కృత జీవితోత్తమమార్గము ననుసరించుటకు సంసిద్ధుఁడు కాఁజాలఁడు. వాఁడు స్వయంకృతాపరాధ సముద్భవములగు కష్టముల నీశ్వరదత్తము లనియుఁ,

గర్వదండనమనియుఁ, బుణ్యపదార్థమనియుఁ, బరజనకల్పిత మనియు భావించుచున్నంత పర్యంతము తనమాధ్యమును విస్తరింపఁ జేసికొనుచు, భారమును వృద్ధిగావించుకొనుచుఁ, దన కష్టములను, దుఃఖములను బెంపొందింపఁ జేసికొనుచునే యుండఁగలఁడు. వాఁడు తా ననుభవించుచున్న దుఃఖము స్వయంకృతాపరాధఫలిత మని స్పష్టముగా గ్రహించునంతవఱకు యుద్ధరింపఁ బడఁజాలఁడు. దుఃఖోత్పత్తికి వాస్తవికమగు కారణము స్వయంకల్పితపాప మని గుర్తించు మనుజుఁ డాత్మదోషముల యెడ దయార్ద్రహృదయుఁడయి, నమ్రస్వభావియయి వర్తింపక స్వయంకృత దుష్టకార్యములకుఁ దనకుఁ దానే దండనము విధించుకొనుచుఁ బాపవిమోచనోపాయము నన్వేషించుచుండఁ గలఁడు. ఆత్మదోషములఁ బరిశోధించుకొన్న మనుష్యుఁడు జ్ఞాననేత్రమును విప్పినంతనే వాని ప్రతిభావమును, గార్యమును దజ్జీవితమందిరనిర్మాణమున కావశ్యకములగు వివిధోపకరణములయి వాని యాధ్యాత్మికశక్తిని వర్ధిల్లఁ జేయఁగలవు. తన్మూలమున నతఁడు పూర్వకృతములగు పాపములకు నిష్కృతిని బడసి భవిష్యజ్జీవిత కర్తవ్యములఁ గడుసావధానతతో నిర్వహింప సన్నాహము లొనరించుకొను చుండఁగలఁడు.

దుఃఖదాయకమగు భారమును మనము మనయందు విశుద్ధప్రేమ వివేకముల నూన్యత యున్నంతవఱకే ప్రశాంత హృదయముతో విధిగ ననుభవింప వలసియుండును.

ఆనందప్రాసాదము తీవ్రతరక్లేశములయొక్కయు, గాఢాభిమానములయొక్కయు బాహ్యప్రాకారములకు లోపల వెలయుచున్నది. ఆయానందమందిరమునఁ బ్రవేశింప నభిలషించు యాత్రికుఁ డీయభిమానక్లేశప్రాకారముల నతిక్రమించి చనవలసియుండును. ఆ బాహ్య ప్రాకారద్వారములందు యాత్రికుఁ డొకింతకాలము వేచియుండవలసి వచ్చును. ఆ ప్రయాణికుఁ డా ప్రాకారములనే యానందమందిరముగ భ్రమించునందాఁక యచటనే నిలిచిపోవలసియుండును. ఆ తుదక మగు భ్రాంతి తొలంగినంతనే వాఁడు నిరాటంకముగ నానంద నికేతనము నుద్దేశించి యొక్కొక ప్రాకారమును దాటి యరుగ వచ్చును. మనుష్యుఁ డెంతపర్యంతము తన్నుదాను ముఖ్యముగఁ బ్రేమించుకొనుచు దయఁజూచుచునుండునో, ఎంతదాఁక గతజన్మకర్మయొక్క పవిత్రఫలముగ దుఃఖమును భావించుచుండునో, అంతవఱకు దుఃఖమునుండి విమోచనము నందలేఁడు. అతఁ డాత్మలాలనమును విడిచిపుచ్చి, దానియెడ నిరసనభావమును గలిగియుండి దుఃఖములు కేవలమార్గములయి యున్నదియు, మనోరథములు, ఫలితములునయి యున్నదియు గ్రహించినంతనే తనమానసమును, భావములను బరిశుద్ధమొనరించుకొని యాబాహ్యప్రాకారద్వారములలోనుండి నిరాఘాటముగా శాంతినికేతనము బ్రవేశింపఁ గలుగుచున్నాఁడు.

క్లేశ మపూర్ణత్వమునుండి కలుగుచున్నదా లేక పూర్ణత్వము నుండియా? ఇయ్యది యపరిపక్వతయొక్క చిహ్నమా లేక పరిపక్వతయొక్క లక్షణమా? యని దీర్ఘముగా విచారించుటచే దుఃఖవిమోచనోపాయము గోచరింపఁగలదు. దుఃఖ మపూర్ణత్వలక్షణము; అపరిపక్వతయొక్క ఫలితము. దుఃఖోదయమునకు ముఖ్యకారణ మన్వేషింపఁబడుటయే తడవుగా దూరమొనరింపఁబడఁగలదు. కావున మనము విశ్రాంతినిమిత్తము తీవ్రతరక్లేశములలోనుండియు, శాంతినిమిత్తము నిర్జనతయందుండియు నరుగవలసియున్నదనుట సత్యము. దుఃఖితుఁడగు వ్యక్తి, తాను కల్యాణార్థము దుఃఖపరంపరలలోనుండి ప్రయాణము సాగింపవలసియుండును కాని నిలిచియుండరాదను హెచ్చరికను ముఖ్యముగా స్మృతియందిడికొనవలయును. క్లేశము ద్వారము. అది నివాసస్థానము కాదు. నిర్జనత మార్గమే కాని నిర్దిష్టప్రదేశము కాదు. ఈవిధముగఁ దనయాత్రను సమాప్తము గావించు వ్యక్తి దుఃఖశూన్యమును, దివ్యానందమయమును నగు విశ్రాంతిని బడయఁ గలుగుచున్నాఁడు.

భారము కొంచెముకొంచెముగా సంచితమయి వర్ధిల్లుచున్నది. ఇద్దాని గురుత్వము మానవునకు గోచరింపరానంతటి సూక్ష్మముగ నెమ్మదినెమ్మదిగా వృద్ధినందుచుండును. భావశూన్యమగు నుద్వేగము, ప్రగాఢమగు నాత్మస్నేహము, అంధవాస

నోత్పత్తి, చీటికిమాటికి నిష్టభోగములచేఁ దుష్టినందుట, అప
విత్రభావప్రాదుర్భావము, కటుభాషణము, మౌర్ఖ్యము
మొదలగు నగణ్యములగు దోషములయొక్క పాపసంచయ
భారము దుఃఖదాయకమును, దుర్భరమును నగుచుండును.
ప్రారంభమునం దొకింతకాలము దనుక భారము కష్టము
నొసంగఁజాలదు, కాని యది యనుదినము వృద్ధి నొందుచుం
డును. ఒకానొకదినమున స్వార్థముయొక్క దుష్ఫలము లవశ్య
భోక్తవ్యములయి జీవితమును నష్టపఱచి హృదయమునకుఁ
దీరని దుఃఖము నొదవింపుచుఁ దద్భారము నసహనీయమొన
రించివేయును. ఇట్టితరుణము సమీపించినపుడు దుఃఖితుఁడు
తనస్థితిని గుర్తించి తనభారమును దూరమొనరించుకొనుటకు
యథోచితమగు నుపాయము నన్వేషింపవలయును. వాని కట్టి
యుపాయము లభించినచో సముచితరీతి జీవితమును గడుపుట
కావశ్యకములగు వివేకమును, బారిశుద్ధ్యమును, ప్రేమయు
నంప్రాప్తింపఁ గలవు.

తనపూర్వచారిత్రమును బరివర్తన మొనరించుకొను
టచే మానవునిజీవితభారమంతయు నశించిపోవ వాని సమ
యము శాంతియుతముగఁ గడవఁగలదు. వాఁడు సానందచిత్తుఁ
డయితనకర్తవ్యముల నిర్వహించుకొనుచుండఁగలఁడు. ఈరీతిగఁ

పాపభారమును దగ్గించుకొనుచుండు మనుష్యుఁ డాత్మవిజయమును సంపాదించి చిరశాంతి సౌఖ్యము ననుభవింపుచుండఁ గలఁడు.

# గుప్తాత్మసమర్పణము.

స్వర్గము మన నల్దెసలను, లోపలను విద్యమానమయి యుండ మూఢులమయి దానికయి స్థానస్థానములం దన్వేషింపుచుంటి మేమి? సకలసద్గుణములకుఁ బునాది వినయము. పునాదిని సంపూర్ణధ్యానముతో దృఢతరముగ నిర్మించినచో భవననిర్మాణముయొక్క ప్రాశస్త్యాప్రాశస్త్యములను గూర్చి సందేహింపఁ బనియుండదు. — షేలీ.

ని వేమతము నవలంబించినవాఁడ వయి యున్నను సత్యమునుండి దూరముగ నుండఁ జాలవు. సత్యముయొక్క దివ్యజ్యోతి ప్రతిమానవునియందు దేదీప్యమానముగ వెలుంగుచున్నది. అయ్యది బాహ్యవస్తువులందుఁ బ్రకటీభూతము కాఁజాలదు. ఇది నిశ్చయము. — బ్రౌనింగు.

త్యాగముచే నుపలబ్ధియు, లోభముచే హానియుఁ గలుగు నను విషయమును జనసామాన్యము సులభముగ విశ్వ

సింపఁజాలదు. సద్గుణమును సముపార్జించు నిమిత్తము దుర్గుణమునకు హానిని గలుగఁజేయవలసి యుండును. ప్రతిసుకృతమును సంపాదించుటకు భోగవిలాసము నాహుతిఁ గావింపవలసి యుండును. మహాపురుషు లగుటకుఁ దొలుత మానవులు స్వార్థత్యాగమొనరించు టావశ్యకము. పరమసత్యముయొక్క విశాలమార్గమున ముం దడుగిడుచున్న కొలఁదియు, మనము సత్వర మసత్యమును, దోషపుంజములను విసర్జింపవలసినవారల మగుచున్నారము.

నూతనవస్త్రధారణమునకుఁ బూర్వము జర్జరాంబర పరిత్యాగ మావశ్యక మగుచున్నది. అదియేరీతి సత్యాన్వేషణపరతంత్రుఁడు కాఁగోరు మనుష్యుఁ డసత్యమును సంపూర్ణముగ బహిష్కరించు టగత్యము. వనపాలకుఁడు (తోఁటమాలి) పుష్పవాటికయందు మొలచియున్న గడ్డిగాదరను ద్రవ్వి కుళ్లఁబెట్టి ప్రయోజనకరములగు వృక్షముల కాహారము (ఎరువు) గ నొసంగుచున్నాఁడు. ఇదియేచందమున బుద్ధివృక్షము సయితము కలుపుగాఁ దీయఁబడుచున్న దుర్గుణములను ఎరువును స్వీయపోషణమునకయి స్వీకరింపుచున్నది. ప్రయోజనమును బడయుట కాత్మసమర్పణ మవసరము. సత్యజీవితము — ఆనందమయజీవితము — శాంతిమయజీవితము — ఉద్వేగక్లేశశూన్యమగు జీవితము — కేవల మాత్మో

త్సర్గమువలననే సంప్రాప్తమగుచున్నది. మనుష్యజీవితధ్యేయమగు పవిత్రజీవితము మనకు బాహ్యపదార్థములయొక్క బలిదానముచే లభింపఁజాలదు. అయ్యది యాత్మదోషములను, వికారములను నుత్సర్గ మొనరించుటవలననే లభించుచున్నది; కారణ మేమన నీ యాంతరికవికారములే మానవజీవితమున దుర్భరదుఃఖపరంపరల నావిర్భవింపఁ జేయుచున్నవి. కల్యాణప్రాప్తికి మేలును, సత్యమును, బలిదాన మొనరింప నవసరము లేదు. అసత్యమును, గీడును బరిత్యాగ మొనర్పవలసి యుండును. ఈ కారణముచే నాత్మోత్సర్గమువలన నపారమగు లాభమే ప్రాప్తించును గాని హాని కలుగనేరదు. ప్రారంభకాలము నుత్సర్గము మిక్కిలి ప్రయాసకరముగఁ గానవచ్చును. మనుష్యుఁడు స్వార్థకారణమున భ్రమాంధకారమునఁ బడి యుండుటయే దీనికి ముఖ్యహేతువు. ఒకమానవుని ప్రకృతియందుండి స్వార్థాంశమును దొలఁగించుటచే స్వాభావికనియమముచే వాని కవశ్యము బాధ కలుగఁగలదు.

సురాపాయి మద్యపానమును విసర్జింప సంకల్పించినంతనే తీవ్రతరమగు క్లేశము ననుభవింపఁ గడంగుచున్నాఁడు. దుర్వ్యసనమున కభ్యస్తుఁ డయియున్న వ్యక్తి, దానిని విసర్జించుట కెంతయో కష్టము ననుభవింపవలసి యుండును. అతఁడు తనదుర్వృత్తిని బహిష్కరింపుచు లోకోత్తరమగు

బ్రహ్మానందమును విసర్జింపుచుంటిని గదా యని విచారింపు చుండును. కాని యతండు దుర్వ్యసన బహిష్కరణప్రయత్న మునందు విజయము నందినంతనే మవ్యయమును బానమొన రింపవలయు ననియెడి యాసవప్రగాఢాభిలాష నశించును; కాని మానసము ప్రశాంతిని, నప్రమత్తతను, సచేతనమును గాంచగలడు. అప్పుడతండు తనపాశవికవాంఛలను, స్వార్థాంధ విశ్వాసమును బహిష్కరించివేయుటచే దన కపారమగు ప్రయోజనము కలిగినదని గ్రహించి యమందానందకందళిత హృదయుండు కాగలడు. అతం డా దుర్వ్యసన పరిత్యాగ ముచే గోల్పోయిన దేదియును లేదు, తన ప్రాణాంతకమగు శత్రువును సంహరించినాడు. వ్యసనము మానవునిజీవితమునా దాశ్రయమును సంపాదింప సమర్థమైనది కాదు. అది సత్వర పరిత్యాజ్యము. వ్యసనముచే మానవుని జీవితశాంతి తొలంగును; ఆధ్యాత్మికశక్తియు దివ్యానందమును నదృశ్యము లయిపోవును. సదాచారములవలనను, ఆత్మదమనముచేతను గలుగు సత్య మగు ప్రయోజనము మహత్తరమైనది. ఆమహత్తరమగు ప్రయోజనము జీవితాభ్యుదయమున కత్యంతాపేక్షణీయ మయినది. వ్యసనమును గాఢాలింగన మొనరించుకొను చున్నంత పర్యంతము తద్వియోగము మనుష్యున కసహనీయ మగు వేదనము నావిర్భూత మొనరించును. దృఢసంకల్పబల ముచే మహాపురుషుల హితోపదేశవాక్యముల నాలించి వ్యస

నమును బరిత్యజించివైచినపిమ్మట కలుగు నసాధరణమగు లాభమును జూచుకొని యెంతటిమూఢుఁడయిన హర్షింపఁ గలఁడు. కావున మానవులెల్లరు దూరదృష్టియుతులయి, దుర్వ్యసనములను గాలసర్పములకంటె భయంకరము లని గ్రహించి వెనుకాడక శీఘ్రమే పరిత్యజించివైచినచోఁ దమ్ముఁ దాము సంరక్షించుకొనినవార లగుదురు. దుర్వ్యసన బహిష్కరణమే మోక్షప్రథమసోపానము.

సమస్తవిషయములకు వాస్తవికాల్పసమర్పణములయొక్క స్థితి యిదియే. సమస్తార్థములకు నాత్మోత్సర్గములు ప్రారంభమందును, బూర్తియగు పర్యంతమును దుఃఖదాయకములుగ గోచరింపుచుండును. కావుననే మనుష్యులు వీనిని గాంచి భీతచిత్తులగుచుందురు. స్వార్థమయములగు నధమభోగములను విషయవాసనలను బహిష్కరించుటయందును, జయించుటయందును మానవుల కెట్టిహానియును గలుగఁజాల దన్నరీతి సామాన్యదృష్టికి గోచరింపుచుండును. భోగవిలాసములను విసర్జింప నుపక్రమించు మనుష్యుఁడు చిరకాలసంపాదిత మగు మధురానందమును గోల్పోవుచున్నవానివలె నపారమగు వ్యాకులతను, నసంతోషమును బొందుచున్నాఁడు. కీడును బాయుటయందు మనుజునకు దుఃఖము కలుగు టనివార్యము. ఇదియు నత్యంతావశ్యకమే. కారణమేమన మనుష్యుఁడు స్వార్థ

ముయొక్క వివిధవిధానములఁ బరిత్యజించుటచే నత్యంత దుష్ప్రాప్యమగు నపరిమిత సౌఖ్యప్రయోజనము కలుగుచున్న దని గ్రహింపుచో సౌఖ్యోపలబ్ధి వానికిఁ గరము కష్టసాధ్యము కాఁగలదు, కారణ మేమన వాని యీయథార్థ లాభలాలస (స్వార్థాభిలాష) మత్యంతప్రబలము కాఁగలదు. విపులస్వార్థ మున కావాసమగు స్థానమున సౌఖ్య మెట్లుండనేర్చు ?

మనుష్యుఁడు స్వలాభముయొక్కయుఁ, బారితోషికము యొక్కయు నభిలాష చేఁగాక, నష్టము ననుభవింపఁ గటిబద్ధుఁడు కానంతపర్యంతము స్వార్థత్యాగియయి పరమానందమును బడయఁజాలఁడు. మానసముయొక్క యీవిధమగు స్థితియే మానవుని స్వార్థశూన్యునిఁ గావింపుచున్నయది. తన యిరుగు పొరుగువారి సౌఖ్యార్థ మాత్మలాభమును, స్వప్రయోజన మును నభిలషింపక మానవుఁడు వినయసంపన్నుఁడయి స్వార్థ పూర్ణములగు కార్యములను, స్వభావమును విసర్జించివేయవల యును. కారణ మేమన స్వార్థమునకు సంబంధించిన సమస్త కా ర్యములును, సత్యవిరుద్ధములును, నయోగ్యములును నయి యుండుచున్నవి. వీనిని సంపూర్ణముగా మానవజాతి నిషేధిం చుటచే విశ్వ మత్యధికముగ సుందరమును, సౌఖ్యవంతము ను గాఁగలదు. మనుష్యజాతి స్వార్థముతోఁ బాటు నిజవిలాస ములను, వికారములను వేయేల! తుచ్ఛమగు జీవితమునే విడిచి

వేయవలసియుండును. ఇట్లాచరించినను వాస్తవముగ నష్టము ననుభవించు మానవుఁ డీభూమండలమునఁ గలఁడా? కృపణుఁడు విపులవైభవవాంఛను బరిత్యజించినచో హాని నొందునెట్లు? దస్యుఁడు చౌర్యమును విడినచోఁ బ్రయోజనము నందకుండునా? స్వార్థత్యాగముచే నపారమగు ప్రయోజనమే కలుగుచుండ, నష్టము కలుగుచున్న దని భావించు మూఢునకుఁ గష్టమేల కలుగకుండును? వానికిఁ దటస్థించెడి యాకష్టమే యొకవేళ స్వార్థత్యాగముయొక్క దుష్ఫలితమగు హానియని దూరదృష్టిలేని మూఢులు భావింపవచ్చును, కాని వాస్తవమున కిది భిన్నము. సత్యమాలోచింప నీపద్ధతియందే యాత్మసమర్పణము కలదు. నష్టముచే లాభ మీరీతిగనే వాటిల్లుచున్నది.

వాస్తవికమగు బలిదానము (ఉత్సర్గము) ఆంతరికమయినది. బాహ్యమునం దద్దాని కునికి లేదు. అయ్యది హృదయముయొక్క గంభీరమగు వినీతభావమునుండి యుత్తేజితమగు నాధ్యాత్మికరహస్యము. ఆత్మోత్సర్గములేకయే మనుష్యుఁ డేమియు సేయనేరఁడు. ఆధ్యాత్మికజ్ఞానప్రసార సమయమందు మానవుఁ డీయాత్మసమర్పణము మీఁదనే సంపూర్ణముగా నవలంబితుఁడు కావలసి వచ్చుచున్నది. కాని 'యీయాత్మసమర్పణ మేపదార్థములచే నిర్మిత మయినది, ఎవ్విధముగఁ బ్రయోజన కరమగుచున్నది, ఎచ్చోట నన్వేషింపఁబడి లభిం

వుచున్నది?’ అని విచారించుకొంటిమేని యీయాత్మసమర్ప
ణము, స్వార్థమును భావములందును, గార్యములందును గలు
గుచుండు మానవుని దైనికప్రవృత్తిని జయించుటవలననే
నిర్మిత మగుచున్న దని స్పష్టపడఁగలదు.

మానవునకుఁ బరులతోడఁ గలుగుచుండు సామాన్య
వ్యవహారములం దీయాత్మసమర్పణము ప్రయోజనకర మగు
చున్నది. ఇయ్యది కోలాహలముయొక్కయు, లోభముయొ
క్కయు గడియయందుఁ గాన్పించు చున్నయది. అంతఃకర
ణముయొక్క గుణములును, గంభీరములును నగు నాత్మోత్స
ర్గములు బహువిధములు. వానిని బడయుటయందు మానవున
కవశ్యము బాధ కలుగవచ్చును. కాని యీయాత్మసమర్ప
ణము లెవ్వారినిమిత్తము గావింపఁబడుచున్నవో, వారికిని,
గావించువారికిని విశేషమగు నిర్మలానందము నొడఁగూర్పఁ
గలవు. మహోన్నతమగు బలిదానము నపేక్షించు మహ
త్తరములగు కార్యముల నాచరింప సన్నద్ధులయి యుత్సాహి
తులయి యుండు మనుష్యులే, తమకు సులభముగ సాధ్యపడు
నట్టియు, సామాన్యములును నగు నాత్మసమర్పణములను
విస్మరింపుచు, వానివైపునకుఁ గన్నెత్తియయిన వీక్షింపకు
న్నారు. ఎచ్చోట నష్టదాయకమగుపాపము నెలకొనియుండు
చుండునో, మానవుని దుర్బలత్వ మవశ్య మయ్యెడ గల దని

తెలియఁ దగును. మానవుఁడా! ఎచ్చోట నిన్ను లోభ మధి కముగా బాధించు చుండునో, అయ్యెడనే నీవు తొలుతఁ బరి మాత్రోత్సర్గమును ప్రారంభింపుము. ఇట్లాచరించుటచే నీకు శాంతిమార్గము లభ్యము కాఁగలదు. నీయందు నెలకొని యుండు క్రోధమును, నిర్దయయుఁ బ్రధానమగు దోషములుఁ సోదరుఁడా! నీ వేల నేటదనుక క్రోధోద్వేగమును, కటువచన ములను, నిర్దయాత్మక భావములను, రాక్షసకర్మలను విడిచి యుండలేదు? నీవు కటువచనములను, నాక్రమణములను, దో షారోపణములను, కృపారాహిత్యమును నిశ్శబ్దముగ సహిం చుటకును, బ్రత్యపకార మొనరింప కుండుటకును సన్నద్ధుఁడవు కాఁజాలవా? పరమమాధ్యముయొక్క ముఖ్యలక్షములగు వీని నన్నింటి బహిష్కరించివైచి వీనికి మాఱుగా దయాదా క్షిణ్యములను, ప్రేమానురాగములను లోకముయెడఁ బ్రక టింపఁజాలవా? ఇట్లొనరింపఁ జాలుదువేని పరమానంద పద వికిఁ బ్రాపింపఁ జేయు గుప్తాత్మసమర్పణముల నిమిత్తమును నీవు సుసజ్జితుఁడవును, యోగ్యుఁడవును, సన్నద్ధుఁడవును గాఁ గలవు.

నీ స్వభావమందు క్రోధమును, నిర్దయయు నెలకొని యున్నచో సత్వర మవ్వానిని బహిష్కరించి వేయుము. మా నసముయొక్క యిట్టి యనుచితమును, కఠోరమును, దయా

శూన్యమును నగు ప్రవృత్తులచే నీ కెట్టి లాభమును గలుగ
నేరదు. ఇట్టి స్వభావము నీ కనారోగ్యమును, దుఃఖమును,
నాధ్యాత్మికాంధకారమును దెచ్చి, మఱెట్టి సౌఖ్యము నొసం
గఁజాలదు. పరులకును నీసిని మించి నీ వేమియుఁ బ్రసాదింపఁ
జాలవు. నీవు నిరంతరము "న న్నావ్యక్తి దూషించినాఁడు;
లాఘవ పఱచినాఁడు, హింసించినాఁ" డని వచింపుచుందువు.
ఇత్యాది నీయాత్మదుర్బలత్వమును వెల్లడించునట్టి యొక నీచ
మగు వ్యాజము; నింద్యమగు భీరువృత్తి. ఒకవేళ నాఁడయొక్క
దయాశూన్యత నీయెడ దూషితమును, నష్టదాయకమును
నగుచో వానిపట్లను సయితము నీదయావిహీనత కలుషిత
మును, హానికరమును గాఁగలదు. ఎవఁడేని యొకమను
ష్యుఁడు నీయెడఁ గరుణాశూన్యుఁడయి వర్తించి దుష్టనీతిని
వెల్లడింపుచో నీవును వానివలె భ్రష్టుఁడవయి తిరిగి వానిపట్ల
రాక్షసముగ నేల వర్తింపుచున్నాఁడవు? అపకార మొనరిం
చిన వానియెడ విశేషమగు నుపకారమును వెల్లడించి నీ వేల
నీతిమంతుఁడ వయి నీ యాధ్యాత్మికశక్తిని వృద్ధిగావించుకొన
సిద్ధుఁడవు గాకున్నాఁడవు? జలప్రవాహము మఱికొంత జల
భాగము తనతోఁ జేరుటచే వృద్ధినందునే కాని క్షీణింప నేరదు.
రాక్షసత్వముచే దయాశూన్యతే న్యూనము కాఁజాలదు.
అగ్నినే నగ్నిజల్లారు టెట్లు? క్రోధముచే క్రోధ ముపశమింప
నొల్లదు.

కరుణాశూన్యతను, క్రోధమును బరిత్యజింపుము. పరస్పరశిలాసంఘర్షణముననే యగ్నిస్ఫులింగము లుదయింపుచున్నవి. కరతలద్వయ మేకీభవించుటవలననే చప్పట్లుధ్వని కలుగ ర్పుచున్నది. అదియేరీతి క్రోధము క్రోధముతో నైక్యమొందినపుడే వర్ధిల్లునుగాని, కోపము ప్రేమచే ముట్టడింపఁ బడినపుడు వృద్ధినందనేరక యొక్కసారిగ నుపశమింపఁగలదు. కావున నాయనా! నీయెడ నెవఁడేని క్రుద్ధుఁడగుచున్నచో నీవును మూర్ఖుఁడవయి కోపమును జెందక వానికోపమునకు నిన్నుఁ బాత్రునిఁ గావించిన దోషమేమి నీయందుఁగలదో ప్రశాంతహృదయముతో నన్వేషించుకొనుము. క్రుద్ధుఁడు తనహృదయాంతరాళమున జనించిన క్రోధానలమున కాహుతి యగుచుండ నీ వేల వానిని కోపమను మంటయందుఁ బడఁద్రోసి వానివలెనే మందభాగ్యుఁడవు కాఁగోరుచున్నాఁడవు? క్రోధమును దయార్ద్రహృదయుఁడవయి క్షమింపుము. ఇట్టి యవసరములందు శాంతమును, క్షాంతిని, దయాళుత్వమును గలిగియుండి నిన్ను దూషింపుచు నీయెడఁ గ్రోధమును బ్రకటించువారిని క్షమించి వారిపై నకృత్రిమమగు కృపారసమును వెదజల్లుము. వారి కోపతాపము తత్క్షణమే చల్లారిపోఁగలదు. నీవొకవేళ స్వభావముగా నధీరుఁడవును, ముక్కోపియు నయియున్నచో నధీరత్వమును, బహిష్కరించునట్టి యాత్మసమర్పణపాఠము నభ్యసింపుము. నీచిత్తము ధీరత్వమును గోల్పోవుచున్నపుడెల్ల శాంతస్వభావ

ముతో నాయకీరత్వము నణఁచివేయుము. అధైర్యముయొక్క నిర్దయాధికారమునకు వశుఁడవుగాక దానిని జయింప దృఢ సంకల్ప మొనరించుకొనుము. అధైర్యమును క్షణమాత్రికా లమైనను నీదేహమందిరమునఁ బ్రవేశింపనీయకుము. పరులవూర్ధ్యమునుగూర్చియు, దోషములను గుఱించియు నీవు మోసగింపఁబడవలదు. పరులు నిన్ను నిందించినను, హింసించినను, గుపితునొనరింప యత్నించినను, రెచ్చగొట్టినను ధైర్యమును, శాంతమును విసర్జింపవలదు. ఏదోషమును దూర మొనరించుట కయి యధైర్య ముదయింపుచున్నదో, యాదోషమునే యది వృద్ధిగావింపుచుండును. అధైర్యమును, జిడచిడ మనుటయు దుర్బలత్వముయొక్కయు నయోగ్యతయొక్కయు ముఖ్య లక్షణములు. వీనిచే నీవును, నీ పొరుగువారికిని విశ్రాంతియు, శాంతియు, సౌఖ్యమును లభింపఁజాలవు, మీదుమిక్కిలి వైఫల్యమును, దుర్భాగ్యమును దుఃఖమును లభింపఁగలవు. నీయొక్క యధైర్యముచేఁ బరుల కోమలహృదయముల సంక్షోభము కలుగుచున్నయది. నీవును దీరనిహాని సంభవింపుచున్నది.

సాహసములేని వ్యక్తి సత్యమగు బ్రహ్మానందమును బొత్తిగా ననుభవింపఁ జాలఁడు, కారణ మేమన వాఁడు సదా దుఃఖితుఁడయి, వ్యాకులహృదయుఁడయి యుండుచుండును. వాఁడు మానవజీవితాభ్యుదయమున కత్యంతావశ్యకమగు

స్థైర్యముయొక్క ప్రశస్త ప్రశాంత ప్రవిమల సౌందర్యము నుండియుఁ, దదనంతమాధుర్యమునుండియు ననభిజ్ఞుఁడయి యుండుచుండును. వాని మానసమునకు విశ్రాంతి నొసంగుటకయి శాంతి వానిదరిఁ జేరనొల్లదు.

అస్థైర్యము బలిదాన మొనరింపఁబడునందాక మానవున కానంద మిసుమంతయు లభ్యము కానేరదు. ఈయాత్మ సమర్పణముచే సహిష్ణుత యిక్కలి వర్థిల్లును, శాంతి యలవడును. అపుడు నూతనమగు నమ్రస్వభావము నిర్మింపఁబడఁ గలదు. అస్థైర్యమును, క్రోధమును దూరమొనరింపఁ బడి స్వార్థత్యాగముయొక్క వేదికపైఁ బ్రజ్వరిల్లుచున్న బలిదానమను ప్రచండాగ్నిజ్వాలల కాహుతి గావింపఁబడుటచే మానవుఁడు సబలమును, సుస్థిరమును, ప్రశాంతమును నగు మానసముయొక్క యానందము ననుభవింపఁ గలుగుచున్నాఁడు.

బాహ్యమునకు దోషశూన్యములుగఁ గానవచ్చు మానవులచే సేవింపఁబడుచున్న చిన్నచిన్న స్వార్థపూర్ణములగు విలాసము లెన్నియో కలవు. విలాస మెట్టిదయిన దానియందు స్వార్థము లవలేశము మిశ్రమమయియున్నను దప్పక హానికరమే కాఁగలదు. ఇట్టి భోగవిలాసములకుఁ జీటికిమాటికిఁ జిక్కుచుండుటచే నెట్టి భయంకరమగు నష్టము వాటిల్లుచున్నదియు జనసామాన్యము గ్రహింపకున్నది. మానవునియందు దైవి

కమును, బాశవికమును నగు రెండుశక్తు లుండుచున్నవి. పాశవికశక్తి నశించినపుడే మానవుని యందుఁ గల దైవికశక్తి వృద్ధి యగుచుండును. ఇంద్రియములకుఁ గల్పితసౌఖ్యము గలిగించు నట్టి విలాసములు బాహ్యమున కెంత నిర్దోషములుగ నున్నను, అవి మానవుని సత్యమునుండియు, నానందమునుండియు దూరముగా నీడ్చివేయును. మనుష్యుఁడు పాశవికసౌఖ్యములచేఁ దన యింద్రియములకుఁ దుష్టిని గూర్చుచున్నకొలఁదియు వానియింద్రియములు చంచలములును, బ్రబలములును నగుచుండఁగలవు. మానవుఁ డీ సామాన్యములగు బాహ్యవిలాసములను విసర్జింపనంతపర్యంతము విలాసమయజీవితముచేఁ దా నెంతబలమును, హర్షమును, సదాచారమును, బవిత్రభావమును నష్టమొనరించుకొని యుండినదియు స్పష్టముగా గుర్తింపఁజాలఁడు. స్వార్థమయములగు భోగవిలాసముల సంపూర్ణముగా బహిష్కరింపఁజాలని మనుష్యుఁడు పవిత్రానందమును ననుభవింపనేరఁడు.

ఈ యాత్మస్నేహము వలనను, నింద్రియలోలత్వము చేతను మానవుఁడు తన్ను దానే పతితుని గావించుకొనుచున్నాఁడు, మఱియు నాత్మగౌరవమును నష్టమొనరించుకొనుచు విశ్వమం దుత్తమకార్యముల నాచరించు శక్తిసామర్థ్యములఁ గోల్పోవు చున్నాఁడు. వాంఛలకు వశీభూతుఁడయి వాఁడు తన

యాంతరికాంధకారమును వృద్ధిగావించుకొని, తన్మూలమునఁ బదార్థమర్మావలోకనశక్తిని, సత్యాన్వేషణాబలమును బోఁగొట్టుకొనుచున్నాఁడు. నీతివిహీనమగు పాశవిక విలాసము సత్యాన్వేషణమునకుఁ బ్రబలశత్రువు. విలాసముల బలిదాన మొనరించుటచే మానవుఁడు స్థిరత్వమును, సందేహములను నణఁచివైచి సకలమును నిజస్థితియందు వీక్షింపఁగల యాంతరదృష్టిని, దృఢవిశ్వాసమును సంపాదింప సమర్థుఁడగుచున్నాఁడు. నాయనా! నీవు బుద్ధిమంతుఁడవయి నీప్రేమకుఁ బాత్రములయిన దుష్టవాసనలను విసర్జింపుము. నింద్యమగు క్షణిక సౌఖ్యములకంటెఁ బవిత్రమగు శాశ్వతసౌఖ్యమును సముపార్జింప నాయత్తపడుము. ఇంద్రియలోలత్వమున కతీతుఁడవయి వర్తింపుచో నీజీవితము వ్యర్థమును, సందిగ్ధమును గాఁజాలదు.

మనుష్యులనేకులు తమవచనములనే ప్రమాణములుగ భావింపుచుందురు. ప్రమాదవశంబునఁ దమనోటినుండి జారిన నుడువునే బ్రహ్మవాక్యముగ సమర్థించుకొన వారు సదా పరులతో జగడమాడుచుందురు. ఇట్టి నీచప్రకృతిని గర్హింపుచు విడిచిపుచ్చుటచేఁ బరులపై విశేషప్రభావము ప్రసరింపఁగలదు. పరులజీవితమందును, ఉద్దేశ్యములందును, విశ్వాసములందును జోక్యమును గలిగించుకొను ప్రకృతిని మాన

వుఁడు విసర్జించి వేయవలయును. పరులయెడ విశేషమగు సహనమును గలిగియుండు స్వభావము నభ్యసింపవలయును. తనవాక్యము నే సమస్తజనులు ప్రమాణముగ భావింపవలయు ననియెడి తలంపు, విద్వాంసులయందును, వక్తలయందును విశేషముగా గానవచ్చుచుండు నొకవిధమగు స్వార్థము. ఇట్టి స్వార్థము దయాశూన్యమగు కేవలాంధకారము. ప్రారంభమం దీవాక్యహఠ మను దురభ్యాసము విశేషమగు కష్టముచే దూరమొనరింపఁ బడుచున్నది. కాని మానవుని హృదయమందు సౌశీల్యమును, ప్రేమయు నావిర్భవించినచో దుఃఖదాయకమును, ద్వేషమును నగు నీహఠబుద్ధి సులభముగా లోపించిపోవుచున్నది. సౌజన్యమును, సత్యజిజ్ఞాసయు నేమానవునకు స్వాభావికాలంకారములయి యొప్పుచుండునో వానియందు స్వవచనహఠ ముండ నేరదు.

హఠముగల మనుష్యుఁడు తన యభిప్రాయము నే సకలలోకాదర్శప్రాయముగ భావించుచుఁ దనమతమునకు విరుద్ధములుగనున్న పరుల యాచార వ్యవహారోద్దేశ్యముల సదా దూషించుచుండును. వాఁడు బుద్ధిపూర్వకముగఁ బరుల సన్మార్గము ననుసరింపఁ జేయ నభిలషించియు మిథ్యాభిమానముచేఁ దానుమాత్ర ముచితమార్గము ననుసరించు చుండనేరఁడు. పరులు వానిదోషములఁ జూపించుచు వాని నుద్ధరింప సమ

కట్టుచో వాఁడెంతయుఁ బరాభవింపఁబడినవానివలెఁ గ్రోధమును, విషాదమును, సిగ్గును జెందుచుండును. తనదోషమునకయి లోకము తనతో శతృత్వమును వహించి విశేషాఘాతమును గలిగించినచో దుఃఖవారిధి మునుంగుచుండఁగలఁడు. దీనికి ఫలముగా వాఁడు సదా యప్రసన్నుఁడయి, క్రోధోన్మత్తములును, నిర్దయాత్మకములును నగు వివిధభావములయొక్క విషమజ్వరతాపముచేఁ బరితపించుచుండఁగలఁడు. ఎంత పర్యంత మిట్టి మనుష్యుఁడు పరులను దనయుద్దేశ్యానుసారముగ నడిపించవలయునను వాంఛను విసర్జింపనేరఁడో, అంతదనుక శాంతిని, జ్ఞానమును, నభివృద్ధిని సంపాదింపఁజాలఁడు. వాఁడు ఎన్నిప్రయత్నము లొనరించినను బరుల హృదయమును గ్రహింపనేరఁడు.

అట్టి వ్యక్తి పరులకార్యములయందును, గాంక్షలయందును సహానుభూతిసి బ్రకటింపఁజాలఁడు. వాని చిత్తగతి సదా మిథ్యాభిమానముచేతను, గర్వముచేతను, గాఠిన్యమువలనను నిరోధింపఁబడి యుండుచుండఁగలదు. కావున వానియందు మధురమగు సహానుభూతియొక్కయు, నాధ్యాత్మిక ధ్యానము యొక్కయుఁ బ్రవేశము కలుగఁజాలదు.

ఈ హఠమును విసర్జించు మనుష్యుఁడు పరులతోడ సలుపు దైనిక వ్యవహారమందు నిజోద్దేశ్యాధిక్యమును, బక్షపాత

మును దూరమొనరించి పరుల స్వానుభవసిద్ధమగు నీతి నభ్యసించుటకును, బరుల నానావిధమగు మానసిక స్థితిని గ్రహించుటకును బ్రయత్న మొనరింపఁ గలఁడు. అతఁడు తనయుద్దేశ్యమును బ్రకటించుట కెంత స్వాతంత్ర్యమును బరులనుండి స్వీకరింపుచుండునో, అంతియే స్వేచ్ఛను బరులకును వారి యుద్దేశ్యములను బ్రకటించుకొనుటకయి యొసంగుచుండును. పూర్వముకంటె వాని కత్యధికమగు జ్ఞానము, ననుకంపయు, నానందమును ననుభూత మగుచుండఁగలవు. పూర్వము తనదృష్టికి గోచరింపనట్టి బ్రహ్మానందపథము వానికి దృగ్గోచరము కాఁగలదు.

దీనికిఁబిదప మనుష్యుఁడు లోభమును, లోభబహుళములగు భావములను బలిదానమొనరించు టావశ్యకము. మనకుఁగాకుండఁ బరులకు సంపదలు లభించినను మనము స్వలాభమును బడసినరీతిగనే సుప్రసన్నులము కావలసియుండును. పరాభ్యుదయమును గాంచి హర్షింపవలయును. పరులు శ్రేష్ఠములగు కార్యములయందు విజయలక్ష్మిని బడయుచున్నను, బ్రశస్తములగు వస్తువుల భోగింపుచున్నను మత్సరమును గలిగియుండక సంతోషింపుచుండవలయును. స్వలాభమును బరుల ప్రయోజనమునిమిత్తము నిస్స్వార్థభావముతోడను, విశుద్ధహృదయముతోడను త్యజించివైచుట మిక్కిలి ప్రశంసనీ

యమగు విషయము. ఈవిధములగు సద్భావములను బరిగ్రహింపుచుండుటచే మానవునకు గంభీరమగు శాంతియు నాధ్యాత్మికశక్తియు లభించును. స్వార్థముయొక్క యథార్థమగు సమర్పణ మిదియే.

ఆర్థికవైభవములు క్షణభంగురములు, అవి చిరస్థాయిగ నుండనేరవు. కావున వానిని మన వని నుడువ వలనుపడదు. అవి స్వల్పకాలమువరకే మనయొద్ద నుండగలవు. కాని యాధ్యాత్మికసంపద లజరామరములు. అవి సదాప్రతిబింబములవలె మనల వెంటనంటియుండుచుండును. ఆర్థిక సంపదలను త్యాగమొనరించుటవలనను, భౌతికసౌఖ్యములను విసర్జింపఁగలుగుటవలనను, సృష్టియందలి సమస్తపదార్థములు మన సౌఖ్యమునకయి సృజింపఁబడియుండలేదనియు, లోకకళ్యాణమునిమిత్తమే మనకుఁ బ్రాప్తించియున్నవనియు గ్రహించుటచేతను సులభముగా మనకు స్వార్థత్యాగముయొక్క సకలలోకాదర్శప్రాయమగు నాధ్యాత్మికశక్తి సంప్రాప్తమగుచున్నది.

స్వార్థశూన్యుఁడగు మనుష్యుఁడు ధనాఢ్యుఁడయియున్నను స్వప్నమందును వైభవగర్వమును గలిగియుండఁజాలఁడు. ఈకారణముననే వాఁడు లుబ్ధులను సంపదలకారణమున ముట్టడించియుండు కాఠిన్యము, కార్పణ్యము, భయము, విషాదము

మొదలగు దుష్ప్రవృత్తులనుండి సురక్షితముగా నుండఁగలుగుచున్నాఁడు. నశించుటచేఁ దనమానసమునకుఁ గష్టము గలిగించునంతటి మహత్తరమగు పదార్థముగ ధనోపలబ్ధి నతఁడు భావింపనొల్లఁడు. అతఁడు కేవలము స్వార్థత్యాగమునే విశ్వమండలమందలి సమస్తమనుష్యులకు విశేషప్రయోజనకరమగు నిత్యసంపత్తిగ విశ్వసించుచుండును.

చదువరీ! ఆనందమయమానవుఁ డెవఁడో యిప్పటికి యిన నుడువఁగలవా? తనసౌఖ్యమునిమిత్తము సంపదల నభివృద్ధిగావించుకొనుచు హర్షించుచుండు మానవుఁడు శ్రేష్ఠుఁడా లేక పరులసౌఖ్యమునిమిత్తమును, విశ్వకళ్యాణముకొఱకును దనకుఁగల సర్వస్వమును సమర్పణ మొనరింపఁ గటిబద్ధుఁడయి యుండు వ్యక్తి యుత్తముఁడా? లోభముచే సౌఖ్యము నశించుచున్నది. నిర్లోభముచే సౌఖ్యోదయమగుచున్నది. మనుష్యజాతియొక్క దుర్భరదుఃఖదారిద్ర్యమును, ఘోరవిపత్పరంపరలను దూరమొనరించుటయందు సమర్థమగు మహత్తరశక్తి యీర్ష్యాపరిత్యాగము, అనఁగా బరులయెడఁ గటుభావములను, మత్సరమును, ఘృణను, క్రోధమును గలిగియుండకుండుటయే. అంధకారప్రకాశము లొక్కచో నేకీభవించి యుండఁజాలని విధంబున నీర్ష్యయు, నానందమును గలిసియుండ నేరవు. ఈర్ష్య మానవహృదయమం దుదయించి నానిశాంతి

సౌఖ్యకోమల కుసుమముల భస్మమొనరించివైచి, మానసమును నరకసదృశముగఁ జేసివేయునట్టి ప్రచండాగ్ని.

ఈర్ష్య బహునామముల, బహుభేదముల నొప్పారుచుండును, కాని యన్నింటితాత్పర్య మొక్కటియే. ఈర్ష్య యొక్క వివిధాంగములును మానవహృదయమందుఁ బరుల యెడ ద్వేషభావమును బ్రజ్వలిత మొనరించును. ఈర్ష్య యొక్క యంధవిశ్వాస పూరితులగు ననుచరులు స్వధర్మమందుఁగల ప్రగాఢాభిమానోన్మాదముచే నన్యధర్మావలంబుల దూషించుచు వారితో యుద్ధమొనరింప సన్నద్ధు లగుచు రక్తపాతముచే భూమాతను దడిపివైచుచున్నారు.

పరులయెడఁ జూపఁబడు ప్రతివిధమగు వైమనస్యమును, నసంతోషమును, నశుభచింతనమును, గటుభాషణమును మొదలగు దుష్ప్రవృత్తులన్నియు నీర్ష్య యనఁబడుచున్నవి. ఈర్ష్యయే దుఃఖోత్పత్తికి మూలస్థానము. పరులయెడఁ గ్రోధాన్వితభావములఁ గలిగియుండు మనుష్యుఁ డెంతగాఁ బ్రయత్నించినను దుష్టప్రవృత్తియగు నీర్ష్యను జయింపఁజాలఁడు. సమస్తమానవులయెడ దయార్ద్రహృదయుఁడయి వర్తించు పద్ధతి నభ్యసింపనంతపర్యంతరము మనుష్యుఁడు మత్సరమును బలిదానమొనరించుటయందు సాఫల్యమును సముపార్జింపఁ జాలఁడు. పరులవిషయమునఁ గీడుఁదలంచువాఁడును, నుడువు

వాఁడును, సేయువాఁడును మత్సరముయొక్క భయంకర జాలమునుండి విమోచనము నొందనేరఁడు. మానవుఁడా! నీవు యథార్థమగు బ్రహ్మానందము ననుభవింప నభిలషించితివేని సత్వరముగ మత్సరమును నీహృదయక్షేత్రమునుండి దూరమొ నరించివేయుము. మత్సరగ్రస్తుఁడు సకలైశ్వర్యములు గలిగి యుండియు దీనునివలె, హీనునివలె, గర్భదరిద్రుచందమున నిరంతరము దుఃఖించుచుండఁగలఁడు. ఈర్ష్యయొక్క కరుణా శూన్యములగు కఠినమోహపాశము ఉచ్ఛేదితమయిన ప్రాసాదాంతరాళమున బ్రహ్మముయొక్క విశుద్ధ దేవతామూర్తి యుపవసించి, వజ్రసమాన కఠోరములగు నిష్ఠాకపాటముల భేదించుకొని నికేతనములోపల కేతెంచు మానవునకు మోక్షఫలిత మగు నిత్యసత్యమగు శాంతిని బ్రసాదింప సదా నిరీక్షించుచుండును.

నాయనా! పరులు నీయెడ నెంతనీచముగా వర్తించినను నీవుమాత్రము వారల దూరకుము; ప్రతిక్రియ యొనరింపఁ బూనకుము. కీడుసేయువానికి మేలుసేయుము. నీ కంతటి యాత్మబలము లేకున్నచో మౌనము వహింపుము. ఈర్ష్య నీర్ష్యచేఁ బరాభవింప నెంచకుము. ఎవఁడేని నిన్ను ద్వేషించుచున్న నీవు త్వరపడి కుపితుఁడవయి తాల్మిని వీడకుము. ఒక వేళ నీ వేదేని దోషమొనరించియుండుటవలనను వాఁడు

నిన్ను దూషించి యుండవచ్చును. ఇదియే నిజమగుచో నీవు పశ్చాత్తాపమును జెంది నీచారిత్రమును సంస్కరించుకొని నిన్ను ద్వేషించినవానిపట్ల సౌజన్యమును వెల్లడింపుము, 'గోళ్లచే గిల్లి వేయఁదగినవానిని గొడ్డళ్లఁ గొట్టుటేల' యను లోకోక్తి ననుసరించి సామాన్యముగ సౌజన్యముచేఁ బరిష్కృతము కావలసినసమస్యను ద్వేషముచే బహుళ మొనరించుటేమి వివేకము? క్షమాకవచమును ధరించు మానవుని విద్వేషం దెట్టి భయంకరాస్త్రమును హింసింపఁజాలదు. క్షమయే మహత్తరములగు నస్త్రములలోనికెల్ల దివ్యాస్త్రము. ఈర్ష్య నింద్యమయినది. హీనమయినది. విషముకంటెఁ బ్రాణహానికరమయినది. ప్రేమ దివ్యమును, ధీయుతమును, కల్యాణదాయకమును నగు శ్రేష్ఠసాధనము.

పరుల కపకార మొనరింపకుండుటయే సకలలోకాదర్శప్రాయమును, సర్వోన్నతమును నగు నాగరికత. పవిత్రమగు సౌందర్యమును, లోకసంపూజ్యమగు యోగ్యతను సానందముగ వీక్షింపఁగలుగు నేత్రములఁ గలిగియున్నట్టియు, నిజాదర్శ జీవితోదాహరణములచే భ్రష్టుల సన్మార్గానువర్తులుగఁ జేయుచుండునట్టియు మనుష్యుఁడే యథార్థమగు సంస్కర్త. మానవుఁడా! నీవు నాహితోపదేశము నాలకించి సత్వరము సమస్తవిధములగు నీర్ష్యను విసర్జించివేయుము.

విశ్వజీవ ప్రేమయొక్క పవిత్రవేదికపై భయంకర పిశాచమగు నీర్ష్యను బలిదాన మొనరించి వేయుము. దీని యందే నీయనంతమగు కల్యాణము దాగియున్న దని విశ్వసింపుము. దీనిచే నీజీవిత మనంతసౌఖ్యమున కాకరము కాఁగలదు. నీహృదయ సరోవరముయొక్క ద్వారమును దెఱచి వైచి దానిలోనుండి దివ్యమధుర మనోహర ప్రేమరసమును నిరాటంకముగాఁ బ్రవహింపనిమ్ము. ప్రతిప్రాణియొక్క జీవిత శాంతిని గూర్చియు, రక్షణమును గుఱించియు విశేష ధ్యానమును గలిగియుండుము. నీ కపకార మొనరించు ప్రాణి కేని ప్రమాదవశంబున నయిన గీడును దలంపకుము.

అపవిత్ర వాసనలును, ఆత్మదయయు, నాత్మప్రశంసయు, నాత్మగౌరవమును సత్వరత్యాజ్యములు. ఆత్మగౌరవ మన నాత్మతత్త్వమును సన్మానించుట కాదు. తన్ను దాను ఘనునిగ భావించుకొని సన్మానించుకొనుటనే యాత్మగౌరవ మందురు. ఇట్టి వాసనలన్నియు హృదయముయొక్క జాడ్యములు. ఇవియే మస్తిష్కముయొక్క యానందశూన్యములగు వికారములు. మానవుఁడు క్రమక్రమముగ వీనిలో నొక్కొక్క దానిని బరిత్యజించు కొలఁదియు వాని దుర్బలత్వమును, భేదమును దూరమయి పోవఁగలవు. వాని కంతట సంపూర్ణమును, శాశ్వతమును నగు స్వర్గీయానందము సిద్ధింపఁగలదు.

ఇంతవఱకు వ్రాయఁబడిన గుప్తములగు బలిదానము లన్నియు హృదయాంతరాళముననే కలుగుచున్నవి. హృదయముయొక్క పవిత్రమును, గుప్తమును, నదృష్టమును నగు వేదికమీఁదనే సమస్తవాసనలు బలి యొసంగఁబడు చున్నవి. మనుష్యుఁడు "ఇది నాయపరాధము, ఇది నాదోషము" అని యంగీకరించు నంత పర్యంతము దోషములనుండి విమోచనము నందనేరఁడు. వాఁడు దోషమును విడిచిపుచ్చఁ గలిగినపుడే దోషాచ్ఛాదిత మయి యుండిన పరమసత్యముయొక్క జ్ఞానమును బడయఁ గలుగుచున్నాఁడు.

స్వర్గీయమగు నానంది మను ధనము లభింపుచుండియు నేత్రముల గోచరింపఁజాలదు. పరమార్థమునిమిత్తము కావింపఁబడు మౌనయుతమగు బలిదానమును, నహంకారసమన్వితమగు ప్రకృతియొక్క క్రమబద్ధమగు దైనికోత్సర్గమును దృగ్గోచరము కానేరవు. ఇట్టి యాత్మసమర్పణము న కెట్టి కృత్రిమ పారితోషికమును, జనసామాన్యమందుఁ గరతలధ్వనులచేఁ బ్రశంసయు లభింపనేరవు. ఇయ్యది ప్రపంచముయొక్క దృష్టికిఁ జాలసమీపముగ నుండువారి దృష్టికంటె గుప్తముగా నుండుచుండును. కారణ మేమన చర్మచక్షువు లహంకార సంహారముయొక్క యాధ్యాత్మిక సమరదృశ్య సౌందర్యమును విలోకింపఁజాలవు.

ఈయాత్మసమర్పణము పరులచేఁ జూడఁబడనపుడు దీని నాచరించుటచేఁ గలుగు ప్రయోజనము సయితము శూన్యమే యని భావింపరాదు. ఏతదాత్మసమర్పణముయొక్క విశుద్ధానందమయప్రకాశకిరణములు సమస్తమానవకోటికి హర్షము నొసంగుచుండును. దీని పరోపకారశక్తి సువిశాలమయి యెంతదూరమయినఁ జేరఁగలదు. మనుష్యులిద్దానిని వీక్షింపలేకున్నను గ్రహింపలేకున్నను దీనియొక్క నైసర్గిక ప్రభావము సమస్తమానవులపైఁ బ్రతిబింబితమగుచుండును. అహంకారమును నిర్మూలించుటకు హృదయాంతరాళమున నీ వెట్టి ఘోరయుద్ధముల నొనరింపుచున్నదియు, శాశ్వతమగు నాత్మవిజయము నిమిత్త మెంతగాఁ బ్రయత్నింపుచున్నదియు మనుష్యులు గ్రహింపఁజాలరు. కాని వారు నూతన పరివర్తనమును బడసిన నీస్వభావమును స్నేహార్ద్రహృదయమును బవిత్రాశయములను సులభముగా గ్రహింపఁ గలుగుదురు. నీహృదయక్షేత్రమం దెట్టి భయంకరసంగ్రామము జరుగుచున్నదియు నాయుద్ధభూమియందు నీ కెన్నియాఘాతములు కలిగియున్నదియు, నాగాయములపై నీ వేమి యౌషధము నుపయోగింపుచుండునదియు, నాయౌషధముచే నీ కెట్టి విశ్రాంతి లభించినదియు గుర్తింపఁజాలరు; కాని తొల్లింటి కంటె నీవు విశేష సౌఖ్యానందదాయకములగు శక్తిసామర్థ్యములను, శాంతమును, ధైర్యమును, బవిత్రమగు నాధ్యాత్మిక

శక్తిని మాత్రమే సంపాదించియున్నాఁడని స్పష్టముగా గ్రహింపఁగలరు. ఇంతకంటె శ్రేష్ఠమును, ప్రేమపాత్రమును నగు పారితోషికము మఱి నీకెచ్చోట లభింపఁగలదు? ప్రేమయొక్క సౌరభపూర్ణములగు కార్యములు మానవుని కృత్రిమ ప్రశంస సువాసనలేనిదిగఁ గోచరింపఁగలదు. అహంకారశూన్యమగు హృదయముయొక్క పవిత్రాగ్నిజ్వాలలోఁ బ్రపంచముయొక్క కల్పితప్రశంసలు దగ్ధమయి భస్మావశేషములు కాఁగలవు. ప్రేమ తనకుఁ దానే పారితోషికము తనకుఁదానే యానందము. ఇంద్రియాదుల దుష్టచాంచల్యముచే బాధింపఁబడిన మనుష్యులకు విశ్రమస్థానమును, రక్షణమును విశ్వమునఁ గేవలమొక్క ప్రేమనుండియే లభించుచున్నవి.

అహంకార పరిత్యాగమును, సంపూర్ణజ్ఞానానంద ప్రాప్తియు నేదేని యొకవిశాలమగు మహత్తరకార్యాచరణముచే లభింపనేరవు. అవి విశ్వముయొక్క సామాన్యజీవితమందలి యల్పోత్సర్గములఁ జీటికి మాటికిఁ గావింపుచుండుటచేతనే లభ్యములగుచున్నవి. నెమ్మదినెమ్మదిగాఁ గావింపఁబడునట్టి యాత్మోత్సర్గములమూలముననే సత్య మహంకారమును జయింపఁగలుగుచున్నది. ఈరీతిఁ బ్రతిదిన మహంకారమును జయింపుచు దుష్టభావములను, నపవిత్రవాసనలను, భావప్రవృత్తులను దమన మొనరించునట్టి మనుష్యునిశక్తియు శౌచ

మును బుద్ధియు ననుదినప్రవర్ధమానములయి వానిని గ్రమముగా సత్యానందమును సమీపింపఁ జేయఁగలవు.

మానవుఁడా! నిత్యమును, సత్యమును నగు బ్రహ్మానందమును, తత్ప్రకాశమును, నీవు నీబాహ్యమందుఁగాని, దూరమందుఁ గాని భ్రాంతికి వశుఁడవయి యన్వేషింపకుము. దీనిని నీవు నీలోపలనే యన్వేషింపుము. నీవు నీకర్తవ్యపాలనము యొక్క సామాన్యములును, గుప్తములును నగు బలిదానములచే నీనిత్య సత్యమగు దివ్యానందమయమార్గమును బడయఁగలవు. అప్పుడు నీవాత్మవిజేత వను ప్రతిష్ఠ నంది శాశ్వతానంద మూర్తివయి వెలయుచుండఁ గలవు.

---

## షష్ఠమ పరిచ్ఛేదము.

# సహానుభూతి.

నీ వెప్పుడేని నీయాత్మను వీక్షింపఁదలంతువేని కఠినమును దీవ్రమును నగు దృష్టితో నవలోకింపుము; కాని పరులను జూచునపుడు విశేషమగు దయార్ద్రహృదయముతో నవలోకింపుము. ఊబినేలనుండి గడ్డి వెలువడునట్లు సామాన్యమానవుల ముఖమునుండి సదా దూషణవాక్యములును, నీతిశూన్యము లగు నుడువులును వెలువడు చుండును. సత్యభాషణమునకయి సర్వేశ్వరునిచేఁ బ్రసాదింపఁబడిన నీ శ్రీముఖమును బరుల దోష సంకీర్తనముచేతను, దుష్టభాషణమునను మలినముఁ గావించుకొనకుము. —ఇలావ్హీలరు విలకాక్సు.

దుఃఖితులగు మనుష్యులను నీబాధ యెట్లున్నదని ప్రశ్నించుట నాపద్ధతి కాదు, నేను స్వయముగా దుఃఖితులను గాంచి దుఃఖితుఁడ నయి దుఃఖము ననుభవింపు చుందును.

— వాల్టువిట్టుమేను.

మన మాత్మదమనశక్తిని బడసిన కొలఁదియుఁ బరుల యెడ సహానుభూతిని గలిగియుండ సమర్థుల మగుదుము. నిరంతరః. మనము మనయందే దయను గలిగియుండుచు మన హృదయములయెడనే సహానుభూతిని బ్రకటించుకొనుచు నుండినచోఁ బరులయెడ నేవిధమగు సహానుభూతిని వెల్లడింపఁ జాలము. మనము సదా మనప్రశంసను గుఱించియు, రక్షణమును గుఱించియు, నభిప్రాయమును గూర్చియు విచారించుకొనుచున్నచో నన్యులతోడఁ బ్రేమపూర్వకముగ వ్యవహరింప నేరము. పరులను గూర్చి ధ్యానమును గలిగియుండి నిజసౌఖ్యమును గూర్చి యంతగా ధ్యానమును గలిగియుండకుండుటనే మహాత్ములు సహానుభూతి యని వచింపుచున్నారు. సహానుభూతి స్వసౌఖ్యమునకంటెఁ బరసౌఖ్యమునే మానవుని దృష్టిపథమున నెలకొనఁ జేయుచుండును.

పరులయెడ సహానుభూతిని గలిగియుండుటకుఁ దొలుత మన మవ్వారిస్థితిని గ్రహింపవలసి యుందుము. మనము వారి వాస్తవికమగుదశను గుర్తించునిమిత్తము వారివిషయమునఁ దొలుతనుండియు దురభిప్రాయమును గలిగి యుండరాదు. మనము సదా నిష్పక్షపాతముతో వాని యథార్థమగు స్థితిని గ్రహింపవలసియుండును. మనము పరులయొక్క యాంతరికస్థితిలోపలకుఁ బ్రవేశింపవలయును. మనము వారి

వాస్తవికస్థితిని వారినేత్రములతోడనే వీక్షించి, వారియను భవమును సాంగోపాంగముగా బరిశోధించి, గ్రహించి వారివలె నయిపోవు టావశ్యకము. నిస్సందేహముగ మనకంటె విశేష మగు బుద్ధిని, జ్ఞానమును సంపాదించి యున్నవారియెడ మన మీరీతి వర్తింపజాలము. మనకంటె నధమస్థితియందున్న వారితో సయితము మన మీరీతి వర్తింపనేరము. కారణమే మన సహానుభూతియు, స్వార్థమును నాకేస్థానమునం దుండ నేరవు. మన మేపాపములనుండియు, దుఃఖములనుండియు నవి రామమగు కృషిచే సాఫల్యమును సంపాదించియుంటిమో, అట్టి పాపవిషాదభరమునకు గ్రుంగి కృశించుచుండు మానవుల యెడ విశేషమగు సహానుభూతిని వెల్లడింప సమర్థులమయి యున్నారము. ఏపురుషుని జ్ఞానానుభవము మనబుద్ధిబలమును మించియుండునో, అట్టి మహనీయుని మనము సహానుభూతి యొక్క మాటునకు గప్పుపుచ్చి యుండజాలము, కాని మన యొక్క సహానుభూతి నేటికిని మనల బాధించుచున్న విషాద భయములనుండి విమోచనమును సంపాదించుటలో మహా పురుషలకును సహాయభూతము కాగలదు.

పక్షపాతమును, దురభిలాషలును సహానుభూతియొక్క విశాలమార్గమునకు బ్రతిబంధకము లగుచున్నవి. అహంకారము సహానుభూతిపరిగ్రహణమునుండి సదా హృదయమును నిరో

ధించుచుందును. పూర్వము నుండియు నెవ్వానియెడ నీహృదయ మందు ద్వేషము గలదో వానియెడ నీవు సహానుభూతిని గలిగి యుండఁజాలవు. ఏ మానవునియం దయినను దొలుతనుండి నీహృదయమునం దీర్ష్య నెలకొనియున్నచో ఘోరవిపద్గ్రస్తుఁడవయియుండియు నీ వట్టివాని సహానుభూతి నపేక్షింపఁ జాలవు. నీ వేమానవునియందుఁ దొలుతనుండియు జుగుప్స (ఏవగింపు) ను గలిగియుందువో వాని జీవితముయొక్క యథార్థతను స్పష్టముగా గ్రహింపఁజాలవు. పాశవికబుద్ధిచే నొక మానవునియం దీర్ష్యను గలిగియుందువేని నీవు వాని నెట్టిదీన దశయం దుండగాఁ జూచినను విచారింపనొల్లవు. నీవు వాని యెడ నీహృదయమం దెట్టిదుర్భావములను, దురభిప్రాయము లను గలిగియుందువో వాని ననుసరించియే నీచే ద్వేషింపఁ బడుచున్న వానియొక్క జీవితసత్యమును నిశ్చయింపఁ గలుగు దువు. నీవు నీయొక్క యశుద్ధమును, గారణశూన్యమును నగు నభిప్రాయము ననుసరించియే వానియందలి శీలమును గ్రహింపఁ గలుగుదువు, కాని మేలు నావంతయు గుర్తింప నేరవు.

నీవు పరులయొక్క యథార్థతను గ్రహింప నభిలషింతువేని నీకును, బరులకును మధ్యగల వైమనస్యమును, స్వార్థమయభావములనుఁ, బక్షపాతమును విసర్జించివేయుము.

పరుల శాస్త్రముల కర్థాంతరములఁ గల్పింపకుము. వారి యభిప్రాయములను, విశ్వాసములను దూషితములని సిద్ధాంతీకరింపఁగడంగకుము. కొంచెము సమయమునకయినను నిన్ను నీవు దూరముగా నుంచుకొని పరులస్థితి నవలోకింపుము. కేవల మీరీతి నీవు సదా పరుల సహచరుఁడవయి వారిజీవిత చారిత్రమును, జ్ఞానానుభవమును సంపూర్ణముగా గ్రహింతువేని పరులను గాంచి యెప్పుడును దూషింపఁజాలవు. అన్యులను బాగుగా గ్రహించియుండకుండుటవలననే నీవు వారియుద్దేశ్యముల నతిక్రమింపుచు, వారిని దూషించుటకేని సందేహింపకున్నాఁడవు. మనుష్యుఁడు విశుద్ధచారిత్రుఁడయి, ఆత్మవిజయమును బడయునందాక, పరులవాస్తవికస్థితిని గ్రహించుటయందు సమర్థుఁడగుటయు సంభవింపనేరదు.

వృద్ధియుఁ, బరిపక్వస్థితియు, వ్యాపనమును జీవిత మనఁబడుచున్నవి. ఒకవిధముగాఁ జూచినచో దుర్మార్గునందును, సన్మార్గునందును—పాపియందును, పుణ్యాత్మునందును గేవలము శ్రేణియొక్కయుఁ, గ్రమముయొక్కయు భేదము తక్క విశేషమగు తారతమ్య మేమియుఁ గానరాకున్నది. పుణ్యాత్ముఁ డొకప్పుడు పాపాత్ముఁడే. పాపియు భవిష్యత్తునందుఁ బుణ్యాత్ముఁడు కావచ్చును. పాపాత్ముఁడు బాలుఁడు. పుణ్యాత్ముఁడు వృద్ధుఁడు. సదా యాటవస్తువులచేఁ గ్రీడింపు

చుండు వారనియు, జ్ఞానశూన్యులనియు, గురుజనాజ్ఞలను తిరస్కరించువారనియు భావించి, బాలకులనుండిదూరముగా నుండుచుండుపురుషునకును, పాపాత్ములను దుష్టులనిభావించి వారినుండి భేద మావంతయుఁ విముఖుఁడయి యుండు మనుష్యునకును గానరాదు.

జీవితము సమానమయినది. కాని చూచుటకు దీనికిని భేదము లనేకములు కలవు. పుష్పము వృక్షమునుండి భిన్నమగు పదార్థముకాదు. ఇది వృక్షముయొక్క విశేషాంగము; దళముయొక్క రూపాంతరము. శాష్పము జలమునుండి భిన్నమగు పదార్థముకాదు. అదియు సలిలముయొక్క మఱియొకరూపము. పుణ్యాత్ముఁడు పరిపక్వమయినట్టియుఁ, బరిణతుఁడయినట్టియుఁ బాపాత్ముఁడే.

అజ్ఞానకారణమున సశుద్ధకార్యప్రణాళికయందభిరుచిని గలిగియుండు యపరిపక్వబుద్ధిసంపన్నుఁడే పాపాత్ముఁడు. విశుద్ధమును, సత్యమును, సత్యమునను నగు కార్యవిధానముననం దాసక్తుఁడయియుండు పరిపక్వధీయుతుఁడే పుణ్యాత్ముఁడు. ఒకపాపాత్ముఁడు మఱియొకపాపాత్ముని దూషితు నొనరించుచుండును. కారణమేమన దోషముల నెన్నుటయే కార్యముయొక్క యపరిశుద్ధవిధాన మనఁబడుచున్నది. పుణ్యాత్ముఁడు పాపాత్ముని దూషింపనొల్లఁడు. కతమేమన తానునయిత మొకప్పు

డట్టి నీచస్థితియందే యుంటినను స్మృతిని గలిగియుండుచుం డును. కావున నతఁడా పాపాత్మునిఁ దనయనుజునిగను, ప్రియ మిత్రునిగను భావించి వానియెడ గంభీరమగు సహానుభూతిని గలిగియుండుచుండును. కతమేమన సహానుభూతిని గలిగియుం డుటయే కారుణ్యముయొక్క విశుద్ధమును, బరమోజ్జ్వలమును నగు ప్రణాళికయైయున్నది.

సమస్తమానవులయెడ సదా విశాలమగు సహానుభూ తిని గలిగియుండుచుండు పరిపక్వబుద్ధియుతుఁడగు మహాత్ము నకుఁ బరుల సహానుభూతితో నిమిత్తమేమియు నుండఁజాలదు. హేతువేదియన బాపసంతాపములను, దుర్భరవిషాదభయ ములను సంపూర్ణముగా జయించి నిరంతర బ్రహ్మానంద నిమ గ్నుఁడయి యుండుచుండును. దుఃఖితులకుఁ బరుల సహానుభూతి యత్యంతాపేక్షణీయమయి యున్నది. పాపములఁ గావించు వారలవశ్యము క్లేశముల ననుభవింపఁగలరు. మానసికమును దైహికమును నగు ప్రతిపాపమునకు మారుగా దుఃఖము నవ శ్యము ననుభవింపవలసియుండునని విశ్వసించు మనుష్యుఁడు పరులదోషముల నెన్నుటను విసర్జించివైచి, పాపసంభూతములగు దుఃఖములకు గుఱియగుచున్నవారలఁ గాంచి, మహోదార మగు సహానుభూతిని వెల్లడింప నారంభించును. మనుష్యుఁడు తన్ను విశుద్ధునిగను, బవిత్రచారిత్రునిగను జేసికొనఁగలిగి నపుడే తా నీరీతి భావింప నారంభించును.

మనుష్యుఁడు తనస్వాంతముయొక్క సమస్తవికారములను సంస్కరించుకొని, స్వార్థమయవాంఛలఁ బరిమార్చి, క్రోధాహంకారముల పాదదళితమొనరించివైచినంతనే సమస్తవిధములగు మానవానుభవములను ననగా సకల పాప దుఃఖశోకభయోద్దేశ్యములను సంపూర్ణముగాఁ గెలువ నేర్చి పవిత్రమగు ధర్మనీతిని స్పష్టముగా, సాకల్యముగా గ్రహింప సమర్థుఁడగుచున్నాఁడు. తన పవిత్ర హృదయముయొక్క విశుద్ధమగు దృష్టితోఁ బరులఁ జూడ నేర్చిన వ్యక్తి, వారల నవశ్యము కరుణాపాంగముల వీక్షింపఁ సమర్థుఁ డగుచున్నాఁడు. అతఁడు పరులను దన దేహముయొక్క భాగముగనే భావింపుచుండును. ఆకరుణామూర్తి స్వప్నమందేని పరులను బ్రత్యేకదృష్టితో నవలోకింపనొల్లక పతితులుగ భావింపక వారి విషయమం దీరీతిఁ దలపోయుచుండును. "నే నేరీతిఁ దొలుతఁ బాపాచరణమున కియ్యకొంటినో, ఆచందముననే వీరును బాప మాచరింపుచున్నారు, క్లేశముల నే నేపగిది ననుభవించియుంటినో, ఆవడువుననే వీరు సయిత మనుభవింపుచున్నారు, నే నేభాతి నంతమునకు శాంతిసౌఖ్యములను సంప్రాప్తింపఁ జేసికొనియుంటినో, వీరును నట్టి చిరశాంతిని సంపాదింపఁ గలరు."

అజ్ఞానమునకుఁ గారణభూతమయి, కలుగనున్న దుఃఖమును రహస్యముగఁ గప్పిపుచ్చియుంచి పాపాత్మునిఁ దాక్క

లికముగ సుప్రసన్నచిత్తుని గావింపుచుండు పతితుని చారిత్ర మందలి నిగూఢ పాపమును గ్రహించునట్టియుఁ బరులదోష ముల లెక్కింప నట్టియు, సమస్త జనులయెడ సహానుభూతిని గలిగి వర్తింపుచుండు నట్టియుఁ, బ్రబలమగు పక్షపాతమును గలిగి యుండనట్టియు మనుజుఁడే యథార్థమగు సజ్జనుఁడు; ధీమంతుఁడు.

మానవుని బుద్ధి యెంతవఱకు వ్యాపింపఁగలదో, అంత దనుక మనుష్యుఁడు తన సహానుభూతిని విస్తరింపఁజేసికొన గలుగుచున్నాఁడు. అతఁడెన్నిప్రయత్నము లొనర్చినను బుద్ధిని మించిన సహానుభూతిని, సంపాదింప నేరఁడు. మనుష్యుఁడు దయార్ద్రహృదయుఁడును, వినయశీలుఁడును నగుచున్న కొలఁదియుఁ దనబుద్ధి నభివృద్ధి గావించుకొన సమర్థుఁ డగును. సహానుభూతి సంకుచితమగుటచే మానవహృదయ మును సంకుచిత మగుచున్నది. సంకీర్ణమగు నంతఃకరణముచే జీవనజ్యోతి దూషితమయి మానవుని సౌఖ్యమును నశింపఁజేసి వేయఁగలుగుచున్నది. సహానుభూతిని విస్తృత మొనరించు కొనుటయందే మానవుని జీవితము ప్రతిభాసముపేత మయి, ప్రకాశవంత మయి హర్షాబ్ధి నోలలాడఁగలదు. అట్టి యుత్త మజీవిత సంపన్నుఁడగు వ్యక్తియే జనసామాన్యమున కానంద మయమును, ప్రకాశభాసురమును నగు భవసంతరణ మార్గ మును ప్రదర్శింపఁ గలుగుచున్నాఁడు.

పరులయెడ సహానుభూతిని గలిగియుండుట పరుల దేహములను దన దేహముతో నేకీభవింపఁ జేసికొనుటవంటిది. సమస్త జీవకోటియెడ యథాశక్తి సమానభావమును గలిగి యుండుటయే శ్రేయస్కరము, కారణమేమన స్వార్థశూన్యమగు ప్రేమచే నతిశీఘ్రముగ నైకమత్య ముదయింపుచున్నది. సమస్త జీవరాసులయెడ స్వార్థశూన్యమగు ప్రేమను గలిగి యుండి వానియన్నింటియందుఁ దన్మయుఁడయి యుండు మనుష్యుఁడు ప్రపంచముయొక్క సర్వవ్యాపకమగు ప్రేమను, నీతిని, బుద్ధిని గ్రహింపఁ గలుగుచున్నాఁడు.

పరులను దన సహానుభూతినుండి దూరముగా నుంచు చున్నంతపర్యంతము స్వర్గము, శాంతి, సత్యము మానవుని సమీపించనేరవు. అతని సహానుభూతి సమాప్తమయిన సీమ యందే ఘోరాంధకారమును దుఃఖమును, భయంకరోపద్రవ ములును బ్రారంభము లగుచున్నవి. కారణమేమనఁ బరులను దన ప్రేమనుండి దూరముగా నుంచుట యన మనుష్యుఁడు తన్నుదా నిర్మల ప్రేమానందమునుండి దూరమొనరించు కొనినవాఁడయి స్వార్థముయొక్క ఘోరాంధకారమయమగు కారాగారమునఁబడి క్షీణించుటయే యని గ్రహింపఁదగును.

మానవుని సహానుభూతి యపార మయినపుడే వానికి సత్యముయొక్క యనంతమగు ప్రకాశము దృగ్గోచరము

కాఁగలదు. అసీమమగు ప్రేమయందే పాగములేని నిర్మలా నందము నెలకొనియున్నది.

సహానుభూతియే ఆనందము. ఇందు సర్వోత్తమంబగు నిర్మలానందము దృష్టిగోచరమగుచున్నది. సహానుభూతి స్వర్గీయము, కలిమేమన నిద్దాని ప్రకాశమందు సమస్తవిధము లగు స్వార్థమయభావములు నష్టమయిపోవ నెల్లరతోడ నైక్య భావము ననగా నాధ్యాత్మికసమత్వముయొక్క సుదృఢ సాం గత్యమును గలిగియుండుటచే నత్యంతపవిత్రమగు బ్రహ్మా నందము లభించుచున్నది. మనుష్యుఁడు సహానుభూతిని గలిగి యుండుటను విసర్జించినంతనే వానిజీవితము, దృష్టి, జ్ఞానము వృథా యగుచున్నవి.

మానవుఁడు పరులయెడ స్వార్థమయ భావములను గలిగియున్నంత దనుక వారియెడ యథార్థమగు సహానుభూతిని గలిగియుండఁజాలఁడు. వాస్తవికమగు సహానుభూతిని గలిగి యుండు వ్యక్తి పరులను వారి నిజస్థితియందున్నరీతి నవలోకిం పఁ బ్రయత్నమొనరించుచు, వారి విశేషములగు పాపము లను, వాసనలను, దుఃఖములను, విశ్వాసములను, బద్ధపాత ములను గ్రహింపఁ జూచుచుండును. అతఁడంతియునకుఁ బరు లాధ్యాత్మికాభివృద్ధియం దెంతవరకు సఫలత నందినదియు, వారియనుభవ మెంతవర కున్నదియు, వారు తమదశ నిర్బుడు

పరివర్తన మొనరించుకొనఁగలుగు నదియు, లేనిదియు స్పష్టముగా గ్రహింపఁ గలుగుచున్నాఁడు. జనులు తమకుఁగల జ్ఞానము ననుసరించియే విచారింపుచుఁ గాక మొనరింపుచుందు రని యతఁడు గ్రహించును. వారి హీనబుద్ధియు, జ్ఞానమును బ్రశస్తములగు నుదాహరణముల మూలమున సాహాయ్యమును, నభివృద్ధిని బడయుచుందు రనియుఁ, గాని తత్క్షణము వారు సంపూర్ణమగు పరివర్తనమునకుఁ బాల్పడఁజాల రనియు నతఁడు గుర్తింపుచుండును. వివేకము, ప్రేమ, దయ, శ్రద్ధ, సహానుభూతి యను గుణములు వృద్ధియగుటకును, వికసించుటకును సమయ మావశ్యకమయి యున్నది. కాలవ్యవధితోఁ బాటు తత్సద్గుణ సుమనోవికాసమునకయి యాశ్రయమాధ్యములను వంధ్యశాఖలను దత్క్షణమే ఖండింప వలనపడదు.

ఇట్టి దయామయుండగు సత్పురుషుఁడు తనతోఁ బరిచయమును గలిగియున్నట్టి సమస్తమానవుల యాభ్యంతరిక జగత్తుయొక్క ద్వారము నన్వేషింపుచున్నాఁడు, అతఁడు ఆద్వారమును గనిపెట్టి దానిని దెఱచి, లోనఁ బ్రవేశించి వారి జీవితమందిరమున నివసింపుచు వారెల్లరతోడ నైకట్యమును జెందుచున్నాఁడు. అప్పు డతనికి ధిక్కరించుటకును, గ్రోధించుటకును, నీర్ష్యను వహించుటకును నెట్టిస్థానమును లభింపకపోవుటచే వాని హృదయమందు విశేషమగు ననుకంపయు, ధైర్యమును, ప్రేమయు నుదయింప నారంభింపుచున్నవి.

అపుడతఁడు తన్ను సర్వమయునిగఁ జూడ నారంభించుచు సకలమానవులు తన యితరదేహములనియుఁ, వారిప్రకృతులు తనస్వభావమున కనుగుణ్యము లయినవనియుఁ, కేవల మహ్వా[illegible]యందు న్యూనాధికభావముయొక్క తారతమ్యము మాత్రమే కలదనియు భావింపఁజొచ్చెను. అతనికి పరుల హృదయములందుఁ బాపప్రవృత్తులు పనిసేయుచున్నట్లు గోచరించినచోఁ దత్క్షణమే యతఁడు తన హృదయమునను మానసమందునఁగూడ ఇట్టి దుష్ప్రవృత్తులు లేవుకదా యని నిత్యము పరీక్షించుకొనుచుండెను. అట్టిపరీక్షయందు దలిసి పవిత్రాంతఃకరణము 'మహాత్మా! నీ వెట్టిపాపము నాచరించియుండలేదు. కావున భీతిల్లకుము' అని గంభీరముగఁ బ్రత్యుత్తరము నొసంగుచుండును. ఆ సత్పురుషుఁడు పరులయందుఁ బుణ్యప్రవృత్తిని వీక్షించినచో నాహ్లాదితస్వాంతుఁడయి యిప్పటికిని విశేషమగు శక్తిని బడసి పాపకర్మస్థితిని సముపార్జించియుండునట్టి తన మానసమందట్టి పుణ్యప్రవృత్తి కలిగినదా లేదా యని దీర్ఘముగ విచారించుచు గూడిన మట్టాని పాప్తికయి కృషిసలుపుచుండును. ఒకనిపాపము సమస్తజనులపాపము. ఒకనిపుణ్యమెల్లరసుకృతము. ఒకమనుష్యుఁ డితరమనుష్యులనుండి భిన్నముగా సృజింపఁబడి యుండలేదు. ప్రకృతియొక్క భేదమేమియులేదు, కేవలము స్థితియొక్క తారతమ్యమే కానవచ్చుచున్నది. మానవుఁ డెవఁడయినఁ దనకంటెఁ బవిత్రుఁడుగఁ

నున్న యొకవ్యక్తినుండి తన్ను భిన్నముగా భావించినచోఁ గేవల మది యతని యజ్ఞానమే యగును. వాస్తవమాలోచింప గర్భదరిద్రుఁడును సార్వభౌమునినుండి భిన్నమగు పదార్థము కాదు. మనుష్యత్వమంతయు నభేదమయినది. సహానుభూతియొక్క పవిత్రమందిరమందుఁ బుణ్యాత్ములును, పాపాత్ములును సమావేశమయి సంఘీభవించుచున్నారు.

మహాప్రభువగు జీససునుగూర్చి బైబిలువంటి పవిత్రమతగ్రంథ మీరీతి నుడువుచున్నది. "ఆమహానుభావుఁడు సకల ప్రపంచముయొక్క పాపభారమును దన భుజస్కంధములపై వహించెను. అతఁడు సోదరమానవులగు పాపాత్ముల నెల్లర నుండి తన్ను బ్రత్యేకవ్యక్తిగ భావించియుండలేదు. దయానిధి యగు నతఁడు పాపులలోఁ దన్నొకనిగ భావించుకొనియెను. సకలజీవరాసులతోడ నతనికిఁగల యిట్టిసమభావ మతని జీవితమందు సమస్తమానవులకు స్పష్టముగ గోచరించెను. భయంకరపాపములయొక్క కారణముచే జనసామాన్యముచే విసర్జింపఁబడిన మహాపాపుల నెల్లర దయామయుండగు జీసను గాఢాలింగన మొనరించుకొని, వారి యవనతికయి దుఃఖాశ్రువుల రాల్చుచు వారియెడ ప్రగాఢమగు సహానుభూతిని వెల్లడించెను. ఆ మహనీయుఁడు లోకకల్యాణము నిమిత్తము దుర్భరకష్టముల ననుభవించి తుదకుఁ దనప్రాణములను సయితము బలిదానముఁ గావించెను"

ఎల్లరికంటె సహానుభూతి యెవ్వానికి విశేష మావశ్యకమయి యున్నది? పుణ్యచారిత్రుఁడును, ధీరుఁడును, జ్ఞానియు, మహాత్ముఁడును నగు వ్యక్తి ప్రత్యేకముగా సహానుభూతిని సంపాదింప వలసిన యవసరము లేదు. జ్ఞానశూన్యుఁడును, ఫలింపనట్టి పాపమును గలిగియున్నట్టి మనుష్యుఁడును ముఖ్యతముగా సహానుభూతిని సంపాదింప వలసియున్నది. మానవుఁడు పాపాత్ముఁడయిన కొలఁదియు దుఃఖతుఁడు కావలసివచ్చుచుండును. పాపవిషాద విమోచనమునకు సహానుభూతియే దివ్యమగు సాధనము. జీససుప్రభువు ఈ విషయమయి యొక్కచో నీరీతి వచించియున్నాడు:—"నేను పుణ్యాత్ములకొఱకు భువినవతరించి యుండలేదు. పాపులను వారి పాపాచరణమునకయి పశ్చాత్తాపతప్తులఁగావించు నిమిత్తమే యిహమున కేతెంచి యున్నాడను." జీససుప్రభువుయొక్క శుభవచనములచే సహానుభూతి పుణ్యాత్ముల కనావశ్యకమనియుఁ, బాపుల కత్యంతావశ్యకమనియు స్పష్టపడుచున్నది. దీర్ఘకాలపర్యంతము దూషితకార్యములచే భయవిషాదముల ననుభవింపఁ బాపసంచయము నొనరించునట్టి మానవునకే ముఖ్యముగా సహానుభూతి యపేక్షణీయ మయియున్నది.

ఒకవిధమగు పాపకర్మ నాచరించు మనుష్యుఁడు మఱొకవిధముగనున్న పాపము ననుష్ఠించువ్యక్తిని నీచునిగను, ఘోరాపరాధిగను భావించుచున్నాఁడు. వాఁడు తనయొక్కయు,

మఱియొకనియొక్కయుఁ బాపములు భిన్నవిధము లయి
యున్నను దుదకన్నియు నొక్కటియేఁ యని గ్రహింపఁజాలఁడు.
వాఁడు సమస్తవిధములగు పా[పము]లొకటే యనియు, కేవలము
వానియొక్క రూపములందే భేదము కలదనియు విచారింపఁ
కుండును. మానవుఁడు తా నెంత పాపాత్ముఁడో, పరులు
నయిత మట్టి పాపాత్ములే యని నిర్ణయింపుచుండును. వానికి
సత్యజ్ఞానము కలిగినంతనే పాపమునుండి విముఖత్వమును బడ
య యత్నింపుచున్నాఁడు వాఁ డిట్లొనరించి పరులను సయితము
పాపాత్ములని నుడువనొల్లఁడయి సమస్తజనులయెడ సం
పూర్ణమగు సహానుభూతిని వెల్లడింప నారంభింపుచున్నాఁడు.
ఇంద్రియదాసులును, బాపాత్ములును నగు మనుష్యులు పరస్ప
రము దూషించుకొనుచుండుటయు, గర్హించుకొనుచుండు
టయు సృష్టియొక్క స్వాభావికనియమ మయినది. సమస్త
జనులచే దూషింపఁబడుచు, గర్హింపఁబడుచు నున్న భ్రష్ట
మానవుఁడు లోకముయొక్క ధిక్కారమును మంచిగ భావించి
నా యపరాధముల వలననే లోకము నన్ను నిందింపుచున్నది
కదా యని విచారింపుచున్నచో నవశ్య మతని కత్యద్భుతమగు
నున్నతమార్గము లభింపఁగలదు. వాఁ డంత బరులదోషముల
లెక్కించుటను విసర్జించివేయుచున్నాఁడు.

యథార్థముగ సజ్జనుఁ డగు మనుష్యుఁడు పరనిందకుఁ
గడంగ నొల్లఁడు. ఇట్టిమనుష్యుఁడు స్వార్థపరత్వమును, నంధ

ప్రియమగు నుద్వేగమును దూరమొనరించివైచి, ప్రేమను, శాంతిని, గలిగియుండి సమస్తవిధములగు పాపములను, దత్సంభూతములగు దుఃఖక్లేశములను స్పష్టముగా గ్రహింపఁగలుగుచున్నాఁడు. వాఁడు నిద్రనుండి మేల్కాంచి, జ్ఞానప్రకాశమును బడసి, స్వార్థమును విసర్జించి సమస్తమానవలోకముయెడ నిర్మలమగు సహానుభూతిని గలిగియుండుచున్నాఁడు. ఇట్టి మానవోత్తముని మూఢులు దూషించినను, దోషిగ నిశ్చయించినను, నసహ్యించుకొనినను వాఁడు కోపము నొందక కీడునకు మాఱుగా నెల్లఁ ఉపకారమొనరింపుచు వారియెడ సంపూర్ణమగు సహానుభూతిని బ్రకటింపుచున్నాఁడు. అతఁడట్లు తనకపకారమొనరించు వారికిని మేలుసేయుచు "ఈమానవులు స్వహృదయమందిరముల వ్యాపించియున్న గాఢాజ్ఞానాంధకారముయొక్క కారణమున నన్ను ద్వేషింపుచున్నారు, ఇందుచే నాకేమియు నష్టము లేదు. వీరలవశ్యము తమ దుష్కర్మలయొక్క ఫలితము ననుభవింపఁగలరు." అని భావింపుచుండును.

ఆత్మదమనము, జ్ఞానవృద్ధియను సద్గుణసాధనములచే ద్వేషించువారిని ప్రేమించువిధము నభ్యసింపఁదగును. మానవుఁడా! నీ వెపుడును బరులొనరించు కీడువైపునకు నీదృష్టిని బ్రసరింపఁ జేయకుము, సదా నీహృదయమునే పరిశీలించుకొనుచుండుము. అట్లు పరిశోధించుకొనుచుండుటచే నీ

స్థూలదృష్టికిఁ గానరానట్టి దోషములెన్నియో నీవిజ్ఞాననేత్రమునకు గోచరింపఁగలవు. నీవు నిజదోషములను, స్వీయపాపబాధములను గ్రహింప నారంభింతువేని, పరులను నిందించు దురభ్యాసమును విసర్జించి నిన్ను నీవే ధిక్కరించుకొనుచుండఁగలవు. సామాన్యరీతిచేఁ జెప్పఁబడు సహానుభూతి వాస్తవికమగు సహానుభూతి కానేరదు, కాని యది యొక విధమగు దైహికస్నేహము. మనయందు స్నేహాతిశయమును వెల్లడించు వారిని మనముసయితము ప్రేమించుట మనుష్యునియొక్క స్వాభావిక ధర్మమయియున్నది. కాని మనయం దెట్టి స్నేహమును గలిగియుండక, ద్వేషింపుచుండునట్టి వారియెడఁ జూపఁబడు నిర్మలమగు స్నేహమునే పవిత్రమగు సహానుభూతి యని నుడువు టుచితము.

సహానుభూతియొక్క యావశ్యకతయే దుఃఖక్లేశములకు ముఖ్యకారణము. దుఃఖము ననుభవించియుండని ప్రాణియే భూతలమున లేదని చెప్పవచ్చును. దుఃఖమునుండియే సహానుభూతి యుదయించియున్నది. ఒక్కసంవత్సరమందుగాని లేక యొకజీవితకాలమందుగాని మానవహృదయము దుఃఖముల ననుభవించి పవిత్రమును, స్వచ్ఛమును గానేరదు, కాని చీటికి మాటికి భువిపై జన్మింపుచు దుఃఖమునందియే మనుష్యుఁడు తన స్వానుభవముయొక్క సువర్ణమయఫలితమును బడయు

చున్నాఁడు. అతఁడు తత్ఫలితముగఁ బ్రేమ, జ్ఞానము లను మహాభాగ్యలరత్నములఁ బ్రాప్తింపఁజేసికొనుచున్నాఁడు. ఈ చందమున జన్మజన్మాంతరములకుఁబిదప రహస్యమును గుర్తించి మనుష్యుఁడు సహానుభూతిని దగ్గఱకుఁ జేరఁదీయుచున్నాఁడు. నియమోల్లంఘనమే మహాపాపము. మనుష్యుఁ డజ్ఞానముచే నియమముల నతిక్రమించుచున్నాఁడు. పాపమే క్లేశము. ఒక పాపమునే మాటి మాటి కొనరించుటచేఁ దత్ఫలితమగు క్లేశమును మానవుఁడు చీటికి మాటికి ననుభవింప బాధ్యుఁడగుచున్నాఁడు. వాఁడీరీతిఁ బదేపదే కష్టముల ననుభవించి, తన్నియమముయొక్క జ్ఞానమును బొందుచున్నాఁడు. వాఁడు జ్ఞానమును బడసినంతనే వానిహృదయసరోవరమునం దుదయించియున్న పవిత్రమును, సుందరమును నగు సహానుభూతి యను వారిజము వికసింపఁ గడంగుచున్నది.

దయయు, సహానుభూతియొక్క యొకయంశమే. ప్రపంచమందు దుఃఖితులయొక్కయు, విపద్గ్రస్తులయొక్కయు విషాదభయముల దూరమొనరించి వారికి ధైర్యమును గలిగింప దయయే యుత్తమోత్తమంబగు సాధనరాజముగ నున్నది. “ దయ, శక్తిహీనులనిమిత్తము ప్రపంచమున శరీరపుకుసుమకోమల మొనరించుచున్నది, శక్తిసంపన్నులకొఱకు విశ్వమును సమున్నతము గావించుచున్నయది.”

క్రౌర్యమును, కృపారాహిత్యమును, దోషారోపణమును, క్రోధమును, తొలఁగించుటచే దయ వర్ధిల్లుచున్నది. ఒకానొక పాపాత్ముని స్వయంకృతాపరాధముయొక్క భయంకర ఫలితము ననుభవించుచుండఁ గాంచి కఠినహృదయుఁ డొకఁడు "సీ దుర్మార్గుఁడు తనపాపమున కుచితమగు ఫలము ననుభవించుచున్నాఁ" డని వచించు ననుష్యుఁడు దయార్ద్రహృదయుఁడగు దయారసముచే దుఃఖితుల హృదయతాపమున నుపశమింపఁ జేయ నేరఁడు. మనుష్యులను ప్రాణికోట్లపైఁ గఠినములగు బుద్ధి వహింపుచు యథోచితముగా నుండు సహానుభూతుల నెల్ల డింపకుండ నుండుచున్నారో వారి హృదయము సంకీర్ణమయి, వాని దయానందమును క్షీణింపఁ జేయుచు వారి మనస్సీమ యందు దుఃఖబీజముల నాటుచుండఁగలదు.

తనకంటెఁ బరులయొక్క ప్రశస్తతరమగు విజయమును గాంచి సంతోషించుచు నాసాఫల్యమును స్వకీయముగనే భావించు పరోన్నతిని సహించుబుద్ధియే సహానుభూతియొక్క ద్వితీయాంగము. తనశత్రువులయొక్క కల్యాణమును స్థితిని గాంచి సంతోషించునట్టియు, ద్వేషమునుండియు, ఈర్ష్యనుండియు, జుగుప్సనుండియు విముక్తుఁడయినట్టియు మనుష్యుఁడు నిస్సందేహముగ సుఖ స్వభావుల ధన్యుఁడు.

తనకంటె హీనతరములును, క్షుద్రములును నగు ప్రాణుల రక్షించుట సయితము సహానుభూతియొక్క యొక

యాంగమయి యున్నది. నోరెఱుంగని జంతువులయొక్క సంరక్షణము నిమిత్తము విశేషముగు సహానుభూతి యపేక్షింపఁబడుచున్నది. దీనుల రక్షణమే శిక్షణము (దండనము) కంటె శక్తియొక్క శోభను వృద్ధిఁ గావించుట కుత్తమసాధనమయి యున్నది. క్షుద్రజీవసంరక్షణమునసే మానవజీవితము చరితార్థమగును గాని జీవహింసచే నెప్పటికిని గానేరదు.

జీవితములన్నియు నొకటియే. క్షుద్రాతిక్షుద్ర మగు ప్రాణిసయితము మహాప్రాణినుండి శక్తియొక్కయు, బుద్ధియొక్కయు న్యూనతాధిక్యములయందుమాత్రము భిన్నముగా నుండుచుండును. తదితరవిషయములన్నింటియందు జీవులన్నియు సమానములే. మానవుఁడు దయార్ద్రహృదయుఁడయి జీవసంరక్షణమునకుఁ గడంగినచో వాని సంపదలును, సౌఖ్యానందములును దినదినాభివృద్ధి నందఁగలవు. దీనికి విపరీతముగా మనుజుఁడు వివేకమును బాసి కఠినబుద్ధిచేఁ బ్రాణికోటికి దుఃఖక్లేశముల నొదవింపుచున్నచో వాని యైశ్వర్యమడుగంటి పోఁగలదు. వాని సౌఖ్యానందము లంతర్హితములయి పోఁగలవు. ఒకప్రాణి మఱొకప్రాణిని సంహరించి భుజింపుచున్నను, ఒకయుద్యోగము మఱొక యుద్యోగమును నష్టమొనరింపు చున్నను మానవుఁడు వానితో నిమిత్తము లేక సాత్త్వికప్రకృతిని సంపాదించిన హితమును బడయఁ

గలఁడు. సాత్త్వికస్వభావమును మనుష్యుఁడు దయ, దాక్షిణ్యము, ప్రేమ, సహానుభూతి, స్వార్థత్యాగము మొదలగు పవిత్ర కర్మలవలననే వృద్ధిగతమును, సురక్షితమును, బరిపక్వమును జేసికొనఁగలుగు చున్నాఁడు.

మనుష్యుఁడు తాను పరులయెడ సహానుభూతిని వృద్ధిఁ గావింపుచుఁ దనయెడఁ బరులహృదయములందు నత్యధికమగు సహానుభూతిని గలిగింపఁ జేసికొనుచున్నాఁడు. పరుల యెడ వెల్లడింపఁబడు సహానుభూతి వ్యర్థముగా నేరదు. అధమ ప్రాణి సయితము సహానుభూతియొక్క స్వర్గీయస్పర్శచేఁ గృతజ్ఞతను వెల్లడింప నారంభించుచున్నది, కారణ మేమన సహానుభూతి సకలప్రాణికోటిచే సులభముగా గ్రహింపఁ బడు నొక విశ్వవ్యాపక మగు భాష. అమెరికాయందలి డారటమూరు నగరముయొక్క పరమ దుర్మార్గుఁడగు నేరస్థుఁడు తన యసంఖ్యాకములగు నపరాధములచే వివిధనగరములందు రమారమి నలుబదివత్సరములకాలము కారాగారబద్ధుఁడయి యుండెను. సమస్తజనులు వాని నొక ఘోర హంతకునిగను, భయంకర పిశాచముగను భావించు చుండిరి. చెరసాలలందుండు ప్రభుత్వోద్యోగియు లతని సంస్కరణమం దావంతవిశ్వాసము నయినఁ గలిగి యుండఁ జాలకుండిరి. ఒకదివసమం దాధూర్తుఁడు బంధింపఁబడుచున్న చెరసాల

యొక్క గదియం దొక వ్యాధిపీడితమును, శల్యావశిష్టమును,
క్షుధార్తమును నగు మూషికము వ్యాకులహృదయముతో నటు
నిటుం బరుగెత్తెను. దానియొక్క యసహాయస్థితిని, దుర్బల దేహ
మును గాంచి యా పాపాత్ముని హృదయమందు సంచితము
దయయొక్క విద్యుచ్ఛక్తి సంచరింపం దొడంగెను. వాం డంతం
దన స్థితియు, నా చిట్టెలుకయొక్క దశయు నొక్కరీతిగనే
యున్న దని గ్రహించి దానియందు విశేష మగు సహాను
భూతిని వెల్లడింప నారంభించెను. వాం డా చిట్టెలుకకుం దన
బూట్సు (పాదరక్షలు) నందు నివాసస్థాన మొసంగి దాని కను
దినము తన భోజనపానములనుండి కొంతభాగము నొసంగుచు
వచ్చెను. ఏ యత్యంతనీచమును, కఠోరమును, మానవ
భయంకరమును నగు రాక్షసహృదయమందు మానవలోకము
యెడ దయాదాక్షిణ్యములకు స్థానము లేకుండెనో, ఆ దుష్ట
హీనహృదయమందే క్షుద్రజీవ మగు మూషికమువలన
సహానుభూతియొక్క స్వర్గీయజ్యోతి దేదీప్యమానముగం
బ్రజ్వరిల్లెను. తనకంటె శక్తిహీనులయెడ వానిహృదయ
మందు దయయు, ప్రేమయు వర్ధిల్ల నారంభించెను. తనకంటె
నధికమగు శక్తిసంపన్నులయెడ వాని హృదయమం దుండిన
ద్వేషాగ్ని యుపశమింపం జొచ్చెను. వాం డంతం గారాగార
పరీక్షకులయొక్క యాజ్ఞాపాలనమందు సంపూర్ణముగా దక్షుం
డయ్యెను. అమెరికా ప్రజాసామాన్య మవ్వాని కఠిన మగు

హృదయ మెట్లు దయార్ద్రమయ్యెనా యని యబ్బురపడ నారంభించెను. అంత వానియాకృతియు మార్పునందెను. నేత్రములయొక్కయు, నధరములయొక్కయు భయంకరస్థితి క్రమముగాఁ దొలంగిపోవ నాస్థానమందు మార్దవమును, ప్రేమయుఁ బ్రకాశింపఁ దొడంగెను. ఇపు డతఁడు పరమదుర్మార్గుఁడుగ నేరస్థుఁడుగ నుండలేదు. అతనికి సంపూర్ణమగు ప్రాయశ్చిత్తమగుడు వానిమానసము పుణ్యమందు సంలగ్నమయ్యెను. అంతమున కీసమస్తవృత్తాంతము ప్రభుత్వకర్మచారుల కెల్లరకు స్పష్టపడియెను. వా రంత వానిని స్వతంత్రుని గావించివైచిరి. వాఁడు కారాగారమునుండి వెడలిపోవునపుడు తనవెంట నా మూషికమును సయితము తీసికొనిపోయెను.

ఈచందమునఁ బరులయెడ సహానుభూతిని వెల్లడింపుచుండుటచే స్వయముగాఁ దద్భాండారము మన హృదయములయందు వృద్ధినంద మన జీవితములు సఫలములు కాఁగలవు. సహానుభూతియొక్క దానముచే నానంద పారితోషికము లభించుచున్నది. సహానుభూతియొక్క దానము నొసంగకుండుటచే మన యానందము నష్టమయిపోవుచున్నది. మనుష్యుఁడు అధికమగు సహానుభూతిని గలిగియుండుకొలఁదియు వానిజీవిత మాదర్శప్రాయమయి సత్యానందమయస్థితికిఁ బ్రాపింపఁ గలదు. మానవుని హృదయము తనయందు నిర్దయభావము

లకును, గటువిచారములకునుస్థానమైనంగక కోమలత్వ
మును, మాధుర్యమును పెంపొందింపఁజేసికొనుచున్నకాలఁ
దియు, వాఁడు సులభముగా నాత్మవిజేత కాఁగలిగి బ్రహ్మా
నందసాగరమున నీదులాడచుండఁగలఁడు.

---

## సప్తమ ప్రకరణము.

---

# సహనము.

సహన మనఁగా నోర్పు. ఓర్పు మానవజీవితమునం దొక ప్రశస్తమగు సద్గుణము. జీవితాభ్యుదయమం దోరిమి చేఁగలుగు ప్రయోజనము లనంతములు. గతించిన ప్రమాదములనుగూర్చి సంస్మరించుటచే మానసికాంధకార మేర్పడుచున్నది. ప్రమాదములకు హేతుభూతులయినవారిపైఁ గక్ష వహించి పగఁదీర్చుకొన విచారించుటకంటె నాత్మఘాతము వేఱొండులేదు. ఓర్పు నవలంబించుటనుగూర్చి విచారించుటయే మానసికప్రకాశమున కారంభము. క్షమావలంబన చింతనమే శాంతిని, సౌఖ్యమును సంపాదించుట కుత్తమమగు సాధనము. పరజనకృతములగు నపకారములను, విఘాతములను, బ్రహాస్త్రములను, ననుగ్రహములను, గటాక్షములను సదా చింతింపుచుండునట్టి మనుష్యునిచిత్తమందు శాంతి నెలకొనియుండఁజాలదు. తనతోడఁ బరు లనుచితముగ వర్తించినారని భావించునట్టియుఁ, దన శాత్రవులఁ బరాభూతులఁ

గావింప వివిధములగు కృత్రిమప్రయోగముల నన్వేషించుచుండు నట్టియు మానవునిచిత్తమున కెట్టివిశ్రాంతియు లభింపనేరదు. ఎవ్వాని హృదయమందు ద్వేషముయొక్కయుఁ బ్రత్యపకారముయొక్కయు నుపద్రవములు చెలరేగియుండునో, వాని హృదయమందు సౌఖ్యాధివాసము గగనపుష్పమువంటిదగును. అగ్నిచే భగభగమండుచున్న వృక్షశాఖపై విహంగ మధిష్టించి గాన మొనరించు టెట్లు? ప్రత్యపకార మను ప్రచండాగ్నిచే దగ్ధమగుచున్న హృదయమందు సౌఖ్య మనుభవింప నేర్చునా? ఇట్టి మాధ్యమునకు నివాసమగు స్థానమందు బుద్ధి ప్రవేశించుట కరము కష్టసాధ్యము.

పరమపవిత్రమగు క్షమయొక్క తత్త్వమును గుర్తించియుండని వ్యక్తికే ప్రత్యపకారము మధురముగ నుండుచుండును. పావనమగు క్షమయొక్క దివ్యతత్త్వ మాధుర్యరసము నాస్వాదించిన మనుష్యునకుఁ బ్రత్యపకారముయొక్క రుచి మిక్కిలి వెగటుగను, గటువుగను, తీక్ష్ణముగను నుండఁగలదు. తమోగుణాంధకార పరిపూర్ణహృదయులగు మనుష్యులకే ప్రత్యపకారము సౌఖ్యదాయకముగ నుండుచున్నది. కాని క్రోధాది దుర్గుణముల యుద్వేగము క్షీణించుకొలఁదియు మానవునకు సహనముయొక్క కోమలత్వము సంప్రాప్తమగుచున్నది. తత్క్షణమే వానికిఁ బ్రత్యపకారము కేవలము

దుఃఖోత్పాదనమునకు ముఖ్యసాధన మను జ్ఞానమును గలుగుట తటస్థించుచున్నది.

ప్రత్యపకార మొక భయంకరమగు తీవ్ర విషము. ఇయ్యది మానవుని మస్తిష్కమున దొలుతఁ జేరి దానిశక్తుల నెల్ల హరించి, క్రమముగా దేహమందలి రక్తమంతటను వ్యాపించి, మానవుని సమగ్ర సాత్త్వికశరీరమును విషాక్తమొనరించి వేయుచున్నది. క్రోధ మొక భయంకరమగు మానసికతాపజ్వరము. ఇయ్యది మానవుని మస్తిష్కముయొక్క ప్రయోజనకరములగు సమస్తశక్తుల దగ్ధమొనరించి వేయుచున్నది. కీడును దలంచుటయు నొకభయంకరమగు మానసిక బాద్యమే యనఁబడుచున్నది. ఈ దుష్టరోగముచే మానవుని దయయొక్కయు, మంగళమయాభిలాషలయొక్కయు స్వాస్థ్యము ఖండింపఁబడుచున్నది. మానవుఁ డిట్టి భయంకర రోగములనుండి సావధానచిత్తుఁడయి యుండుటావశ్యకము. సహనమును నేర్వకుండుటయొక్కయుఁ, బరులకుఁ గీడుసలుప నెంచుటయొక్కయుఁ బ్రకృతి దుఃఖము నుదయింపఁ జేయుచున్నది. ఇట్టిహీన మగు ప్రకృతిని గలిగియుండు మానవుని విషయవికార దమనశక్తి నశించిపోవ, వాఁడు జడబుద్ధియయి దుస్స్వప్నములకుఁ బాల్పడి, జీవితప్రకాశశాంతులఁ గోల్పోయి సౌఖ్యానందములనుండి వంచితుఁడగుచున్నాఁడు. పాపా

ణాతుల్యమగు హృదయమును గలిగియుండుటచే మానవుని దుఃఖ మభివృద్ధిజెంది, అది వానిజీవితప్రకాశమును, విశ్రాంతిని నష్ట మొనరించి వేయుచున్నది. కోమలహృదయమును గలిగియుం డుటవలనను, సుప్రసన్నుఁడయి యుండుటవలనను మనుష్యు నకు జీవితప్రకాశమును, విశ్రాంతియు సులభముగా లభించు చున్నవి. కఠినహృదయులును, నసహనశీలురును నగు మను ష్యులు లోకమందలి సమ సజనుల కంటె నధికముగా దుఃఖము ననుభవింపఁగల రని వచించుటలో జనసామాన్యమున కత్యంతమగు నాశ్చర్యము కలుగఁగలదు. వాస్తవమునకీ విష యము భిన్నమయినది కాదు. కారణమేమన నిట్టి వారాకర్షణ శక్తియొక్క నియమానుసారముగఁ బరుల హృదయము లందుఁ దమ్ము సాధించుటకుఁ బ్రతికారబీజముల నాటినవార లగుటయేకాక, వారు దివారాత్రములు చిత్తకాఠిన్యముచేఁ గలుగు దుఃఖము ననుభవించుచుండ బాధ్యు లగుదురు. మాన వుఁడెవ్వని నయిన సాధించునిమిత్తము కఠినహృదయమును గఠినమొనరించుకొనునప్పుడెల్ల వాని కవశ్యమయిదు విధము లగు నష్టములు కలుగుచున్నవి:—1. స్నేహలోపము, 2. సాంఘిక సాంగత్య నష్టము, 3. దుఃఖితుఁడును, నుద్విగ్నమన స్కుఁడును నగునట్టి నష్టము, 4. క్రోధము, గర్వము కలు గుట, 5. పరిజనప్రదత్తమగు దండన ననుభవించుట. ఇది యే చందమున మనుష్యుఁడు సహనమును గలిగి వర్తించుటచే

నయిదువిధములగు విశుద్ధానందములఁ బడయసమర్థుఁడగు చున్నాఁడు:—1. స్నేహానందము, 2. సాంఘిక సాంగత్యానందము, 3. స్వచ్ఛమును, బ్రశాంతమునునగు మానసికానందము, 4. క్రోధగర్వదమనము, 5. పరులు మనకు హితాభిలాషులగుటచేఁ గలిగెడి యానందము. ఈ పంచవిధములగు నానందములను మానవుఁడు కేవలము సహనముచే సంపాదింపఁగలుగు చున్నాఁడు.

అసంఖ్యాకులగు మనుష్యులిక్కాలమున క్షమాశీలురు కాకుండుటచే సదాక్రోధాగ్నియందు దగ్ధమగుచున్నారు. అస్వాభావికమగు నసహన ప్రకృతిని నిరోధింపఁజేసినఁగాని మనుష్యుఁడు తా నెంతటి కఠినహృదయుఁడయి నిర్దయుఁడయి వర్తింపుచున్నదియు స్పష్టపడనేరదు. అసహన మను దుష్టపిశాచముయొక్క దాస్యమును విసర్జించి క్షమయను దైవము నారాధించువారికి క్షమాక్షమల సుఖదుఃఖ దాయకములగు స్వభావపద్ధతులు బోధపడఁగలవు.

మనము ప్రపంచముయొక్క పరస్పర వైమనస్యమును గూర్చి దీర్ఘముగా విచారించినచో నెందఱు వ్యక్తులు, ఎన్ని సమాజములు, ఎంద ఱిరుగు పొరుగువాండ్రు, ఎన్ని జాతులు ప్రత్యపకారముపైఁ బ్రత్యపకారము నొండొరులయందుఁ గావించుకొనుచున్నదియుఁ దేటతెల్లము కాఁగలదు. ఈరీతిగ

నెన్ని హృదయములు విదీర్ణము లగుచున్నదియు, నెంతగా నశ్రుధారలు ప్రవహించుచున్నదియు, ఎన్ని వియోగములు, ఎన్ని ప్రమాదములు తటస్థించుచున్నదియు, భయంకరముగా నెంత రక్తము ధారాయాసంబునఁ బ్రవహించుచు భూలోకమున దుఃఖమును దాండవింపఁజేయుచున్నదియు విశదపడఁగలదు. ఈభయంకరములగు విషయముల నిన్నింటి ధ్యానపూర్వకముగ విచారించినచో మనము దుష్టుల మగుటకు సలుపు కుత్సితాలోచనములను విసర్జించి, ప్రతిమానవునియొక్క దోషమునకయు ప్రత్యపకార మొనరించుటను మానివైచి క్షమించుట నభ్యసించినచో లోకమున కనంతకల్యాణము చేకూరుటయం దెట్టి విలంబ మొనఁగూడ దని స్పష్టము కాఁగలదు.

మనుష్యుఁడు పగదీర్చుకొనుటను వీడి, క్షాంతిని బరిగ్రహించినచో నవశ్య మంధకారమునుండి ప్రకాశములోనికి రాఁగలఁడు. అనవానమందుఁగల విశేషమగు నంధకారమును, నజ్ఞానమును గుర్తించియున్నవా రగుటచే బుద్ధిమంతులును, జ్ఞానసంపన్నులును నగు మనుష్యు లద్దానిని స్వీకరింపనొల్లరు. మనుష్యుఁడు పగఁదీర్చుకొను దుష్టప్రకృతిని విసర్జింపక, సదాచరణమును బరిగ్రహింపక యున్నంతపర్యంత మంధకారమునే గ్రహింపఁ జాలకుండును. మనుష్యుఁడు తనయంధకారమయములును, పాపప్రచురములును నగు ప్రవృత్తులచే నంధ

ప్రియుండయి మోసగింపఁబడుచున్నాఁడు. సమస్తవిధములగు నవమానములఁ బరిత్యజించుటచే నహంకారము, క్రోధము, ఉన్మాదము, మమకారము, ఆత్మస్తుతి మొదలగు దుర్గుణములన్నియు మానవజీవితమునుండి యంతర్హితములయి పోవుచున్నవి. అపకారిపైఁ బగఁదీర్చుకొనుటకు మానవుని చిత్తమును ప్రేరేపించుటకుఁగల కారణములన్నియు బహిష్కరింపఁబడెను. తనే తొలుత నహంకారముచేతను, నవివేకముచేతను నాచ్ఛాదితములయి యుండిన మానవుని సమున్నతజీవనజ్యోతియు, విశేషముగు వివేకప్రకాశమును బ్రకటీభూతము లగుచున్నవి. సామాన్యములగు నుపాలంభనములు, (ఎత్తిపొడుపులు) కటాక్షములు, ధిక్కారములు సామాన్యదృష్టికిఁ దీవ్రద్వేషముకంటెను, భయంకర ప్రత్యపకారముకంటెను హీనములయినట్లు గోచరించుచున్నను నివియు మనుష్యచారిత్రమును, మానవాంతఃకరణమును సంకుచితమొనరించునట్టి దుష్టప్రవృత్తులయని గ్రహింపవలసియున్నది. ఈదుర్గుణములన్నియు నహంకారమునుండియు, నాత్మశ్లాఘమునుండియు నుదయించుచున్నవి. అహంకారముచేతను, నాత్మస్తుతిచేతను నంధుఁడగు మానవుఁడు పరుల హితోపదేశమును, సద్వాక్యములను విషప్రాయముగ భావించుచుండును. అతఁడొరులనుడువులకుఁ జెవియొగ్గనొల్లఁడు. అహంకారము మానవునియం దభివృద్ధినందినకొలఁదియు నతఁడు మహాదుష్టుఁడగుచు, లోకమునకుఁ గీడొనరింప

నుత్సహింపు చుండఁగలఁడు. దుష్టత్వమున కహంకారమే జన్మస్థానము. మానవుఁడు చీటికి మాటికి స్వల్పవిషయములందుఁ జెడుగాఁ దలంచుటచే వానిప్రకృతియం దీర్ష్య వర్ధిల్లి గాఢాంధకారలేశభ్రమల నావిర్భవింపఁ జేయుచున్నది.

మానవుఁడా! లోకు లేమి మాట్లాడినను దానిని చెడుగాఁ దలంపకుము. ప్రతిభావమందుఁ జెడునే చూచుచు వ్యర్థముగా నీమది కేల వ్యథను గలిగించెదవు? నీవు శీఘ్రము గర్వాహంకారములఁ బహిష్కరించి వేయుము. పరుల హృదయముల కెట్టి కష్టము నొదవింపఁ జేయకుము. పరుల దుష్టులుగ భావింపకుము. ఎల్లర క్షమింపుచు వారియెడ దయార్ద్రహృదయుఁడ వయి వర్తింపు చుండుము.

గర్వాహంకారముల సంపూర్ణముగా విసర్జించుట మిక్కిలి కష్టసాధ్యమగు పని. కాని యిది సకల లోకాదర్శప్రాయమగు శుభకార్యము. ప్రతివిషయమును జెడుగాఁ దలపోయకుండు పద్ధతిని గ్రమ క్రమముగా నభ్యసించుట వలనను, స్వకీయ భావములను, గార్యములను నెమ్మదిగా గ్రహించి స్వచ్ఛములుగఁ జేసికొనుటవలనను గర్వాహంకారవిసర్జనకార్యము సులభసాధ్య మగుచున్నది. గర్వాహంకారములు క్షీణించు కొలఁదియు సహనశీలతయు, శాంతమును గ్రమముగా వృద్ధినందసాగుచున్నవి.

పరుల హృదయముల నొవ్వఁజేయకుండుటయుఁ, బ్రతి సామాన్య విషయమును జెడుగాఁ దలంపకుండుటయుఁ బరస్పర బాంధవ్యమును గలిగియున్నవి. ఒకమనుష్యుఁడు మఱొకమనుష్యుఁ డొనరించు కార్యములఁ జెడుగాఁ దలంపకున్నచో వాఁడవశ్యము ద్వితీయునిపై దయఁగలిగి వర్తించు ననుట స్పష్టము. ఇట్టి మనుష్యుఁడు వచించు విషయమును, ననుష్ఠించు కార్యమును బరులహృదయములం దెట్టి సంక్షోభ విషాదములఁ గలిగింపక దయను, బ్రేమను గలిగింపుచుండఁ గలవు. పరులు తనకయి కావించునట్టి యేకార్యమును గాంచియు నతఁడు భయపడ నొల్లఁడు; కారణమేమన నొరుల కెట్టిదుఃఖమును గలిగించియుండని వ్యక్తి పరులు తన కెట్టిదుఃఖమును గలిగింపఁజాల రని విశ్వసింపుచుండును. క్షాంతిశూన్యుఁడగునట్టియు, సత్యాసత్యవిచారణలేనట్టియు, సమస్తవిధములగు నుపాలంభనములమీఁదను, దూషణములమీఁదను, దోషారోపణముల మీఁదను బగఁ దీర్చుకొనఁగోరునట్టి వ్యక్తి పరుల శాంతి సౌఖ్యమును గూర్చి విచారింపనివాఁడయి, అనుదినము తనశత్రుసంఖ్యను వృద్ధిఁ గావించుకొనుచుండును. వానికి సదా పరులు తన కేమికీడు గావింతురో యనుభయ ముండుచుండును. అతఁడు తాను పరుల కొనరించియుండిన కీడునకుగాను బ్రత్యపకార మవశ్యమెప్పుడో హఠాత్తుగా లభింపఁగల దను భయముచే సదా వ్యాకులచిత్తుఁడయి బాధపడుచుండఁ గలఁడు.

"ద్వేషము ద్వేషముచే నుపశమింపదు,
ప్రేమచే ద్వేష మంతరించును."

మనోజ్ఞమగు నీయుత్తమ నీతివాక్యమును రాజకుమారుఁడగు దీర్ఘాయువుయొక్క కథ సమర్థింపుచున్నయది:—"కాశీనగరముయొక్క శక్తిసంపన్నుఁడును, ప్రతాపవంతుఁడును నగు బ్రహ్మదత్త భూపాలుఁడు, కోశలదేశాధిపతియగు దీర్ఘితి ధరణీధవునిపై దండెత్తి, అతని సామ్రాజ్యమును గబళింప యత్నించెను. దీర్ఘితియొక్క రాజ్య మంతవిశాలమయినది కాదు. అట్లగుటచేనతఁడు బ్రహ్మదత్తు నెదుర్కొని పోరు సలుపుట యసంభవమని భావించెను. ఈరీతి భావించియతఁడు తనరాజ్యమును శత్రుహస్తగత మొనరించి ప్రాణభీతిచేఁ బలాయన మొనరించెను. కొంతకాలముదనుక నతఁడు వేషాంతరస్వీకారముచే వాడవాడలఁ దిరుగుచుఁ దుదకుఁ బత్నీసమేతముగ నొకశిల్పకుని కుటీరమునందు నివాస మేర్పఱచుకొనియెను. ఇచ్చోటనతని కొక కుమారరత్నము కలుగ వానికి దీర్ఘాయు వని నామకరణముసేయఁబడెను.

అల బ్రహ్మదత్తభూపాలుఁడు "నేను దీర్ఘితియొక్క రాజ్యము నాక్రమించుకొనియుండుటచే నతఁడు తరుణము లభిం

చినపుడు నన్ను మోసగించి నాప్రాణము లపహరించుటయం దా శ్చర్యమేమియు లేదు, గావున వానిని వధించుట శ్రేయస్క ర" మని భావించి దీర్ఘైతి నన్వేషింపఁదొడంగెను.

చాలకాలము గతించెను. దీర్ఘైతి తనతనూభవుండగు దీర్ఘాయువుచే విద్యాభ్యాసనమొనరింప నతఁడు స్వల్పకాలము నందే పండితుఁడును, చతురుఁడును, బుద్ధిమంతుఁడును గాఁ గలిగెను.

దురదృష్టవశమున బ్రహదత్తుఁడు దీర్ఘైతియొక్క నివాస స్థానమును దెలిసికొనఁగలిగెను. ఇది యెఱింగి దీర్ఘైతి తనమూల మున దారాపుత్రు లన్యాయముగ వధింపఁబడఁగల రని గుర్తె ఱింగి వారి నొకరహస్యస్థానమునకుఁ బంపివైచెను. కాని దీర్ఘైతి భార్యాసమేతముగ బ్రహ్మదత్తునకుఁ జిక్కి వానిచే సంహ రింపఁబడెను.

శత్రువును స్త్రీసమేతముగ వధించినను వానిపుత్రుఁడు శేషించియుండుటచే నతఁ డెపుడో తా నసావధానముఁగ నున్న పుడు పైఁబడిచంపునను భయముచే నిత్యము తల్లడిల్లు చుండెను.

దీర్ఘాయువు తన జననీజనకులు క్రూరముగా సంహ రింపఁబడి రను సమాచారము నాలకించినంతనే తన నామధేయ

మును, వేషమును మార్చుకొని బ్రహ్మదత్తుని యశ్వశాల
యందు సేవకోద్యోగమును బరిగ్రహించెను. స్వల్పకాలము
నందే దీర్ఘాయువు తన సద్వ్యవహారమునను, సంస్తవపాత్ర
మగు యోగ్యతవలనను సకలజనప్రేమకుఁ బాత్రుఁ
డయినంతనే కర్ణాకర్ణిగ నతని సద్గుణప్రశంస బ్రహ్మదత్త
భూపాలుని శ్రోత్రపుటములఁ బడెను. భూపాలుఁడు దీర్ఘాయువును
సాదరముగఁ దనసన్నిధికి రావించి, బహురీతుల సత్కరించి
నాటినుండి వానిని తనయొద్దనే యుండ నియమించెను. దీర్ఘా
యువు నవీనపదవిని సంపాదించి స్వామిని భక్తిశ్రద్ధాను
రాగములచే సేవించి, అతని సంపూర్ణానుగ్రహమునకుఁ
బాత్రుఁడయ్యెను.

భూపాలుఁ డొకదినమున విశ్వాసపాత్రుఁడగు దీర్ఘా
యువుతోఁగూడి రథారూఢుఁడయి మృగయావినోదమునక
యి బయల్వెడలెను. ధరణీపతి సైనికనికాయముతోఁ గూడ
నరణ్యమునఁ బ్రవేశించి కొంత దవ్వరిగి, సైనికుల నట నిలిచి
యుండ నాజ్ఞాపించి ప్రియమిత్రునితో నరణ్యమునఁ బ్రవేశిం
చెను. మధ్యందిన మార్తాండుని తీక్ష్ణప్రకోపమునను, రథప్ర
యాణాయాసమునను బ్రహ్మదత్తుఁడు పరిక్లాంతుఁడయి దీర్ఘా
యువుయొక్క తొడలోఁ దనశిరము నుంచి గాఢనిద్రాపర
వశుఁడయ్యెను.

రాజు గాఢసుషుప్తియందుండ దీర్ఘాయు వీరీతి విచారిం పమొదలిడెను:—"ఈనృపాలుఁ డన్యాయముగా నాసర్వనాశన మొనరించియున్నాఁడు. ఇతఁడు రాజ్యతృష్ణాబద్ధుఁడయి పూజ్యులగు నాజననీజనకుల సింహాసనచ్యుతులఁ గావించుటయేకాక, కౄరుఁడయి యక్రమముగ వారిప్రాణముల సంహరించెను. మాతాపితలప్రాణహంతకుఁడగు మహాద్రోహి యిపుడు నాకు వశుఁడయియున్నాఁడు. ఇతనిని వధించి మాతాపితృఋణవిముక్తుఁడ నగుటయే పుత్త్రుఁడనగు నా ధర్మము." అని భావించి దీర్ఘాయువు యొఱనుండి కరాళకరవాలమును వెలికిఁదీసి ఝళిపించెను. కాని తత్క్షణమే హితబుద్ధియయి తన బాల్యకాలమందు పితృదేవుఁడు బోధించియుండిన "అపకారికి నుపకారము నెపమెన్నక సేయువాఁడె నేర్పరి" యను నీతివాక్యము స్మృతిపథమునఁ దోఁచినంతనే చంద్రహాసము నొఱయందుంచివైచెను. వెంటనే వానిరోష మంతరించెను.

తుదకు రాజు నిద్రనుండి త్రుళ్లిపడుచు మేల్కాంచెను. దీర్ఘాయువు—"తమ రేల భీతచిత్తులయి యున్నట్లున్నా" రని ప్రశ్నింప, భూపాలుఁడు—"నేను సదా సుఖనిద్ర ననుభవింపలేకున్నాఁడను. స్వప్నములు నిరంతరము నన్ను బాధించుచుండును. నాశత్రువుయొక్క పుత్త్రుఁడగు దీర్ఘాయువు నావక్షస్స్థలమును ఖడ్గముతోఁ జీల్చుచున్నట్లు కలలను గనుచుందును. ఇపు

డుసయిత మట్టి భయంకరదృశ్యమే స్వప్నమందుఁ బొడసూప భయకంపితుఁడనయి తుళ్ళిపడి లేచితిని.” అని యుత్తర మొసంగెను.

బ్రహ్మదత్తుని కంపితభాషణము నాలించి, రాజకుమారుఁడు తనఖడ్గము నొరనుండి తీసి, భూపాలు నుద్దేశించి “రాజా! నీ ప్రబలశత్రువగు దీర్ఘాయువు నేనే. తమ రిపుడు నాస్వాధీనమందున్నారు. తమపైఁ బగఁదీర్చుకొను తరుణ మాసన్నమయినది.” అని గంభీరముగ గర్జించెను.

బ్రహ్మదత్తుఁడంత మోకరిల్లి దీర్ఘాయువుయొక్క చరణరాజీవముల నాశ్రయించి దీనకంఠస్వరమునఁ బ్రాణదానము నర్థింపసాగెను. దీర్ఘాయు వంత నీరీతి నుత్తర మొసంగెను:—“రాజా! తమరు నాకుఁ బ్రాణభిక్ష నొసంగుఁడు. చిరకాలమునుండి నన్ను వధింపఁ జూచుచున్నారు. నేఁడు నేను మీకుఁ జిక్కి యున్నాఁడను. కావున నాకుఁ బ్రాణదాన మొసంగఁ గృతాంజలినయి వేడుచున్నాను.”

బ్రహ్మదత్తుఁడును, దీర్ఘాయువును బరస్పరము ప్రాణదాన మొనరించుకొనిరి. ప్రేమచేఁ బులకాంకితశరీరులయి, గాఢాలింగన మొనరించుకొని యొండొరుల మొకరి కొకరు హానిఁ గావించు కొనమని రుద్ధకంఠములతో శపథ మొనరించుకొనిరి. దీర్ఘాయువుయొక్క క్షమాశక్తిని, యోగ్యతను, బరో

పకారబుద్ధిని గాంచి బ్రహ్మదత్తుఁడు విస్మయానందపరవశుఁ డయి తన ప్రియపుత్రిక నతనికిఁ బరిణయము గావించి, యతని పిత్రార్జితమగు రాజ్యము నతనిస్వాధీన మొనరించెను.

ఈ నీతికథచేఁ బాఠకలోకమునకు ద్వేష మద్వేషముచే ననఁగా శాంతిచేఁ బరాభూత మగు నని స్పష్టపడుచున్నది. ప్రత్యపకారము కంటె క్షమయే యత్యధిక సుందరమును, మధురమును, మహత్తరమును నయియున్నది. త్యాగముచేఁ బ్రేమ ప్రాదుర్భవించుచున్నది. త్యాగము నభ్యసించు మనుష్యుఁ డహంకారమునుండియు, మిథ్యాభిమానమునుండియు, ద్వేషమునుండియు, ప్రత్యపకారమునుండియు దూరముగా నుండు నట్టియు — నిత్యసత్యములగు శుభవాంఛలతోడను, బ్రహ్మానందశాంతులతోడను వెలయుచుండు నట్టియుఁ బవిత్ర మగు స్థానమును జేరఁగలుగుచున్నాఁడు. ఈప్రశాంతమును, మానయుతమును నగు నానందమందు క్షమకూడ నుఁడనేరదు, మానవున కద్దాని యవసరమే యుండఁబోదు. కారణమేమన నీయానందమయస్థితికి బ్రాపించు మనుష్యుఁడు, పరుల దోషాపరాధములచే దుష్టుఁడు కానొల్లఁడు. మీఁదు మిక్కిలి వారి యజ్ఞానమును, భ్రమను, గ్రహించి వారిపై దయారసమును వర్షింపఁ జేయుచుండఁ గలఁడు. మానవుని స్వభావమందు దుష్టుఁ దగులుటయొక్కయుఁ, బ్రత్యపకారమున

ఱించుట యొక్కయుఁ, గుత్సితవాసన నిండి యున్నంతవఱకే క్షమ యపేక్షింపఁబడుచున్నది. సకలజీవులపై నిష్కల్మషమగు సమానప్రేమభావమును గలిగియుండుటయే యాదర్శ నియమము; ఆదర్శజీవితము; ఆదర్శస్వర్గము. స్వర్గీయప్రేమ యొక్క నిర్దోషమగు మందిరములోనికిఁ బ్రవేశింప నేర్పడి యున్న ముఖ్యద్వారములలో సహన మొకటి. చదువరీ! జీవిత తారకమంత్రమగు నీసహనమును బడసి, తన్మూలమున నాత్మ విజేతవయి బ్రహ్మానంద పదవినందుము!

---

## అష్టమ ప్రకరణము.

---

# దోషములఁ జూడకుండుట.

మానవుఁ డనేకవిధముగ క్షాంతిపాఠాభ్యాసమున విజయమును బడయు, వాని మస్తిష్కమునందు వాస్తవికమగు యుక్తాయుక్తవివేకము కలుగ నతఁ డెట్లు హృదయమందు భావములు, ఉద్దేశ్యములు జన్మింపుచున్నదియు, నేరీతి నవి వృద్ధినంది కార్యరూపమునఁ బరిణమింపుచున్నదియు, స్పష్టముగా గ్రహింపనేర్చుచున్నాఁడు. ఇట్లగుటవలననే మానవుని మస్తిష్కమునం దనేకవిధమగు నవీనవికాసము కలిగి జీవితము నత్యంత శ్రేష్ఠముగను, సమున్నతముగను, పవిత్రముగను జేసి వేయుచున్నది. ఇట్టి యుత్తమస్థితిఁ బ్రాపించి మనుష్యుఁడు తా నన్యుల వచనములను, కార్యములను విని, క్రోధమును జెందక, పరులమాటలఁ జెడుగాఁ దలంపక యెల్లరఁ బ్రేమింపుచుండఁగలఁడు. ఇపు అతఁడు గతసమయమందువలె నజ్ఞానముచేఁ గుపితుఁడు కాజాలఁడు. అతనిమానసమందు నిరంతర మిట్టిభావపరంపర లుదయింపు చుండును:—చీటికి మాటికిఁ

బగఁదీర్చుకొనుటేల? తిరిగి క్షమించుటేల? పరులపైఁ గ్రోధము వహించి, తిరిగి దానికయి పశ్చాత్తాపమును జెంది, క్షమాభిక్షకయి ప్రార్థించు టెందులకు? క్రోధమును, జెడుగాఁ దలంచుటను విసర్జించుటయే క్షమ యనఁబడుచున్నది. క్రోధరోషములనివార్యములును, సత్పదార్థములును నగుచో వానికయి పశ్చాత్తాపపడుచు క్షమార్పణములఁ గోరు టెందులకు సంభవించును? కటుభావముల దూరమొనరించుటయు, క్షమించుటయు సుందరముగను, మృదుమధురముగను, ప్రశాంతముగను నున్నట్లు కాననగుచో బొత్తిగా మఱచియుఁ గ్రోధింపకుంకుట, పరులతప్పుల నెన్నకుండుట, దేనిని జెడుగా భావింపకుండుట మొదలగునవి మఱెంత సుందరములును, ప్రియములును, మృదుమధురములును నయి యుండఁగలవు. క్రోధమును, రోషమును లేశమాత్రమయిన మానవ హృదయమందు లేకుండినచో సహనముయొక్క యవసరమే తటస్థింపనేరదు. ఒరుల వచనములను, గార్యములను జెడుఁగా దలంచు దుష్టస్వభావము నాయందున్నపుడే నేను శాంతియొక్కపారము నభ్యసింప బాధ్యుఁడ నగుదును; కాని క్రోధమును, రోషమును, బరదోషగణనమును నాస్వభావమందే లేనప్పుడు నేను శాంతిని సంపాదింపవలసిన పని యేముండును? నాకెవఁడేని యుపకార మొనరించినచో నేను వానికి బ్రత్యుపకార మొనరింప దూషణమున కుపక్రమింతునేని యది నాయుపరా

ధము కాకుందునా? అపరాధముచే నపరాధము చక్కఁబడునా? ఒకనిదోషముచే మఱొకనిదోషము దూరమొనరింపఁబడఁగలదా? ఒకఁడు భయంకరమగు నపరాధముఁ గావించి యపకారము నా కొనరించియున్నాఁడో లేక తనకే కావించుకొనియున్నాఁడో విచారింపవలసియున్నది. నాదోషము నాకు గీడునాపాదించునో లేక పరులదోషమే నాకు హానిని గలిగించునో దీర్ఘముగా విచారింపవలసియున్నది. అయ్యో! నేను మూఢుఁడనయి యెప్పుడెప్పుడు క్రోధమును వహింపుచుందు నందులకు? నను దోషములఁ జూచు టేమిభావ్యము? ప్రత్యపకారమున కెందులకుఁ గడంగవలయును? కటుభావచింతనము తగునా? నే నీ నీచకర్మలనెల్ల నాచరింపుచున్నచో దానికి ముఖ్యకారణములు నాయందు నెలకొనియున్న స్వార్థాహంకారములే. నాయంధప్రాయ మగు పశుత్వము మేల్కాంచి నాసత్స్వభావము నణచివేయుచున్నది. నే నంత దుష్టుఁడనయి ప్రత్యపకార మొనరింపఁ గటిబద్ధుఁడ నగుచున్నాఁడను. అహంకారముచేతను, నపవిత్రమును, హీనమును నగు క్రోధమువలనను బరులవాక్యములును, గార్యములును నాహృదయసంక్షోభకరములయి నన్ను భ్రష్టుని గావింపుచున్నవి. నే నన్యు లొనరించునట్టి యపరాధములకయి వారిని దండింప నన్నర్హుఁడను గాక నిజదోషములనే దూరమొనరించుకొన యత్నించినచో ధన్యుఁడనే యగుదును. పరులదోషముల నెన్ని వారికి

బ్రిత్యపకార మొనరింప నెంచుటకంటె నేను భయంకరమగు నహంకారమును, నాత్మశ్లాఘమును, గ్రోధమును విసర్జించి వేయుదునేని మహత్తరమగు శ్రేయస్సు కలుగఁగలదు, అపుడు నా కెట్టిక్లేశములు సంభవింప నేరవు.

ఈచందమున మనుష్యుఁడు నిరంతరము తనయంతఃకరణమును బ్రశ్నించుకొనుచుఁ దనకుఁదానే యుచితసమాధానము నొసంగుకొనుచుండినచో వానిభావములు పావనములును, కోమలములును, జారిత్రము క్రోధశూన్యమును గాఁగలదు. అపుడవాని యుద్వేగము క్షీణింపఁ గ్రోధరోషముల యుత్పత్తికి హేతుభూతము లయిన యజ్ఞానాంధకారము లొక్కపెట్టున మాయమయిపోఁగలవు. అంతమునకు మనుష్యుఁ డాయానంద స్థితికిఁ బ్రాపింపఁగలుగుచున్నాఁడు. పరులదోషములపేక్షింపక, సకల మానవకలావణ్యము నపేక్షింపుచు నెల్లరియెడఁ బ్రేమ భావమును, శాంతమును వహింపుచు వర్తించుటచే మానవునకు బ్రహ్మానందము లభింపఁగలదు. ఇంతమాత్రమున మానవుఁ డజ్ఞానమును, మౌర్ఖ్యమును, జూచుట యే విసర్జించివేయుచున్నాఁడనియు, గష్టములను, దుఃఖములను, భయములను గాంచుటయే లేదనియు, నుచితానుచితకర్మలయందును, శౌచాశౌచములందును గల భేదము నె విలోకించుటకును, గ్రహించుటకును నసమర్థుఁడయి యున్నాఁడనియు భావింప వలనుప

డను. వాఁడు క్రోధమును, బక్షపాతమును, బరదోషకీర్తనమును విసర్జించివేయుటచే జ్ఞానముయొక్క సంపూర్ణ స్వచ్ఛప్రకాశమూలమున పైనివివరించియున్న వివిధవిషయములయొక్క వాస్తవికస్థితిని గ్రహింపుచున్నాఁడు. అప్పు డంతె వానికి తనకు హానికరమయినట్టియుఁ, దనచే నిరోధింపఁబడఁదగినట్టియు, శీఘ్రమే నష్టమొనరింపఁబడఁదగినట్టియు దుష్టశక్తిపరులయందు లేనట్లు గోచరింప నారంభింపుచున్నది కీడును: దన హృదయమునుండి బహిర్గత మొనరించివైచుటచే మానవుఁ డద్దాని భయంకరతత్త్వమును గ్రహించి తనజీవితము ద్వేషభయరోషముల నివాసమునకు యోగ్యమయినది కాదనియు, జిజ్ఞాస, అనుకంప, ప్రేమ మొదలగు సద్గుణముల నివాసమున కర్హమయినదనియు స్పష్టముగా గ్రహింప నేర్పుచున్నాఁడు.

మహాకవియగు షేక్స్పియరు "అజ్ఞానముకంటెఁ బ్రగాఢమగు భయంకరాంధకారము లేదు." అని తన యొక నాటకమున వ్రాసియున్నాఁడు. నేఁడు లోకమునఁ గానవగుచున్న కీడంతయు మానసముయొక్క గంభీరమగు నజ్ఞానతిమిరసంభూతమయినదియే. అంధకారమునుండి ప్రకాశములోనికి రాఁగోరు వ్యక్తి తనస్వాంతమునుండి సకలపాపముల నిర్మూలించివేయుటావశ్యకము. మేలుకలుగకుండుటకే కీడని పేరు. ప్రకా

శము కలుగకుండుటకే యంధకార మని నామధేయము. ఇది యేచందమునఁ గ్రోధరోషము లుత్పత్తికాకుండుస్థితినే కోవిదులు జ్ఞాన మనుచున్నారు. జ్ఞానసంపన్నుఁడగు పురుషోత్తముఁడు పరిశాంతమగు ననురోధముచే మనుష్యులకుఁ బ్రకాశ మెట్లున్నదియు బోధించు టుచిత మని భావింపుచున్నను, పాపరూపమువలనఁ బ్రకటితమగుచున్నవారి యాధ్యాత్మికాంధకారమును నిందింపనొల్లఁడు.

చెడుగు రెండువిధములు. యుక్తాయుక్తవిచక్షణాలేక భావింపఁబడున దొక కీడు ఇయ్యది యజ్ఞానముచే సంభవింపుచున్నది. కర్తచేఁ గీడనియు, నాచరింపఁ బడరానిదనియు గ్రహింపఁబడియు ననుష్ఠింపఁబడు నశుభకార్యమే రెండవవిధమగుచెడ్డ. చెడ్డ, గుర్తించిచేయఁబడినను, గుర్తింపక యాచరింపఁబడినను నది యజ్ఞానమునుండియే కలుగుచున్న దని మనము గ్రహింపవలయును. అశుభకార్యము నాచరించువాఁడు దానిని గ్రహించి చేసియున్నను, గ్రహింపక చేసియున్నను వాఁ డద్దాని వాస్తవికమగు నునికిని, మర్మములను గ్రహింపఁజాలఁడు. అతఁ డాకీడు నాచరించుటచే భవిష్యత్కాలమునం దెట్టి దుష్పరిణామములు కలిగి యవశ్యభోక్తవ్యములయి తనజీవితమును దుఃఖవారిధిని ముంచివేయఁగలవో గుర్తింపనేరఁడు. వాఁ డీ రహస్యమును గ్రహించియే

యున్నచోఁ బ్రమాదవశంబునఁ గీ డొనరింప సాహసింపనేరఁడు. పలుమాటలేల ? మానవుఁ డొనరించు సమస్తదోషముల కజ్ఞానమే ముఖ్యకారణము.

మానవుఁ డీ విషయమును గూర్చి యనుభవమును సంపాదింపుచుండియు నిట్టి కార్యముల నేలఁ గావింపు చుండు నను ప్రశ్న కలుగవచ్చును. మనుష్యుఁ డిట్టి పనుల నాచరించుట దోష మని గ్రహించినచో వానియం దజ్ఞానము కల దని భావించు టెట్లు?

మానవుఁడు దోషములను గ్రహింపుచుండియుఁ గీడొనరింపుచుండుటచే వానియందు సంపూర్ణమగు జ్ఞానము లేదనియు, వాఁడు దోషముల భయంకర తత్త్వమును సాకల్యముగఁ బరిశోధించి యుండలేదనియు గ్రహింపవలసి వచ్చుచున్నది. వాఁడు పరులప్రబోధముల నాలించుటవలనను, నాత్మీయు లోనంగు హెచ్చరికల మూలమునను, నిజాంతఃకరణ తాడనమునను గామక్రోధములవంటి దుష్కర్మ లనాచరణీయములని గ్రహింపుచు, నుడువుచు నుండునే కాని తత్కాలమందుఁ దా నే మొనరింపుచున్నదియు స్పష్టముగా నవలోకింపనేరఁడు. వాఁడు నిషిద్ధమగు కార్యము నాచరించుటచేఁ దాత్కాలిక మగు నాహ్లాదము లభించు ననియెడి వ్యామోహముచే నంతఃకరణప్రబోధమును దృణీకరించి యనుచిత

కార్యాచరణమున కుపక్రమించుచున్నాఁడు. వాఁడు తాను బడయునట్టి యాహ్లాద ముత్తమంబనియు, భోగ్యమనియు భావించుచున్నాఁడు. కష్టములేనిదే సౌఖ్యము దుర్లభమనియుఁ, దా ననుభవించునట్టి యాహ్లాదము కష్టమునుండి భిన్నమగు పదార్థము కాదనియు నతఁడు గ్రహింపఁజాల కున్నాఁడు. వాని యాచరణమునందే మానవకార్య నిర్వహణమున కాధార భూతమగు నియమమున కతఁ డనభిజ్ఞుఁ డని మనకు స్పష్టపడుచున్నది. వాఁడు తా ననుభవించు దుఃఖమంతయుఁ, దా నాచరించియుండిన దుష్కర్మలయొక్క ఫలితమే యని గ్రహింప నేరఁడు. అతఁడు తా ననుభవించుచున్న దుఃఖమంతయుఁ బరుల ద్రోహముచేఁ గలిగినదనియు, సుఖదుఃఖములు రెండును భగవద్విరచితములనియుఁ గావున వాని నన్వేషించుటయు, గ్రహింప నుంకించుటయు నిష్ప్రయోజన మని విశ్వసించుచుండును. అతఁడు తనకు సౌఖ్యము నొసంగఁగల వని విశ్వసించు కార్యములనే యాచరించుచు నిరంతరము సౌఖ్యము నన్వేషింపుచుండును. కాని వాఁడు తన కార్యములచేఁ దా నెట్టి దుష్ఫలితముల ననుభవింప బాధ్యుఁడు గావలసి వచ్చునో గుర్తింపఁజాలకుండును.

ఒకతూరి దుర్వ్యసనగ్రస్తుఁ డగు మనుష్యుఁ డొకఁడు నాతో నీ విధమున నుడివెను:—"నే నీవ్యసనముచే నెట్టి బాధ

మును గలుగ నేరదనియు, మీఁదుమిక్కిలి భయంకరమగు హానియే వాటిల్లుననియు బాగుగా నెఱుంగుదును." నే నంత వాని నీరీతి నడిగితిని:—"మహాశయా! తమరు నిత్య మాచరింపుచున్న దుర్వ్యసనమును హానికరమనియు, నిష్ప్రయోజనమనియు స్పష్టముగా గుర్తింపుచు నేల గావింపుచున్నారు?" దీనిమీఁద నతఁ డిట్లుత్తర మొసంగెను—"ఈవ్యసనముచే నాకు రుచికరమగు నానందము లభింపుచున్నది. కావున నే దీనిని విడువఁజాల కున్నాఁడను." ఆమనుష్యుఁడు తనస్వభావము దూషితమయి పోయిన దని వాస్తవముగా నెఱుంగఁజాలఁ డనియే నుడువ వచ్చును. అతఁడు పరులచేఁ దనస్వభావము చెడ్డ దని వినియుండెనే కాని తనప్రకృతి కళంకితమయి పోవుచున్న దని స్వప్నమందయిన స్వయముగా నూహించి యుండలేదు. కాని వాస్తవమందు వాఁ డావ్యసనమును మంచిదానిగను, దనసౌఖ్యానందముల వర్ధిల్లఁ జేయుదానిగను విశ్వసించుటవలననే దానిని విసర్జింపఁ జాలకుండెను. మనుష్యుఁడు స్వానుభవముచే నొక కార్యమును దుష్టమనియుఁ, దదాచరణముచేఁ దన దేహమునకును, మానసమునకును నష్టము గలుగఁగల దనియు, నాకార్యమునందుఁ గల దోషములచే భయంకరములగు విపత్పరంపర లుదయింపఁగల వనియు గ్రహించినచోఁ దత్క్షణమే వాఁ డద్దానిని విసర్జించుటయే కాక పూర్వమువలె దానిని సౌఖ్యానందవర్ధకమగు వస్తువుగ భావింపక భయం

కర దుఃఖోత్పాదక మగు రాక్షసపదార్థముగఁ జూచుచుండఁ గలఁడు. భుజంగముయొక్క శిరోభాగమున ధగద్ధగాయమానముగ వెలుంగుచున్న బహుమూల్యవంత మగు మణి యున్నను మానవుఁ డాసర్పమును గాఢాలింగన మొనరించుకొనఁజాలఁడు. సర్పము బాహ్యమునకు మణిచే విభూషితమయి యున్నను ప్రాణహానికరమగు హాలాహలముచే నది నిండి యున్న దని స్పష్టముగా గ్రహించు మనుష్యుఁ డద్దాని పొంతకరుగ నొల్లఁడు. ఇదియేచందమున మానవుఁడు తా నాచరించు దుష్కార్యములకయి భవిష్యత్కాలమందుఁ దాను నిశ్చయముగా భయంకరములగు దుఃఖముల ననుభవింపవలసి యుండు నని గ్రహించినచో నంతకుఁ బూర్వమునుండియుఁ దనమానసముచే నభిలషింపఁబడుచు వచ్చియున్న తాత్కాలిక సౌందర్యమును, సౌఖ్యానందములను మట్టిపెల్లలకంటె హీనములుగఁ జూచి, విసర్జించివేయఁ గలఁడు. దుష్కర్మల యొక్క రహస్యము వెల్లడియయినంతనే మానవుఁడు వానిని స్పష్టముగా వీక్షింపఁ గలుగుచున్నాఁడు.

నాకుఁ బరిచితుఁడగు యువకుఁ డొకఁ డుండెను. అతఁ డొక ధర్మోపదేశకుఁడు. ధర్మోపదేశముతోఁ బాటు వాణిజ్యమునుగూడ జీవిత వ్యవసాయముగఁ బరిగ్రహించి యుండెను. అతఁ డొకతూరి వ్యాపార వ్యవసాయముల బాగు

గా నిర్వహించుటయందుఁ గల్లలాడుట, మోసముచేయుట చాలయావశ్యకము లగుచుండు ననియు, నీ రెండు ఉపాయముల నవలంబింపనిచో నిస్సందేహముగ వ్యాపారి నష్టపడఁ గలఁ డనియు వచించెను. అతఁడే తిరిగి నాతో నబద్ధమాడుట దోష మని గ్రహించియుండియు వ్యాపారసౌకర్యమునకయి బొందుచుండు ననియు నుడివెను. నే నతనిమాటల నాలించి-"సోదరా! నీ వెపుడయిన వ్యాపారాభివృద్ధికి శ్రేష్ఠమార్గములయిన సత్యమును, ధర్మమును నాశ్రయించి యుంటివా" యని ప్రశ్నించితిని. అతఁ డంత—"వాణిజ్యాభివృద్ధికి ధర్మమునకంటె నుత్తమంబగు సాధనము లే దని యెఱుంగుదును, గాని నే నింత వఱకద్దాని నాశ్రయించి యుండ లేదు." అని యుత్తర మొసంగెను. చదువరీ! ఈ నవయువకుఁడు తనదోషము సంస్కరించుకొనలేనట్టి దుస్థితియం దుండుటకుఁ గారణమెద్దియో గ్రహించితివా? ఈనవయువకుఁడు సత్యవిరుద్ధముగ వర్తించుట మానవధర్మము కాదని గ్రహించియుండెనా? లేదు, కేవల మితఁడు జనసామాన్యముఖంబున సామాన్యవిధమున నసత్యమాడుట దోష మని మాత్రమే వినియుండెను. వాస్తవముగా నితఁడు స్వానుభవముచే సత్యాసత్యముల ప్రయోజనాప్రయోజనముల గుర్తించియుండ లేదు. ఏనికిఁ గల్లలాడరా దను శిక్ష లభించియుండెను ఇతని యంతఃకరణమునయిత మసత్యభాషణము దోష మని స్వయము

నొసంగుచుండెను, కాని యీని కసత్యభాషణముచే విశేషమగు లాభమును, నభివృద్ధియు, సౌఖ్యమును గలుగు నను ప్రబల విశ్వాస ముండెను. ఇతఁడు సత్యభాషణముచే నష్టమును, దారిద్ర్యమును, దుఃఖమును గలుగు నని భయపడుచుండెను. ఇతని యీపద్ధతుల నవలోకించుటచే నితఁడు కల్లలాడుటనే యుక్త ధర్మముగను, సత్యభాషణమునే యనుచితమగు నధర్మముగను భావించియుండినట్లు స్పష్టపడుచున్నది. ఇతనికిఁ గల్లలాడుటయొక్క వాస్తవికమగు రహస్యమును గ్రహించు శక్తి లేకుండెను ఇందువలననే యితనివర్తనమునకును, ప్రయోజనమునకును, ప్రభావమునకును, నానందమునకును, ప్రతిష్ఠకును, వ్యవహారిక లాభమునకును మిక్కిలి నష్టము కలుగుట సంభవించెను. ఇట్టి మనుష్యుఁడు పరసౌఖ్యమునుగూర్చి ధ్యానమును గలిగియుండియు వ్యాపారమందు బొంకకుండుటచే నార్థికనష్టము గలుగఁగల దను భయముచే లభించునట్టి యసౌఖ్యము ననుభవించి తన్మూలమున సత్యాసత్య భాషణముయొక్క వాస్తవిక జ్ఞానమును బడయుచున్నాఁడు. వాస్తవికమగు జ్ఞానము కలిగినంతనే మనుష్యుఁడు తా నింతకాలము పర్యంతము కల్లలాడి సంపాదించినది సౌఖ్యము కాదనియు, నదియే భయంకరమగు దుఃఖమనియు, బరుల మోసగించుటచే నాత్మవంచకత్వము సయితము వాటిల్లుచున్న దనియుఁ, దా నింతవఱకుఁ బ్రగాఢభ్రమయొక్క ఘోరాంధకారమున

మునిఁగియుంటి ననియు గ్రహించి విచారించి సకల వ్యవసాయ
ములందు, సత్యభాషణమునే విజయప్రాప్తికి ముఖ్యసాధన
ముగ నవలంబించిఁ తన్మూలమున వాస్తవికానందము ననుభ
వింప సమర్థుఁ డగు చున్నాఁడు. పై నుదహరింపఁ బడిన
రెండు ఉదాహరణములు నుసత్యము నన్వేషింపుచు,
సందేహముల యొక్కయు, భ్రమల యొక్కయు వలలోఁ
జిక్కియున్న మనుష్యులకు సమస్త పాపములును, దుష్క
ర్మలును గాఢాజ్ఞానజన్యము లని స్పష్ట మొనరించును. ఈ
యుదాహరణములచే మనుష్యుఁడు, పాపాత్ములయెడ
ద్వేషమును వహింపరా దనియు, నిర్మలమగు ప్రేమనే ప్రకటిం
చుట ధర్మమనియు గ్రహింపవలసి యున్నది. ప్రపంచమందు
దోషులుగ నున్నవారెల్ల రజ్ఞానసంపన్ను లనుట కేమియు సంది
యము లేదు. ఒకవస్తువుయొక్క సంపూర్ణజ్ఞానమును గలిగి
యున్న వ్యక్తి యావస్తువును యథోచితముగ నుపయోగింపఁ
గలఁ డనుట నిర్వివాదాంశము. ఇదియేరీతి మానవుఁడు సం
పూర్ణముగ జ్ఞానసంపన్నుఁడే యగుచోఁ బాపముల నాచరింప
నొల్లఁడు. మానవునిజీవితమందు లోచన గోచరములగు
దోషములకన్నింటికి నజ్ఞానమే ముఖ్యహేతువుగ నున్నది కాన
దోషులెల్లరు క్షమింపఁబడ నర్హులయి యున్నారు. అపరాధు
లను క్షమించి, వారియెడ దయార్ద్రహృదయులయి వర్తించు
టయే బుద్ధిమంతులగువారి పరమధర్మ మయియున్నది. అనే

త్యభావణమున కెట్టి పవిత్రమగు దైవికనిబంధన మేర్పడి యున్నదో, అదియే దూషితప్రకృతి, లోభము, జుగుప్స, ద్రోహము, ద్వేషము, అభిమానము, అహంకారము, ఆత్మశ్లాఘ, స్వార్థము మొదలగు సమస్తపాపములమొదను సార్థకమగుచున్నది. ఈదుర్గుణములన్నియు మానవజీవితమునఁ బ్రవేశించుటకు ముఖ్యకారణము జ్ఞానరాహిత్యమే. జ్ఞానరాహిత్యముచే మానవునిహృదయమందిరమందలి సత్యప్రకాశమంతర్హితమయిపోవ నలుదెసల నాధ్యాత్మికాంధకారము వ్యాప్తమగుచున్నది. మనుష్యుఁడు తనహృదయముయొక్క దూషితపదార్థమునంతయు దూరముగఁ బాఱవైచి, కీడుయొక్క వాస్తవికమగు సంపూర్ణజ్ఞానమును సంపాదించినంతనే జుగుప్స లేనివాఁడయి దుష్కర్మల నాచరించువారియెడ కోమలబుద్ధితో, దయార్ద్రహృదయముతో మెలంగ నారంభించుచున్నాఁడు.

దోషములఁ గాంచుచుండుటచే మనను మఱి యితరములగు దోషములఁ జిక్కువడవలసినవారల మగుచున్నారము. ప్రపంచమందలి ప్రతివ్యక్తికిని స్వాతంత్ర్యము కలదు. మనుష్యుఁడు తన యభిరుచి ననుసరించి కార్యము నాచరింప నధికారమును గలిగియున్నాఁడు. పరులయందు దోషముల నెన్నుచుండుటతోఁబాటు పరులకార్యములును, భావములును

ద న్ననుసరించియుండవలయు నని కోరుకొనుచుండును. మనుష్యుఁడు కేవలము తా నాచరించునట్టియు, విచారించునట్టియుఁ గార్యములనే సర్వోత్తమములుగ విశ్వసింపుచుండును. అతఁడు తనవియు లెంతనీచములుగ నున్నను వానిని మంచివానిగనే తలంపుచుఁ బరు లొనరించు కార్యము లెంత ప్రశస్తములయి యున్నను వానిని నిరసింపుచుండును. కావున స్త్రీ పురుష భేదములేక సకలమానవాళి తా మెవరిపైనయిన జుగుప్సను, ద్వేషమును బ్రకటింపకుండ నుండుట శ్రేయస్కరము. అనేకు లాత్మదోషము లెంత భయంకరములయి యున్నను వానిని మిక్కిలిదయతో క్షమించుకొనుచుఁ, బరుల సామాన్యదోషములనయిన గొప్పవానిగ భావించి, ఆదోషము లొనరించిన వారిని సంపూర్ణముగా నిరసింపుచున్నారు. ఈ భ్రాంతియొక్క కారణముననే ప్రపంచముయొక్క వివిధ మతావలంబులమధ్య నిరంతర కలహములు తటస్థింపుచున్నవి. క్రైస్తవు లన్యధర్మావలంబుల మిక్కిలి దుష్టులని భావింపుచుండ, హిందూ మహమ్మదీయులు క్రైస్తవుల భ్రష్టులుగఁ దలపోయుచున్నారు. అతిఛాందసులు సంస్కర్త లన నీచులుగ భావించి వారల నెల్ల విధముల నిరసింపుచున్నారు. వైదికులు నేటిప్రపంచముయొక్క దూషితవిజ్ఞాన సిద్ధాంతముల బొత్తిగా గర్హింపుచున్నారు. వాస్తవమాలోచింప వీరందఱిలో నెవ్వరును దుష్టులును, భ్రష్టులును లేరనియే స్పష్టపడఁగలదు. ప్రతివ్యక్తియు తనవాంఛిత

మార్గము ననుసరింపుచుఁ దన్మార్గమునే నిత్యముగను, సత్యముగను విశ్వసింపుచుండును.

మనము ప్రశాంతహృదయులమయి, విశ్వముయొక్క భిన్నములగు ధర్మముల పరస్పరదూషణముల ధ్యానపూర్వకముగ వీక్షింతుమేని యీకలహముల కన్నింటికి మూలకారణమజ్ఞానమే యని స్పష్టము కాఁగలదు. లోకమందలి విద్వేషములకును, కలహములకును మూలకారణమును గుఱించి ధ్యానములో నాలోచించుటచే మానవహృదయముయొక్క శాంతియు, ననుకంపయు, బుద్ధియు, గాంభీర్యమును దినదినప్రవర్ధమానములు కాఁగలవు.

యథార్థమగు సజ్జనుఁడు సమస్తసందర్భములందు మంచినే వీక్షింపుచుండును గాని కీడు నెంతమాత్రమువలోకింపుచుండఁడు. కారణ మేమన నతఁడు పరుల భావములను, కార్యములను తనబుద్ధి ననుసరించియుండవలయు ననియెడి మూఢవాంఛను త్యజించివైచి మానవుల స్వభావములు భిన్నములుగ నుండుచుండు ననియు, వారి యాధ్యాత్మిక శక్తి వృద్ధినందినకొలఁదియు వారి భావములును, గార్యములును వర్ధిల్లుచుండుననియు గ్రహింపఁగలఁడు. అతఁడీర్ష్యను, ద్వేషదృష్టిని, అహంకారమును, బక్షపాతమును విసర్జించి జ్ఞానముయొక్క దివ్యప్రకాశమును విలోకింప నిరంతరము కృషి సలుపుచుండును. పారిశుద్ధ్యమును, ప్రేమను, దయను, సౌశీల్యమును,

ధైర్యమును, వినయమును, స్వార్థత్యాగమును జ్ఞానముయొక్క దివ్యప్రకాశములనియు, నపవిత్రత, ఈర్ష్య, క్రూరత్వము, క్రోధము, నుద్వేగము, అహంకారము, స్వార్థము మొదలగున వన్నియు నజ్ఞానముయొక్క యంధకారపుంజము లనియు నతఁడు స్పష్టముగా గ్రహించుచుండును. మనుష్యుఁ డజ్ఞానాంధకారమునం దున్నను, సుజ్ఞానప్రకాశమం దున్నను దన కుచితము లని తోఁచిన కార్యముల నెల్ల నాచరించుచు నుండును. బుద్ధిమంతుఁ డీరహస్యముల నన్నింటి గ్రహించి యేవిషయమందును బరులపై దోషారోపణముఁ గావింప నొల్లకుండును.

ప్రతిమానవుఁడును, తనప్రకృతి ననుసరించియుఁ, దనకుఁగల యుక్తాయుక్త జ్ఞానము ననుసరించియుఁ గార్యముల ననుష్ఠించుచు స్వీయానుభూతకర్మలయొక్క ఫలితముల ననుభవించుచున్నాఁడు. తన యిచ్ఛానుకూలముగ నాలోచించుటయు, నాచరించుటయుఁ బ్రతిమానవునకు సర్వోత్తమమగు స్వత్వమయియున్నది. మానవుఁడు నిజస్వార్థమునకు వశుఁడయి తనయొక్క తాత్కాలిక సౌఖ్యోపలబ్ధినిమిత్తము విచారించి కార్యమొనరించుచుఁ బరుల సౌఖ్యమువైపునకు ధ్యానము నొసంగకుండినచోఁ గారణకార్యము లస్థిరనియమానుగుణ్యముగఁ దన్ను దుఃఖాబ్ధిని బడఁద్రోసికొనుచున్నాఁడు. వాఁడట్లు కొంతకాలము క్లేశము ననుభవించి దీర్ఘముగ విచారింప

వలసినవాఁడయి, తచ్చింతనమునకుఁ బిదప సంతరణము యొక్క శ్రేష్ఠమార్గమును గనిపెట్ట శక్తుఁ డగుచున్నాఁడు. స్వానుభవముకంటె మానవున కాదర్శప్రాయుఁడగు నొజ్జ లేఁడు. అజ్ఞానముచేఁ బ్రాప్తించు కష్టమును మించిన శిక్షాప్రదమును, సంస్కరణకారకమును నగు దండనము లేదు. స్వార్థాంధుఁడగు మనుష్యుఁ డజ్ఞానయుతుఁడు. అతఁడు తొలుత దుఃఖమును, ఆదుఃఖమునుండియే జ్ఞానానందములను బ్రసాదించునట్టి మార్గమును స్వీకరింపుచున్నాఁడు; సజ్జనుఁడే బుద్ధిమంతుఁడు. బుద్ధిలేనిచోట సౌజన్యముండనేరదు. బుద్ధిమంతుఁడు తనమార్గమును దాను స్వీకరించుచున్నాఁడు; కాని యజ్ఞానముయొక్కయు, దుఃఖముయొక్కయు సోపానపరంపరల నతిక్రమించి సుజ్ఞానానందములఁ బడసి, జ్ఞానముయొక్క సంపూర్ణప్రకాశమున లీనమగుచున్నాఁడు.

మనుష్యుఁడు పరులకు వారి కర్తవ్యాచరణ సందర్భమున నిజాభిలాష ననుసరించికాక, వారియభీష్టము ననుసరించియే సమ్మతినొసంగుచు వారికర్తవ్యములఁ దనబుద్ధితోఁ బరీక్షింపక, వారిబుద్ధితోడనే పరిశీలింపుచు, వారికివికాదర్శమందు వారివాంఛలకే గణ్యస్థానము నొసంగుచు నందుఁ దనలాలసలఁ బ్రవేశపెట్టక యుండఁగలిగినపుడే పరుల దోషముల వీక్షింపనివాఁడయి వారివాస్తవిక చారిత్రమును, గ్రహింపఁ

గలుగుచున్నాఁడు. పరులయందు దోషములు మనకు దృష్టిగోచరములయినంతనే మనము వారి గుణాధిక్యమును నిజాధిక్యమునందు మిథ్యాభిమానముచే గ్రహింపలేకనియే నుండవలసియుండును. నీయాదర్శముననుసరించియు, నాయాదర్శము ననుసరించియు గాక మనుష్యుఁడు వాని యాదర్శము ననుసరించియే పరీక్షింపఁబడినపుడు వాని వాస్తవికమగు స్థితి బహిర్గతము కాఁగలదు. ఈరీతిగ మానవచారిత్రమును బరిశోధించుటను ధర్మశాస్త్రము బోధింపనేరదు. స్వర్గీయమగు నీ పద్ధతిని సమస్తలోకమునకుఁ జాటఁగలుగున దొక్క పరిశుద్ధమగు ప్రేమయే. మనము నిర్మలమగు ప్రేమదృష్టితో విలోకించినపుడే జ్ఞానసూర్యోదయమయి మనకు పరులయొక్క యథార్థమగు దశను జూపింపఁగలదు. మనుష్యుఁడు నేనితరుల స్వాతంత్ర్యమును లాఘవపఱచి వారిని నిర్ణయించుట కెవ్వఁడ నని భావించినపుడే ప్రేమతత్త్వమును విశేషముగాఁ బడయఁగలఁడు. ప్రతి మనుష్యుఁడు సదా పరుల దోషులుగ నిశ్చయించుటకును, నిందించుటకును, నే నంత పాపశూన్యుఁడను, బవిత్రుఁడను నయి యుంటినా యని స్వాంతమున విచారించుకొనుచుండవలయును. ప్రతిమానవుఁడు పరులయందలి దోషముల నెన్నుటకుఁ బూర్వమే తనయందు వేరూనియున్న దోషముల గ్రహించి నిర్మూలించివేయుట యావశ్యకము. మహాత్ముండగు కబీరుదాసు వచించిన విధమును గనుఁడు.

"నాయనా! నీ వేల వీరపురుషునివలె వేషమును ధరించి మీసమును దువ్వుచు దోషమునఁ బరుల దోషముల నెన్న బయలుదేఱితివి? అయ్యో! నీ యితరులతప్పులఁ బయలుపఱచుటకుమున్ను నీ హృదయాంతరాళమునఁ బుంఖానుపుంఖములుగ వేరూనియున్న దోషముల దూరమొనరించుకొనవేమి? నిన్ను నీవు సవరించుకొనలేక పరుల సంస్కరింప బయలువెడలితివా?"

మహాపాప మొనరించియుండిన యొక దుశ్చరిత్రయగు స్త్రీని జనులు ఱాళ్ళతో రువ్వి హింసింప నారంభించినప్పుడు దయామయుండగు జీససు ప్రభువు బోధించియుండిన వాక్యము చిరస్మరణీయము. ఆమహానుభావుఁ డిట్లు వచించెను.

"అన్నలారా! మీలో నేవిధమగునట్టిపాప మొనరింపని వ్యక్తియే యీ పాపాత్మురాలగు స్త్రీపైఁ దొలుత ఱాయిని విసరఁ దగును." మహాత్ముని యీనుడువుల నాలించి ప్రజాసంఘమందలి పాపశూన్యుఁడును, నిర్దోషియు నగు వ్యక్తి ఱాళ్ళను రువ్వకయే వినయవిధేయతతోఁ గరుణారసము వర్షించునట్లు "అమ్మా! నిన్ను నేను దోషురాలిగ నిర్ణయింపఁజాలను. నీవిఁక వెడలి పొమ్ము. ఇంతటినుండి పాపము లాచరింపకుము." అని యాభ్రష్టచారిత్రయగు స్త్రీతో నుడివెను.

పవిత్రమగు హృదయమందు ద్వేషమునకును, స్వార్థయుక్తములగు నిర్ణయములకును స్థానము లభింపఁ జాలదు. కారణ మేమన నట్టి హృదయము మార్దవయుతోడను, నిర్మలమగు ప్రేమతోడను బరిపూర్ణమయి యుండుచుండును. ఇట్టి విశుద్ధమగు హృదయమునకుఁ బరులయందు దోషములు గోచరింప నేరవు. మనుష్యుఁడు పరులయందుఁ గీడును జూచు స్వభావమును విడిచిపుచ్చుచున్నకొలఁదియు నతఁడు స్వయముగా భయవిషాదపాపముల నుండి విముక్తుఁడు కాఁగలుగుచున్నాఁడు.

మనుష్యుఁడు జ్ఞానమును సంప్రాప్తింపఁ జేసికొనినంతపర్యంతము తనయందున్నట్టియుఁ దనకార్యములందు వెలయుచున్నట్టియు దోషముల నవలోకింపఁజాలఁడు. వాని జ్ఞానప్రకాశము వర్ధిల్లుచున్నకొలఁదియు నతఁ డా దోషపూర్ణములగు కార్యముల నెల్ల విసర్జించివేయుచుండఁగలఁడు. ప్రతిమనుష్యుఁడును దనకార్యములను బరు లెంతగా నింద్యములని భావించినను, ధర్మసంగతము లని నిరూపించ వాని నాచరించు టత్యంతావశ్యకమనియు, నవి న్యాయయుక్తము లనియు వచింప నారంభింపుచుండును. అతఁడు తా నాచరించు కార్యమును జెడ్డదని వచించినచో దాని నాచరించుటెట్లు సంభవించును? ప్రతియల్పమానవుఁడును దా నొనరించు కార్యమును బ్రామా

కమనియే వాదించుచుండును. కుపితుఁడును తన క్రోధ
మును నుచితమే యని వచింప సాహసించును. లుబ్ధుఁడు
తన లోభబుద్ధిని, జారుఁడు తన వ్యభిచారవృత్తిని ధర్మ
సంగతము లని నిరూపింపఁ జూచుచుండును. అసత్య
భాషి నిరంతరము జీవితనిర్వాహణమున కసత్యభాషణము
నత్యంతావశ్యకమగు పదార్థ మని నిర్వచించుచుండును.
దోషదర్శి దూషితచరిత్రుల జీవితముల సంస్కరించు నిమి
త్తము వారల సావధానచిత్తులఁ గావించుచు, సంస్కరింపఁ
జూచుచుండునే కాని నిందింపఁనొల్లఁడు. దస్యుఁడు చౌర్యమొన
రింప శీఘ్రకాలమందే సంపదల నార్జించి సుఖించుమార్గమును
గ్రహించుచున్నాఁడు. నరహంతకుఁడు మానవుల సంహరించుట
నొక దోష మని విశ్వసింపక పోవచ్చును.

ప్రతిమానవుని కార్యము వాని జ్ఞానప్రకా
శము ననుసరించియు, నజ్ఞానాంధకారము ననుసరించియు నిర్వ
హింపఁ బడుచుండఁగలదు. వాని జ్ఞానసీమ నతిక్రమించి
వాని జీవితమును, గార్యములును నుండనేరవు. వాఁడు
వాంఛించినచోఁ దన్నుఁ దానే సంస్కరించుకొని తన జీవన
జ్యోతిని, జ్ఞానమును వృద్ధి గావించుకొనఁ గలుగుచున్నాఁడు.
క్రుద్ధుఁడగు మానవుని జ్ఞానము సహనమును, ధైర్యము శేరి
యుండని హేతువుచేతనే వాఁడు సదా విరక్తుఁడగుచు, నన

హ్యించుకొనుచు సమస్తలోకమును నకారణముగ దూషించుచుండును. వినయ విధేయతల నభ్యసింపని మానవుఁడు ప్రమాదుల మహాత్తును గ్రహింపఁజాలఁడు. అసత్యభాషియు, పరులదోషముల గణించునట్టియు మానవుని స్థితి యిట్టిదే యగును. చోరుని జ్ఞానానుభవము లపరిపక్వములయి యుండుచుండును. వాని స్వాంతమును, గార్యములును నజ్ఞానతిమిరముచే నాచ్ఛాదితములయి యుండుచుండును. తనయధమ స్థితితో సరిపోల్చుకొనుటకేని యతఁ డున్నతజీవితము నెపుడును గడపియుండ నేరఁడు. అతఁడు తనజీవితముకంటెఁ బవిత్రమగు జీవితము లేదనియే భావించుచుండును. అంధకారము నందుఁ బ్రకాశము ప్రజ్వరిల్లుచున్నది. కాని యంధకారమున కా ప్రకాశముయొక్క యనుభవము కలుగనేరదు. ఆత్మస్తుతి పరాయణుఁడగు మూఢుఁ డంధకారమునుండి జ్ఞానశూన్యుఁడగుటచే దనస్థితిని బాగుగా గ్రహింపనేరఁడు.

మనుష్యుఁడు చీటికి మాటికి దుఃఖముల ననుభవించి తన నడవడిపై నిజదృష్టిని బ్రసరింపఁజేసినంతనె తన యజ్ఞానముయొక్క క్రోధాసత్యాది దుర్గుణములమూలముననే తన కనేకములగు క్లేశములు సంభవించిన వని గ్రహించి, యా సమస్తదోషముల విసర్జించివైచి, తద్విరుద్ధములగు పరమోజ్జ్వల గుణగణముల నన్వేషించి, వాని నభ్యసింప నారంభింపు

చున్నాఁడు. అతఁడు దృఢసంకల్ప పూర్వకముగ శ్రేష్ఠతరమగు మార్గము ననుసరించినంతనే సత్పథముయొక్కయు, దుష్పథముయొక్కయు జ్ఞానము కలుగఁ దాను బూర్వావస్థయందు ఘోరాంధకారమునఁ జిక్కియుంటినని గ్రహింప నేర్చుచున్నాఁడు. మంచిచెడ్డలయొక్క యనుభవమును జూచుచుండుటవలననే జ్ఞానప్రకాశము విస్తరిల్లుచున్నది.

మనుష్యుఁడు పరుల కార్యముల వారి దృష్టితోడనే విలోకింపుచు, వారి కొలఁతబద్దతోడనే కొలచుట కారంభించినంతనే వారియందు దోషములు కానవచ్చుట నిరోధింపఁబడుచున్నవి. కారణమేమన నతఁడు ప్రతి మనుష్యునకు గొలఁతకఱ్ఱలును, ఆదర్శములును భిన్నములుగా నుండుచుండునని గ్రహించును. విశ్వమందు స్వల్పసంఖ్యాకులచే నయిన ప్రేమింపఁబడనట్టి హీనాతిహీనములగు దోషములేవియు లేవనియే చెప్పవచ్చును. ఇదియే చందమున నల్పసంఖ్యాకులచే నయిన నిందింపఁబడని సర్వోత్కృష్టములగు సద్గుణములును విశ్వమునఁ గానరావు. సకలప్రపంచముచే నైక్యభావముతోఁ బ్రశంసింపఁబడు వస్తువేదియు నీధరాతలంబున గోచరింపదు. మనుష్యుఁడెద్దానిని హీనముగ భావించునో, అది వానికొక్కనికే హీనమయినది. వాఁడెద్దానిని మంచివస్తువుగఁ బూజించునో అదియు వానివిషయముననే మంచిదిగ భావింప వలనుపడు

చున్నది. ఒకనిమేలు మఱొకనికి కీడు కావచ్చును. లోకమండలి యీ తారతమ్యము కేవలము గ్రహించుటలో నున్నది. పవిత్ర చారిత్రుఁడగు మనుష్యుఁడు లోకమండలి యధికసంఖ్యాకులు తనచే నిర్దేశింపఁబడు మార్గము ననుసరింపుచుండవలయు నను ధర్మవిరుద్ధములగు వాంఛలకు, దన మదియందుఁ దావొసంగఁజాలఁడు. అతఁడు మనుష్యులెల్లరు తమతమ యభిప్రాయముల ననుసరించి వర్తింపుచు స్వతంత్రులయి జీవించునపుడే మిక్కిలి హర్షింపఁగలఁడు. అతఁడు సర్వదా పరుల స్వాతంత్ర్యజీవితనిర్వహణమునకు యథాశక్తిఁ దోడుసూప యత్నింపుచుండును. కారణమేమన నతఁడు సమ్మతిమాఱుటకంటె ననుభవము వర్ధిల్లుటవలననే సమున్నతమగు జ్ఞానమును, బహుళానందమును గలుగుచున్నవని గ్రహింపుచున్నాఁడు.

లోకమండలి ప్రతిమానవుఁడు ప్రాయికముగాఁ దనతో నేకీభవించి భిన్నాభిప్రాయము లేక యుండు వ్యక్తిని సజ్జనుఁడనియు, భిన్నాభిప్రాయముచేఁ దనతో నేకీభవింపఁజాలని మనుష్యుని ధూర్తుఁడనియు నుడువుచుండుట మనము విలోకింపుచునే యున్నారము. తన్నధికముగాఁ బ్రేమించుకొనుచుండు మనుష్యుఁడు తన యభిప్రాయములఁ జూచుకొనుచు సదా ముగ్ధుఁ డగుచుండును. అతఁడు తన యభిప్రాయముల నభిను

తించువారల నాశీర్వదింపుచుఁ బ్రశంసింపనివారల దూషింపుచుఁ బరాభవింపఁ జూచుచుండును. "ప్రేమించువారలఁ బ్రేమించుటయం దేమి గొప్పతనము కలదు? శత్రువులఁ బ్రేమించువాఁడే బ్రశంసాపాత్రుఁడు." అని జీసను శిష్యకోటి కుపదేశించి యున్నాఁడు. అహంకారాభిమానములు మానవు నంధుని గావించివైచును. నేడు వివిధములగు ధర్మ సంప్రదాయములు పరస్పర ద్వేషములచే దుఃఖమయస్థితికిఁ బ్రాపించుచున్నవి. భిన్నమతావలంబులగు రాజనీతిజ్ఞు లొండొరులయందుఁ గలహించి పరస్పరము దూషించుకొనుచున్నారు. పక్షపాతహృదయముగల మనుష్యుఁడు తనయాదర్శము ననుసరించియే లోకమును బరీక్షింపుచుఁ బక్షపాతబుద్ధితో సర్వత్ర తనయాధిక్యమునే స్థాపించుకొనఁ జూచుచుండును. వాఁడు సదా తన్ను సత్యసంధునిగను, బరుల నపరాధులుగను నిశ్చయింపుచుండును. వాఁడు పరుల కభిలాష లేకున్నను, వారిబుద్ధికి విరుద్ధముగనున్న తనకర్తవ్యపథము ననుసరింప దండనమునను, దౌర్జన్యమునను బలాత్కరింపుచుండుట యనివార్యమగు నుత్తమధర్మమనియే విశ్వసింపుచుండును. మొగలాయీ ప్రభుత్వకాలమున స్వధర్మమం దంధభక్తిని గలిగియున్న మహమ్మదీయుఁడు శుద్ధసాత్త్వికచరిత్రుఁడగు హైందవుని బాధించి మతభ్రష్టునిఁ జేయుటయే మోక్షదాయకమును, భగవత్ప్రీతికరమును నగు తనధర్మ మని త్రికరణముల విశ్వసింపుచుండెను.

మనుష్యు లొండొరుల ద్వేషించుకొనుచు, దోషపాత్రులఁ గావించుకొనుచు, కలహింపుచు దుఃఖముల నుదయింపఁ జేసికొనుచున్నారు. వారు యథార్థముగ దుష్టులయి యుండుటచే నీరీతి భ్రష్టులగుచుండుట లేదు వారు మంచిచెడ్డల గ్రహించి దుష్టకార్యములకుఁ గడంగుచుండుటలేదు ద్వేషమును, దూషణమును వారు జీవితోన్నతిప్రాప్తి కావశ్యకములగు ధర్మము లని విశ్వసించుటవలననే యిట్టి నిందార్హకర్మలకుఁ బాల్పడుచున్నారు. మానవులెల్లరు నాంతరికముగ మంచి వారలే; కాని వారియందుఁ గొందఱు మిక్కిలి బుద్ధిమాంద్యులు. మఱికొందఱు వారికంటె ననుభవమునందు గనిష్ఠులు. కొంతకాలమునకుఁ బూర్వము మధుసూదనుఁడు, సురేంద్రనాథుఁడను నిరువురు యువకులు సతీశచంద్రుఁడను సుప్రసిద్ధ రాజనీతిధురంధరుని విషయమయి వాద వివాదములు గావించుకొనియుండిరి. విద్యావంతులగు నాయిరువురి వాదోపవాదములు చదువరులకుఁ బ్రయోజనదాయకము లగునను విశ్వాసముచే నీదిగువ నుదహరింపుచున్నాఁడను.

మధు—భూలోకమందుఁ బ్రతిమానవుఁడును దనభావముల యొక్కయుఁ, గర్మలయొక్కయు ఫలమును బడయుచున్నాఁడు. మనుష్యుఁడు స్వయంకృతములగు పాపములచే దుఃఖముల ననుభవింపవలసినవాఁ డగుచున్నాఁడు

సురే:—మిత్రమా! నీ నుడువులు నా కంతగా సంతోషమును కలిగింప లేదు. మనుష్యుఁడు స్వయంకృతములగు దుష్కర్మలయొక్క దండనమునుండి తప్పించుకొనఁజాలనివాఁడగుచోఁ బ్రతిభాశాలురగు రాజనీతి ధురంధరు లెందఱో తమంతటఁ దామే యెంతటి భయంకర నరకముల నిర్మించుకొనుచున్నారు! మనుష్యుఁ డధికారయుతుఁడును, శక్తిసంపన్నుఁడును నయియున్నను, గాకున్నను దాను పాపమందును, నజ్ఞానమందును నున్నంతపర్యంత మవశ్యము ఖేదము ననుభవింపవలసినవాఁ డగుచున్నాఁడు.

మధు—ఉదాహరణమునకయి సమస్తవిధముల దుష్టుఁడును, స్వార్థపరుఁడును, లుబ్ధుఁడును నగు సతీశచంద్రుని విలోకింపుము. ఇట్టి దుష్టమానవుని నిమిత్తము మిక్కిలి కష్టదాయకములగు దండనలు విధింపఁబడఁగలవు.

సురేం—సతీశుఁ డిట్టి దుష్టుఁడని నీ వెట్లు గ్రహింపఁగలుగుచున్నాఁడవు?

మధు—అతని కార్యములే యతనిచారిత్రమునకుఁ బలవత్తరములగు ప్రమాణములు. పరుల నెవ్వారినయిన నిందించు వ్యక్తిని గాంచినంతనే నేనతనిని దుష్టునిగ నిశ్చయింపుచుందును. నేను సతీశచంద్రుని వీక్షించినంతనే వాస్తవికమగు క్రోధముచే మండిపడు

చుండును. ఎవఁడేని యొకమనుష్యుఁడు పరులకు నష్టమును కలిగించునట్టి పదవి నధిష్ఠించియుండఁ జూడ నే నవుడవుడు వానియందు లోకోపకార మొనరించునట్టి శక్తియే లేదాయను సందేహమునకుఁ బాల్పడుచుండును.

సురేం—చెలికాఁడా! సతీశచంద్రుఁ డేమయినఁ గీడొనరింపుచున్నాఁడా?

మధు—అయ్యో! సందేహమేల? వాని కుటిలనీతి మిక్కిలి చెడ్డది. అధికారగర్వముచే నతఁడు సకల ప్రపంచమును దగ్ధమొనరించుటకేని శంకింపనంతటి రాక్షసుఁడు.

సురేఁ—నీవలెనే చాలమంది మనుష్యులు సతీశుని దుర్మార్గునిగనే నిశ్చయింపుచున్నారు. కాని నీవంటి బుద్ధిమంతులే వేలకొలఁదిగ సతీశుని పరమయోగ్యుఁడని విశ్వసించి వానియోగ్యత ననేకరీతులఁ బ్రశంసింపుచు, నతని రాజనీతిజ్ఞానముచే దేశకల్యాణము కాఁగల దని నిశ్చయింపుచున్నారు. అతని యధికారస్థితి యిట్టివారివిూఁదనే ముఖ్యముగా నవలంబితమయి యున్నది. సతీశచంద్రుని మంచివాఁడని భావించు వీరునయితము దుష్టులేనా?

మధు— వారు భ్రమచెందుచున్నారు. వేలకొలఁది జనుల కండ్ల గప్పివచ్చిన పతితుని దుష్టత్వ మపారము. అతఁడు స్వార్థసిద్ధికయి కపటవేషధారియగు బుద్ధిమంతునివలె నల్లరకు గోచరింపుచు నాంతరికముగఁ బాపముల నాచరింపుచున్నాఁడు. నే నట్టి గోముఖవ్యాఘ్రము నసహ్యించుకొనుచుందును.

సురేం—నీవునయితె యొకవేళ ప్రజాసామాన్యమువలెనే మోసగింపఁబడఁగూడదా?

మధు— అదెట్లు?

సురేం—ద్వేషమును, జుగుప్సను గలిగియుండుటయే నాత వంచనము. ప్రేమ ఆత్మజ్ఞానము. మనుష్యుఁడు ద్వేషించుటనుమాని, ప్రేమభావమును గలిగియుండుట నభ్యసింపనంతపర్యంతము పరులను, దన్ను దివ్యదృష్టితో వీక్షింపఁజాలఁడు.

మధు—సంగడీఁడా! నీ యీ వచనము సత్యమయినది; కాని యిది యసాధ్యమును, అసంభవమును నయియున్నది. నే నెవఁడేని నొక మనుష్యు నన్యుల దూషింపుచు, మోసగింపుచు, నసత్యమార్గము ననుసరింపఁజేయుచు నుండ వీక్షింతునేని యవశ్య మవ్వానిని గర్హింపవల

సిద్ధియుండును. ఇట్లాచరించుట యనుచితము కానేరదు. సతీశచంద్రుని యంతఃకరణము లేదనియే నుడువ వలసివచ్చుచున్నది.

సురేం—నీవు భావించునట్టి స్థితియందు సతీశచంద్రుఁడున్నదియు, లేనిదియు నిశ్చయముగా వచింపఁజాలము. ఒక వేళ నీవు వచించినరీతిగనే సతీశచంద్రుఁడు దుర్మార్గుఁడయి యుండవచ్చును; అంతఃకరణములేని జడుఁడయి యుండవచ్చును. అట్టివానియెడ దయనుజూపుటను ధర్మమా లేక జుగుప్సను వెల్లడించుట ధర్మమా?

మధు—ఇది యెట్లు?

సురేం—సతీశున కంతఃకరణము లేదనియేకదా నీవు నుడివి యుంటివి?

మధు—నిస్సందేహముగ నతని కంతఃకరణము లేదనియే నుడువ వచ్చును.

సురేం—అట్లగుచో నతఁడు జ్ఞానమునుబట్టి విచారించినచోఁ బంగువగును. నీవంధులను వారు చూడలేరు కదా యని యేవగించుకొందువా? మూకుని గాంచియు, బధిరునిఁ జూచియు వారు మాట్లాడలేరనియు, వినఁజాలరనియు నేవగించుకొందువా? సముద్రముపైఁ బ్రయాణ

మొనరింపుచున్న నావికుని హస్తమునుండి తెప్పజారి మున్నీట మునిగిపోవ నానౌక యొక్క కొండను ఢీకొని భగ్నమగుచోఁ "కర్ణధారీ! నీవేల నీనావను కొండ నుండి దూరముగా నుంచుకొనక పోయితి" వను నుపాలంభనవాక్యములచే విపత్తునందున్న నతనిహృదయమును దుఃఖింపఁ జేయుదువా? నావయందలి యాత్రికుల ప్రాణహానికి నావికునే బాధ్యునిగ నిశ్చయింతువా? అంతఃకరణము లేని మానవునియొద్ద సరియైన మార్గమున మనుష్యుల నడిపించునట్టి పథప్రదర్శకయంత్రములగు సత్యధర్మములు కలవు. కావున నేనానికి స్వార్థము ధర్మయుక్తముగను, సత్యముగను గానవగుచున్నది. సతీశుఁడు నీకుఁ జెడ్డవాఁడు కావచ్చును. కాని యతఁడు తనవిషయమున దుర్మార్గుఁడు కానేర్చునా? అతఁడు న్యాయముగాఁ దన్ను దుశ్చరిత్రునిగ భావించుకొనుచుండునా?

మధు—అతఁడు తన్నుఁదా నొక దుర్మార్గునిగఁ దలంచు కొనకున్నను వాస్తవమునకుఁ బరమదుష్టుఁడే.

సురేం—సతీశచంద్రుని నీ వసహ్యించుకొనుచున్నావుగదా యని నేను నిన్ను చెడ్డవానిగాఁ దలంచినచో నేను దోషిని కాకుందునా?

మధు—లేదు.

సురేం—అది యేమి ?

మధు—కారణమేమన నిట్టిస్థితియందు నన్నేవగించుకొనవలసిన యగత్యములేదు. నేను స్వార్థము నపేక్షించికాని, నిజాభిమానమునకు భంగము వాటిల్లునని కాని సతీశ చంద్రుని దూషించి యుండలేదు. లోకకల్యాణము నకు విరుద్ధముగ వర్తించుటవలననే వానిని నేను గర్హించితిని. ఇట్టిస్థితియందు ఘృణపరమావశ్యకమును, నుచితమును, సత్యమును గాఁగలదు. సత్యమగు క్రోధమును, సత్యమగు ఘృణయు నేవగింపఁ బడ రానివి.

సురేం—సత్యమగు స్వార్థమును, సత్యమగు లోభమును, సత్య మగు నిందయు నీయొక్క సత్యమగు క్రోధమువలెనే యెందులకు సన్మానింపఁబడరాదు ? నీ వేదేని విషయ మును గ్రహించి యాచరింపుచున్నచో సతీశచంద్రు నేవ గించుకొనుటనే మనుష్యత్వముయొక్కయు, నాగరికత యొక్కయు నుచితమగు కర్తవ్యముగ భావింపు చున్న చో నేను నీయీపనులకయి నిన్ను చెడ్డవానిగాఁదలంచిన యది నాతప్పగును. ఈగుప్పకంటె మఱియొక నుత్త మంబగుమార్గము కలదు. ఈయుత్తమమార్గపరిజ్ఞానమే

నన్ను సతీశచంద్రు సేవగించుకొనుటనుండి నిరోధింపు చున్నది. కారణమేమన సతీశుని చారిత్రము నాకెంత నీచముగానున్నట్లు గోచరించినను, నతనికిని, నతని సహకారులకును మాత్రము చెడ్డదిగా గోచరించుట లేదు.

మధు—అయుత్తమంబగు మార్గమేది ?

సురేం—అది సువిశాలమగు ప్రేమమార్గము. పరుల నేస్థితి యందును చెడ్డవానిగాఁ దలంచు స్వభావమును బరిత్య జించివేయుటయే ప్రేమలక్షణము. ఇయ్యది మానవ హృదయముయొక్క యొకానొక శాంతిమయంబును, నానందయుక్తంబును నగు భవ్యస్థితి.

మధు—ఒకఁడు మఱొక్క మనుష్యు నకారణముగ దూషింపు చుండ నీవు కుపితుఁడవు కాకుండ నుండఁగలవా ?

సురేం—నాయభిప్రాయ మదికాదు. మనుష్యుఁడు పరులయెడ దుర్భావమును గలిగియున్నంతవఱకు వారిపైఁ గోప మును వహింపుచునే యుండఁగలఁడు. కాని వాఁడు ప్రశాంతబుద్ధియొక్కయుఁ, బవిత్రప్రేమయొక్కయు నుస్థితిఁ బ్రాపించినంతనే క్రోధమునకు హేతు భూతమగుచున్న కీడును లేశమాత్రమును దనయందుఁ జూడనేరఁడు. అట్లు దతనికి మానవులయొక్క వివిధ

విధములగు స్వభావము లన్నియు విశదమగుడు వెంటనే యతఁడు మనుష్యులెల్ల రేరీతి కార్యాచరణ తత్పరు లగుచున్నదియు, దమ భావములకును, గర్మలకును నెట్టి ఫలితములఁ బొందుచున్నదియు స్పష్టముగా గ్రహింపఁగలుగుచున్నాఁడు. ఇట్టి స్థితిచే మానవుఁడు సమస్తమానవుల ననుకంపతోడను, నిష్కల్మషమగు ప్రేమతోడను విలోకింపఁ గలుగుచున్నాఁడు.

మధు—నీవు నుడివియున్న పరమ పవిత్రమగు స్థితి నిస్సందేహముగ సర్వోచ్చమును, మనోహరమునను నున్నది. కాని నే నిట్టి స్థితికి బ్రాపించుటను దుఃఖదాయకముగ భావించుచున్నాఁడను. సతీశచంద్రునివంటి లోకోపకార పరతంత్రులగు దుష్టుల వగించుకొనుట మాని గాఢాలింగన మొనరించుకొనుట నాచేఁ గానేరదు.

ఈ వాదవివాదముచే మధుసూదనుఁడు ద్వేషమును, జుగుప్సను బ్రేమింపుచుండుటచే వానిని విసర్జింపఁ జాలనని వచించియున్నట్లు మనకు స్పష్టపడుచున్నది. ఇదియే చందమున సమస్త మానవులు తా మాచరించు కార్యములనే పరమావశ్యకములుగను, సర్వోత్తమములుగను భావింపు చుందురు- మనుష్యు జీవితయములను సంపూర్ణముగా విశ్వసింపు చుండునో వానినే యాచరింప నలవడుచున్నాఁడు. ఒక

కార్యమందు మానవుని విశ్వాసము తొలఁగిపోయినచో నవశ్య మతఁడా కార్యమును విసర్జించివేయుననుట కేమియు సందేహము లేదు. మధుసూదనుఁడు లోకమందలి యితర మానవులవలెనే స్వతంత్రుఁడయి కోరినప్పుడెల్లఁ బరుల ద్వేషింపఁగలుగుచున్నాఁడు. ఇది వాని స్వాభావిక స్వత్వమయినది. ద్వేషభావమును గలిగియుండుటచేఁ దత్ఫలితముగాఁ బ్రాప్తములగు దుఃఖములను, మనోవ్యాకులతను మనుష్యుఁ డనుభవించినఁగాని ద్వేషముయొక్క భయంకర తత్త్వమును గుర్తించి "అయ్యో! ద్వేషము కరము హానికరము. దీనిని గలిగియుండుటకంటె మౌఢ్యము, గుడ్డితనము లే" దని విచారింపుచు ద్వేషమును విసర్జించివేయఁగలఁడు.

ఒకతూరి సుప్రసిద్ధుఁడగు తన యాచార్యు నొకశిష్యుఁడు మంచి చెడ్డలయందుఁగల తారతమ్య మేమని ప్రశ్నింప నా దేశికుఁడు తనహస్తముయొక్క యయిదు వ్రేళ్ళ నధోముఖముగ నుంచి శిష్యు నిట్లుఁ బృచ్ఛించెను. "కుమారా! నాహస్త మేదిశకు వంగియున్నదో చెప్పఁగలవా?" శిష్యుఁడంత నీచందమునఁ బ్రత్యుత్తర మొసంగెను. —"గురుదేవా! మీహస్తము క్రిందివైపునకు వంగియున్నది." గురుదేవుఁడంత తనహస్తమును బైకెత్తి "ఇపుడు నాహస్త మేదిక్కును సూచింపుచున్న" దని ప్రశ్నించెను. శిష్యుఁ డంత యూర్ధ్వదిశయని యుత్తర

మిచ్చెను. ఆచార్యుఁడు శిష్యుని రెండుత్తరముల నాలించి సుప్రసన్నుఁడయి 'నాయనా! మంచి చెడ్డలయందీభేదమే సుస్థిరముగా వెలయుచున్నది. కీడుచే మనుష్యుఁ డధఃపతితుఁ డగును. మేలుచే నూర్ధ్వస్థితికిఁ బ్రాపించును. గురూత్తముని యా సులభోదాహరణములచేఁ బ్రకృతిసిద్ధమగు శక్తిని నశుద్ధకార్యములకును, ననుచిత ధర్మములకును వెచ్చించుటయే కీడు. ఆశక్తిని విశుద్ధమగు కార్యములకును, సముచితములగు భావములకును వినియోగించుటయే మే లనఁబడుచున్నది. ఇదియే చందమునఁ బ్రపంచనిందకుఁ బాత్రుఁడయినమనుష్యుఁడు గురువుగారు చేతివ్రేళ్లఁ బైకెత్తినట్లు అధమస్థితికిఁ బ్రాపించుచున్న తన చారిత్రము నుద్ధరించుకొను టావశ్యకము. మేలు నభ్యసింపుచుఁ గీడుయొక్క వాస్తవికార్థమును గ్రహింపుచుండుటచే మనుజుఁడు పరులయందుఁ గీడును జూచు దురభ్యాసమునుండి విముక్తుఁడగుచున్నాఁడు. పరులయందలి చెడుగునుఁ జూచుట మాని తన సంపూర్ణహృదయశౌచమునకయి యథాశక్తిఁ గృషిసలుపునట్టి మనుష్యుఁ డెంతను ధన్యుఁడు. ఇట్టి సంస్తవపాత్రమగు కృషిచే మానవుఁ డొకదినమున మిక్కిలి పరిశుద్ధచారిత్రుఁ డయిపోవ, వాని దృష్టిపథమునం దెట్టికీడును గోచరింపఁజాలదు.

చెడుగుయొక్క జ్ఞానమును సంపాదించిన పిదప మనుష్యుఁ డేమి చేయవలయును? అతఁ డపుడు మంచియందు లీనుఁ

కయిపోవలయును. నన్నెవఁడేని యపరాధిగ నిశ్చయించిన
చోఁ బ్రత్యపకృతిగను నేను వానిని దోషిగా నిశ్చయింప
నొల్లను. నన్నెవఁడేని దూషించినను, గుపితు నొనరించినను
నే నట్టి క్రోధభావమును వెల్లడింపక వానిపైఁ గరుణారసమును
వెదఁజల్లుదును. నన్నెవఁడేని నిందింప నారంభించినచో నే
నవ్వానిని స్తుతింప నారంభింతును. నన్ను వాఁడు ఏవగించుకొని
నచో వానికి నాప్రేమ యవసర మయినదని గ్రహించి నేను
వానియెడఁ బవిత్రమగు ప్రేమభావమును వెల్లడింతును. స్థిర
త్వము నెఱుంగనివారికి నేను ధైర్యస్థైర్యములఁ బోధింతును.
లుబ్ధాగ్రేసరులపట్ల నేనుదారహృదయముతో వర్తించెదను.
లోకానుభవ మెఱుంగని బాలురతోడను, నారికసములగు
కలహప్రియులతోడను సవినయముగను, శాంతముగను
మెలంగెదను. నే నెవ్వానియందును గీడునే చూడనపుడు నే
నన్యుల శత్రువులుగఁ దలంచి యేవగించుకొను టెట్లు పొసగ
నేర్చును?

ఓ నాప్రేమాస్పదులగు సోదర సోదరీమణులారా!
ప్రపంచము నన్ను సంహరించుటకును, ద్వేషించుటకును,
సిద్ధపడుచున్నదనిన నే నెంతయుఖేదము నందుచున్నాఁడను.
నన్ను ద్వేషించువారుగాని, నాకు ద్రోహమొనరించు వారు
గాని విశాలమగు నీభూమండలమునఁ గాన రాకున్నారు.

సకలమానవాళి నాపైఁ బూర్ణమగు కృపాదృష్టిని గలిగియు న్నది. స్వప్నమందును నా కెవ్వానిమీఁదను రోషము కలుగు చుండుటయే లేదు.

పరుల నిందింపుచుండు మనుష్యుఁడు తన దుర్భావము లకును, దుష్కర్మలకును వెనుక నాకీర్తియొక్క నానావికము లగు ప్రేతభూతమూర్తులు కూర్చుండి యున్నట్లు భావింపుచుం డును. కాని పవిత్రహృదయుఁడగు మానవునివెంట నట్టిభూ తములు నుండ రవు. సత్పురుషుఁ డొకవేళ పరుల కార్య ములయొక్క మంచిచెడ్డలను గణించి విచారించినను హానిని పాపజాలములు వెంటాడ నేరవు. ప్రపంచతత్త్వము తత్ప్రష్ట మయినది. ఆతత్త్వమునందుఁ జెడ్డకుఁ దావులేదు. బుద్ధిదోషము ననే కేవలకార్యములు దూషితము లగుచున్నవి. మేలు శాశ్వతమయినది. కీడు స్థిరము లేనిది. ఒక్క మాతృగర్భ మున జనించిన సోదరీ సోదరు లేకగృహమం దధివసింపుచు ప్రేమించుకొనుచు సుఖదుఃఖముల నొండొరుల సాహాయ్య మొనరించుకొనుచు, వారియం దెవఁడేని ప్రమాద మొన రించిన క్షమించుకొనుచు నొకరి నొకరు దూషించుకొనక శాంతముగ జీవించు విధమున సహృదయుఁడగు మానవో త్తముఁడు లోకమందలి సమస్తమానవు లనేక మాతృగర్భ సంజనితులగు సోదరీ సోదరులుగను, నాకే తత్త్వముచే సృజిం

పఁబడినవారిగను, నొకే యాదర్శము ననుసరింపుచున్నవార
లగను భావించి మనసారఁ బ్రేమింపుచుండును. అతఁడు తన
కంటె నధికప్రాయముగల పురుషులఁ బితృసమానులుగను,
సమవయస్కుల సహోదరులుగను, చిన్నల బిడ్డలుగను,
ప్రాయమునందు పెద్దవారగు స్త్రీల మాతలుగను, సమవయ
స్కుల సోదరీమణులుగను, బాలికలఁ బ్రియపుత్రికలుగను
భావించి ప్రేమింపుచుండును. అతఁడు సకల ప్రపంచమును
తననుండి భిన్నవస్తువుగ భావింపనొల్లఁడు. సమస్త మానవ
లోకముపట్ల నాత్మసమానమగు గౌరవభావమును గలిగి
యుండి ప్రమాదవశంబునయిన నెవ్వారిని దూషింపనొల్లఁడు.
ఈరీతిగ నతఁడు క్రోధద్వేషాది దుర్గుణముల నన్నింటి
జయించి, విశుద్ధ ప్రేమమూర్తియయి, ఆత్మతత్త్వమును
సాధించిన లోకోత్తరవిజేతయయి బ్రహ్మానందమయస్థితికిఁ
బ్రాపించి సమస్తవిధముల ధన్యుఁడు కాఁగలఁడు.

---

## నవమప్రకరణము.

---

# సుస్థిరానందము.

సుస్థిరానందమన నేమి? అది యెట్టిపదార్థము? లభించుస్థానమెద్ది? ఈప్రశ్నలనుగూర్చి యొకింత లోకానుభవజ్ఞాన సంపన్నుండగు వ్యక్తి దీర్ఘముగ విచారించినచో నవశ్యము విశ్వమానవజీవితమం దంతర్వాహినియయి, శాశ్వతమయి వెలయు సుస్థిరానంద మొక స్వర్గీయపదార్థ మని గ్రహింప సమర్థుండగును. స్వర్గీయమగు నీ సుస్థిరానందమునకుఁ బాపశూన్యమగు ప్రదేశమే నివాసస్థానము. ఇయ్యది జ్ఞానసంపన్నుండగు సత్పురుషుని పవిత్రహృదయమునందు వెలయుచుండును.

అంధకారము వెడలిపోవునట్టి యొకవిధమగు ప్రతిబింబము. ప్రకాశము స్థిరముగ నెలకొనియుండునట్టి సత్పదార్థము. అది యేవిధమున దుఃఖ మస్థిరమయినది, సుఖము లేక యానందము సుస్థిరమయినది. సత్యమగు పదార్థ మేదియు లుప్తీభూతము కానేరదు. సత్యము నిత్యమయినది, కాని-

అయథార్థమగు పదార్థము స్థాయిగ నుండనేరదు. దుఃఖ మసత్య మయినది. కావుననే యది యస్థిరము. ఆనందము తథ్యమయి నది. కావుననే యది శాశ్వతమయినది. ఒకింతకాలపర్యంతమా నందము గోప్యముగ నుండియున్నను, తిరిగి మానవునకు సంప్రాప్తము కాఁగలదు. దుఃఖ మొకింతకాల మున్నను బ్రయత్న ముచే దూరమొనరింపఁ బడుచున్నది.

మానవమూర్తీ! నీదుఃఖములు స్థిరముగా నుండఁగల వని భావింపకుము. దుఃఖపరంపరలు గగనమండలమందలి నీలాంబుదశకలములవలె క్షణమాత్రకాలమున నదృశ్యము లైపోఁగలవు. పాపసంభూతములగు క్లేశముల సదా యనుభ వించునిమిత్తమే నీవు సృజింపఁబడియుండలే దని గ్రహింపుము. క్లేశములన్నియు భయంకరస్వప్నములవలె రెప్పపాటుకాలము నందంతర్హితములయిపోఁగలవు. భయ విషాద సందేహముల విసర్జించివేయుము! లే, లెమ్ము!! పవిత్రహృదయుండవయి, పాపవిదూరుఁడవయి నిత్యానందము ననుభవింపుము.

నీవే నీస్వప్నముల రచించుకొనుచుంటివి. లోభగ్రస్తుఁడ వయినకాలఁదియు దుఃఖభూధరములు నీపై విరిగిపడు చుండఁగలవు. అపుడు నీవు గొంతెత్తి రోదనమొనరించిన ప్రయోజనము కలుగనేరదు. నీవు లోభమును విసర్జించిన కాలఁదియుఁ బ్రవిమలానందచిత్తుఁడవయి సుఖింపఁగలవు.

నాయనా! నీవు దుఃఖముయొక్క శక్తిహీనుఁడవగు దాసుఁడవు కావు. అనూనమును, అక్షయమును, అపారమును నగు భవ్యానందము గృహద్వారమునఁ గూర్చుండి నీ రాకకుఁ బ్రతీక్షించుచున్నది. నీవు పాపమయ స్వప్నముల యొక్కయు, గాఢాంధకారములయొక్కయు నసహాయుఁడవగు ఖైదీవి కావు. ఇప్పటికిని నిమీలితములగు నీ నేత్రముల యొక్క రెప్పలపయిఁ బారిశుద్ధ్యముయొక్క మనోహరమగు జ్యోతి ప్రకాశించుచు నీ జాగరణమునకయి నిరీక్షించుచున్నయది.

స్వార్థముయొక్కయుఁ, శాపముయొక్కయు దుఃఖపరిపూర్ణమగు గాఢసుషుప్తియందు సుస్థిరానందము విస్మరింపఁ బడి పోఁగొట్టుకొనఁ బడుచున్నది. అప్పుడా పవిత్రానందము యొక్క గంభీరములగు గీతములు శ్రుతిగోచరములు కానేరవు. తదానందముయొక్క దివ్యపుష్పసౌరభము పాంథుని హృదయమును హర్షాబ్ధి నోలలాడింప నసమర్థమయిపోఁగలదు.

పాపములును, స్వార్థమును బరిత్యజింపఁ బడినపుడు—ఇంద్రియసౌఖ్యములనిమిత్తము విషయాదులయం దాసక్తమగు దుష్టపద్ధతిని విసర్జించినపుడు మానవుని బాధించుచున్న శోకభయాదు లంతరింప, వానిహృదయ మజరామరమగు బ్రహ్మానందజ్యోతిచే నుద్దీపితము కాఁగలదు.

పాపమును సంపూర్ణముగా బహిష్కరింప సమర్థమయిన హృదయమునుండియే నిర్మలానందము బహిర్గతమగుచున్నయది. ప్రశాంతస్వభావ మానందమున కునికిపట్టు. ఆనంద సామ్రాజ్యముయొక్క పునాదులు పుణ్యచారిత్రుల బాహుబలముపై నాధారపడియున్నవి. స్వార్థపరాయణు లానంద సామ్రాజ్యమందలి భయంకర విప్లవకారులు. ఆనందము స్వార్థులనుండి కడుదూరముగ నుండుచుండును. కలహప్రియుల నిది కన్నెత్తి వీక్షింపనొల్లదు. పాపాత్ములదృష్టికి నిత్యానందము సదా యగోచరమయి యుండుచుండును. హర్షము సుకృతముతోఁగూడి నిత్యము కాపురము సేయుచుండునట్టి మనోహరమును, పవిత్రమును, కోమలమునునగు నొకస్వర్గీయ పదార్థము. ఇయ్యది స్వార్థవాయువును గాంచినంతనే యంతర్హితమగుచు సదా ప్రేమ నన్వేషించుచుపోయి దానిని జేరుచుండును.

స్వార్థాభిలాష క్షీణించుచున్న కొలదియు హర్షమనూనమగు పరిమాణమందు మానవునకు లభించుచున్నది. హర్షముయొక్క సంపూర్ణస్థితియు, స్థిరత్వమును కేవలమొక్క పుణ్యాత్ములకే లభించుచుండుటలేదు. అయ్యది సర్వసాధారణులకును, వా రేయేగడియయందు స్వార్థమును విసర్జించుచుందురో ఆయా గడియయందు హర్షము రుచిజూచుటకుఁ దగినంతగా

లభించుచున్నది. విలాసయుతము కానట్టియు, క్షణికము
కానట్టియు, దూషితము కానట్టియు, శోకదాయకము కానట్టి
యుఁ, పవిత్రానందము మానవుని స్వార్థశూన్యమును
ధర్మాశ్రితమును, సత్యానుగుణ్యమును నగు ప్రతిభావ
మందును, గార్యమందును బుష్కలముగా లభించుచున్నది.

మానవుని స్వార్థత్యాగమునుబట్టియే వాని కానంద
మును సంప్రాప్త మగుచుండును. స్వార్థత్యాగమునకును,
నిత్యానందమునకును బ్రగాఢమగు బాంధవ్యముకలదు. మను
ష్యుఁడు స్వార్థాంధుఁ డగుచున్న కొలఁదియు నవశ్యము దుఃఖి
తుఁడును గావలసి వచ్చుచుండును. అహంకారమును, స్వార్థ
మును డీకొని వానిపై సంపూర్ణమగు జయమును బడసిన మను
ష్యుఁడే సజ్జనుఁడు; సత్పురుషుఁడు. ఆనంద మట్టి సత్పురుషుల
పెన్నిధి. జీవితాంతమందు దుఃఖము కలుగునని యథార్థమగు
నాచార్యుఁ డెవఁడును నుడువ నంగీకరింపనొల్లఁడు. జీవితాంత
మపూర్వానంద విలసితమనియే యతఁడు విన్నవించుచుండును.
అతఁడు పాపముయొక్క కారణముచే ననివార్య మగుచున్న
దుఃఖము నొక ద్వారమనియే వచింపుచుండఁ గలఁడు. అహం
కార స్వార్థము లెచ్చోట సమాప్తము లగుచుండునో, అచ్చో
డనుండియే శోకములు దూరముగాఁ దొలఁగి పోవుచున్నవి.
హార్దము సత్యముయొక్క పరమబంధువు. పవిత్ర జీవితమందు

దొలుత నెచ్చోట దుఃఖము రోదింపుచుఁ గూర్చుండియుండునో, కోమలమగు దయ యచ్చోటనే మూర్తీభవింపఁగలదు. స్వార్థత్యాగ ప్రయత్నమందు మానవుని బహువిధములగు దుఃఖము లాక్రమించుట యథార్థము. భ్రష్టుఁడు పవిత్రుఁడగుటయం దవశ్యము క్లేశముల ననుభవింపుచున్నాఁడు; కాని ప్రతిమానవుఁడు మహాత్ముఁడగుటకు యత్నించునపుడే భయవిషాదములకు గురియగుట తటస్థించును గాని, సంపూర్ణముగా సంస్కరింపఁ బడిన పిదప వాని జీవితమందంతట బ్రహ్మానందమే- బ్రహ్మానందము తాండవింపఁగలదు.

కుమారా! సుందరమగు పుష్పమెట్లు సిద్ధమగుచున్నదో విచారింపుము. తొలుదొలుత నొక క్షుద్రమగు నంకుర మంధకారమయమగు మృత్తికాంతర్భాగమునుండి తనమార్గము నన్వేషింపుకొనుచు వసుధోపరిభాగముయొక్క ప్రకాశము నుద్దేశించి బహిర్గత మగుచున్నది. పిదప నొకసన్నని మొక్క దృగ్గోచర మగుచున్నది. తదనంతరము కిసలయములఁ బొడవుచు వానినే పత్రములుగ సిద్ధమొనరింపుచున్నది. అసంఖ్యాకములగు దళములచే సుశోభితమయి మొక్క వృక్షముగ మారి మొగ్గలను దొడుగుచున్నది. తుదకా మొగ్గలనుండియే సంపూర్ణములగు పుష్పములు బహిర్గతములయి విశ్వముయొక్క నల్దెసలఁ దమదివ్యసౌరభమును, సౌందర్యమును, సౌకు

మార్యమును వెల్లడించి ప్రకృతియొక్క ప్రయత్నమును సమాప్తమొనరించి వేయుచున్నవి.

మానవజీవితమునయుత ఈ పుష్పస్థితిని బోలి యున్నది. మనుష్యుఁడు తొలుత స్వార్థముయొక్కయు, నజ్ఞానముయొక్కయు గాఢాంధకారముయొక్క భూగర్భము నందుండి జనుపాంథునివలెఁ బ్రకాశమును దడుముకొను చున్నాఁడు. అతఁ డట్లు కొంతకాలము తడుముకొనుచు గాఢాంధ కారమునుండి ప్రకాశమునఁ జొచ్చి క్రమక్రమముగా వేదనా దుఃఖముల ననుభవించి స్వార్థమును దూరమొనరించి యుద్ధ రింపఁ బడుచున్నాఁడు. అతఁ డంతమునకు వికసిత పుష్పము రీతి స్వార్థశూన్యమును, బవిత్రమును నగు జీవితమును బడసి సకలమానవాళి కనాయాసముగా శౌచముయొక్క సౌరభ మును నిత్యానందముయొక్క సౌందర్యమును ననుభవించు భాగ్యమును గలిగించుచున్నాఁడు.

పవిత్రహృదయులును, సజ్జనులును నగు మనుష్యులు సదా పరిపూర్ణానంద మయులయి వెలయుచున్నారు. ఈ విష యమును జనసామాన్యము న్యాయదృష్టితో న్యూనాధిక ముగ భావించినను మానవహృదయము స్వయముగా దీనిని సత్యమని భావింపఁగలదు. జనసామాన్యము దేవదూతలను బ్రి సన్నకాయులుగ భావించుటలేదా? అస్థి చర్మ మాంస మయ

దేహులగు మనుష్యులయందును ప్రసన్నమూర్తులగు వారు కలరు. అట్టి యానందమయ దేహులగు దేవదూతలు నిత్యమును మనతోఁ గలయుట తటస్థింపుచుందురే కాని మనము దేహధారులయి తమ హృదయాంతరాళముల బ్రహ్మానందజ్యోతిని ప్రకాశింపఁజేయు దేవదూతల గుర్తించునంతటి పవిత్రహృదయులము కాకపోవుటచే వారి నెప్పటికప్పుడే ప్రతిమార్గమందు విడిచి ముందునకు సాగిపోవుచున్నాము.

పవిత్రహృదయులే నిత్యానందమయులు. పాపమందును, పాపముతోఁ బోరుటయందును నశాంతియు, దుఃఖమును గలుగుచున్నవి. కాని సత్యముయొక్క పరిపూర్ణత్వమందును, మార్గమందును నిత్యానందము లభ్యమగుచున్నది. స్వార్థముయొక్క పొల్లును మనుష్యుఁడు దూరమొనరింపనంతవఱకు దుఃఖము నెదుర్కొనవలసియే యుండును. పొల్లునందుండి ధాన్యము వేఱుసేయఁబడిన పిదపఁ బొట్టును యంత్రముచే దూరమొనరింపవలసిన కార్యబాధ్యత తీరిపోవుచున్నది. ఇదియేరీతిగ నాత్మయందుండి శేషించియున్న దోషములు దూరమొనరింపఁబడినంతనే దుఃఖముయొక్క కార్యప్రణాళిక సమాప్తమయి పోవుచున్నది. పిదప మానవునకు దీని యవసరమే కలుగనేరదు. మానవుఁడంత నిత్యానందము ననుభవింపఁ గలుగుచున్నాఁడు.

ప్రపంచమందలి సమస్త మహనీయులును, సాధువులును, సంస్కర్తలును సహర్షముగ నొక శుభసంవాదమును దెలిపియున్నారు. ఆశుభసంవాదములఁ బాఠకు లెఱింగియే యుందురు. రానున్న విపత్తును నిరోధించివేయుట, రోగమును దూరమొనరించుట, మిత్రుల యొక్కయు, బంధువుల యొక్కయు క్షేమసమాచారములు వచ్చిచేరుట, కష్టదమనము, ఒకానొక కార్యమందు సాఫల్యమును బడయుట మొదలగునవియే శుభసమాచారములు. కాని మహాపురుషుల శుభసంవాదమేమి? దుఃఖితులకు శాంతియు, హతగాత్రుల కౌషధమును, శోకపీడితులకు హర్షమును క్షుధార్తుల కాహారమును, బాపాత్ములకు విజయమును, నిరాధారులకు నివాసగృహమును, విదీర్ణహృదయుల కానందమును కలుగుటయే యా శుభసంవాదము. ఈ మహత్తరములగు పదార్థములన్నియు జన్మాంతరమందు లభించునని భావింపరాదు. ఇవియన్నియు నీలోకమందే యిప్పుడును సంసిద్ధముగా నున్నవి. ఇవి తెలిసికొనఁదగినవియుఁ, బ్రాప్తింపఁజేసికొనఁ దగినవియు, భోగింపదగినవియు నయి యుండుటవలననే మహాత్ము లెలుగెత్తి చాటు రహస్యము నవలోకింపుడు.

"అన్నలారా! స్వార్థముయొక్క దృఢతమ బంధనములఁ ద్రెంచివైచినవ్యక్తియే యీపదార్థముల నన్నింటి బడసి

స్వార్థశూన్యమగు ప్రేమయొక్క దేదీప్యమానమగు స్వతంత్ర సామ్రాజ్యమునఁ జేరుచున్నాఁడు.

మానవమూర్తి! నీవేల యాలసించెదవు? మంచితనము నన్వేషింపుము! దానిని బడసిన పిమ్మట దానిని బాగుగా నభ్యసించి, తత్సంబంధ మగు ననుభవమును సముపార్జింపుము. దీనిచే నీవు మిక్కిలి గాఢమును, కోమలమును, మధురమును నగు బ్రహ్మానందము లభింపఁగలదు. నీవు పరులహితమును గూర్చి విచారించుట యందును, వారి కొఱకుఁ జింతించుట యందును, వారిని ప్రేమించుటయందును, వారిని సేవించుట యందును నెంత పరిమాణమందు నీస్వార్థమును బరిత్యజింతువో, అంత పరిమాణమందే నీవు బ్రహ్మానందము లభింపఁ గలదు. దానికంటె నధికముగ హర్షము లభించుట యసంభవము.

స్వార్థత్యాగముయొక్క ద్వారమునకు లోపల నిత్యానందమందిరము వెలయుచున్నది. అభిలాషగల ప్రతి వ్యక్తియు నందు నిరభ్యంతరముగాఁ బ్రవేశింప వచ్చును. సందేహయుక్త చిత్తుఁడగు మానవుఁడు స్వార్థద్వారమును దాటిపోయి నే నుడివియుండిన మాటలసత్యమును బరీక్షింపవచ్చును. స్వార్థము దుఃఖమును, జ్ఞానమానందమును మనకేకాక నమస్త లోకమునకుఁ గలిగించు చున్నదనియు, మనతోడఁ గలసిమెలసి

వర్తించువారునయితము మన స్వార్థశూన్యతచే నత్యంతము
లగు సౌఖ్యానందములఁ బడయఁ గలరనియు, మనుష్య సృష్టి
యొకేవిధముగ నున్నదనియు, నొకని సౌఖ్యమే యెల్లరి సౌఖ్య
మనియు గ్రహించి మనము సాధారణ మార్గములను, నయిత
మానంద సంధాయకములుగఁ జేసికొనుచు శత్రువులయొక్క
మార్గములందుఁ బడియున్న కంటక సముదాయముల నెత్తి
పాఱవైచి స్వార్థశూన్యమగు ప్రేమయొక్క వికసిత కోమల
ప్రసూనముల మెత్తగా నేర్పఱుప వలయును. మనశత్రువు
లేమి, మిత్రులేమి, మఱి యితరు లేమి యాపుష్పాచ్ఛాదిత
మార్గముపై నడుగులిడుచుఁ బ్రయాణము సాగించినంతనే వికసిత
కుసుమము లగు పారిశుద్ధ్యముయొక్క సౌరభముచే వాయు
మండలము నింపివైచి, నిర్మలానంద సుగంధముచే మానవ
లోకమును హర్ష సాగరమున నోలలాడింపఁగలము. ప్రేమ
సామ్రాజ్య పట్టాభిషిక్తులే యాత్మవిజేతలగుటచే నిత్యానంద
తరంగ డోలికల నుయ్యెలలూగుచుండఁగలరు.

## దశమ ప్రకరణము.

# మౌనము.

ఓ మనుష్యుఁడా! నీవు మౌనముద్ర నవలంబింపుము. మౌనము మానవజీవితమునకు ముకుటము. ప్రతిదినము కడు దీర్ఘమయి యున్నను మనమద్దాని విశేషభాగమును వ్యర్థమగు లోకాభిరామాయణమునుగూర్చి ప్రసంగించుటయందుఁ గడపి వేయుచున్నారము. దినమునకు రెండుమూడు గడియలయినఁ బ్రతిమానవుఁడు మౌనమును ధరించు టావశ్యకమయియున్నది.

మానవుఁడా! నీవు నీభాషణమును శక్తిసంపన్నము గను, బ్రభావోపేతముగను జేసికొన నభిలషింపు చుంటివేని కొలఁదిసేపయిన మౌనమును వహించి, మిథ్యావాదమును విసర్జించి వ్యర్థగోష్ఠికిఁ గడంగక జ్ఞానమును సంపాదించి మౌనముయొక్క స్వర్గసౌభాగ్యము ననుభవింపుము. —ఏ. యల్. సామన్.

ఓ యంతఃకరణమా! నీవు నిశ్శబ్దముగా నుండుము. ప్రజ్వలితోద్వేగమునుండియుఁ, గార్యాతురతనుండియు క్షణమాత్రకాలము విడివడి విశ్రాంతి నందుము. సదా విశ్రాంతి

నొకవ్యసనముగ నేర్పఱచికొనవలదు. దినమున కొక్కగడియ కాలమేని త్రికరణపూర్వకమగు మౌనముతో నేకాంతముగ నుపవసింప భీతిల్లకుము. వికాసమున కిదియొక సూక్ష్మమగు నుపాయము. —అరనైస్టు క్రాసబీ.

బుద్ధిమంతుఁడగు మానవుని భాషణమం దొకవిధమగు ప్రభావోత్పాదకశక్తి సహజముగా నెలకొని యుండుచుండును. కాని వాని మౌనమునం దంతకంటె గంభీరమగుశక్తి వెలయుచుండఁగలదు. ఆదర్శప్రాయులగు నుత్తమపురుషులు సుజ్ఞానసిద్ధులయి యుండియుఁ బ్రాయికముగా నిస్తబ్ధతను వహించియుండి మన కధికప్రభావయుక్తమగు శిక్ష నొసంగఁ గలుగుచున్నారు. మహాపురుషులయొక్క మౌనభావ మెన్నిశతాబ్దముల పర్యంతమయిన భూలోకమున సుస్థిరముగా నుండి మానవకోటికి శిక్షాప్రద మగుచుండును. వాక్చాతుర్యమును గల్గియున్నట్టియు, వాదప్రతివాద నైపుణ్యయుతుఁ డయినట్టియు వక్తయొక్క వాక్యముల వేలకొలఁది జను లాలకింపుచుండఁగలరు. అట్టివక్తల గంభీరోపన్యాసములు వినునపుడు శ్రోతలకు మిక్కిలి రుచికరములుగఁ గాననగుచుండినను గాలాంతరమం దవి బొత్తిగా విస్మృతింబడి కాలగర్భమున లీనమయి పోవుచున్నవి. పాయిలెటు జీసనుప్రభువును "సత్యమన నేమి?" యని ప్రశ్నించినపుడు జీసను గంభీరమగు మౌనముద్రాంకి

తుఁ డయ్యెను. ఆమహానుభావుని యప్పటిమౌన మతని విశాల
మగు ప్రతిభను, నిరుపమానమగు బుద్ధివికాసమును, అనంత
మగు మేధాశక్తిని సహస్రముఖంబుల నుద్ఘోషించుచున్నది.
ఆమౌనము వినయముతోడను, నుపాలంభనములతోడను బరి
పూర్ణమయియుండి సదా "దేవదూతలకేని ప్రవేశింప శక్యము
కానిస్థానము మూఢులకు సులభగమ్యమయియుండు" నను కోవి
దవాక్యమును జరితార్థమొనరించుచున్నది.

తర్కశాస్త్రవేత్తలగు బ్రాహ్మణులు రెండువేల శతా
బ్దములకుఁ దొలుత వారణాశియందు శ్రీబుద్ధదేవుని "బ్రహ్మ
మన నేమి?" యని ప్రశ్నించుచు మిక్కిలి బాధింప, దేవుఁడు
మౌనమును వహించియుండెను. ఆ ప్రభువుయొక్క పరమ
గంభీరమగు మౌన మతని చిరకాలార్జితమగు జ్ఞానముకంటె
జనసామాన్యమునకు గురుతరమగు నీతిశిక్షను బ్రసాదించి
యుండెను. ఆమహనీయుఁడు కేవలమూఢులకు మౌనముచే
నట్టిశిక్ష నొసంగఁజాలకపోయినను బండితలోకమునకు మాత్ర
మపూర్వమగు శిక్ష నొసంగ సమర్థుఁ డయ్యెను. అసహన
ముతోఁ గూడియున్న భగవదాస్తిక్య నాస్తిక్యవిషయమున
వాదవివాదములు పెచ్చు పెరుగుటకు హేతువేమి? ప్రజ లీ
విషయమున సామాన్యమగు దయాళుత్వమును, శ్రద్ధను నభ్య
సించి బుద్ధిబలముయొక్క సామాన్య నియమముల గ్రహించు

టుచితము. భగవత్పదార్థమన నేమి యను విషయమును గూర్చి విశ్వమునం దిన్ని వాద వివాదములును, సందేహములును గలుగుటకు హేతువేమి? తొలుదొల్త మనము మన విషయమును గుఱించి తెలిసికొను టావశ్యకము. నాస్తికవాదము బుద్ధిహీనతకుఁ బ్రమాణసూచకమగు చిహ్నము కానేరదు. ఇదియే చందమున నాస్తిక్యమునకును, వినయమునకును సమానములగు బౌద్ధమును, నాధ్యాత్మికమును నగు పరిపక్వ స్థితియొక్క లక్షణములు లభింపనేరవు. లావుగారు తన జీవితకాలమున లోకమున కాదర్శశిక్ష నొసంగియున్నారు. "బుద్ధిమంతులు శబ్దముల నుచ్చరింపకయే మౌనముచే నుత్తమశిక్ష నొసంగుచున్నారు." ఈ మౌనశక్తిచే లావుగారి కనేకులగు శిష్యు లేర్పడిరి. ఆమహనీయుఁడు ప్రాయికముగా నేకాంతమందు మౌనవ్రతము నవలంబించి యుండువాఁడు. అతఁడు మౌనవాణి నాలకించుటకుఁగాని, స్వయముగా లోకమున కుపదేశించుటకుఁగాని లాలసుఁడయి యుండలేదు. ప్రజలే స్వయముగా నతనిచెంత కరిగి జ్ఞానపాఠముల నభ్యసించుచుండిరి. ప్రాచీనకాలముయొక్క మహాపురుషుల మౌనయుతములగు కార్యములు దూరమునందుండి ప్రకాశించుచు వారికిఁ గర్తవ్యపథములఁ జూపించు దీపముల వంటివి. కారణమేమన మంచితనమును, సుజ్ఞానమును సంపా

దింప నభిలషించు మానవుఁడు తా నెప్పుడెప్పుడు మాట్లాడవలసి యుండునదియు, నేరీతిగ సంభాషింపవలసినదియు, నెప్పుడెప్పుడు మౌనమును వహింపవలసినదియు, నే యే నుడువుల నుచ్చరింప రానిదియు స్పష్టముగా గ్రహించు టావశ్యకము. జిహ్వపై నధికారమును సుస్థాపిత మొనరించుకొనుట బుద్ధిబలము యొక్క ప్రథమ కర్తవ్యము. మస్తిష్కమును స్వాధీనమునం దుంచుకొనుట యంతకంటె నత్యుత్కృష్టము, పరమావశ్యకము నగు ధర్మమయి యున్నది. ఈరెండు కర్తవ్యముల నిర్వహించుటయందు విజయమునందిన వ్యక్తు లాత్మవిజయమును సాధింప సమర్థు లగుచున్నారు. రసనేంద్రియమును నిరోధించు వ్యక్తి మస్తిష్కముపై సంపూర్ణాధికారమును నెఱప శక్తుఁడగుచున్నాఁడు. మూర్ఖుఁడు వదరుచు, వ్యర్థగోష్ఠి సలుపుచు, వాదప్రతివాదములకుఁ గడంగుచు నిరంతరము వాచాలత్వమను నస్త్రమును బూని శబ్దసంగ్రామ మొనరింపుచుండును. అతఁడు సదా తన వాక్చమత్కృతిని గూర్చి స్తుతించుకొనుచుఁ బ్రతివాదియొక్క వాగ్బంధనముఁ గావించితిని కదా యని మది భావించుచు గర్వపడుచుండును. వాఁడు తన మాధ్యమునకయి యభిమానము వహించుచుఁ దన రసనమును గుఱించియే నిత్యము చింతించుచుఁ దనశక్తి నంతయు వ్యర్థప్రయోగములందు దుర్వ్యయ మొనరించుచుండును.

అట్టి మూఢుని జీవితము సస్యప్రదమగు క్షేత్రమును బాసి చవిటిభూమిని మిక్కిలిశ్రమచే దున్ని విత్తుచుండెడి కర్షకునిజీవితమును బోలుచున్నది.

ధీమంతుఁడు వ్యర్థప్రసంగమునుండియు, దంభములనుండియు, మిథ్యాకథనమునుండియు నిరంతరము దూరముగా నుండుచుండును. అతఁ డేవిషయమం దేని పరులచేఁ బరాభవింపఁబడినను నిర్వికారమూర్తియయి సంతుష్టాంతరంగుఁ డగుచుండును. అతఁ డెప్పుడేని యొకపందెమునఁ దోటువడినఁ దా నింతవఱకు గ్రహింపఁజాలకయుండిన దోషమొండు మానసికచక్షువునకు గోచరించి బుద్ధిబలమును వృద్ధిగావించెను గదా యని హర్షించుచుండును. "సమాప్తము" అను శబ్దము నుచ్చరింప నౌత్సుక్యమును వహింపని మనుష్యుఁడు ధన్యుఁడు. ఒకానొక మహాపురుషుని కథన మొం డీ సందర్భమున స్మరణకు వచ్చుచున్నది. "నేను తొలుత శబ్దశాస్త్రవేత్తలతోడను, తర్కశాస్త్రనిష్ణాతలతోడను శాస్త్రార్థమును, వాదవివాదమును గావించుచుండెడి వాఁడను. కాని నేనిపు డామార్గమును గడునింద్య మని గ్రహించితిని. నే నిపుడు వాదవివాదము లొనరించుటను, బరులపై దోషారోపణము గావించుటను విసర్జించి వైచితిని. నేను కేవలము సకలమును వినుచుఁ, జూచుచు నుందును. అవసర మగునేని ప్రశ్నకే సాధ్యమయి

నంత క్లిష్టముగాఁ బ్రత్యుత్తరము నొసంగుచుండును. మౌన వ్రత మాహాత్మ్యమును సంస్మరించి నప్పుడెల్ల నేను విస్మితుఁడ నగుచుందును." పరులు రెచ్చగొట్టినను నిశ్శబ్దతను వహించు టయే యాత్మపరిపక్వమును, సహానుభూతిపూర్ణమును నగు చున్నదనుటకుఁ బ్రమాణములు. విచారశూన్యుఁడును, దయా హీనుఁడును నగు మనుష్యుఁడు స్వల్పముగ రెచ్చగొట్టఁబడి నను వెక్కసముగ నుద్రేకపూరితుఁ డగుచుండును. అట్టిమను ష్యుఁడు తన్నమాత్రము పరు లాక్షేపించినను తనబుద్ధియొక్క స్థిరత్వము (తూకము)ను జెఱచుకొనుచుండును. శ్రీ బుద్ధదే వుని యొక్కయు, జీససుప్రభుని యొక్కయు గంభీరమగు నాత్మదమనము, కౌతుకమును, దాంత్రిక విద్యాప్రదర్శనమును గానేరదు. వారి మౌనము వారి పరిపక్వస్థితియొక్కయు, బుద్ధివైశాల్యముయొక్కయుఁ బ్రబలదృష్టాంతము. మనము గ్రంథములందు జీససుప్రభువు వాదవివాదములయొక్క శబ్దమున కయినఁ బ్రత్యుత్తరము నొసంగి యుండలేదనియు, శ్రీ బుద్ధమహాప్రభువు శాస్త్రార్థములందు నిమీలితనేత్రుఁ డయి, నీరవుఁడయి యుండెడివాఁడనియుఁ జదువునపు డాలోక పావనచారిత్రుల గంభీరమౌనముయొక్క యపారమగు శక్తియొక్కయు, వారి యథార్థమగు మహత్త్వముయొక్కయు సౌమ్యద్యుతి నవలోకింపఁ గలుగుచున్నారము.

మౌనియే శక్తిసంపన్నుఁడగు మనుష్యుఁడు. వదరుచుండు మనస్సు నిశ్శబ్దములయం దెట్టిపరిభావ[illegible]ండనేరదు. అతని యాధ్యాత్మికశక్తులు నిత్యము వదరుచుండుటయందే వ్యయమయిపోవుచున్నది. ఆధ్యాత్మికశక్తిహీనుఁడైయుండు నిగ్రహముండనేర్పుట యసంభవము. ఒకానొకయంత్రము యొక్క శక్తిచేఁ గార్యమును సాధించుకొనవలసివచ్చినపుడు యంత్రసంచాలకుఁడు తొలుదొలుత నాయంత్రము యొక్క వివిధోపకరణముల యథోచితస్థానమునందుంచి బాహ్యబలముచే దానియందొకశక్తి నావిర్భూతముఁ గావించుచున్నాఁడు. బుద్ధిమంతుఁడగు మనుష్యుఁడును యంత్రమును నడుపువానివలెనే తనశక్తుల నన్నింటి గూర్చుకొని వానిని స్వాధీనమునం దునిచికొనవలసినపుడెల్ల వానిని యథోచితముగ నుపయోగించుచుఁ గర్తవ్యముల సాధించుచున్నాఁడు.

వాస్తవికమగు శక్తి మౌనవ్రతమునందే వెలయుచున్నది. మోక్షప్రాప్తికి విజ్ఞానధనులగు భారతీయ ఋషిపుంగవు లవలంబించియుండిన ముఖ్యసాధనములలో మౌనవ్రతము గణ్యస్థానమునే యలంకరించుచున్నది. మొరుగుచుండు శునకము కఱవనేరదనియుఁ, గరవనేర్చిన శునకము మొరగనేరదనియు వచింపఁబడుసామెత లోకానుభవసిద్ధమయినది. వెడల్పు మోముగల సీమదేశపు కుక్కలు (Bulldogs) భయానకమగు

మానమునందుఁ బ్రఖ్యాతిని వహించియున్నవి. ఆ కుక్క యితరసమయములందు జడప్రతిమవలె నుండి యవసరమైనప్పుడు దీర్ఘకాలనిస్తబ్ధసంచితమగు శక్తి నొక్కుమ్మడి వెచ్చించి యెంతటి ఘనకార్యమునయిన సఫలమొనరించి వేయుచున్నది. ఈకుక్కయొక్క మాన మధమశ్రేణికి వర్తించునదయి యున్నను మానవప్రతినియమప్రభవమునే చాటుచున్నయది. ప్రాయికముగా బడాయిఁగొట్టు మనుష్యుఁ డపజయములకు గుఱియగుచుండును. అతని ధ్యాన మెపుడును నిజోద్దేశ్యము నుండి విభక్తమయిపోవ, వాని యంతరికశక్తు లన్నియు నాత్మశ్లాఘయందే వ్యయమగుచున్నవి. వాని మనోబలమంతయు వాని కార్యముయొక్కయుఁ, గార్యపర్యవసానముయొక్కయు శోభమునందు వ్యయమయిపోవుచున్నది. తన సైన్యము నొక్కచో సమావేశపరచు విధము నెఱుంగక బహుప్రదేశములయందునిచి యుద్ధయాత్రకరుగు సేనానాయకునివలె మానముయొక్క ప్రయోజనము నెఱుంగని వ్యక్తి తన కర్తవ్యముల నిర్వహింపఁ గడంగుచుండును. వినమ్రస్వభావుఁడును, నుద్యోగియు నగు పురుషుఁడే కార్యకుశలుఁడు కాఁగలుగుచున్నాఁడు. అతఁ డాత్మాభిమానమునుండియు, నాత్మశ్లాఘనుండియు విడివడి తన సమస్తశక్తుల కార్యమును విజయపూర్వకముగ సిద్ధమునరించుటయందుఁ బ్రయోగింపుచు

న్నాఁడు. వదరుపోతు తనశక్తిసామర్థ్యములఁ బ్రశంసించుకొనుటయం దెంతసమయమును వెచ్చించుచుండునో కార్యార్థి యంతసమయమునే కార్యసంపాదనమునం దుపయోగించి వాచాలునికంటె శీఘ్రముగఁ గర్తవ్యమును నిర్వహింపుచున్నాఁడు. విభక్తమగు శక్తిసంచితమును, సురక్షితమును నగు శక్తియొక్క వశమునందుండెనను నియమము, సర్వవ్యాపకమును, సార్వకాలికమును నయియున్నది. వదరుచుండునట్టియు, నాత్మస్తుతిగావించుకొనుచుండునట్టియు మూఢుని, నిస్తబ్ధముగా నుండుచు నమ్రస్వభావమును గలిగియుండు వాని సులభముగాఁ బరాభవింపఁగలుగుచున్నాఁడు.

మానవవ్రతమునం దపారమగు శక్తికల దను నిబంధనము సార్వదేశికము. కార్యకుశలుఁడగు వణిజుఁడు తనవ్యాపారపద్ధతులను, వివిధోపాయములను, ఉద్దేశ్యములను స్థానస్థానమందు లాభము నపేక్షించి, చాటుచుఁ దిరుగనొల్లఁడు. అతఁడు వ్యాపారవిజయముచే ముగ్ధుఁడయి స్వానుభవశూన్యునివలె స్థానస్థానమందు వదరుచుఁ దిరుగుచుండినచో వానివ్యాపార విజయపతాక భూతలపతితమగుట సత్యము, ఆధ్యాత్మిక పరిభావసంపన్నుఁడగు వ్యక్తి తనయొక్కయుఁ, దన యాంతరిక సాఫల్యముయొక్కయు విషయమునుగూర్చి స్తుతిపాఠమును బ్రారంభింప నొల్లఁడు. అతఁ డిట్లాచరించినచో వాని

యాధ్యాత్మికశక్తియుఁ, బ్రభావమును క్షీణించిపోవ మిక్కిలి దుర్బలుఁడు కావలసివచ్చును. సాఫల్యము వ్యావహారికమయినను ధార్మికమయినను నద్యాది శక్తిసంపన్నమును, ధైర్య సమన్వితమును నగు మానవప్రతిముయొక్కయు, దృఢసంకల్పముయొక్కయు, మనోబలముయొక్కయు బరిచారికయయి యున్నది. విశేషముగు బలమును గలిగియున్న శక్తులు కోలాహల మొనరింపఁజాలవు. ఆడంబరమునకుఁ గల సంరంభము సౌమ్యస్థితికి లేదని యే నుడువవచ్చును. జడమతి స్వల్పకార్యముల నాచరించునపుడును గలకల మొనరింపుచుండ మహాప్రభావయుతుఁడగు మనుష్యుఁ డెంతటిఘనకార్యములననైన సద్దులేకుండగనే సాధింపుచున్నాఁడు.

నాయనా! నీవు బలాఢ్యుఁడవును, బ్రయోజకుఁడవును, స్వావలంబనపరాయణుఁడవును గాఁ గోరుచుంటివేని మానవ్రతమందలి విశేషమగు ప్రయోజనమును, సామర్థ్యమును శీఘ్రమభ్యసింపుము. నిన్నుగురించి నీవే మాట్లాడుకొనవలదు. ప్రపంచము మిథ్యాభాషిని బలహీనునిగను, నీచునిగను భావించి, వానిడంబములఁ బలుకు స్వభావమునకుఁ గినిసి తత్క్షణము వానిని విసర్జించి వేయుచున్నది. నీ వాచరింపవలసిన కర్తవ్యమునుగూర్చి ఆచరణమునకుఁ బూర్వమునుండియు నుపన్యసింపఁ గడంగకుము. పదరులకంటెఁ గార్య మాచరించి లోకమునకుఁ

జూపుటయే మానవవ్రతముయొక్క ముఖ్యలక్షణము. అమూల్యమగు నీశక్తిని బరులయొక్క కార్యవిధానమును విమర్శించుటయందును, వారిని నిందించుటయందును వెచ్చించివేయకుము. ప్రతిమానవుఁడు తనశక్తిని స్వీయకర్తవ్యసాధనమునందు సఫలత్వము నపేక్షించి వ్యయమొనరించుట శ్రేయస్కరము. ఉన్నతవిధానము ననుసరించి యాచరింపఁబడిన కార్యము సయితము విశేషోత్సాహముతోడను, మాధుర్యముయొక్క సాహాయ్యముచేతను జేయఁబడినచోఁ బరుల కార్యములను గూర్చి నిందించుటకంటెను, విమర్శించుటకంటెను వేయిమడంగు లుత్తమము. నీవు సదా పరులకార్యముల నిందింపుచుంటివేని నీకార్యపద్ధతి యెట్లున్నదా యని తలంచుటయైన లేదు. పరులు తమ కార్యముల నుత్తమరీతిఁ గావించుకొనక యున్నచో నీవు వారికిఁ దోడ్పడుచు, నీకర్తవ్యముల బాగుగా నిర్వహించుకొని వారికి మార్గదర్శకుఁడ వగుము. పరులు నిన్ను నిందింపకుండునట్లును, నీవు పరుల నిందింపకుండుటకును దగిన రీతిని విచారింపుము. మూఢు లెవరైన నిన్ను దూషింపుచుఁ జీటికిమాటికి నీపై దండెత్తుచున్నచో నభంగమగు మౌనముచే వారల లజ్జితులఁ గావింపుము. ఈరీతి నీ వాత్మవిజయమును సంపాదించినచో భాషింపకయే పరుల వారి యపరాధములకై దండింపఁ గలుగుదువు.

యథార్థమగు మౌనము జిహ్వేంద్రియమును బంధించుటచే లభింపనేరదు. చిత్తమున బ్రశాంతస్థితియం దుంచుటయే వాస్తవికమగు మౌనలక్షణము. స్త్రీ, కేవలము రసనేంద్రియమును బంధించి, మానసము నస్థిరముగను, నిత్యము వ్యర్థసంచార మొనరించుదానిగను నుంచినచో నిట్టి మౌనము దుర్బలత్వమును బారఁదోలుట కౌషధమును, శక్తిని సంపాదించుట కుత్తమసాధనమును గానేరదు. మౌనము మనస్థైర్యమునందును, హృదయమందును సంపూర్ణముగా వ్యాప్తము కాఁగలిగినపుడే శక్తిసంపన్న మగుచున్నది. మౌనము సదా ప్రశాంతముగనుండు టవసరము. మనుష్యుఁడు తనపైఁ దాను విజయమును సంపాదింప నేర్చినకొలఁదియు విస్తృతమునుఁ గంభీరమును, సుస్థిరమును నగు మౌనమును సంప్రాప్తింపఁజేసికొనుచున్నాఁడు. క్రోధము, ద్వేషము, దుఃఖము, భయము, వికారము మొదలగు దుష్టప్రవృత్తులు మానసమునం దుపద్రవముల నావిర్భవింపఁ జేయుచున్నంత పర్యంతము మౌనవ్రతముయొక్క పవిత్ర గాంభీర్యము పరిపక్వస్థితిఁ బ్రాపింపఁజాలదు. పరుల వాక్యములవలనను, కార్యములచేతనుఁ నీ ప్రకృతి దుఃఖము నందుచున్నంతకాలము నీవు దుర్బలుఁడవనియు, నపవిత్రుఁడవనియు, నాత్మనిగ్రహశక్తిశూన్యుఁడవనియు లోకమునకు స్పష్టమగుచుండఁగలదు. కావున సదా ప్రశాంతి

నభివృద్ధిపఱచునట్టి దురభిమాన, దురహంకార స్వార్థ ప్రవృత్తుల నీహృదయాంతరాళమునుండి వెడలించివేయుము క్రోధలేశమునకయిన నీహృదయమున స్థాన మొసంగకుము. ఏవిధమగునట్టి కీడును, నిందయు నీయంతఃకరణముయొక్క నిర్మలశాంతిని భంగమొనరింపకుండునట్లు చూచుకొనుము. దృఢముగా నిర్మితమయిన యుత్తుంగ ప్రాసాదముపై నుండి ప్రచండమగు వాయువు కడురయమునఁ బర్వెత్తుచున్నది; కాని యానికేతనమునకెట్టి హానియు గలుగుచుండుట లేదు. తన్మందిరమునం దధివసించు మనుష్యులెల్లరు నిర్విచారముగను, నిశ్చింతగను, ప్రశాంతముగను గూర్చుండి సౌఖ్యమయము లగు తమదినములఁ గడుపుచుందురు. ఇదియేచందమున సుదృఢమును, సక్రమమును నగు బుద్ధిమందిరమునఁ గాపురము సేయు మానవున కెట్టి విపత్పరంపరలును నష్టమును గలిగింప నేరవు. అతఁ డాత్మనిగ్రహపూర్వకముగను, నిశ్చలముగను విశ్రాంతి సౌఖ్యము లనుభవించుచుఁ గూర్చుండి యుండఁ గలఁడు. కేవలము జితేంద్రియుఁ డగు మానవోత్తముఁడే మానవజీవితాభ్యుదయమునకావశ్యకమగు నాదర్శమాన వ్రతము నవలంబింప సమర్థుఁడు.

ఒకానొక విషయమును గూర్చి గొప్ప యాడంబరము తోడను, వైభవముతోడను బ్రసంగింపక, తన్నిర్వాహణమున

కెట్టి యాందోళనమును, గోలాహలమును గావింపకయే మనుష్యుఁడు కార్యసిద్ధి నందలేఁ డని జనసామాన్యము నుడువుచుండుపద్ధతి కేవల మనుభవశూన్యమును, భ్రమాన్వితమును నయియున్నది. వ్యర్థప్రసంగి, శాంతముగ విచారించునట్టియు నిశ్శబ్దముగాఁ గార్యమును సాధించునట్టియు వ్యక్తిని వ్యర్థునిగ భావించుచుండును. అతఁడు నిస్తబ్ధత యను నేమియు సేయకుండుట యనియుఁ, ద్వరపడుట, ఆతురపడుట, అవిరామముగఁ బ్రసంగించుట బాగుగాఁ బనిసేయువాని లక్షణము లనియుఁ దలపోయు చుండును. అతఁడు కేవలము సర్వప్రియత్వము నే శక్తి యనియుఁ, బ్రభావ మనియు నెంచు చుండును. కాని విచారశీలుఁడును, కార్యకుశలుఁడును నగు మనుష్యుఁడే యథార్థమగు కార్యనిర్వాహకుఁడు. కార్యనిర్వాహకుఁడు సదా వివేచించి, కార్యతత్త్వమును గ్రహించి, దానిమర్మములఁ బరిశోధించి, తాత్పర్యము ననుభవగత మొనరించుకొని కర్తవ్యాచరణమునకుఁ గడంగు చున్నాఁడు. ప్రకృతి మానవవృత్తివలనను, నద్భుతమగు రసాయనము మూలమునను వసుంధరయొక్కయు, వాయువుయొక్కయు స్వయంభూతములగు తత్త్వములచే వృక్షములయొక్క కోమలములగు దళములను, సుందరములగు పుష్పములను, రుచికరములగు ఫలములను, వివిధములగు నగణితమనోహరాకృతులనురచించు

విధంబుననే మానియు, వివిధార్థసాధకుఁడగు గార్యకరయు మానవులయొక్క యాచరణపద్ధతులను, బృథ్వియొక్క స్వరూపమును, స్వకీయశాంతిబలముచేతను, జమత్కారమువలనను మార్చివేయుచున్నాఁడు. అతఁడు వస్తువులయొక్క పరివర్తనశీలమును, నప్రాకృతికమును నగు స్థితితోఁ గ్రీడింపనోల్లఁడు. కాని యాపదార్థములయొక్క యాంతరిక రహస్యస్థానము వరకుఁ జేరఁగలుగుచున్నాఁడు. అతఁడటఁ జేరి కార్యమొనరింపుచున్నాఁడు. అంతిమసమయ మేతెంచినపుడు, మృత్యువు వాని స్థూలదేహమును భౌతికప్రపంచమునుండి తొలఁగించివేసినపుడును వానిగుప్తములును, నజరామరములును నగు ప్రయాసముల సత్ఫలితములు ప్రపంచమును సౌఖ్యానందమయముగఁ జేసివేయుచున్నవి. కాని వ్యర్థభాషియగు మనుష్యుని ప్రసంగములు, వాక్యములు కడుశీఘ్రముగ నశింపుచున్నవి. శాబ్దికకృషి (సేద్యము) చే ఫలములు ఫలింపనేరవు.

తనమానసికశక్తుల నన్నింటి నేకీభవింపఁ జేసికొనునట్టియు, సంచయ మొనరించుకొనునట్టియు మనుష్యుఁడే తన సమస్తదైహికశక్తులను నయితము కేంద్రీభూత మొనరించుకొనఁ గలుగుచున్నాఁడు. శీఘ్రగామియుఁ, జంచలచిత్తుఁడును, గోలాహలుఁడును నగు మనుష్యునికంటె సామాన్య మనుష్యుఁడే శ్రేష్ఠతరమగు స్వాస్థ్యసుఖము ననుభవించి

విశేషకాలము జీవింపఁగలుగుచున్నాఁడు. ప్రశాంతమును, విన
మ్రమును నగు మానసిక భద్రస్థితిచే శారీరక భద్రస్థితి వృద్ధి
నందుచున్నది. మానస మాత్మదమనముయొక్క ఫల మగుట
వలననే శక్తిసంపన్నము కాఁగలుగుచున్నది. మనుష్యుఁ డెంత
విశేషమగు సఫలత్వముతోఁ దన్నుఁ దాను వశపఱచుకొను
చున్నాఁడో, అంత యధికముగ శాంతిని, మానమును బడయఁ
గలుగుచున్నాఁడు. కారణమేమన నతఁడు స్వార్థమయములగు
భోగవిలాసముల ననుభవించుటకుఁగాక మహత్తరమగు నేది
యో యొక యుద్దేశ్యమును సాధించు నిమిత్తమే కార్య మాచ
రింపుచున్నాఁడు. కావున నతఁడు భౌతికప్రపంచము యొక్క
బాహ్యకలహములనుండి దూర మరుగుచుఁ బరమశాంతి
యొక్క యాంతరిక భద్రస్థితికిఁ బ్రాపించుచున్నాఁడు. అతఁడు
మాట్లాడు ప్రతిశబ్దమున కేదియో యొక గంభీరమగు నుద్దే
శ్యమును, మహార్థమును నుండుచుండును. అతని ప్రతిమాన
మునకును విశేషార్థము లేకుండనుండదు. అశ్రుపాతమునకును,
దుఃఖమునకును హేతుభూతమగునట్టి యొక శబ్దమేని వాని
శ్రీముఖమునుండి వెలువడనేరదు. పశ్చాత్తాపమును, క్లేశము
లను గలిగించునట్టి యేకార్యము నతఁ డాచరింపనొల్లఁడు.
మంచిమాటల నుడువుచు, శుభకార్యముల నాచరించుచు
నతని యంతఃకరణము ప్రశాంతమయి యుండుచుండఁగలదు.

ఇట్టి పరిశాంతస్థితి నందిన మనుష్యుఁ డాత్మవిజేతయయి తన జీవితకాలమునంతయు సౌఖ్యానందపూర్వకముగఁ గడుపుచుండఁగలఁడు.

---

## ఏకాదశ ప్రకరణము.

# ఏకాంతవాసము.

కుమారా! ఆధ్యాత్మికమగు నేకాంతవాస మొసంగఁగల ప్రత్యుత్తరమునకయి బాహ్యవస్తువుల నన్వేషించుచుంటి వేల? స్వర్గముయొక్క దివ్యదృశ్యము నీసమీపమునందే యుండ గిరులపై నధిరోహించు శ్రమ కేల పాల్పడుచుంటివి? మహాత్ముఁడేకాంతవాసమున విచారించుచు రాత్రిలం దాకాశమండలమును సుశోభితమొనరించు తారకాసముదాయమును మధ్యందినసమయమందే తనదివ్యదృష్టిచే విలోకించుచున్నాఁడు.

—ప్లైటీయరు.

మౌనవ్రతకాలమందు సకలేంద్రియములు ప్రశాంతములయి యున్నపుడు మనుష్యుఁడా! నీవు నీహృదయమందిరమును బుద్ధిభండారముచే నింపివేసికొనుము. ఏకాంతవాసమున మానవుఁడు దీర్ఘమగు తత్త్వాలోచనమునకుఁ గడంగుచో

జ్యోతిస్స్వరూపమగు పరమపదముయొక్క మంగళాకృతిని వీక్షించుటయం దభ్యర మేమికలదు? — వర్డ్స్‌వర్తు.

మానవుని ప్రధానాస్తిక్యము (ఉనికి) ఆంతరికమును, సద్వృత్తమును, నాధారాస్తికము నయియున్నది. కాని నాయండు స్వీయజీవితమును, బలమును, బాహ్యమునుండి కాక లోపలినుండియే పడయుచున్నాడు. బాహ్యవస్తువు లనేకవిధములగు రూపములు. వీనినుండియే మానవాస్తిక్యముయొక్క శక్తులు వ్యయమగుచు దహనరూపమున స్రవించిపోవుచున్నవి. వ్యయమగు శక్తులను తిరిగి మనుష్యుడు సంపాదింపగోరినచో నాంతరమానవత్వము నాశ్రయింపవలసి వచ్చుచున్నది.

మనుష్యుడు తనయాభ్యంతరికమానమును జంచలేంద్రియములయొక్క కోలాహలయుక్తములగు విలాసములకయి వెచ్చించుచు, బాహ్యపదార్థ సంఘర్షణమందు లీనుడగుచున్న కాలందియు భయంకర క్లేశములను, దుఃఖములను ననుభవించి తుద కత్యంతపరిశ్రాంతచిత్తుడయి విశేషమగు విశ్రాంతి నొసంగు ప్రశాంతమగు ఏకాంతవాసముయొక్క చరణకమలముల నాశ్రయించుచున్నాడు.

మానవుని దేహము కేవలము ధాన్యముయొక్క పొట్టును, బొల్లను భుజించి జీవింపలేని విధంబుననే, పవిత్రమగు మానవాంతరాత్మయును కేవలము నిస్సారములగు విలాసములపై

నాధారపడి యుండజాలదు. మానవశరీరమునకు సకాలమున యథోచితమగు భోజనము లభింపనిచో నది దుర్బలమయి, క్షుత్పిపాసలచే వ్యాకులతను జెంది, ఆహార పానీయముల కయి యఱవ నారంభించుచున్నది. ఆత్మయొక్క స్థితియు నింతియే. ఏకాంతమందీ యాత్మకును స్వచ్ఛమును, బవిత్రమును నగు భావాహారమును నొసంగు టావశ్యకమయి యున్నది. లేనిచో దీని నవీనతయు, శక్తియు నశించిపోవును. అంతమున క్రియాత్మపదార్థము క్షుద్బాధకు దాళలేక దుఃఖ భారముచే నలుగతి యేడ్వ నారంభించుచున్నది ప్రకాశము కొఱకును, ఆశ్వాసము నిమిత్తమును దుఃఖితాత్మకు గలుగు ప్రగాఢాభిలాషయే దానియొక్క క్షుత్పిపాసానివారణమున కయి కావించుకొనబడు విన్నపము. సమస్త దుఃఖక్లేశములు మానవాత్మ క్షుద్బాధచే మరణించుచున్న దని సూచించుచు న్నవి. అంతరాత్మ జ్ఞానప్రకాశముల నభిలషించుచో దదభి లాషయే భోజనమున కయి కావింపబడు మొఱయని మనము గ్రహింపవలయును. దుశ్చరిత్రుడగు పుత్రుడు విశ్వజీవిత క్షేత్రమున బ్రవేశించి తనతో గొనిపోయి యుండిన ధనధాన్యముల దుర్వ్యయము నొనరించి వైచి, ఆహార పానీయముల కాధారము లేక పితృగృహాభిముఖుడగు చందముననే మానవాంతరాత్మయు విలాసముల కయి బుద్ధివివేకబలముల

ద్వినియోగ మొనరించియుండినచో దుర్బలమయి తిరిగి శక్తిని సంపాదింప న్యూనుల పడుచుండఁగలదు.

ఇంద్రియలోలత్వమం దాత్మకుఁ బవిత్రమగు జీవితము లభింప నేరదు. విషయ సేవనముచే నింద్రియములు మదించి యాత్మవికాసమును హరించుచున్నవి. ఇంద్రియములు సదా విరామము లేకుండ నింద్యములగు భోగవిలాసముల నభిలషించుచు మానవజీవితశాంతిని భంగ మొనరింప జూచుచుండును. ఇంద్రియముల ననుసరించుటచే క్షణికమగు బాహ్యానందము, కోలాహలము, చాంచల్యము, క్లాంతి, దుర్బలత్వము మొదలగు దుఃఖదాయకము లగు పర్యవసానముల మనుష్యుఁ డనుభవింప బాధ్యుఁ డగుచున్నాఁడు. ఇంద్రియలోలత్వముచే మానసిక శక్తులకు సంభవించు నష్టమును మనుష్యుఁడుతిరిగి యాభ్యంతరికమగు - శాంతవాసముచే బూరించుకొనఁ గలుగుచున్నాఁడు. కష్ట మొనరించిన పిదప తిరిగి శక్తిని సంపాదింప దేహమునకు విశ్రాంతి యావశ్యకమయిన రీతిగనే మానవాంతరాత్మయుఁ దనశక్తులను దిరిగి యథోచితస్థితికిఁ బ్రాపింపఁజేయ నిమిత్తము విశ్రాంతి నేకాంతవాసముచేఁ బడయవలసియున్నది. మానవుని స్థూలదేహమునకు సంపూర్ణారోగ్యము కొఱకు నిద్ర యావశ్యకమగు విధముననే సూక్ష్మశరీరము యొక్క స్వాస్థ్యమునిమిత్త మేకాంతవాస

మత్యంతావశ్యకము. దేహమునకు వ్యాయామ మెంత ప్రయో
జనకరమగుచున్నదో, ఏకాంతవాసముచే జనించు పవిత్రము
లగు భావములును నిశ్చలమగు ధ్యానమును మానవాంత
రాత్మ కంతటికిని లాభదాయక మగుచున్నది. అవశ్యకములగు
విశ్రాంతియు, నిద్రయు లేనిచో దేహము శిథిలమయి పోవు
రీతి నాత్మయు నావశ్యకములగు శాంతియు నేకాంతవాస
మును లేకపోవుటచే వికాసశూన్య మయిపోవుచున్నది.
మనుష్యు డాధ్యాత్మికాభివృద్ధియొక్క గణనముచే సమయా
సమయములందు నశ్వరపదార్థమయమగు బాహ్యప్రపంచ
మునుండి వెలుపడి, అంతరికమగు నేకాంతవాసముయొక్క
సుస్థిరములును, నజరామరములును నగు సత్యములను సేవింప
నంతపర్యంతము తన శక్తిని, ధార్మికత్వమును సుస్థిర మొన
రించుకొనజాలడు. ధర్మముచే జితమునకు సంప్రాప్తమగు
సామర్థ్యమ మేకాంతవాసముచే సులభముగా లభ్య మగుచు
న్నది. ధర్మవిధుల ననుసరించి, యోగారూఢుడయి, ప్రాపంచి
కములగు నాతంకములనుండి విమోచనము నంది ధ్యానోపాసన
ములకు గడంగినచో నివి మనుష్యునకు సమయా సమయము
లందు నాధ్యాత్మిక శాంతియందు మానసమును లీన మొన
రించు పద్ధతిని, నమున్నతములును, పవిత్రములును నగు వాస
నలయం [illegible]మును లగ్న మొనరించు రీతిని నేర్పుచుండు

గలవు. మానవుని హృదయాంతర్గతములగు ప్రబోధకశక్తులు మానవునియొద్దఁగల సంపదలకంటె నుత్తమములును, యోగ్యములును నగు సంపదలనుబడయ నిరంతర మన్వేషింపుచుండును. ఏకాంతవాసముచే నెపుడును దన మానసమును స్వచ్ఛముగను, శాసనపాలనయోగ్యముగను జేసికొన కర్వాని మనుష్యుఁడు నిరంతరము లౌకికవిధులయొక్క సాహాయ్యము నపేక్షించుచుండవలసియుండును; కాని దివ్యమగు నాత్మికమన బలప్రభావముచే నాత్మవిజయమును గాంచినట్టియు, స్వేంద్రియముల వశమొనరించుకొని నేకాంతమును సేవించుచున్నట్టియు మనుష్యుఁడు పవిత్రములగు కర్తవ్యపథముల ననుసరింప మానసమును మచ్చికకుఁ దెచ్చుచు విజయమును గాంచుచున్నాఁడు. ఇట్టివిజేతలు మహాపురుషులయొక్కయు, ధర్మాచార్యులయొక్కయుఁ, బూజామందిరములయొక్కయు, సద్గ్రంథములయొక్కయు నావశ్యకతయే యుండదు. శ్రీరామకృష్ణాదు లిట్టివిజేతలశ్రేణియం దెన్నఁదగియున్నారు. పూజామందిరములు పవిత్రహృదయుల కానందవిహారములు కానేరవు; కేవల మవి దూరదృష్టిలేని పాపాత్ముల నుద్ధరించుటకు సామాన్యసాధనములు. సంస్కృతహృదయుఁడు సర్వవ్యాపకమగు ప్రేమజ్యోతిని విసర్జించి మానవకల్పిత మందిరాంతరాళమందలి జడమయకృత్రిమ ప్రకాశమును విలోకించుటయందానందము ననుభవింపఁజాలఁడు.

మనుష్యుఁడు, జీవితముయొక్క కష్టములను, విపత్పరంపరలను, లాలసలను ఢీకొనుటకు శక్తిని, వానిరహస్యముల గ్రహించునిమిత్తము శాంతిని, వానినిఁ బరాజితము లొనరించుకొనుటకు జ్ఞానమును, వానిపై సంపూర్ణాధికారమును వహింప స్థిరమగుబుద్ధిని యేకాంతవాసముచే సంపాదింపవలసియున్నది. ధరాంతర్గతమయి, దృష్టికగోచరమయియుండు పునాదియొక్క సాహాయ్యముచే భవనము సురక్షితముగ నుండు చందముననే మనుష్యుఁ డేకాంతవాసమున హృదయమునం దావిర్భవింపఁ జేసికొనియున్న సుదృఢములును, దీవ్రములునునగు భావములచేఁ జర్మచక్షువులకు గోచరింపరానట్టి ప్రబలశక్తిని, శాంతిని సంపాదించి వానిని సుస్థిరము లొనరించుకొనఁ గలుగుచున్నాఁడు.

ఏకాంతమందే మనుష్యుఁడు తన్నుఁ దాను స్పష్టముగా గుర్తింపఁగలుగుచున్నాఁడు. అతఁ డేకాంతముననే నిజస్వభావమును, బ్రకృతియొక్క శక్తిని, బ్రభావమును గ్రహింప సమర్థుఁడగుచున్నాఁడు. ప్రపంచముయొక్క నానా కోలాహలములందునుఁ బరస్పరవిరుద్ధములగు వాంఛలయొక్క కేకల మధ్యయందును బవిత్రాత్మయొక్క వాణి శ్రుతిగోచరము కానేరదు. ఏకాంతవాసము లేనిదే మనుష్యుఁ డాధ్యాత్మికాభ్యుదయము నందనేరదు.

ఈశ్వరసృష్టియందుఁ దమపైఁ దాము తీవ్రతరమగు దృష్టినిఁ బ్రసరింపఁజేసికొనుటయందు దిగులొందునట్టియు, దమ యాంతరికస్వరూపమును సంపూర్ణముగా గ్రహించుటకు భయావహము లగుచుండునట్టియు మనుష్యు లెందరో కలరు. వా రేకాంతమందుఁ దమ ప్రత్యాంతఃకరణమునుండి బహిర్గతములగుచుండు గంభీరములగు భావములను గాంచ వాంఛించుటకుమారు భయము నొందుచుందురు. వారు క్షణాలమయినఁ బరులతోడు నపేక్షింపక స్వతంత్రాలోచనమందు నిమగ్నులయి యుండఁజాలరు. అట్టి దుర్బలహృదయు లేకాంతమునఁ గూర్చున్నంతనే తమ వివిధవాసనలయొక్క భూతప్రేతముల మానసిక ప్రతిబింబము ప్రత్యక్షముగ గోచరించినంతనే భయకంపితులయి పోవుచున్నారు. కావుననే వా రేకాంతవాసముచే నాత్మవిజయపథము నన్వేషించి నిత్యానందము ననుభవించుటకుమారుగఁ గేవలము నినోదముయొక్క నాదం తీవ్రస్వరమున వినఁబడుచుండు నట్టి స్థలములకును, బరమసత్యముయొక్క దివ్యవాణిని వినరాకుండఁ జేయునట్టి మహా సంరంభయుతములగు ప్రదేశములకును జనుచుండుట కలవడియుందురు. కాని సత్యముమీఁద ప్రబలస్నేహమును గలిగి యుండునట్టియు, బుద్ధివికాసము నభిలషించుచుఁ దన్మార్గము నన్వేషించుచుండునట్టియు మానవోత్తముఁడు నిత్య మే

శాంతవాసమందే కాలము గడుపుచుండును. అతఁడు తన యథార్థమగు స్వరూపమును సంపూర్ణముగను, స్పష్టముగను విలోకింపఁ గలుగుచున్నాఁడు. అతఁడు సదా కోలాహలమయ ప్రపంచమునందలియు, కల్పితానందమయస్థానములనుండియు దూరముగా నుండుచుఁ బరమసత్యముయొక్క మృదుమధురమగు దివ్యగానము ప్రతిధ్వనించుచుండు పవిత్రస్థానమును జేరుచుండును. అప్పుడతనికి యీ పరమసత్యముయొక్క పవిత్రవాణి వాని హృదయకుహరమున ధ్వనింప నారంభించి వానికొక లోకోత్తరశాశ్వతమగు సంగీతానందరసమును పాన మొనరింప నొసంగుచుండును.

ప్రపంచమందు మనుష్యు లధికముగా సంగీతమున కయి యాతురపడుచుఁ దిరుగుచున్నారు. వారు నూతనము లగు వినోదములను, వింతలను, నవీనము లగు నాహ్లాదములను, నుత్తేజనములను మిక్కిలి యన్వేషించుచున్నారు. కాని శాంతి యను నెట్టిదో వారు గుర్తింపఁజాలనట్టి గాఢాంధకారమున మునింగియుండుచున్నారు. వారు క్షణికములును, హీనములును నగు వినోదములయొక్క వివిధమార్గములందు సౌఖ్యమును దమకుఁ గొనుచుఁ దిరుగుచున్నారు. కాని వారెప్పటికిని విశ్రాంతిసౌభాగ్యమునకే నోచకున్నారు. నానావిధములగు హాస్యముల మూలమునను, జ్వరపూర్ణములగు ప్రలాపముల

మూలమునను వారానందమును, జీవితమును వెంబడింపుచు
దిరుగుచున్నారు. కాని నిరంతరము శోకాతురులయి యుండి
యవిరామముగ నశ్రుపాత మొనరింపుచుఁ, దుదకు భయం
కర మృత్యుముఖంబునఁ బడి పోవుచున్నారు.

స్వార్థబహుళములగు నాహ్లాదముల నన్వేషించుటలో
మనుష్యుఁడు జీవితసముద్రముపైఁ గొట్టుకొనిపోవుచు నాశల
నిధియొక్క ప్రచండవాయు వేగమందనఁగా తుపానునందుఁ
జిక్కువడి పోవుచున్నాఁడు. అట్లు తుపానునకుఁ జిక్కి, మొదు
రుదెబ్బలఁ దినుచు, ఘోరముగ దురపిల్లుచుఁ దుద కెప్పటికో
స్వీయాస్తిత్వముయొక్క గంభీరమానమునందు విద్యమాన
మయి యున్న రక్షణ మను కొండ నారోహింపఁ గలుగుచు
న్నాఁడు.

మానవుఁడు బాహ్యమగు కృషియందు నిమగ్నుఁడయి
యున్నంతపర్యంతము వాని యాధ్యాత్మికశక్తి హీనమగుచునే
యుండఁగలదు. అతఁడు హీనమగు తనయాభ్యంతరికశక్తిని
దిరిగి పరిపుష్టమొనరించుకొన నభిలషించినచో నేకాంతవాస
మందు ధ్యాన మొనరింపవలసివచ్చుచున్నది. ఏకాంతవాసము
నుండి విముఖుఁడయి యుండు వ్యక్తి జీవితముయొక్క సత్య
జ్ఞానమును బడయనేరఁడు. ఒకవేళ సత్యజ్ఞానమును సంపా
దించినను దానిని స్వల్పకాలపర్యంతమయిన సురక్షితముగా

నుంచుకొనఁజాలఁడు. ఈ రహస్యముచే నేకాంతవాసము యొక్క ప్రభావ మెల్లరకు గోచరింపుచున్నది. ఏకాంతవాసముచే జీవితము యొక్క సత్యజ్ఞానమును సముపార్జింపనేరని వ్యక్తి తన హృదయక్షేత్రమున సూక్ష్మముగను, నగాధముగను వేరూనియున్న పాపములను గ్రహింపఁజాలఁడు. కారణమేమన సత్యజ్ఞానములేని వాని కాపాపములు బాహ్యమునకుఁ బుణ్యములుగనే గానవచ్చుచుండును. మహోచ్చకోటికిఁజెందిన ధీమంతులుదక్క లోకమందలి సమస్తమానవులీపుణ్యరూపమునందున్న మహాభయంకరపాపములకు బలియయిపోవుచున్నారు.

"అంతర్ధ్యానముయొక్క నిస్సబ్దము లగు గడియలందు వినీతభావములోఁ దనపైఁ దాను సందేహమును శ్రద్ధను వహించునట్టి మానవోత్తమునియందే వాస్తవికమగు మహత్త్వము వెలయుచుండును."

సదా బాహ్యములగు నుత్తేజనములకుఁ జిక్కియుండు మనుష్యుఁడు నిరాశను, శోకములను గురియగుచుండును. ప్రపంచిక విలాసములయొక్క నినాదము మిక్కిలి ప్రబలమగు స్థానమందే హృదయశూన్యతయు మిక్కటముగా నగాధమును, తీవ్రమును నగుచుండును. ఎవ్వాని సమగ్ర జీవితము విలాసములయొక్క లాలనలయందే కాక, ప్రపం

చిర కార్యవ్యగ్రతయందుఁ జిక్కువడియుండెనో, ఎవ్వఁడు దృష్టపదార్థములయొక్క పరివర్తనశీలమగు ధర్మముచేతనే నిజప్రయోజనమును గలిగించుకొనఁ జూచుచుండునో, ఎవ్వఁ డేకాంతవాసముయొక్క ముఖ్యావలంబనముచే స్థిరాస్తిక్యము యొక్క యాంతరికపును. సదృష్టమును నగు సూక్ష్మప్రపంచ మును వీక్షింపఁజాలఁడో అట్టి మనుష్యుఁడు పయితము జ్ఞాన మునుఁ బుద్ధిని సంపాదింపలేక శూన్యహృదయుఁడయియుండు చున్నాఁడు. అతఁ డేవిధముగను జగత్తునకు సాయమొనరింపఁ జాలఁడు; అవసరమయినపుడు తన యోగ్యములగు కాంక్షలను బలిదాన మొసంగనేరఁడు. కారణమేమన వానియొద్ద సమ ర్పణ మొనర్చుటకు ఉపభోజనమే లభింపనేరదు. వాని యాధ్యాత్మికభండారము శూన్యమయియుండును. కాని వస్తు వులయొక్క సత్యమును నిర్ణయించు నిమిత్తమే కాంతము నాశ్రయించునట్టియుఁ దన యింద్రియముల పరిభూతి మొన రించుకొను, నిజేచ్ఛాప్రాబల్యముఁ దగ్గించినట్టియు మనుష్యుఁ డనుదినము నూతనమగు జ్ఞానమును, బుద్ధిని సంచయ మొన రించుకొనుచున్నాఁడు. అతఁడు వలయుచోఁ బ్రపంచమున కుపారమగు సాహాయ్యము నొనరింపఁగలుగుచు సత్యస్వరూ పముచేఁ బరిపూర్ణుఁడయి యుండుచున్నాఁడు. కారణమేమన వాని యాధ్యాత్మికభండారము సమృద్ధిగ నుండుచుండును

ఆబాల్యమునుండి పుష్కలముగా సంపదల వినియోగింపు మన్నకాలఁదియు వృద్ధియగుచుండును.

మనుష్యుఁ డాధ్యాత్మిక సత్యములయొక్క ధ్యానము నం దనురక్తుఁడయి యున్నంతవఱకు మిక్కుటముగా జ్ఞానమును, బోధనను సంపాదింపఁగలుగుచున్నాఁడు. అతఁడు కోమలమగు పుష్పమువలె సత్యములయొక్క సర్వవ్యాపకమగు ప్రకాశమువైపునకుఁ దన్నుఁ దానే వికసింపఁజేసికొనుచు, జీవిత చైతన్యమును బ్రసాదించు రశ్మిని బ్రాప్తింపఁజేసికొనుచు దానిని గబళించివేయుచున్నాఁడు. అతఁడు జ్ఞానముయొక్క యక్షయనిర్ఝరముయొద్దకేగి సుప్రసన్నహృదయముతో నాసిలమేటి దివ్యోదకమును పానమొనర్చుచుఁ దన తీవ్రపిపాసను నివర్తింపఁ జేసికొనుచున్నాఁడు. ఇట్టిమనుష్యుఁ డేకాగ్రమగు ధ్యానముచే నొక్క సంవత్సరకాలములో సద్గ్రంథపఠనముచేఁ బడయఁజాలని సత్యజ్ఞానము నొకగడియయందే సంపాదింపఁగలుగుచున్నాఁడు. ఆస్తిక్య మహత్మ్యము. జ్ఞాన మనంతము, దాని యుద్గమస్థాన మభంగము. పైని వచించిన సత్పురుషుఁడు తన యాస్తిక్యముయొక్క యాంతరిక గాంభీర్యముపై విశ్వాసమును గలిగియుండుచున్నాఁడు. అతఁడు స్వర్గీయ వివేకముయొక్క యనూనప్రవంతియందలి హృదయాహ్లాదకరమగు జలమునుండి నజరామరత్వమును బానమొనరించుచున్నాఁడు.

ఆస్తిక్యముయొక్క పరమసత్యములతో సంయోగమొనరించుకొన నలవడియున్న వ్యక్తియే ప్రతిభాసంపన్నుఁడు. అతఁడే జీవితజలముయొక్క శాశ్వతోద్గమస్థానమందుఁ జేటికి మాటికిఁ జేరి తెజ్జలమును పానమొనరింపుచున్నాఁడు. కుశాగ్రబుద్ధియొక్క సంపాదనపద్ధతులు అసంఖ్యాకములును, నభేద్యములును నయియున్నవి. కారణమేమన నాపద్ధతులు సర్వవ్యాపకములును, నున్నతియొక్క ప్రాథమికద్వారములును నయియుండుటచేతనే కుశాగ్రబుద్ధియొక్క సమస్తకార్యములు నిత్యనూతనములయి రాజిల్లుచున్నవి. కుశాగ్రబుద్ధి తనజ్ఞానమును బరుల కొసంగుచున్నకొలఁదియు జ్ఞానమునందు స్వాభావికముగాఁ బరిపూర్ణుఁ డగుచుండును. వాని ప్రతికార్యమును సంపూర్ణమయినపిదప వానిమస్తిష్క మపూర్వమగు నభివృద్ధిని గాంచి విస్తృత మగుచుండఁగలదు. అతఁడు సమస్తవస్తువులయొక్క మర్మముల గ్రహింపుచుఁ బ్రకృతిశక్తియొక్క చరమసీమను వీక్షింప సమర్థుఁడగుచున్నాఁడు. కుశాగ్రబుద్ధి జ్ఞానముచే నిండియుండు చున్నాఁడు. వాఁడు తనశక్తియొక్క ప్రభావముచే నంతముయొక్కయు, ననంతముయొక్కయు భేదము నేకీభూతమొనరించివేయుచున్నాఁడు. అతనికి సామాన్యసాహాయ్యక ప్రయోగములయొక్క యవసరమే తటస్థింపనేరదు. జలాశయములనుండి కిరణములద్వారమున దివా

కరుఁడు జలమును గ్రహించువిధంబుననే సూక్ష్మగ్రాహి
యగు కుశాగ్రబుద్ధి సకలార్థసిద్ధిదాయకమును, సకలకార్య
సాధకమును, హృదయాహ్లాదకరమును నగు జ్ఞానసలిలము
నాసర్వవ్యాపకమగు ఝురమునుండి యవసరమగునపుడెల్ల
గ్రహించుచున్నాఁడు. కుశాగ్రబుద్ధియందును, సామాన్య
మానవునందును గలభేదమును మనము తెలిసికొనుట యుచితము.
కుశాగ్రబుద్ధి యాభ్యంతరికసత్యమునందు నిత్య మధివసించు
చుండును. సామాన్యమానవుఁడు సదా బాహ్యదృశ్యము
లందే కాపురము సేయుచుండును. సాధారణమనుష్యుఁడు
వినోదములను, వింతలను విలోకింపఁ దిరుగుచుండఁ గుశాగ్ర
బుద్ధి నిత్యము బుద్ధిసంచయమునకయి సంచార మొనరింపు
చుండును. సామాన్యమానవుఁడు గ్రంథములపై నాధారపడి
యుండుచుండఁ గుశాగ్రబుద్ధి తన యాంతరికశాస్త్రములపై
నవలంబితుఁడయియుండుచున్నాఁడు. పుస్తకజ్ఞానము శ్రేష్ఠ
మయినదే, కాని దీనియొక్క యథార్థావశ్యకతను గ్రహింప
వలసి యుండును. అప్పుడే గ్రంథపఠనము లాభదాయకము
కాఁగలదు. లేనిచో విద్యార్థి బుద్ధి నుపయోగింపఁ జేయఁజాలఁడు.
బుద్ధియొక్క సంచయద్వారము స్వయముగా జీవితమునందే
యేర్పడియున్నది. ఈ ద్వారమును మనుష్యుఁడు స్వాభ్యాసానుభవ
ములచే గ్రహించి తెలియఁగలుగుచున్నాఁడు. పుస్తకములచే

మనకు సమాచారములు తెలియవచ్చును. కాని స్థిరమగు జ్ఞానము లభింపనేరదు. సద్గ్రంథములు మనజ్ఞానసంపాదనకై నుత్తేజిత మొనరింపఁగలవు, కాని స్వయముగా జ్ఞానమును సంపాదింపనేరవు. కావున మన కేవల సద్గ్రంథపఠనములో సంతృప్తి పడియుండక, స్వయముగా శ్రమపడవలసి యున్నది. కేవల గ్రంథములపై నవలంబితుఁడయియుండు వ్యక్తి తనలో పలి మౌనసంచయ ద్వారమును సమీపింప జాలకపోవుటచేఁ దానొనరించిన శ్రమనంతయు వ్యర్థ మొనరించి మిక్కిలి పరిశ్రాంతుఁడయి పోవుచున్నాఁడు. అతఁడెంత చతురుఁడై యున్నను జ్ఞానము నార్జింపఁ జాలఁడు. అతఁడు తన సమాచారభండారము (గ్రంథాలయము) వలన శీఘ్రముగాఁ జేరఁగలుగుచున్నాఁడు, కాని శూన్యుఁడగుచు నాసమాచారములనే సంపాదించుచు మస్తకకోశమును నింపివేయుచున్నాఁడు. చీటికి మాటికి నతఁ డొనరింపుచుండు నట్టి కార్యములచే జీవితముయొక్క మధుర స్వాతంత్ర్యమును, నవీనతను బడయఁజాలఁడు ఇట్టి మనుష్యుఁడు జ్ఞానోపలబ్ధియొక్క యసంతమార్గములనుండి తన్నుఁ దానే తొలఁగించుకొని, జీవితముతోడి పొత్తును విసర్జించి మృతప్రాయములగు నశ్వరదృశ్యములతోడఁగూడి వ్యవహరింప నారంభించుచున్నాఁడు. సమాచారములు సమాప్తము లగుపోవుచున్నవి, కాని జ్ఞాన మెప్పటికిని సమాప్తము కానేరదు.

చమత్కృతబుద్ధియు, మహత్త్వప్రాప్తియు నేకాంతమందు బుద్ధులును, వికసితములును, సంపూర్ణములును నగుచున్నవి. అతిసామాన్యమనుష్యుఁ డయినను నిత్య మేకాంతమునందుఁ దన శక్తులను, మనోబలమును గూర్చి విచారింపుచు నావిధి సూక్ష్మదృష్టితో మొనరించుకొన నాలోచింపుచుఁ దన యాదర్శప్రాయమగు నభిలషితకర్మను గూర్చి విచారింపుచు, బరీక్షింపుచు నున్నచో నిజాభీష్టసిద్ధినందు త్వరలో కుశాగ్రబుద్ధి కాఁగలుగుచున్నాఁడు. ప్రపంచముయొక్క వివిధములగు వినోదములను, విలాసములను సంపూర్ణముగా విసర్జించి, సర్వజనప్రీతిపాత్రతనందియు, మిథ్యాప్రశంసనుండియు విముఖత్వమును వహించి, సకలమానవజాతియు కల్యాణము నిమిత్తమే దేనియొక్క మహోన్నతాదర్శమును సంపూర్ణ మొనరించుటకయి యేకాంతమం దాలోచన గావింపుచుఁ గార్య మొనరింపుచుండు మనుష్యుఁడు భవిష్యద్ద్రష్టయు, స్వయంసిద్ధుఁడును గాఁగలుగుచున్నాఁడు. నిశ్చయముగా నిజహృదయమును మృదులముగను, మధురముగను, సుందరముగను, బవిత్రముగను, శ్రేష్ఠముగను జేసికొనుచుండునట్టియు, నేకాంతమందుఁ జిరకాలపర్యంతము ధ్యానపూర్వకముగ వస్తువుల యాంతరికమగు శాశ్వతనిర్ణయ మొనరింపుచున్నట్టియు మనుష్యుఁ డాస్తిక్యముయొక్క యుత్రశాస్త్రవ్యవస్థయుతుఁ డగుచు

న్నాఁడు. ఆతఁడు, సార్వజనికగీతమునకు సుస్వాగత మొసంగఁ దన హృదయమందిర సింహద్వారమును దెఱచివేయుచున్నాఁడు. అతఁ డీరీతి వర్తించి తుద కొక కవియయి పోవుచున్నాఁడు.

సమస్తవిధములగు కుశాగ్రబుద్ధులసిద్ధి యొకేవిధముగ నుండుచుండును. కుశాగ్రబుద్ధి యేకాంతము యొక్క స్వచ్ఛహృదయమును, దివ్యదృష్టిని, స్పష్టమగు శ్రవణశక్తిని గలిగియున్నట్టి సుందరాకారుఁడగు నొక బాలకునివంటివాఁడు. కాని యపుడపుడు కుశాగ్రబుద్ధిచే మానముయొక్క సురక్షితద్వారమునుండి విలోకింపఁబడు కోలాహల ముగ్ధమగు ప్రపంచము, వాని నిగూఢమగు భేదమును, గ్రహింపఁజాలదు.

అన్యమతావలంబుల యెడ మిక్కిలి క్రూరముగ వర్తింపుచుండిన సెంటుపాలు తన క్రైస్తవమతమునం దంధభక్తిని, బక్షపాతమును గలిగియుండెడివాఁడు. పరమత సహనబుద్ధియు, విశ్వసోదరప్రేమయు లేని యతఁడు మూఁడుసంవత్సరముల కాలము వనమునం దేకాకియయి వసించి, నిరంతరైకాంతచింతనముచే నాత్మపరిశోధనమునం దప్రతిహత ప్రతిభా భా సముపేతుఁడయి, విశ్వజనీన ప్రేమయుతుఁ డగు ధర్మదూతయు, భవిష్యద్దర్శియగు సిద్ధుఁడును నను విఖ్యాతిని

విశాలమగు క్రైస్తవప్రపంచమున సంపాదించియుండెను. భోగవిలాసములమధ్యఁ బోషింపఁ బడియున్న రాజనందనుఁడగు శ్రీ సిద్ధార్థుఁడు తొలుత నొక సామాన్యమానవుఁడయియుండి కోలాహలమయప్రపంచమును బాసి ఘోరారణ్యముల వత్సరషట్క మేకాంతముగ వసించి, నిశ్చలచిత్తముతోఁ బరమసత్యస్వరూపమునుగూర్చి తర్కించి, చింతించి, ధ్యానించి చపలములగు నింద్రియములతో ఘోరసంగ్రామ మొనరించి, కాముని హతమొనర్చి, తనయాస్తిక్యము యొక్క గంభీరభేదములఁ దీవ్రమగు ధ్యానముతో విచారించి శుద్ధుఁడును, సిద్ధుఁడును, బుద్ధుఁడును నయి జ్ఞానపిపాసార్తుల కెల్లరకు నజరామరత్వమును బ్రసాదించు మహానిర్వాణ జ్ఞానపీయూషధారను బాన మొనరింపఁ బ్రసాదించి ధన్యుఁడయ్యెను. శ్రీబుద్ధభగవానుఁ డేకాంతవాసమందలి ధ్యానపరిభావము నత్యద్భుతమని తన శిష్యులతో నుడివియుండెను. చిత్తశాంతి కేకాంతవాసము మిక్కిలిప్రయోజనకర మగు సాధన మని ధమ్మపదమువంటి వేదగ్రంథ మెలుగెత్తి చాటుచున్నది. లావ్రూగారివంటి యొక సామాన్య మనుష్యుఁడు సుజ్ఞానాన్వేషణమున బయల్వెడలి, యేకాంతవాస స్వీకారముచే భగవత్సాక్షాత్కారమును బడసి ప్రపంచమునం దొక విఖ్యాత ధర్మాచార్యుఁడు కాఁగలిగెను. అక్షరజ్ఞానములేని వడ్రంగి

పుత్రుఁడగు జీసను చాలకాలము పర్వతములపై నేకాంతవాసమొనర్చి అనంతమగు విశ్వప్రేమమయుండును, విశాలమగు పవిత్రబుద్ధియుండును ధ్యానమున వసించి స్వర్గరాజ్యమును బడసి విఖ్యాతమానవజాతీయకల్యాణకర్త కాఁగలిగెను.

ఈ మహాపురుషులెల్లఁ బవిత్రమును, స్వర్గీయమును నగు జ్ఞానముయొక్క సమున్నతశిఖరముపై సమారోహించిన పిమ్మటసమయమున సావకాశములం దెప్పుడును మాటిమాటి కేకాంతమున కరుగుచుండెడివారు. మహాపురుషశిరోమణియై యునను కేవల మేకాంతవాసముచేఁ బ్రాపించునట్టి లీనయాంత్రికశక్తిని మాటిమాటికిఁ బుష్టియుతమును గావించుకొనుచుండనిచో దనయాధ్యాత్మికోన్నతినుండి పతితుఁడయి నిజప్రభావమును గోల్పోవవలసినవాఁ డగును. శ్రీబుద్ధాది ధర్మాచార్యులు తమభావములను, లోనియుత్పాదకశక్తులను నంతఃకరణముతో సమాన మొనరించి, తమయా సిక్యమును స్వాధీన మొనరించుకొని సర్వవ్యాపకమగు విశ్వవాంఛలో వ్యక్తిగతమగు స్వేచ్ఛాభిలాషను లీన మొనర్చి, అసాధారణ శక్తిని సంపాదించి, ఉత్పాదకములును, కారణభూతములును నగు భావముల కధినాయకులయి జగదున్నతికి ముఖ్యహేతుభూతు లయిరి.

ఇది యొక కౌతుకము కాదు, కాని సుస్థిరమగు నొక నియమము. శాసనస్థితియం దెట్టి గుప్తభేదముండని విధముగనే శ్రీబుద్ధాది మహాత్ముల పవిత్రజీవితములందును నెట్టి కుతూహలమును లేదనియే చెప్పవచ్చును. ప్రతిస్థితియం దామహాశక్తియొక్క రూపము సమానముగా నుండఁగలదని చెప్పవలను పడదు. మహాపురుషులయందు విశేషముగా గానవగు నట్టిశక్తి చాలసంవత్సరములవఱ కవిరామముగా నేకాంతవాస మొనరించుటచే సంప్రాప్తమగుచున్నది.

మానవుని సత్యవాసస్థానము మహత్తరమగు మానసమునందే విరాజిల్లుచున్నది. వానియందుఁగల సత్యమునకును, స్థిరత్వమునకును మానసమే యుద్గమస్థానము. అట్లయ్యు మానవుని యాధునిక స్వభావము ద్విపథములయి యుండుటచే బాహ్యకార్య ప్రవృత్తి యావశ్యక మగుచున్నది. ప్రపంచమునందు సంపూర్ణమగు నేకాంతముగాని, సంపూర్ణమగు కార్యవ్యగ్రతగాని సత్యజీవిత మనఁబడనేరదు. ఏకాంతవాసముచే శక్తిని బుద్ధిని సంచయ మొనరించి ప్రాపంచిక కర్తవ్యముల నిర్వహించుటయం దాశక్తిని, బుద్ధిని వ్యయ మొనర్చుటయే సర్వసామాన్యులకు సత్యజీవిత మయియున్నది. మనుష్యుఁడు దినాంతమున ననఁగా సాయంసమయమునఁ గార్యనిర్వహణ ప్రయాసముచేఁ బరిశ్రాంతుఁడయి రేపటిదినముయొక్క కర్తవ్యసర్వ

హాగమునకు వలయు పాటును గావించుటకుఁ దగు మధుర విశ్రాంతి ననుభవించు నిమిత్తము స్వగృహోన్ముఖుఁడగు చందముననే ప్రతిమనుష్యుఁడును జీవితకర్తవ్యముల నిర్వహించుచు నలుపుఁజెందినంతనే విశ్వయంత్రశాలయొక్క కోలాహలమునుండి విడివడి భవిష్యజ్జీవితహితార్థము మౌనపూర్వకముగ నేకాంతవాసమున కియ్యకొనుట శ్రేయస్కరము. ఈరీతిగ ననుదినము వాసరమందలి యొకింతభాగమును పవిత్రమును, సదుద్దేశ్యపూర్ణమును, ప్రశాంతమును నగు నేకాంతవాసమందు వినియోగించు వ్యక్తి యసామాన్యశక్తి సంపన్నుఁడును, యోగ్యుఁడును, బ్రహ్మానందమయుఁడును గాఁగలఁడు.

ఏకాంతవాసము శక్తిసంపన్నుల స్వాభావికసంపత్తి. శక్తిసంపన్ను లగుటకుఁ గటిబద్ధులయినవారి కిది యే దివ్యౌషధము. మానవుఁడు సామాన్యస్థితినుండి విడివడి, మహోన్నతదశకుఁ బ్రాపించిన కాలఁదియు నేకాంతవాసమం దనురక్తుఁడగుచున్నాఁడు. అతఁడు సత్యము నన్వేషింప నేకాంతస్థానమున కేగి స్వాభీష్టసిద్ధి నందుచున్నాఁడు. విజ్ఞానధనులగు ప్రాచీన భారతీయ ఋషిపుంగవు లేకాంతవాసమును, మౌనమును, ధ్యానమును, చింతనమును శ్రయించియున్నట్లు సకల ప్రపంచముయొక్క యేజాతియందలి మహాపురుషు లేయుగమునను శ్రయించియుండలేదు. భారతీయఋషులు స్వాను

భవముచే వేదాంతవాస మహిమను గ్రహించియుండినవార లగుట తత్త్వజిజ్ఞాసులయి మోక్షోపలబ్ధిఁ గోలాహలశూన్యములగు నరణ్యముల నాశ్రయించుచుండిరి. ఋషీశ్వరులు భారత జాతీయజీవితము నాశ్రమచతుష్టయముగ విభజించి, బ్రహ్మచర్యమునందు నొకవిధముగను, వానప్రస్థమందు మిక్కుటముగను, సన్న్యాసమునందు సంపూర్ణముగను వేదాంతవాసమునకు స్థానము నొసంగి, తద్భావమును లోకమునకుఁ జాటియుండిరి. ఆత్మవిజయమున వేదాంతవాస మేరీతిఁ దోడ్పడుచుండఁ గలదో ప్రాచీనార్యవిజ్ఞానపాఠకునకుఁ బ్రత్యేకించి నుడువఁబని లేదు. జ్ఞానమును, బుద్ధిని, సత్త్వమును, శక్తిని బడయుట కేర్పడియున్న ప్రత్యేకములగు మార్గములన్నియు శబ్దశూన్యములగు వేదాంతవాసములలో నుండియు, మౌనములలోనుండియుఁ బోయియున్నవి. మౌనయుతమగు వేదాంతవాస మాత్మవిజయమునకును, ఆత్మవిజయ మానందసామ్రాజ్యపట్టాభిషేకమునకును ముఖ్యసాధనములు.

# ద్వాదశప్రకరణము.

---

## స్వావలంబనము.

తన స్వచ్ఛహృదయమునందు దివ్యప్రకాశమును గలియుండు మనుష్యుఁడే యెల్లరిమధ్యఁ గూర్చుండి పరమోజ్జ్వలమగు దివసము యొక్క బ్రహ్మానందము ననుభవింపఁగలుగుచున్నాఁడు. కుమారా! యథాశక్తి నేకాంతముగనుండు నుపాయ మాలోచించుచుండుము. నీయెడ నీవు విశ్వాసము గలిగియుండుము. నీయాత్మ వేనిని ధరించియున్నదో పరీక్షింపుము.

— జార్జి హార్బర్టు.

ఆనందమయజీవితమునకు స్వావలంబన మత్యంతావశ్యకమయి యున్నది. శాంతి ననుభవించుటకు శక్తి వాంఛనీయము. సంరక్షణమునకు స్థైర్య మపేక్షింపఁబడుచున్నది. మన నుండి బాహ్యాక్రమణములచే దూరమయి పోవునట్టి పదార్థసముదయములపై మన నిత్యానంద మవలంబితమయి యుండరాదు.

తనజీవితమును నియంత్రిత మొనరించుకొనఁ గలుగుటకును. శాంతిని సంపాదించుకొనఁగలుగుటకును మనుష్యుఁడు తాను నిలుచుట సాక్షాద్భూతమయి, తనలోపల వెలయుచున్న సుస్థిరమగు కేంద్రమును బడయునందాఁక తనజీవితమును సత్యరూపమున నారంభింపఁజాలఁడు. పరివర్తనశీలమగు వసువును విశ్వసించినచో స్వయముగా మనుష్యుఁడును మార్పునకు గుఱియగుచుండఁగలఁడు. తననుండి వేఱు సేయఁబడఁగల వస్తువుయొక్క సాహాయ్యమును మనుష్యుఁ డవలంబించియున్నచో నావసువు తన్ను బాసి పోయినంత హతగాత్రుఁడయి పతితుం డగును. అతఁడు నశ్వరములగు లాభములచే సంతుష్టుఁడగుచున్నచో సర్వమును గలిగియుండియు నానందతృష్ణాబాధచే నిరాహారియై మడియును. ఈమర్మముల నెఱింగి మనుష్యుఁడు పరుల సాహాయ్యమునకయి ప్రతీక్షింపకయు, వారినుండి పారితోషికముల సంపాదింపవలయునను వాంఛను గలిగియుండకయు, నితరములగు స్వార్థమయ ప్రయోజనముల నాకాంక్షింపకయు, మనుచుండుట శ్రేయస్కరము. యాచించుట, దూషించుట, పశ్చాత్తాపపడుట మానవునకుఁ దగనిపనులు. ప్రతిమనుష్యుఁడును దన యాంతరికసత్యము నవలంబించి, తన హృదయముయొక్క భద్రస్థితికయి సంతోషమును బడయుచుఁ దనబలముపై నాధారపడియుండు టావశ్యకము.

యొక్క శక్తిచేఁ దాను నడువవలసిన మార్గము నన్వేషించు టావశ్యకము. బహిర్జగత్తునందుఁ బరివర్తనము, నాశనము, అసంరక్షణము కానవచ్చుచుండ నంతర్జగత్తునం దానందసంరక్షణ స్థిరత్వములు దృగ్గోచరము లగుచున్నవి. ఆత్మ స్వయముగాఁ బర్యాప్తమయి యున్నది. ఎచ్చోట దాని కవసరము కలుగుచుండునో, అయ్యెడనే తత్సంపూర్తికి వలయు సాధనములు బహిర్గతము లగుచుండును. మానవుని యజరామరమగు వాసస్థాన మతనియందే వెలయుచున్నది. మనుష్యుఁడయ్యెడ కరిగి తనగృహముపై సంపూర్ణాధికారమును స్థాపించుకొను టావశ్యకము. మనుష్యుఁడా! నీ వా పవిత్రస్థలమున రాజవయియుండ తత్ప్రదేశమును దాటి యావలి కేతెంచి నంతనే దాసుఁడవయిపోవుచున్నాఁడవు పరులు తమ తమ చిన్నరాజ్యములందు సువ్యవస్థ నొనరించినను, దుర్వ్యవస్థ నొనరించినను నీవు వానిని లెక్కసేయక తటస్థుఁడవయి యుండుము. నీవు నీహృదయసామ్రాజ్యముపై సంపూర్ణ శాసనబలమును గలిగియున్నదియు, లేనిదియు మాత్రము సదా విచారించుకొనుచుండుము. నీయొక్కయు, నఖిలప్రపంచముయొక్కయుఁ బరమకల్యాణము నీహృదయమందే కలదు. సదా నీవు నీ యంతఃకరణము ననుసరించుటయందు బ్రమత్తుఁడవు కావలదు. నీమస్తిష్కమును స్వచ్ఛ

ముగా నుండుకొనుము. నీయందుగల నిర్ణయబుద్ధిని కర్త
వ్యాచరణమం దుపయోగించుచు వృద్ధిఁ గావించుకొనుచుండుము.
నీయొక్క యిచ్ఛాశక్తిని సక్రమముగా నుపయోగించుచు
సమున్నత మొనరింపుము. నీయొద్ద వెలయు జ్ఞానమును
సద్ధ్యానయోగముచే వర్ధిల్లఁజేయుము. నీ యాత్మయందుఁ
గల ప్రకాశముపై దివ్యదృష్టి నునిచి దాని నెల్లరీతులఁ
బోషింపుచుండి దానిని క్రోధాదిప్రచండవేగములనుండి సం
రక్షింపుచుండుము. తదచలజ్యోతి నిరంతర ప్రవర్ధమాన
మగుటకుఁ దగు యత్న మొనరింపుము. కుమారా! నీవు
నశ్వరము స్థూలమగు బహిర్జగత్తును విసర్జించి విశాలమగు
నీయాత్మసామ్రాజ్యమునఁ బ్రవేశింపుము. ఆదర్శమానవుని
రీతి విచారింపుచు నావిధముగనే కార్య మొనరింపుచుండుము.
ఉత్తమమానవుఁడవయి జీవితకాలమును గడపుచుండుము.
నీకు నీవే ప్రభుఁడవయి స్వయముగా సంపూర్ణుఁడ వగుచుం
డుము. నీలోపలఁగల శాశ్వతకేంద్రము నన్వేషించి, తదా
జ్ఞాపాలనమునకు సన్నద్ధుఁడవయి యుండుచుండుము. భూగో
ళము సూర్యుని తనకేంద్రస్థాన మొనరించుకొని నడచువిధ
ముగ నీవును, నీలోపలఁగల దివ్యప్రకాశముయొక్క కేంద్రము
యొక్క యాజ్ఞలఁ బాలింపుచు నడువుము. నీలోపల వెలుం
గుచున్న ప్రకాశమును బహు లంధకార మని వచించినను నీ కెట్టి

హానియు లేదు. పరుల నిరర్థకములగు ప్రశ్నల కన్నింటికిఁ బ్రత్యుత్తరము నొసంగవలసిన భారము నీది కాదు. నీవు కేవలము నీకొఱకే బాధ్యుఁడవయి యున్నావు, కాన నిన్ను నీవు విశ్వసించుకొనుము. నీవు నీకొఱకయినను సత్యసంధుఁడవు కావేని నీకు సత్యముయొక్క మధుర సంతోషము లభింపఁజాలదు.

మహాపురుషుఁడు స్వతంత్రమనుష్యత్వముయొక్క సరళ మహాత్వము[illegible]డ [illegible]కారమయి నిలువఁబడి యుండుచున్నాఁడు. వాఁడు తనమార్గముపై నిర్భయముగా నడచుచుండి పరుల నుండి వ్యర్థముగా క్షమింపుఁడని కోరుచుండనొల్లఁడు. అతఁడు గృహబాహ్యమునఁ దిరిగివచ్చుట కేగుటచేఁ దనవస్త్రములపైఁ బడుధూళిని దులిపివేసికొనుచుండు విధముగ సదా మానవలోకమునుండి తనపైఁ బడుచుండు భూషణదూషణములఁ దనచిత్తమును స్పృశింపకుండగనే తుడిచివేయుచుండును. అతఁ డనుక్షణ పరివర్తనశీలము లగు లోకులయుద్దేశ్యముల ననుసరించి వర్తింపనొల్లఁడు. అతఁడు సదా తనమస్తిష్కముయొక్క దివ్యప్రకాశ సాహాయ్యంబున నడచుచుండును. లోకమం దసంఖ్యాకులు మిథ్యాప్రశంసార్థమును, లౌకికరీతినిమిత్తమును, కృత్రిమ నాగరకతకొఱకును దమ మనుష్యత్వమును విక్రయించివేయుచుందురు.

కుమారా! నీవు భూతప్రేతములయొక్కయు, దేవీ దేవతలయొక్కయు, మనుష్యులయొక్కయు శాసనముల ననుసరించుటయందలి మిథ్యావిశ్వాసమును విసర్జించి, నీయాంతరిక సత్యప్రకాశముపై నేకాకివయి స్వతంత్రముగా నిలువఁబడఁ జాలనంత పర్యంతము బంధనయుక్తుఁడవును, స్వతంత్రుఁడవును, సంపూర్ణానందమయుఁడును గాఁజాల వనుట సత్యము. నీవు ప్రమాదవశంబుననయిన నాత్మాభిమానమును స్వావలంబనముగ భావింపవలదు. కారణమేమన నభిమానము యొక్క క్షణభంగురమగు పునాది (అస్థిభారము)పై నిలువఁబడుటచే ముందుముందు విరిగిపడఁగలవు. గర్వాంధుఁడగు పురుషుఁడు పరులపై నవలంబితుఁడయి యున్నరీతి మఱి యేమనుష్యుఁడు నుండనేరఁడు. వాఁడు పరులు తన్ను గూర్చి యొనరించు ప్రశంసావాక్యమాధుర్యము నమృతప్రాయముగఁ బానమొనరించుచుండును. కానియితరులు తన్ను నిందించునపుడు క్రోధోద్దీపితుఁ డగుచుండును. వాఁడు మిథ్యాప్రశంసను నిర్దోషముగ భావించుచు నిత్యము పరుల యభిప్రాయములచే నొకక్షణమందుఁ గ్రుద్ధుఁడును, మఱొక్క క్షణమందు సంతుష్టుఁడునునయి యుండుచుఁ దన మానసిక వికారముల వృద్ధి గావించుకొను చుండును. ఈరీతిగ గర్వాంధుని సౌఖ్యసూత్రము పరహస్తగతమయి యుండు.

చుండును. కాని స్వావలంబనముపై నాధారపడియుండు మను ష్యుఁడు మిథ్యాభిమానముచేఁగాక, తనయందలి శాశ్వత నియమములమీఁదను, సిద్ధాంతములమీఁదను, పవిత్రా దర్శములమీఁదను, సత్యములమీఁదను నిలువబడియుండు చున్నాఁడు. ఈకారణముచే నతఁడు స్థిరముగా నిలువఁబడనేర్చి యాంతరికోద్వేగ తరంగములచేతను, బాహ్య నిందా స్తుతుల తుఫానులవలనను దనదృఢమగు పునాదినుండి విసముని చలింపనేరఁడు. ఒకవేళ నాఁడు చలించినను తత్క్షణమే తన్ను సంబాళించుకొని తనస్వాభావికస్థితిఁ బ్రాపించుచున్నాఁడు.

నాయనా! నీవు మానసిక తులాదండముయొక్క బీజము నన్వేషింపుము. అన్వేషించి దానిపై నొంటరిగా సుస్థిరుఁడవగుము. దీనిచే నీవు నీజీవితకార్యములం దవశ్యము సఫలతను గాంచ గలుగుదువు. నీ వేకార్యమును గూర్చి నీమస్తిష్కము నుపయోగింతువో దానియందుఁ దప్పక సిద్ధి నందఁగలుగుదువు. కారణమేమన యథార్థమగు స్వావలంబితమగు వ్యక్తి యజేయుఁడగుచున్నాఁడు. పరుల సాహాయ్యముపై నిలువఁబడియుండరాదనుటకు వారియొద్దనుండి యెట్టి నీతిశిక్షను బడయరాదనుట తాత్పర్యము కాదు. నాయనా! నీవు జ్ఞానాభ్యుదయపథమునుండి యెట్టిస్థితియందును విముఖత్వమును వహింపకుము. భద్రమును, నుపయోగకరమునునగు నంశము నెచ్చోటినుండి.

యొప్పునఁ బడయుటకు సదా కటిబద్ధుఁడవై యుందుము. వినయ
విధేయతలు కేవలము బాహ్యరూపములయి యుండఁ దగవు. ఇవి వృద్ధి
నందినకొలఁదియు మానవకల్యాణమును బెంపొందుచుండఁగల
రు. మనుష్యుఁడు స్వావలంబనపరాయణుఁ డగుచున్నకొలఁ
దియు విధేయుఁడును, వినయశీలుఁడును నగుచుండఁగలఁడు
మహాత్ముని మాహాత్మ్యప్రభావము రాజరాజేశ్వరుని కీర్తియు సరిరానే
రదు. అతఁ డింతటి వినయసంపన్నుఁ డగుటకు హేతువేమి? అతఁడు
వినయంపుగల యీశ్వరీయమహాత్మ్యమునకే సమస్వభావమును
గలిగియుండఁ గలుగుచున్నా నని గ్రహింపఁగలుగుచున్నాఁడు.
కుమారా! నీవు నిస్సందేహముగ సమసమానవులనుండి నీతి
శిక్షను బరిగ్రహింపుచుండుము. విశేషించి సత్యరూపులగు నా
దర్శగురువులనుండి గుణపాఠముల నేర్చుకొనుచుండుము. కాని
సర్వోత్కృష్టమగు ననుశాసనము నీయందే కలదనియు, మఱె
చ్చోటను లేదనియు ననెడి పరమసత్యమును మాత్రము విస్మ
రింపకుము. ఆదర్శగురుసత్తముఁడయినను నీకు 'ఇదియే సత్యమా
ర్గము' యని బోధింపుచుండు, కాని దానిపై నడిపించి విజయ
ని గావించుటకుమాత్రము బాధ్యుఁడగుచుండుట లేదు. గురూప
దేశిత మార్గానుసరణముచే విజయమునందు సంపూర్ణమగు
బాధ్యత నీయందనే కలదు. కావున నీవు స్వయముగాఁ బ్రయ
త్నశీలుఁడవగుము, నిజపురుషార్థముచే జ్ఞానమును సముపార్జించి

స్వయంకృషిచే నాగురువుయొక్క సత్యమును నిజసత్యముగఁ జేసికొనుము. ఆత్మ విశ్వాస మభ్యున్నతి కత్యంతావశ్యకమగు సాధనము.

" నిజబలము చే మనుష్యుఁ డగుట, స్వీయాత్మశక్తిపై మహాత్త్వమునకుఁ బ్రాపించుట, ప్రకాశయుతమగు జీవితమును గడపుట యనునవే ఐశ్వర్యముయొక్క ముఖ్యలక్షణములు."

కుమారా! నీవు నీకు స్వామి వగుము. నీపై నీవు శాసకుఁడవు కాఁగలిగినపుడే ధన్యుఁడవగుదువు. ముఖస్తుతిని గృతిమవేషమును శ్లాఘింపకుము. నిన్ను నీ వాక ప్రపంచము యొక్క ప్రధానమును, సజీవమును నగు భాగముగ భావించి కార్యమొనరింపుము. పవిత్రమగు ప్రేమను బరులకుఁ బ్రసాదించుము. తిరిగి దానిని వారినుండి పడయ నాశింపకుము. పరులయెడ సహానుభూతిని గలిగియుండుము. పరులు సదా నీ పట్ల సహానుభూతిని వెల్లడించుచుండవలయునని వాంఛింపకుము. పరులకు సాహాయ్యమొనరింపుము, కాని పరులసాహాయ్యముపై నవలంబితుఁడవయి యుండకుము. నీ కార్యము సత్యపరతంత్రమగుచోఁ బరులు దానిని దూషించుచున్నను లెక్కింపక సంతుష్టాంతరంగుడవయి యుండుము. నీవు మఱచియు 'నా యీకార్యము లోకమునకు రుచికరముగనుండునా?' యని పరులఁ బ్రశ్నింపకుము; నీయందును విచారించుకొన

కము. సదా నీవు విస్మృతి లేనివాఁడవయి "నా యీకార్యము
సత్యసమన్వితము, ధర్మాశ్రితమును నయి యున్నదా ?"
యని సదా నీయంతఃకరణమును బ్రశ్నించుకొనుచుండుము.
నీకార్యము సత్యపరతంత్రమగుచో దానిని లోకముయొక్క
దూషణమును, దర్పమును స్పృశించుటకైన సమర్థములు కా
నేరవు. నీ వొనరించు కార్యమే యసత్యమును, నధర్మమును
నగుచోఁ బరులద్దాని సేవగించుకొనక పూర్వమే యది స్వయ
ముగా విధ్వంసమయి పోఁగలదు. సత్యముయొక్క వాక్యము
లును, గార్యములును గరవ్యమును సంపూర్ణమగు పర్యంత
మును గడచి పోవనేరవు. కాని యసత్యముయొక్క
వాక్యములును, గార్యములును వాస్తవమున కవి యాచరిం
పవలసిన దేమియు లేకపోవుటచే సులభముగా నశించిపోవు
చున్నవి. తర్కమును, గ్రోధమును భయంకరములును,
హానికరములును, వ్యర్థములును నగు పదార్థములు.

నాయనా! తొలుత నీవు నిన్ను స్వీకృతపారతంత్ర్యము
యొక్క బంధనములనుండి విముక్తు నొనరించుకొనుము. ప్రపం
చమునందొక పనికిమాలిన క్షుద్రపదార్థము పారవేయఁబడు
నట్లు కాక ప్రయోజనకరమగు నొకవస్తువువలె దాస్యపాశము
నుండి నిన్ను నీవు వేఱుపఱచికొనుము. నీవు నక్రమముగ
సంపాదించియుండిన స్వాతంత్ర్యమునుండి జనించు మార్గమును

వివేకయుక్తమగు నాత్మాధికారముచే స్రవించు శాంతిని, నైసర్గికశక్తియందుండు బ్రహ్మానందమును సంపాదించును. ఏకాకిగ నుండి స్వయముగా సంపూర్ణత్వమునకుఁ బ్రాపించి, జన్మించిన గృహమునుండి శ్మశానమువఱకుఁ దనమార్గమును నిర్మించుకొనుచు, లోకాపవాదమును, గృతిమప్రశంసను లెక్క సేయక, సందేహమయస్థానము లందుఁ గేవల మాత్మావలంబనమును గైకొను మనుష్యుఁడే యథార్థముగఁ బూజ్యుఁడు. అట్టి సంపూజ్యుఁ డాత్మవిజయుఁ డగుటచే బ్రహ్మానందమును సులభముగాఁ బడయఁగలుగుచున్నాఁడు.

## త్రయోదశ ప్రకరణము.

---

# జీవిత సామాన్య నిబంధనముల గ్రహించుట.

మనుష్యుఁడా! నీవు సత్యసిద్ధాంతములను, దదుత్పత్తిని సూక్ష్మముగాఁ బరిశోధించు వేని యవి నీ హృదయాంతరాళమునుండి వెలువడి వికసించిన వని గ్రహింపఁగలుగుదువు. సత్యస్వరూప మగు సకలమున కుత్పత్తిస్థానము నీయంతరాత్మయే యని దీర్ఘాలోచనము చే గ్రహింపఁగలవు. — బ్రౌనింగు.

రత్నసముదాయముకంటె ధర్మభాండార మధికమూల్యవంతమయినది. మధువుకంటెఁ బీయూషముకంటె ధర్మము, మధురమయినది. దీని రసాస్వాదనానందము వర్ణనాతీతము; కేవలానుభవైకవేద్యము. — ది లైట్ ఆఫ్ ఏషియా.

పాంథుఁడా! యానందమయమార్గముల ననుసరించుచు నప్పుడప్పుడు విశ్రాంతినందుచుఁ, దన్మార్గసౌందర్య మధురరసము నాస్వాదించుచు, నకాలమున జీవితముయొక్క విస్తృత మార్గముయొక్క పవిత్రస్థానమునఁ జేరి తాను వహించియుండిన

భారమును దింపివేయుచున్నాఁడు. అపు డతని యనారోగ్యము దూరమయి పోవఁగలదు. వానికిఁ జౌకగా స్వాతంత్ర్య మపుడు లభింప, వాఁడు చిరశాంతిసౌఖ్యము ననుభవింపఁగలుగుచున్నాఁడు. ఈసమస్తాధ్యాత్మికానందమయమార్గములలో శక్తిని, విశ్రాంతిని గలిగించునట్టి సర్వోత్కృష్టమగు పథము జీవితసామాన్య నిబంధనముల సక్రమముగ గ్రహించుట యయియున్నది. జీవితసాధారణ నిబంధనల గ్రహించు మనుష్యుఁడు సమస్తన్యూనత్వములనుండియు, లాలసలనుండియు, సందేహ భయములనుండియుఁ, దొట్రుపాటునుండియు, దుఃఖమునుండియు సంపూర్ణవిమోచన మందఁగలుగుచున్నాఁడు. అపు డతఁడు సంపూర్ణమగు సంతోషమును, బ్రకాశమును, జ్ఞానమును, హర్షమును, నిశ్చయమును బడయుచున్నాఁడు. జీవితముయొక్క సరళత్వమును గ్రహించి, తదాజ్ఞాపాలన మొనరించునట్టియు, స్వార్థపూర్ణములగు వివిధవాంఛలయొక్క యంధకారమయ మార్గములఁ గా లిడనట్టియు మనుష్యుఁడు నిరుపద్రవకరమును, శత్రుజనాభేద్యమును, సందేహ భయ దుఃఖ వాసనాగమ్యమును నగు పుణ్యస్థానమునఁ జేరఁగలుగుచున్నాఁడు. సత్యము సన్మానింపఁబడు స్థలమందు సందేహము నిర్మూల మగుచున్నది. సత్యసిద్ధాంతప్రారంభము భయవిషాదసమాప్తమునకుఁ గారణము.

శాశ్వతమును, సంపూర్ణమును నగు సంతోషము నెలకొని యుండు కావున దుఃఖదాయకమగు లాలస కాపురము సేయ నేరదు. మానవుని కజరామరమగు దివ్యానందము ప్రాప్తించి నపు డతని జీవితమునందు దుఃఖమున లేశమాత్రము స్థానము లభింపనేరదు.

మనుష్యజీవితము సత్యము ననుసరించి నిర్వహింపఁ బడుచుండినచో నత్యంతసుందరమును, దివ్యమును, సువ్యవస్థితమును గాఁగలదు. అసూయాది లోభము, ద్వేషము, ఇంద్రియలోలత్వము మొదలగు వాసనాపాశములచే బద్ధింపఁబడి యున్నంతవఱకు సత్యనిబంధనము ననుసరించి సాధింపఁబడ నేరదు. మనస్సుయొక్క ప్రకాశహీనమగు స్థితియొక్క కారణముచే నుదయమగు జీవితము సత్యజీవితము కానేరదు. అది కాపట్యముగాని, దుఃఖదాయక మగు జాడ్యముగాని గావచ్చును. అభిలాషలఁ దగ్గించుకొనుటయే బుద్ధివికాసము నకుఁ బ్రథమలక్షణము. వాసనలపై సంపూర్ణాధికారమును గలిగియుండుట బుద్ధివిశేషముయొక్క చరమధర్మము. కారణ మేమన జీవితము నిబంధనములచే బద్ధమయియున్నది. నిబంధనలనుండి భిన్నముగానుండుటచే జీవితమునకు నేటివఱకు లభింపనట్టి పదార్థముల యావశ్యకతయే మనకు లే దని గ్రహింపఁ దగును. యథార్థ మాలోచించి చూచినచో లాలస స్వాభావిక

మానవజీవితమున కవసరమగు పదార్థము కాదు. కేవల మది యొక విద్రోహయుక్తమగు నిరుపయోగత్వము. కావుననే యది హైన్యమునకును, దుఃఖమునకును జనయిత్రి యగుచున్నది. బైబిలునం దొక దుశ్చారిత్రుఁడగు పుత్రునిగూర్చి కథయొకటి వ్రాయఁబడియున్నది. పితృగృహమందు పుత్రున కావశ్యకము లగుసంపదలకంటె నధికముగనే సిరు లుండెను. కాని వాఁడు గృహమును విడిచి వెడలిపోయెను. వానికినవ స్వసుబాహుళ్య మున్నపుడు మఱెట్టిలాలసయు నపేక్షణీయము కాఁజాలదు. కాని వాని హృదయమందు లాలస ప్రవేశించినంతనే కడు దూర మందున్న విదేశమునకు వెడలిపోయెను. అచట కరిగినంత వానికిఁ బ్రతిసామాన్యవస్తువుయొక్క యవసరము తటస్థించెను. వాఁడు గర్భదరిద్రునివలెఁ జేతఁ గాసు వీసమేని లేక దైనికజీవితమును గడపవీలులేనివాఁడయి నిరాహారిగ నుండఁ జాలక తన పితృగృహము నుద్దేశించి పయనము కావలసినవాఁ డయ్యెను. ఈచిన్నికథ ఒక వ్యక్తికనే గాదు, మనుష్యజాతి సంతయు పరివర్తనము సేయుటకొక యనుపమదృష్టాంతము కాఁగలదు. మనుష్యుఁడు వాంఛలయొక్క సందిగ్ధతయందుఁ జిక్కువడినంతనే యవిరామమగు నశాంతిని, అసంతోషమును, అవసరమును, క్లేశమును బొందుచున్నాఁడు. అపుడు వాని యట్టి దుస్స్థితి తొలంగుటకుఁ బితృగృహమున కరుగుట య

నఁగా లాలసను విసర్జించి సత్యజీవితనిబంధనముల ననుసరించుటయే దివ్యౌషధమగుచున్నయది. కాని మనుష్యుఁ డాధ్యాత్మిక దారిద్ర్యముచే క్షుద్బాధచే బాధింపఁబడి వ్యాకులత ననుభవించు వఱకు నీరీతి నాచరింపఁజాలఁడు. తొలుత లాలసయొక్క దుష్పరిణామమగు దుఃఖమును, కలహమును ననుభవించిన పిమ్మటనే శాంతిమయమును, సుసంపన్నమును నగు సత్యజీవితముయొక్క ప్రబలోత్కంఠ మానవాంతఃకరణమున వృద్ధి నందుచున్నది. అప్పు డతఁడు ముందడుగిడ నేరనివాఁడయి విముఖుఁడయి నిజగృహాభిముఖముగఁ బ్రయాసకరమగు ప్రయాణమొనరింప నారంభింపుచున్నాఁడు. అనఁగా నతఁడు విషయదాస్యమునుండియు, జ్వరప్రకోపమునుండియు, బుభుక్షనుండియు వేఱుగానుండునట్టి సాధారణా సిక్యముయొక్క యమూల్యమగు జీవితక్షేత్రమునఁ బ్రవేశింప మొదలిడుచున్నాఁడు. యథార్థజీవితమును గురించియు, సత్యమును గురించియు, సమరసభావమును గురించియు మానవునకుఁ గలుగునట్టి యభిలాషను, లాలసను నొకవిధముగ భావింపరాదు. సాత్త్వికజీవితమును గోరునది పవిత్రమగు నభిలాష. లాలసవిషయ భోగాదుల వాంఛించు నింద్రియప్రవృత్తి. అభిలాష శాంతినిమిత్తము మానవహృదయమున జనించిన తృష్ణ. ప్రాపంచిక పదార్థముల లాలస మనయందు వృద్ధినందినకొలఁదియు మనల శాంతి

సౌఖ్యమునుండి దూరమొనరించివేయుచు మనల నిత్యదరిద్రులఁ జేసివైచి తాను సంయతము సదా యసమాప్తముగను నసంతుష్టముగను నుండుచుండును. లాలసాసమాప్తమగు వఱకు మనుజునకు విశ్రాంతియు, సంతోషమును గలుగుట యసంభవము. ప్రాపంచికపదార్థములు యెట్టిస్థితియందును సంతృప్తము కానేరదు. కాని శాంతి బుభుక్షసంతృప్తిని వహింపఁగలుగుచున్నది. సమస్తవిధములగు స్వార్థమయలాలసలు మనల విడిచినంతనే శాంతియొక్క సంపూర్ణమగు సంతోషము సులభముగా లభ్యమగుచున్నది. అపుడు సంపూర్ణమగు హార్దమును, సమృద్ధియు, సమాల్యమగు నానందమును విద్యమానములయి యుండుచున్నవి. అత్యంతానందదాయకమగు నీస్థితియందు జీవితముయొక్క సమగ్రశ్రేష్ఠత్వమును సరళత్వమును మానవుఁడు గ్రహించి తన్మూలమున నపారమగుశక్తిని బ్రయోజనమును సంప్రాప్తింపఁ జేసికొనుచున్నాఁడు. అంతమునకు వానిశాంతి, బుభుక్షయు నుపశమించుచున్నది. కారణమేమన సంపూర్ణమగు శాంతి సుస్థిరమును, శాశ్వతమును నగు దేహముయొక్కయు, మానసముయొక్కయు నొక సాధారణదశగ మారిపోవుచున్నది. వాసనాప్రవాహమున మునింగియున్న మనుష్యుఁడు లాలసాదమన మౌదాసీన్యమును, నలసత్వమును, శక్తిహీనతను, నిర్జీవత్వ

మును స్ఫురించునని యజ్ఞానాంధకారముచే భ్రమియింపఁ గడంగుచున్నాఁడు. వాసనానిగ్రహముచే నేకాగ్రత, కార్యపరాయణత, శక్తి, ప్రయోజనము మొదలగు సద్గుణములచే భూషితమయిన దివ్యానందమయ జీవితము ప్రాప్తించుచున్నదను రహస్యమును భోగవిలాసముల నిమిత్తమును, భౌతికపదార్థ సంచయార్థమును లాలసులయియుండి తల్లాలసాతృష్ణాబాధచేఁ జచ్చుచుండు మనుష్యులు గ్రహింపఁజాలరు.

స్వార్థయుక్తమగు లాలసనుండి విమోచనము నందినంతనే మానవుని మస్తిష్కము భారశూన్య మగుచున్నది. అతఁడంత మానవజాతినిమిత్తము కార్యమొనరింప స్వతంత్రుఁడగుచున్నాఁడు. స్వాతంత్ర్యము నందినంతనే వానిసమస్తశక్తులేసిద్ధియందును సంతృప్తిని వహింపనొల్లనట్టి భోగవాంఛల ప్రాప్తినిమిత్తమును పనిగొన నేరవు. శక్తులన్నియు నపుడు మానవుని సంపూర్ణాధికారమునం దుండి వాని యాజ్ఞాపాలనమునకయి నిరీక్షించుచుండఁగలవు. పారితోషికమును సంపాదింపవలయునను వాంఛను గలిగియుండకుండుటచే నతఁడు తన సమస్తశక్తుల స్వకీయకర్తవ్యపాలనమం దేకీభూతమొనరించి సమస్త విషయములయందును, కార్యములందును యథోచితరీతి సఫలతను సిద్ధింపఁజేసికొనుచున్నాఁడు.

సంపూర్ణజ్ఞానియు, సంపూర్ణానందమయుఁడును నగు మనుష్యుఁడు లాలసచేఁ గార్యమొనరింప సన్నద్ధుఁడు కానేరఁడు.

అతఁడు సదా జ్ఞానసముపార్జనమునిమిత్తమే కార్యాచరణము నకుఁ గడంగుచుండును. లాలసను గలిగియుండు మనుష్యుఁడు స్వప్రయోజనమును, స్వలాభమును జూచుకొనియే కార్యమును బ్రారంభించుచున్నాఁడు. మాతాపితలనుండి క్రీడావసువును, జీతమిండని బడయునిమిత్తమే బాలుఁడు బడికిఁబోవుచున్నాఁడు. అదియేరీతి లాలసాయుక్తుఁడగు మనుష్యుఁడును లాభము నపేక్షించియే కార్యమొనరించుచున్నాఁడు. కాని సజీవుఁడును, సుశిక్షితుఁడునగు జ్ఞాని తనశక్తులను వలసినపుడెల్ల, నట్టి యావశ్యక కార్యసంపాదనమునిమిత్తమయిన నేకీభూతమొనరించి యథోచితముగ నుపయోగింపఁ గలుగుచున్నాఁడు. అతఁ డాధ్యాత్మికదృష్టిచే సంపూర్ణవృద్ధుఁడుగ గణింపఁబడుచున్నాఁడు. వానియెడ సమస్తవిధములగు పారితోషికములును, లంచములును, బహుమానములును వ్యర్థములు. అతఁడు ప్రకృతియందు సంభవించు సమస్తపరివర్తనములను, సుఖదుఃఖములను సానందముగ ననుభవింప సంసిద్ధుఁడయి యుండుచుండును. అతని హృదయాంతరాళమున బ్రహ్మానందమును, ముఖారవిందమున మృదులహాసమును తాండవింపుచుండును. ఇట్టి మనుష్యుఁ డాదర్శజీవితమును బడయుచున్నాఁడు. ఏది యానందమయమును, మృదులమును, మధురమును, సుస్థిరమును, యథార్థమును నయి యుండి, విశ

ప్రకృతియొక్క యచల సిద్ధాంతము ననుసరించి యుండు
చున్నది. కాని యపూర్వానందము యొక్క యిట్టి జీవిత
మొకవిధమగు స్వర్గీయస్థాన మయియున్నది. ఈ స్వర్గీయ
స్థానమునుగూర్చి ప్రయాణమొనరింప నెంచు యాత్రికుఁడు
మిక్కిలి ప్రయాసము ననుభవింప వలసియున్నది. ప్రయాణి
కుఁడు పాశవికలాలసలయొక్క దేశమందుండి పయనమొన
రింపుచుండియు నాలాలసలయొక్క మాయావాగురములఁ
జిక్కక వానినన్నింటి సాధింపుచు, వానిపై నిరంకుశాధికార
మును స్థాపింపుచు స్వర్గీయస్థానమును జేరవలసియున్నది.
వాని కీ మార్గమందు బయటనుండి వచ్చు శాత్రవుఁడెవఁడును
దటస్థింపనేరఁడు. అతని నీయాత్రయందు డీకొను రిపులెల్ల
రతని హృదయమునుండియే జనింపుచున్నారు. ఆరంభమం దీ
యాత్ర ప్రతిమానవునకు మిక్కిలిప్రయాసకరముగ గోచ
రింపఁగలదు. వాఁడు లాలసప్రభావముచే నంధుఁడయి జీవితము
యొక్క సాధారణ నిర్మాణమునయిన గుర్తింపఁజాలనివాఁ డగు
చున్నాఁడు. అవు డతని కీజీవిత నిబంధనలన్నియు గుప్తముగా
నుండి గోచరింపకుండును, కాని వానిమానసము సరళమయి, స్వ
చ్ఛమయి ప్రకాశించినంతనే జీవితముయొక్క భద్రనియమావళి
వాని యాధ్యాత్మికదృష్టికిఁ గానరాఁగలదు. అవు డతని కా నిబం
ధనల గ్రహించుటయందును, వాని యాజ్ఞానుసారము వర్తించు

టయుండును ఏవిధమగు కష్టము కలుగనేరదు. వానిమార్గమవుడు పరిశుద్ధమయి, సక్రమమయి, సులభగమ్యమగుచున్నది. అవుడు వానిని సందిగ్ధతయు, సంధకారమును బాధింపఁజాలకుండును. జ్ఞానప్రకాశముచే సమస్తమతనికి నున్న దున్నట్లుగఁ గానరాఁగలదు.

సత్యయుక్తమును, బ్రహ్మానందమయమును నగు జీవితము నన్వేషించు మనుష్యుని గతిని మతెంత తేజస్సంపన్న మొనరించుటయందుఁ దోడ్పడు జీవితముయొక్క నిబంధనములలోఁ గొన్ని నిబంధనములనుగూర్చి దిగువ విచారింపఁబడును. ఈనియమములు ప్రయోగమందు కేవలము గణితశాస్త్ర నిబంధనములవలె నబాధితములయి యున్నవి. "ప్రథమ నియమము నుల్లంఘించువానిని క్షమించుటొప్పదు."

మానవజీవితములన్నియు దర్శనమందు వివిధములుగ నున్నను సమస్తము మూల పదార్థమునం దొక్కటియే. నియమమొక్కటే, కాని యది బహువిధముల నుపయోగపడుచుండఁ గలదు. వస్తువునకును, మానసమునకును, భిన్నమగు నియమమున్నట్లు కానరాదు. దృష్టములగు స్థూలపదార్థములకును, నదృష్టములగు సూక్ష్మ పదార్థములకును వేఱు వేఱుగ నియమములు సృజింపఁబడి యుండలేదు. సూక్ష్మనియమము సర్వత్ర నొకేవిధముగ నుండుచున్నది. దేహమునకుఁ బ్ర

త్యేకముగను, అంతరాత్మకుఁ బ్రత్యేకముగను ధర్మశాస్త్రము విరచితమయియుండలేదు. దేహాత్మల రెంటికిని ధర్మశాస్త్రమొకటియే. మనుష్యుఁడు విశుద్ధప్రాపంచికబుద్ధిచేఁ బ్రపంచకార్యములందుఁగొన్ని నిబంధనములు వెలయుచుండుటను విలోకింపుచున్నాఁడు. అతఁడీ నియమములను దాను విస్మరించినను, నుల్లంఘించినను దనయారోగ్యము చెల్లడియగుననియుఁ, దనకుహాని సంభవించుననియు, సంఘమందును, సామ్రాజ్యమందును ఘోరోపద్రవము లుప్పతిలఁగలవని గ్రహింపుచున్నాఁడు. ప్రపంచమం దధికసంఖ్యాకులీనియమములే యాధ్యాత్మికములును, సూక్ష్మములు నగు వస్తువులయందును సార్థకములగుచున్నవని గ్రహింపజాలకున్నారు. వారు తమయజ్ఞానమువలనను, ననావధానతచేతను భయంకరమగు నష్టమునకు గురియగుచున్నారు.

మనుష్యుఁడు తన్ను దానే పోషించుకొనుటకును, నిజహస్తములచేఁ గృషిసలిపి సంపాదించుకొనుటకును, నకారణముగఁ గృషిసేయని దినమున నిరాహారిగ నుండుటకును బద్ధుఁడయియుండవలసినదని ప్రపంచముయొక్క యచల సిద్ధాంతము బోధింపుచున్నది. శరీరకష్టమొనరింపని వ్యక్తికి భోజనమును స్వీకరింప నధికారము లేదు. మనుష్యుఁ డీనియమమును గాంచి న్యాయసంయుక్తముగ భావించుటవలననే ప్రపంచముయొక్క

యావశ్యకము లగు వస్తువుల సంపాదింపఁ గలుగుచున్నాఁడు.
కాని జనసామాన్య మాధ్యాత్మికవస్తువులవిషయమం దీ
నిబంధనము నుపయోగించుచుండుట లేదు. ఎవని యాహార
మును వాఁడే కాయకష్టముచే సముపార్జించుకొనవలయు
ననియు, నట్లొనరించుకొనని మూఢుఁడు ఘోరపాపియయి,
నిత్యదరిద్రుఁడయి భైక్షుకవృత్తిచే ద్వారద్వారముల వ్యా
కులహృదయముతోఁ దిరుగుచుండుననియు నను నుడువుల
నెల్ల రంగీకరింతురు. కాని యీరీతి నాచరించు మనుజుల
సంఖ్య మిక్కిలి స్వల్పముగా నున్నది. మనుష్యుఁ డాధ్యాత్మిక
జీవితపరిధానుఁడయి లోకహితమునకయి తన యావచ్ఛక్తిని
ధారవోయుచున్నచో నట్టివాఁడు శ్రమయొనరింప నక్కఱ
లేకుండఁగనే పరులొసంగు భోజనమును గుడువ నధికారమును
గలిగియున్నాఁడను విషయము నెల్ల రంగీకరించుచున్నారు.
అసంఖ్యాకులగు మనుష్యు లాధ్యాత్మికశక్తిని సంపాదింపు
చున్నామని నుడువుచు, భిక్షుకులయి, ద్వారద్వారములఁ దిరు
గుచు నాంతరికశక్తిని హర్షమును, జ్ఞానమును, శాంతిని బడయ
లేక భయవిషాదముల ననుభవింపవలసినవా రగుచున్నారు.
ఇట్టివారికంటెఁ గాయకష్ట మొనరించి జీవించువారే శ్రేష్ఠ
మానవులు.

మనుష్యుఁ డెవఁడేని యేయేని వస్తువుల యావశ్యకత కలిగినపుడు వెంట వణిజుని విక్రయశాలకరిగి కాంక్షితపదార్థము నూరకే యడుగక మూల్యమునొసంగి తీసికొనినపుడే యావస్తువు వానిదగుచున్నది. వాఁడు యథార్థమగు మూల్యమునొసంగి మూల్యమునకుఁదగిన పదార్థమును దీసికొనినచో దానుచితకార్యమొనరించితినని సంతోషింపఁగలఁడు. అదియేరీతి మనుష్యుఁ డానందము, విశ్వాసము, శాంతి మొదలగు నేదేని యాధ్యాత్మికపదార్థము నభిలషించినచో దానికి మాఱుగఁ గొంత వెల నొసంగవలసియుండును. స్థూలపదార్థము నొకదానిని వణిక్కునుండి పడయవలసి వచ్చినపుడు దానికిఁదగిన ద్రవ్యమొసంగఁబడవలసియుండుచున్నది. అదియేరీతి నాధ్యాత్మిక వస్తుప్రాప్తికే దేని సూక్ష్మమగు వస్తువు వెలకు మాఱుగా నొసంగఁబడ వలసియుండును. ఉద్వేగము, లోభము, అభిమానము, భోగము మున్నగు అతీంద్రియపదార్థములలో నేవస్తువును వెలగానిచ్చినను దానికిఁ దగినంత పరిమాణమందే యాధ్యాత్మికఫలము లభింపఁగలదు. కృపణుఁడు తనద్రవ్యము నంటిపట్టుకొని యుండుచుండును. సదా ధనమును తనయొద్ద నునిచికొని వీక్షించుకొనుచుండుటచే మిక్కిలి యానందము కలుగుచుండుటవలననే యతఁడు దానిలోనుండి పైసయైన నొరులకొసంగ సమ్మతింపకుండును. అతఁడు తనధన

మండలియొక్క కాసయిన వెచ్చించి తనజీవితసౌఖ్యమున కావశ్యకములగు పదార్థములఁ గ్రయమునకుఁ దీసికొనఁ జాలడు. ధనమును బుష్కలముగాఁ గలిగియుండియు వాఁ డానందములేక సదా దుఃఖమయజీవితమును గడుపుచుండును. అదియేరీతిఁ గ్రోధమును, గాఠిన్యమును, విలాసమును, గర్వమును, దురహంకారమును, స్వపక్షపాతమును బ్రహ్మానందమునిమిత్తము విసర్జింపలేని మనుష్యుఁ డాధ్యాత్మిక లుబ్ధుఁ డనఁబడుచున్నాఁడు. ఇట్టిభయంకరోద్వేగములచే ముట్టడింపబడియున్నట్టి యాధ్యాత్మికలోభపరాయణునియొద్ద నేవిధమగు నాధ్యాత్మికసౌఖ్య ముంత సేరదు. ప్రాపంచికానందసంపదలయందలి చిల్లిగవ్వయేని వెచ్చింపక వానినంటిపట్టుకొనియుండు వ్యక్తియొక్క యాధ్యాత్మికావసరముల దీఱ నేఱవు.

ప్రాపంచిక విషయములందు (లోకధర్మములందు) నిపుణుఁడయి యుండువ్యక్తి పరులను యాచించుటకును, చౌర్యమొనరించుటకును సమ్మతింపనొల్లడు. అతఁడు శ్రమయొనర్చి తనకవసరములగు వస్తువులనెల్ల వెలకుఁ దీసికొనుచుండును. ప్రపంచము వాని భద్రత్వమునకును, బ్రకృతినియమపాలనమునకును వాని నభినందింపఁగలదు. అదియేరీతి నాధ్యాత్మికధర్మములందును జతురుఁడయియుండు మనుష్యుఁడు

దీనునివలెను, హీనునిరీతిగను బరులనర్థించుటకును, దొంగిలించుటకును సమ్మతింపనొల్లడు. అతఁ డంతర్జగతునందు గష్టమొనరించి తన కవసరములగు నాధ్యాత్మిక వస్తువులనెల్ల వెలకుఁ దీసికొనుచుండును. సకలప్రపంచ మతని నాధుత్వమునకును, ధర్మాచరణమునకును మిక్కిలి సంతోషించి వాని నెల్లరీతుల సన్మానింపగలదు.

పరులకు సేవ యొనరించు మనుష్యుఁడు నియమితవేతనమును వారినుండి పడయుచుండుట ప్రపంచవ్యవహారమం దొక నియమమయి యున్నది. మాసాంతమున భృత్యుఁడు తన యజమానినుండి సంపూర్ణవేతనమును బొందియుండియుఁ దననియమమునకు భిన్నముగా మఱికొంత ద్రవ్యము నడిగినచోఁ దన యుద్యోగపదవినుండి తొలగింపఁబడఁగలఁడు. ఆరీతిగనే మానవులనేకు లాధ్యాత్మిక ప్రపంచమున స్వల్పమగు కష్టమునరింపుచు నత్యధికమగు ఫలితము నపేక్షింపుచుండియుఁ దమ్ము స్వార్థులుగను, మూర్ఖులుగను భావించుకొన కున్నారు. ప్రపంచముయొక్క నిబంధనము ననుసరించి మానవుఁడొనరించు కృషికిఁ దక్కువగాని, హెచ్చుగఁగాని ఫలితము లభింపనేరదు. స్థూలప్రపంచమునను, సూక్ష్మ ప్రపంచమునను, మనుష్యుని భావములయొక్కయుఁ, గార్యములయొక్కయు పరిమాణము ననుసరించియే ఫలితము లుండుచుండును.

ఈనియమములను జిరస్మరణీయముగ నెఱింగి జ్ఞానసంపన్నుండగు పురుషుఁడు సదా సంతుష్టుఁడయి, సంతృప్తుఁడయి సంపూర్ణ శాంతిపూర్వకముగ జీవితమును గడుపుచుండఁగలఁడు. కారణ మేమన నతఁడు తాను పడయుచున్న సంపద్వైభవములన్నియు స్వయంకృత కార్యములయొక్క యథోచితపరిణామములే యని గ్రహించియుండుచున్నాఁడు. మహత్తరమగు నీప్రపంచ సంబంధనము ప్రపంచమందలి స్వార్థాంధులును, లోభులు నగు యజమానులు తమ భృత్యులకొసంగవలసిన వేతనమును గబళించు విధమున మనుష్యుఁ డొనరించియున్న కార్యమునకుఁ దగు ఫలితమును నొసంగుటలో లేశమాత్రముగ మోసమును గావింపనేరదు. ఈ మహాసంబంధనమును దృఢీకరించునట్టియుఁ, బరిహసించునట్టియు మూఢున కది యీచందమునఁ జెప్పుచున్నది. "చెలికాఁడా! నీకేల మతిభ్రంశము కలిగినది? నీవు నే నేర్పరచియున్న కర్మక్షేత్రమునఁ బనిసేయఁ బ్రవేశించుటకుఁ దొలుత నే మన ముభయులము దినమున కొక్క కాసు జీతమే యొసంగఁబడఁగలదని నిశ్చయించుకొనియుంటిమిగదా; పేరాసకు లోఁబడి నీవిపుడేల దినమున కొక్క రూపాయి నపేక్షించుచున్నాఁడవు?"

ఎవఁడేని యొక మనుష్యుఁడు ధనాఢ్యుఁడయినచోఁ దన సంపదల దురవ్యయములొనరింపుచు సంరక్షించుకొని,

సత్యధర్మముల ననుసరించి, యాసంపదల వృద్ధి గావించి, తుదకేసి లోకకళ్యాణకరమగు పవిత్రకార్యమునకయి సద్వినియోగ మొనరించుట శ్రేయస్కరము. ధనము పట్ల కేవలము నిర్లిప్తుండుగాని, కేవలాసక్తునిగాని కలిగియుండరాదు. ఇట్లుండు వ్యక్తియే విశ్వమందు నిపుణుఁడును, ధనాఢ్యుఁడును నను ఖ్యాతినందఁగలుగుచున్నాఁడు. నిస్సహాయకుఁడుగా, సోమరియు దుర్వ్యయశీలుఁడును నగు మనుష్యుఁడు ధనాఢ్యుఁడు కాలేఁడు. అట్టివాఁడు లోకహీనుఁడును, దుర్వ్యసనలోలుఁడును నను నపఖ్యాతికిఁ బాల్పడుచున్నాఁడు. అదియేరీతి నంతర్గతమునం దాధ్యాత్మిక వస్తువులచే ధనాఢ్యుఁడు కాఁగోరు మనుష్యుఁడు తన మానసికశక్తుల వ్యర్థముగా వ్యయమొనరింపక మితవ్యయముచే సంచయమొనరించుకొనుచుండుట యావశ్యకము. అతఁడు తన జిహ్వేంద్రియమును, వివిధోద్వేగములను నిరోధించివైచి, తన శక్తిని వ్యర్థము మిథ్యావాదమునకును, దురహంకారపూర్ణమగు కుతర్కమునకును, క్రోధాద్యావేగములకును నష్టమొనరింపకుండ నుండవలెయును. ఈరీతిగ నతఁడు బుద్ధికోశమును వృద్ధిగావించుకొనినంతనే వానియొద్ద నపారమగు నాధ్యాత్మిక మూలధనము చేరఁగలదు. అతఁడీ యాధ్యాత్మిక మూలధనమును లోకోపకారార్థము వినియోగింపుచుండవలయును. ఈ

మూలధనము నతఁడు యథార్థమగు లోకహితమున కయి వినియోగించిన గొలఁదియు వర్ధిల్లుచుండఁగలదు. ఈచందమున మనుష్యుఁడు స్వర్గీయనైపుణ్యమును, స్వర్గీయసంపదలను బెంపొందింపఁ జేసికొనఁగలుగుచున్నాఁడు. తనయందుద్వేగములకును, లాలసలకును ననుచరుఁడయి యుండునట్టియుఁ, దన మానసమును వశమొనరించుకొన నట్టియు మనుష్యుఁ డాధ్యాత్మిక దుర్వ్యయశీలుఁడనఁ బరగుచున్నాడు. వాఁడెపుడును స్వర్గీయ పవిత్రవస్తువులచే ధనికుఁడు కాఁడు.

మనము పర్వతముయొక్క శిఖరము మీఁదికిఁ జేరఁ దలంచిచో నాగిరి నారోహింప వలసియుండును. తొలుత మార్గము నన్వేషింపవలసి యుండుచున్నది. అనంతరము సావధానులమయి యామార్గము ననుసరింపవలసిన వారలమగుచున్నారము. ఆరోహించు వ్యక్తి ప్రయాసముయొక్కయు కష్టములయొక్కయు భయముచేఁగాని, శరీరక్లాంతిచేఁగాని పర్వతారోహణ విముఖుఁడు కారాదు. లేనిచోఁ బర్వతారోహణ కార్యము సిద్ధింపనేరదు. సరిగా నిదియేరీతి మానసికమును ధార్మికమునునగు జీవితముయొక్క సమున్నతభూధర శిఖరముపై కరుగ నభిలషించువ్యక్తి, ఆత్మబలముచే గిరినారోహింపవలసి యుండును. అతఁడు మార్గమును గ్రహించి జాగ్రత్తగ నారోహణకార్యమును సఫలీభూతమొనరించుకొన

వలయును. అతఁడు భయముచేఁగాని, వ్యాకులతచేఁగాని పర్య
తారోహణ కార్యమునుండి విముఖుఁడు గాక కష్టములను
విఘ్నములను ననుభవించుచు, జయించుచు లోభాదిశత్రువు
లకుఁ జిక్కకుండ ముందడుగిడుచుఁ బోవుచుండవలయును.
ఇట్లొనరించుటచే నంతమున నతఁ డాధ్యాత్మిక సంపూర్ణత్వము
యొక్క ప్రశాంతశిఖరమును జేరఁగలుగుచున్నాఁడు. అపు
డుద్వేగము, లోభము, దుఃఖము మొదలగు వికారములతోఁ
గూడియున్న ప్రపంచమును దనకుఁ గ్రింద వదలివైచుచున్నాఁ
డు. అపుడతనిశిరోభాగమున స్వర్గీయపవిత్రతయొక్క విస్తృత
మును, మాననీయమును నగు ననంత నభోమండల ముండి
పోవుచున్నది.

ఒకమనుష్యుఁడు దూరమందున్న నగరమును జేరఁ
దలంచినచోఁ బ్రయాణమొనరింప వలసియుండును. ప్రయాణ
మొనరింపకయే వాఁడచ్చటికిఁ జేరు నుపాయమేదియు లేదు.
అటులే యాత్రికావశ్యకములగు సాధనములను, ప్రయత్న
ములను గావింపవలసియుండును. అతఁడు కాలినడక నరుగఁ
దలంచినచో నేవిధమగు వ్యయము కానేరదు. కాని దేహ
ప్రయాసమధికముగా గలుగుట సంభవించును. అతఁ డశ్వ
శకటమందుఁగాని, విద్యుచ్ఛకటమందుఁగాని బోవఁదలంచి
నచో శరీరప్రయాస తప్పిపోవును. గాని ద్రవ్య మధికముగా

వ్యయము కావలసివచ్చును. మనుష్యుఁ డేస్థానమున కరుగఁ దలంచినను శ్రమయొనరింపవలసియే యుండుచున్నయది. ఇది యొక నియమము. ఈనియమ మాధ్యాత్మిక జగత్తుపట్లను సార్థకమగుచున్నది. దయ, శౌచము, వివేకము, శాంతము మొదలగు నేరేని యాధ్యాత్మిక స్థానమును జేరఁగోరు మనుష్యుఁ డత్యంతమగు శ్రమను సహించి, ప్రయాణమొనరింప బాధ్యుఁడగుచున్నాఁడు. ఎట్టిశ్రమయు లేకుండఁగనే తలంపు మదియందుఁ గలిగినంతనే మనుష్యుఁడు తక్షణ మనాయాసముగాఁ బరమసుందరములగు నాధ్యాత్మిక నగరములఁ జేరఁజాలఁడు. అతఁడు సర్వోత్కృష్టమగు ఋజుమార్గమును నన్వేషించి తదనుసారముగఁ బ్రయాణమొనరింప వలసియుండును. అపుడతఁ డభిలషించిన స్థానమును జేరఁగలఁడు. ఆనందమయమును, నాధ్యాత్మికమును నగు జీవితముయొక్క సంపూర్ణ మనుష్యత్వమును బరిపక్వస్థితిని బొందుటకుఁ బూర్వమే మనుష్యుఁ డీశ్వరీయ మహానియమము యొక్క యంగప్రత్యంగములగు నీ సామాన్యనియమముల నన్నింటిఁ బరిగ్రహించుటావశ్యకము. ఆధ్యాత్మిక ప్రపంచమునందుఁ బ్రయోగింపఁబడినట్టి నియమమేదియు బాహ్య జగత్తునందుఁ గానరాదు. బాహ్యపదార్థము నాధ్యాత్మిక సత్యములయొక్క ప్రతిబింబములును, నుదాహరణములును నయియున్న విధం

బుననే ప్రాపంచికబుద్ధియు నాధ్యాత్మికమును, దైవికమును నగు బుద్ధియొక్క ప్రతిబింబమయి యున్నది. మనుష్య జీవితము యొక్క ప్రాపంచకవస్తుసముదాయ మంతయుఁ బ్రయోజనదాయకము లయి, జనసామాన్యముచే సందేహింపఁబడకయే స్వీకరింపఁబడుచుండు సరళ[illegible]లును, సామాన్యములును నగు నిబంధనములు, యథార్థముగా నంతర్జగత్తుయొక్క యాధ్యాత్మిక వస్తువులమీదను శోభించుచున్నవను రహస్యముఁ గ్రహించినంతనే స్థూలప్రపంచము ననుసరించి సూక్ష్మప్రపంచమందును మనుష్యుఁ డీనిబంధనములఁ బాలింపఁగడంగి యథార్థమగు జ్ఞానమును బుష్కలముగా సంపాదింప సమర్థుఁడగుచున్నాడు. అంతె నతని విషాదభయ సందేహములన్నియు దూరమయి పోవుచున్నవి.

జీవిత మొక ప్రత్యక్షమగు న్యాయము. ఇందెట్టి తప్పిదములకును, నొప్పించుటకును స్థానముండ నేరదు. ఇద్దాని ప్రయోగము యథార్థమును, నశేయలెక్కరూపమును నయి యున్నది. నిబంధనము సదా రాజ్యమొనరించుచుండును. నియమములయొక్క హృదయాంతర్భాగమునఁ బ్రేమ వెలయుచున్నది. పక్షపాతమును, మనోవికారమును— నియమమునకును, బ్రేమకును విరుద్ధములయియున్నవి. ప్రపంచ మెవ్వాని పక్ష మవలంబింపనేరదు. అది న్యాయపరతంత్రము. ఎవఁ

ట్టికార్య మాచరింపుచుండునో, వానికట్టిఫలితము నొసంగు చుండును. ప్రపంచమునకు సంబంధించిన దంతయు మంచి దియే. కారణమేమన సకలము నియమబద్ధము. విశ్వమందలి ప్రతివస్తువును నియమబద్ధమయి యుండుటచే మనుష్యుడు జీవిత మం దుచితమార్గము నన్వేషింపఁగలిగి హర్షాంబుధి నోలలాడు చున్నాఁడు. "భద్రమానవునకు జీవితకాలమందును, మృత్యు వునకుఁ బిదపను నేవిధమగు నాపత్తియుఁ గలుగనేరదు. జీససు ప్రభువు సిలువవేయఁబడినపుడు తనకు సంభవించిన ఘోర విపత్తును పరిణతము సౌఖ్యదాయకమగు స్థితియనియే వంచించి ఆమహానుభావుఁడు తన్ను సంహరింపుచున్న క్రూరుల నేమా త్రము నిందించియుండలేదు. ఆప్రభువు ప్రాణమును విసర్జిం పుచు నీరీతిఁ బలికియుండెను. "నాప్రాణముల నేమానవుఁడు నపహరింపఁజాలఁడు. నేనే స్వయముగా లోకహితమునకయి నాయసువులఁ బాయుచున్నాఁడను."

తనజీవితమును సఫలమొనరించుకొని మానసమును విశుద్ధముగఁ జేసికొని, ఆశిక్షయొక్క మనోహరమగు సత్ఫలత్వమును గ్రహింపఁనేర్చిన మనుష్యుఁడు, సకలపదార్థ ములయొక్క నియమబద్ధమగుగతిని గుర్తింపుచున్నాఁడు. అతఁడు తనభావముల వలనను, కార్యముల వలనను దనకును, బ్రపంచమునకును లభించుఫలమును, నానుత్పన్నము చేయు

చుచునట్టి మానసిక కారణములయొక్క పరిణామములను గ్రహింపసమర్థుఁ డగుచున్నాఁడు. అతఁ డంతటినుండి పుట్టుచుఁ బెరుగుచుఁ, బూరియగుచు నిపుడవుడను భేదములేక సదా బ్రహ్మానందము నొసంగునట్టి సద్భావములను, సత్కార్యము లను బరిగ్రహింపుచుండఁగలఁడు. ప్రప్రథమ మజ్ఞానముచే దా నొనరించియుండిన కార్యముల దుష్పరిణామముల నతఁ డతివిధేయుఁడయి యనుభవింపుచు దానికయి నిందింపక, భీతిల్లక, ప్రశ్నింపక విశ్వముయొక్క మహత్తరమగు జ్ఞానమును బడయుచు నావిశ్వపితమపాలనమం దపారానందము నందుచుండఁగలఁడు.

“మనమభిలషిత వర్ణవిలసిత సూత్రములచే మనజీవితమను వస్త్రమును నిర్మించుకొన సమర్థులమయి యున్నారము. కర్మపరిణామమగు భాగ్యభూమియందు మనము విత్తినపంటనే పడయుచున్నారము. మనము విత్తినరీతిగనే సస్యమునందుచు నాచరించిన రీతిగనే ఫలమును బడయుచున్నచో దుఃఖము నత్యంతానురాగ పూర్వకముగ స్వీకరింపవలసి యుండును. నష్టమును బడయుట లాభమునకేయని తెలియఁదగును.”

## చతుర్దశ ప్రకరణము.

---

# సౌఖ్యమయ పర్యవసానము.

ధర్మముచే సత్యము లభించుచున్నది. ధర్మము నతిక్రమింపఁగల శక్తి ఎవ్వానికిఁగలదు? ధర్మము యొక్క హృదయము ప్రేమ. ప్రేమ యొక్క పర్యవసానము శాంతి. శాంతి యొక్క పరిణామము మధురమగు సంపూర్ణత్వము. కుమారా! సకలార్థసాధనమగు నిట్టిధర్మము ననుష్ఠింపుము.

—దిలైట్ ఆఫ్ ఏషియా.

సౌభాగ్యముచే నీకార్యము సమాప్తమగుచో దోషములును సుగుణములయి తనరారఁగలవు. అపుడు నీచరిత్రములన్నియు నీశ్వరీయ ప్రకాశముయొక్క చరిత్రమందు మేళవింపఁగలవు.

—వ్హాయిటరు.

మానవజీవితము సమున్నతమును, పవిత్రమును, సుందరమును నగుటచే దీని కనేకవిధములగు సౌఖ్యమయపర్యవ

సానములు కలుగుచున్నవి. జగతీతలమందపవిత్రతయు,
నజ్ఞానమును, నశ్రుపాతమును, దుఃఖశోకములును తక్కువగా
లేకపోయినను వానితోఁబాటు పవిత్రతయు, జ్ఞానమును,
మృదులహాసమును, విశ్రాంతియు నానందమును బుంఖాను
పుంఖములయి సర్వత్ర గోచరించుచున్నవి. పవిత్రమగు నే
భావమును, స్వార్థశూన్యమగు కార్యమును సుఖమయమగు
పరిణామమును గలిగింపకుండ నుండనేరదు.

సౌఖ్యమయమును, మనోహరమును నగు గృహమును
బడయుటయు నొక విధమగు సౌఖ్యపూర్ణ పర్యవసానమే.
సౌఖ్యమగు జీవిత మొక విశుద్ధానందమయ పరిణామము.
ఒక కార్యము సక్రమముగా సిద్ధించుటయు నొక సౌఖ్యపూ
ర్ణమగు పర్యవసానమె. కృపాళువగు మిత్రులచే ముట్టడింపఁ
బడియుండుటయు నొక సౌఖ్యమయమగు పరిణామమె. పర
స్పర విరోధములను శాంతింపఁజేయుటయుఁ, గలహముల
నిర్మూలించుటయు, నుడువఁబడిన దుర్భాషలను స్వీక
రించుటయు, క్షమార్పణమును గోరుకొనుటయు,
మిత్రుల పరస్పరగాఢాలింగనమును మొదలగున వన్నియు
సౌఖ్యమయ పర్యవసానములె. చిరకాలమునుండి విశేషమగు
ప్రయాసముచే నన్వేషించుచున్న వస్తువును బడయుటయు, నశ్రు
పాతమునుండి హర్షమును సంపాదించుటయుఁ, శాపముయొక్క

దుఃఖదాయకములగు భయంకర స్వప్నములచే మేల్కొంచి పరమోజ్జ్వలమగు సూర్యప్రకాశములోని కేతెంచుటయు, దీర్ఘాన్వేషణమునకు బిదప జీవితమందు స్వర్గీయమార్గమును బడయుటయు మొదలగునవన్నియు నానందమయములగు సత్పరిణామములై. ఈగ్రంథమునందు వచింపబడిన సత్యథముల దీర్ఘాలోచనముచే బరిగ్రహించి, యనుసరించి, ఆత్మవిజయమును సంపాదించిన ప్రతివ్యక్తియు సమందానంద కందమునం దగలడు. వానిసమగ్ర జీవితము సౌఖ్యమయ పర్యవసానములచే బరిపూర్ణము కాగలదు. సత్యమును బ్రారంభించునట్టియు, సత్యము ననుసరించు నట్టియు మనుష్యుడు సుఖముగ నానందదాయకములగు ఫలముల నభిలషించి, వానికయి యన్వేషణ ప్రయాసము నందవలసిన పనిలేదు. ఆనందము లట్టి వ్యక్తి సమ్ముఖమున స్వయముగ సాక్షాత్కరింపగలవు. అవి పరిణామ రూపమున లభించుచున్నవి. నిశ్చయముగా నాయానందమయ పర్యవసానములే మనుష్యజీవితముయొక్క పరమసత్యములును, సారభూతములగు పదార్థములును నయియున్నవి.

బాహ్య ప్రపంచముతో నన్నగా స్థూలశరీరముతో సంబంధమును గలిగియుండు సౌఖ్యమయ పర్యవసానములు నయితే మనేకములు కలవు. అవి క్షణికములగుటచే నతిశీఘ్రముగ గడచిపోవుచుండును. అనేకములగు సౌఖ్యమయ పర్యవసాన

నములు. సూక్ష్మశరీరముతో ననఁగా నంతర్జగత్తుతో సంబంధమును గలిగియున్నవి. అవి యజరామరములగుటచే నెప్పటికిని గడచిపోకుండును. మిత్రసమావేశము, భోగవిలాసము, స్థూలపదార్థములు మొదలగువాని ప్రీతి రుచిదాయకమును, మధురమును నయియుండుచుండును. కాని యది పరివర్తనశీలమును, నశ్వరమును నయి యున్నది. శౌచము, బుద్ధి, సత్యజ్ఞానము మొదలగు పదార్థములతి మధురములు. వీనికి మార్పు లేదు. నాశనము లేదు. ఇవి నిరంతర వికాసమయములయి యొప్పుచుండును. మనుష్యుఁడు తానరుగు స్థలములకెల్లఁ దన ప్రాపంచికలాభములవెంటఁ దీసికొని పోఁగలుగుచున్నాఁడు. వాఁడు సదా యీ ప్రాపంచిక సౌఖ్యమయ పదార్థములనే సంస్మరింపుచు వానిమీఁదనే సంపూర్ణముగా నాధారపడి యుండుచున్నచో వానికి వియోగము తటస్థించినంతనే యీ మనుష్యుఁ డున్మత్తుని వలె రోదింపనారంభింపుచుఁ దన యాధ్యాత్మికశక్తిని గోల్పోవుచున్నాఁడు. కాని యాధ్యాత్మికవస్తువుల హస్తగతమొనరించుకొనిన మనుష్యుఁడు తన సౌఖ్యభండారమునుండి వేఱుపఱచఁబడనేరఁడు. అతఁడు భూమండలమునం దెచ్చోటకేగినను దన వెనువెంటఁ దన యాధ్యాత్మికవస్తువులఁ గొనిపోవుచుండఁగలఁడు. వాని యాధ్యాత్మికపర్యవసాన మానందపరిపూర్ణత్వమందు వెలయుచుండఁగలదు.

అహంబుద్ధిని బహిష్కరించి పైనుడివియున్న స్వార్థశూన్యమగు జీవితమును ప్రాప్తింపఁజేసికొనిన వ్యక్తి యజరామరమగు బ్రహ్మానందమున సదా నిమగ్నుఁడయి యుండుచున్నాఁడు. అతఁ డీజీవితమందే, యీదినమందే, యీక్షణమందే స్వర్గరాజ్యమ్మునను, మోక్షమునను, నిర్వాణమునను, బహిసునందమున, అలంపిసునందమును ప్రవేశించుచున్నాఁడు. అతని జీవితము యొక్క యంతిమయొక్కువ ననఁగా జగదీశ్వరుని గుర్తించుచున్నాఁడు. వాని పవిత్రాత్మ జగదీశ్వరుని పునీతమగు సంకల్పమున విశ్రాంతి నందుచున్నది.

లోభము, ద్వేషము, ఈర్ష్య, విషయవాసనలు మొదలగు దురుణములనుండి తనహృదయమును విముక్తమొనరించినట్టియు, దుస్స్వభావముయొక్కయు, స్వార్థముయొక్కయు భయంకర వాతావరణమునుండి వెలువడినట్టియు, సకలప్రపంచము నపారమగు దయతోడను, విశుద్ధమగు ప్రేమతోడను వీక్షించుచుఁ బక్షపాతరాగద్వేషశూన్యుఁడయి, త్రికరణశుద్ధిగ "జగదీశ్వరుఁడు సమస్త జీవరాసులకు శాంతినొసంగుఁగాత" మని సదా యాశీర్వదించుచుండునట్టియు, మనుష్యుని విశ్రాంతి యెంత మధురమయినది! వాని యానంద మెంత యగాధమయినది!!

లోకాదర్శప్రాయుఁడగు నిట్టిమనుష్యుఁడు తన్నేస్థితి యందు నడఁబాయునట్టి సౌఖ్యమయ పర్యవసానము బడయుఁ

గలుగుచున్నాఁడు కారణమేమన నతని యానాఖ్యమయ పర్యవసానంబు జీవితంబుయొక్క సంపూర్ణత్వమును, శాంతి యొక్క చరమస్థితియు, బరమానందంబుయొక్క పూర్తియు నయియున్నది. మనుష్యుఁడజ్ఞానాంధకారమయ మగు వాతావరణము నుండి వెలువడి కామక్రోధాది భయంకర విషయవికారము లం బరాభవించి, యాత్మవిజయమును సంపాదించినచో నానందసామ్రాజ్యము నానినుండి యెంతోదూరముగ నుండఁ జాలదు. ఆత్మనివేశ స్వార్థశూన్యమగు కృషిచే కణమాత్ర కాలము వ్యాపించినచో నానందసామ్రాజ్య మతని కట్టెదుట నే యున్నటుల స్పష్టపడగలదు. చదువరీ! నీవేల మత్తుఁడవయి, ఆ కానవచ్చుచున్న విశుద్ధానంద సామ్రాజ్యమునఁ బ్రవేశింప కున్నాఁడవు?

సర్వేజనాస్సుఖినోభవన్తు.

సుజ్ఞానోదయము! స్వర్గసాక్షాత్కారము!

# అమూల్యములగు నీతిగ్రంథరాజములు.

"యస్యాసి సద్గ్రంథ విమర్శభాగ్యం,
కిం తస్య శుష్కై శ్చపలావినోదైః."

మానవుని జీవితకాల మమూల్యమైనది. మానవుడు ఇహలోకమందలి భయవిషాదములనుండి విమోచనమునంది, నిత్యానందశాంతుల ననుభవించుటకు జ్ఞానమే పరమసాధనము. మేము మానవుని నైతికజీవితాభ్యుదయము నపేక్షించి కేవల నీతి, ధర్మ, భక్తి, జ్ఞానగ్రంథములను, మహాపురుషుల జీవితములను, సతీమణుల చారిత్రములను, ఆరోగ్యశాస్త్రములను, వేదాంతగ్రంథములను విరివిగాఁ బ్రచురింప యత్నములు సేయుచున్నాము. మా ప్రయత్నము నాంధ్రదేశ ప్రసిద్ధపండిత కవులెల్ల రేకాభిప్రాయులయి సుకించియున్నారు.

## ఇదివఱకుఁ బ్రచురింపఁబడినగ్రంథములు.

1 <u>బుద్ధపురాణము</u>:—1400 పుటలు. చక్కని బైండు. వచనము. మనోహరమగు శైలి. ఇందు బుద్ధునిజీవితము, బౌద్ధ ధర్మములు, హిందూమతవిజ్ఞానము, హిందూ బౌద్ధమత సాదృశ్యములు మున్నగు బహువిషయములు చర్చింపఁబడినవి. అహింసాధర్మబోధ కిది తావు. సంస్కృతాంగ్లాంధ్ర ప్రమాణవాక్యము లనంతములుగనున్నవి. ఆచార్య రాధాకృష్ణ, రామ

లింగారెడ్డి, సాక్షికర్త, ఉమర్ అలీషా మున్నగు 25 గురు మహాకవులు పొగడియున్నారు. ఇట్టి బ్రహ్మాండమగు గ్రంథరాజమును రచించినవారు "బౌద్ధవాఙ్మయబ్రహ్మ" దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు. బలరామకృష్ణకవిగారి బౌద్ధపురాణ గ్రంథరచనకు మెచ్చియే ఆంధ్రమహాసభవారు "బౌద్ధవాఙ్మయబ్రహ్మ" యను బిరుదమును వారికొసంగియున్నారు. ప్రత్యేకముగా నీ యీగ్రంథరచనమువలననే వారికా సన్మానము జరిగియుండ వేఱుగ నీ గ్రంథమును గూర్చి వ్రాయవలెనా? దేశోద్ధారకుని అమూల్యమగు పీఠిక కలదు. వెల 4—0—0

2 వేణుగానము:— ఇది మహాత్ముడగు ఆచార్య టి. యల్. వాస్వానిపండితుని "Ancient Murali" కనువాదము అనువాదకులు, దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు. రసవంతమగు శైలి. గంభీరములగు భావములు. 70 పుటలు. వెల 0—4—0

3 ఆత్మవిజయము:— 300 పుటలు. 28 పౌ॥ గ్లేజు కాగితము. అనువాదకులు దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు. శైలి అత్యద్భుతము. ఇందు మానవజీవితసంస్కరణ విధానము సూచింపబడినది. ఎట్టి విషయలోలుడయిన యీగ్రంథమును చదివిన తన అవివేకాంధకార బంధురమగు జీవితమునకు సిగ్గుజెంది తన్ను సంస్కరించుకొని ధన్యుడు కాగలడు. జనాబ్ ఉమర్ అలీషాకవిగారి అమూల్యమగు పీఠిక కలదు. వెల రు 1—0—0.

# రాబోవు బ్రహ్మాండమగు గ్రంథరాజము.

4 ఆదర్శ మనుష్యజీవితము:— (ఇదిఅచ్చులోనున్నది.)

ఇది బ్రహ్మాండమగు నొక నైతికగ్రంథరాజము. రమారమి 2000 పుటలు. ఈగ్రంథము బలరామకృష్ణయ్యగారిచే స్వతంత్రముగ వ్రాయఁబడినది. వెల చాల సరసముగానుండును. శైలి రసమును వర్షింపఁజేయుచున్నది. భావము లతిగంభీరములు. ఇందు మానవ జీవితోత్థానమున కవసరములగు 800 సద్విషయములనుగూర్చి వ్రాయఁబడినది. ఇట్టిమహాగ్రంథ మింతవఱ కాంధ్రభాషయందు వెలువడి యుండలేదు. దీనిని చదివిన ప్రతిమానవుఁడు మంచి భాషాజ్ఞానమును, వివిధభావ సంపత్తిని, జ్ఞానమును సులభముగాఁ బడయఁ గలఁడు. దీనికిఁ గర్త యొక మహాకవీంద్రుఁడయి యుండఁ గలఁడు ఇవిగాక యింక అమూల్యములగు గ్రంథములు కొన్ని "బౌద్ధవాఙ్మయబ్రహ్మ" దుగ్గిరాల బలరామకృష్ణయ్య గారిచే రచింపఁబడుచున్నవి. త్వరలో వెలువడఁగలవు. మాగ్రంథములకు కమీషను యివ్వఁబడదు.

వలయువారు:— టి. లక్ష్మీనారాయణ,

మానవాదర్శ గ్రంథమండలి కార్యస్థానము,

అంగలూరు, కృష్ణాజిల్లా.